

'ప్రజల రుణం తీర్చుకునేందుకు
ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 165

బుధవారం 4-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




దీప్తికి కాంస్య పతకం

పారిస్ పారాలింపిక్స్‌లో మంగళవారం భారత్ ఖాతాలో ఒక కాంస్య పతకం లభించింది. అథ్లెటిక్స్ మహిళల 400 మీటర్ల టి20 కేటగిరీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజి కాంస్య పతకాన్ని సాధించింది. దీప్తి 55.82 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. - 14లో



బలమైన బంధానికి ఇదే సంకేతం

బ్రూనైలో నూతన రాయబార కార్యాలయం భారత్, బ్రూనైల బలమైన బంధానికి సంకేతమని ప్రధాని మోదీ అన్నారు.
- వివరాలు 6లో



మహిళలపై నేరాలకు మరణ శిక్షే

రేప్, హత్య వంటి నేరాలకు పాల్పడేవారికి మరణ శిక్ష విధించడానికి ఉద్దేశించిన బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం తెలిపింది.
- వివరాలు 6లో



129 మంది ఖైదీలు మృతి

కాంగో రాజధానిలోని సెంట్రల్ మకాలా జైలు నుంచి తప్పించుకునే యత్నంలో 129 మంది ఖైదీలు మృతి చెందారు.
- వివరాలు 6లో



ఉద్యోగుల తరఫున రూ.100 కోట్లు

భారీ వర్షాల నేపథ్యంలో తమ వంతుగా సీఎం సహాయ నిధికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఒక రోజు మూల వేతనాన్ని ప్రకటించింది.
- వివరాలు 5లో



ఖమ్మం మంచికంటి నగర్‌లో బురదతో ఉన్న సామాన్లను శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులు

2లో

ముందే చెప్పి ఉంటే..

ముంచేదా మున్నేరు!

అధికారుల నుంచి ముందస్తు హెచ్చరికలు లేకపోవడం వల్ల నష్టపోయామంటున్న బాధితులు

కట్టుబట్టలతో మిగిలిన ముంపు బాధితులు.. ఖమ్మం నగరం, రూరల్ మండలాలను ముంచెత్తిన వరద

50కి పైగా కాలనీల్లో 10 వేల మందికి పైగా నిరాశ్రయులైన వైనం

ఇళ్లు, దుకాణాల్లో బురద మేటలు

చివరకు బురదే మిగిలిందంటూ రోదన.. ఆహారం, మంచినీటి కోసం ఎదురుచూపులు

రూ.వేల కోట్లలో నష్టం!



సమాచారం ఇస్తే నష్టం తప్పేది..

→ ఉమేష్‌చంద్ర, యాకేష్ సోదరులు. ఒకరు గ్రానైట్ బండలపై పేర్లు చెక్కే ఆర్టిస్ట్ కాగా.. మరొకరు సుతారి మేస్త్రి. ఈ కుటుంబాలు రెండూ మోతీనగర్‌లో రూ.14 లక్షలు వెచ్చించి నాలుగేళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్నాయి. గత ఏడాది వరద వచ్చినా వస్తువులు పాడయ్యాయే తప్ప ఇళ్లు దెబ్బతినలేదు. ఈసారి ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. సామాన్లు, దర్వాజాలు, కిటికీలు కొట్టుకుపోయాయి. రేడియం స్టిక్కర్ మిషన్లు, కంప్యూటర్లు కొట్టుకుపోవడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ముందస్తుగా వరద ముంపు సమాచారం ఇస్తే సామగ్రిని ఇతర చోట భద్రపరుచుకునే వారమని ఈ సోదరులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

9 మంది మావోయిస్టులు మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ –బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. 40 మంది వరకు మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో బలగాలు కూంబింగ్ చేపట్టాయి. - 6లో

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వాహనాలపై దాడి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం..తోపులాట

దాడిలో పగిలిన పువ్వాడ, జగదీశ్‌రెడ్డి కార్ల అద్దాలు

ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం మయూరిసెంటర్/నడిగూడెం: మున్నేరు వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం వాహన శ్రేణిపై దాడి జరిగింది. మంగళవారం మధ్యాహ్నం మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వాన ఎమ్మెల్యేలు ఖమ్మంలోని పలు డివిజన్లలో పర్యటించారు. 47వ డివిజన్ బొక్కలగడ్డలో పర్యటన ముగించుకొని కాన్వాయ్‌తో బయలుదేరిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు చేదు అనుభవం ఎదురైంది. కాన్వాయ్ కాల్వొడ్డు ప్రాంతానికి చేరుకుంటున్న సమయాన స్థానికులు, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకొని 'మీరు ఎందుకు వచ్చారు, వరదలపై రాజకీయం చేయడం ఏమిటి.. మీరు అధికారంలో ఉన్నప్పుడు వందల కోట్లు దోచుకొని ఇప్పుడు ఎందుకు వచ్చారు.. ఖమ్మమంతా కబ్జాలతో ఆక్రమించుకొని ఏ ముఖం పెట్టుకుని మళ్లీ వచ్చారు' అని ప్రశ్నించారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు.. కాంగ్రెస్ శ్రేణులను వాహనాలకు అడ్డు తొలగించే ప్రయత్నం చేయగా తీవ్ర వాగ్వాదం,



దాడిలో ధ్వంసమైన పువ్వాడ అజయ్ కారు

మిగతా 3వ పేజీలో ▶

అండగా ఉంటాం..

వరద బాధితులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ

మహబూబాబాద్ జిల్లా సీతారాం తండాలో పర్యటన

మూడు తండాలకు కలిపి పెద్ద గ్రామం నిర్మించండి

రోడ్లు, చెరువుల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

పోయిన సర్టిఫికెట్లు, పాసు పుస్తకాలకు బదులుగా కొత్తవి ఇవ్వండి

ప్రతి జిల్లాలో బ్లూ బుక్ తయారు చేయాలి

సమీక్షలో ముఖ్యమంత్రి ఆదేశాలు

సాక్షి, మహబూబాబాద్: 'ఇది ప్రజల ప్రభుత్వం.. మీకు అండగా ఉంటుంది.. అధైర్య పడకండి.. అన్ని విధాలుగా ఆదుకుంటాం..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముంపు ప్రాంతాల ప్రజలకు హామీ ఇచ్చారు. వర్షాలు, వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ముంపు కారణంగా నష్టపోయిన పంటలకు గాను ఎకరాకు రూ.10 వేల చొప్పున, చనిపోయిన పశువులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. తక్షణ సహాయంగా కుటుంబానికి రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం శివారు సీతారాం తండాలో మంగళవారం సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా తండావాసులతో మాట్లాడి వారు పడిన ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మురళీనాయక్, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినీరెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రభుత్వ సలహాదారు



మహబూబాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶



విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచిన వరద బాధితుల మృతదేహాలు

చంద్రబాబూ..

ఎవరిదీ పాపం?

బుడమేరు వరదకు 32 మంది బలి

లెక్కతేలని మరణాలు మరెన్నో?

వరద నీటిలో కొట్టుకు వస్తున్న శవాలు

విజయవాడలో హృదయ విదారక దృశ్యాలు

చనిపోయిన వారి లెక్కచెప్పని ఏపీ ప్రభుత్వం

- వివరాలు 12లో

ఎస్డీఆర్‌ఎఫ్ అకౌంట్‌లో రూ.1,345 కోట్లు..

ముందు అవి ఖర్చు చేయండి

అవసరమైతే ప్రధాని పర్యటిస్తారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో రాజకీయాలు చేయడం సరికాదని కేంద్ర బొగ్గు,గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ (ఎస్డీఆర్‌ఎఫ్) కింద రూ.1345 కోట్లు ఉన్నాయని, ఆ నిధులతో బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గతంలో కేంద్రం ఎస్డీఆర్‌ఎఫ్ కింద విడుదల చేసిన నిధులకు మిగతా 3వ పేజీలో ▶



అండగా ఉంటాం.. అధైర్యపడకండి

▶ మొదటి పేజీ తరువాయి

వేం నరేందర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. వరద ముంపునకు గురైన సీతారాం తండాతో పాటు తేజావత్ తండా, భూక్యా తండాలకు ఎత్తైన ప్రదేశాల్లో స్థలం కేటాయించి ఒక పెద్ద గ్రామంగా నిర్మించాలని, ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్లు, చెరువుల మరమ్మతులకు, శాశ్వత పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వరదలో తడిసిన, కొట్టుకుపోయిన విద్యార్థుల సర్టిఫికెట్లు, రైతుల పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర సర్టిఫికెట్ల విషయంలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కొత్తవి ఇవ్వాలని ఆదేశించారు.

కేంద్రం రూ.2 వేల కోట్లు ఇవ్వాలి

రాష్ట్రంలో వరద ముప్పును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఇప్పటికే లేఖ రాశామని సీఎం తెలిపారు. రాష్ట్రానికి రూ.5,438 కోట్లు అవసరమని, తక్షణ సహాయంగా రూ.2 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఇక్కడి పరిస్థితులు చూపించేందుకు ప్రధానిని రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ఇకపై బ్లూ బుక్ ఆధారంగా అప్రమత్తం

ప్రకృతి విపత్తులను తెలుసుకునేందుకు ప్రతీ జిల్లాలో ఒక బ్లూ బుక్ తయా రు చేసి పెట్టుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతీ సీజన్ లో ఆ బుక్ ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.

తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి

వరద బీభత్సంతో అతలాకుతలం అయిన రాష్ట్రంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సిద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తం కావాలని చెప్పారు. అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కడ సహాయక చర్యలు ఎలా ఉన్నాయో చూడండి..

పదేళ్లు పాలించిన కేసీఆర్ ఏనాడూ ప్రజల్లోకి రాలేదని సీఎం రేవంత్ విమర్శించారు. బడిపిల్లల బస్సు రైలు కింద పడ్డా, హైదరాబాద్ శివారుల్లో పశువైద్యురాలు హత్యకు గురైనా రాని కేసీఆర్.. ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శ లు చేయడం శోచనీయం అని అన్నారు. కవల పిల్లల్లా ఉన్న ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో సహాయక చర్యలు ఎలా ఉన్నాయో, పక్క రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఎలా సహకరిస్తున్నాయో చూసి బీఆర్‌ఎస్ నేతలు నేర్చుకోవాలని అన్నారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

ప్రకృతితో పరాచికం అడితే ఏం జరుగుతుందో ఇటీవల జరిగిన విపత్తులతో అర్థం అవుతుందని, చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని సీఎం అన్నారు. హైదరాబాద్‌లోని రాంనగర్‌లో ఒక్క నాలాపై కట్టడాలను తొలగించినందుకే ఆ ప్రాంతంలో వరదలను నివారించుకోగలిగామని చెప్పారు.

టెన్త్ విద్యార్థిని రూ.3 వేల విరాళం



మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు.. తన వంతుగా వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.3 వేల విరాళాన్ని కలెక్టర్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసింది.

రోజుకు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలి

జీఎంలతో సమీక్షలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రోజుకు కనీసం రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, అదే పరిమాణంలో రవాణా కూడా పూర్తి కావాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. నెలవారీ ఉత్పత్తి సమీక్షలో భాగంగా సింగరేణి డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల (జీఎం)తో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ఏరియాల్లో జరుగుతున్న ఉత్పత్తి గణాంకాలను ఆయన సమీక్షించారు. ఈ ఆర్థిక ఏడాదిలో నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తి మందగించిందని జీఎంలు చెప్పగా, వర్షాకాలంలో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.



కాస్త చూసుకుని వెళ్దాంస్వామీ!
ఇప్పుడు దిగితే డైరెక్ట్ నిమజ్జనమే!!

అలర్ట్‌లకు అర్థం తెలుసా?

రోజూ చూస్తూనే ఉన్నాం.. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్.. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ అని.. ఇంతకీ వాటి అర్థం ఏంటో మీకు తెలుసా? పదండి తెలుసుకుందాం.



గ్రీన్ అలర్ట్

ఏదైనా ప్రాంతంలో 24 గంటల వ్యవధిలో 6.4 సెం.మీ. కన్నా తక్కువ వర్షం కురిసే అవకాశం ఉంటే వాతావరణ అధికారులు ఈ అలర్ట్ జారీ చేస్తారు. వాతావరణ పరిస్థితుల్లో రాబోయే మార్పుల గురించి గ్రీన్ అలర్ట్ తెలియజేస్తుంది. అయితే ఈ అలర్ట్ కింద ప్రజలకు ప్రత్యేకంగా హెచ్చరికలు జారీ చేయాల్సిన అవసరం ఉండదు.

ఎల్లో అలర్ట్

ఒక నిర్ణీత ప్రదేశంలో 6.45 సెం.మీ. నుంచి 11.55 సెం.మీ. మధ్య వర్షం కురిసే అవకాశం ఉందన్న అంచనాతో దీన్ని జారీ చేస్తారు. ఈ అలర్ట్ జారీ చేశారంటే ప్రస్తుత వాతావరణం కాస్త ప్రతికూలంగా మారుతుందని అర్థం. 30–40 కి.మీ. వేగంతో గాలులు వీచే పరిస్థితి ఉంటే ఎల్లో అలర్ట్ ఇస్తారు. అంటే ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని.. పరిస్థితిని జాగ్రత్తగా గమనించాలని అధికార యంత్రాంగానికి సూచిస్తారు.

ఆరెంజ్ అలర్ట్

24 గంటల వ్యవధిలో 11.56 సెం.మీ. నుంచి 20.44 సెం.మీ. మధ్య వర్షం కురవొచ్చన్న అంచనాతో ఆరెంజ్‌అలర్ట్‌ను ఐఎండీ జారీ చేస్తుంది. 40 నుంచి 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తూ తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నప్పుడు ప్రభుత్వ యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఈ అలర్ట్‌ను విడుదల చేస్తుంది. ఆరెంజ్ అలర్ట్ జారీ అయిందంటే రవాణా సర్వీసులపై ప్రతికూల వాతావరణం ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అర్థం.

రెడ్ అలర్ట్

24 గంటల వ్యవధిలో ఒక ప్రాంతంలో 20.45 సెం.మీ.కుపైగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటే రెడ్ అలర్ట్ జారీ చేస్తారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులను రెడ్ అలర్ట్ సూచిస్తుంది. రవాణా, విద్యుత్ సేవలకు అవాంతరాలు ఎదురవడంతోపాటు ప్రాణ నష్టం కూడా సంభవించే అవకాశం ఉన్నప్పుడు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేస్తుంది. రెడ్ అలర్ట్ ఇస్తే.. విపత్తు నిర్వహణ దళాలు, పోలీసులు, మున్సిపల్, రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది. గరిష్టంగా ఐదు రోజులపాటు ఆయా అలర్ట్‌లకు సంబంధించిన హెచ్చరికలు అమల్లో ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

-సాక్షి, సెంట్రల్ డెస్క్

ముందే చెప్పి ఉంటే.. ముంచేదా మున్నేరు!

50కి పైగా కాలనీల్లో 10 వేల మందికి పైగా నిరాశ్రయులైన వైనం
అనేకచోట్ల ఇళ్లు పూర్తిగా నేలమట్టం
ముందస్తు హెచ్చరికలు లేకపోవడం వల్లే తీవ్రంగా నష్టపోయామంటూ బాధితుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మున్నేటి వరద ఖమ్మం నగరాన్ని, ఖమ్మం రూరల్ మండలాల్లోని పలు ప్రాంతాలను ముంచేసింది. గత వందేళ్లలో కనీవినీ ఎరుగని జల ప్రళయం బీభత్సం సృష్టించింది. ఇళ్లను నేలమట్టం చేసింది. బియ్యం, ఉప్పు, పప్పుల్లాంటి నిత్యావసర సరుకుల్నే కాదు..విలువైన వస్తువుల్నీ ఊడ్చుకుపోయింది. ఉపాధికి, ఉద్యోగ అవకాశాలకు కీలకమైన వందలాది మంది యువత సర్టిఫికెట్లూ కొట్టుకుపోయాయి. అనేక కాలనీల్లో రోడ్లపైనే కాదు..వేలాది ఇళ్లు, దుకాణాల్లో బురద మేటలు వేసింది. వరద ముంచెత్తే ప్రమాదంపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలూ లేకపోవడం వల్లే సర్వం కోల్పోవాల్సి వచ్చిందని, కట్టుబట్టలతో ప్రాణాలు దక్కించుకున్న తమకు ఇప్పుడు బురదే మిగిలిందని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మున్నేరు పరీవాహక ప్రాంతంలో ఇప్పుడు ఎవరిని కదిలించినా ఇలాంటి కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి.

ఇళ్లు చూసి.. గొల్లుమంటూ..

గత నెల 31న మొదలైన వరద ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. 50కి పైగా కాలనీల్లో 10 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. వరద తగ్గడంతో పునరావాస కేంద్రాల నుంచి మున్నేటి ఒడ్డున ఉన్న ఇళ్లకు చేరుకుంటున్న వారు అక్కడి పరిస్థితి చూసి కన్నీళ్లు పెడుతున్నారు. ఇళ్లల్లో బురద మేటలు వేయగా.. అనేకచోట్ల ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయి నేలమట్టమయ్యాయి. మరికొన్నిచోట్ల పైకప్పులు లేచిపోయాయి. ఒక్కో ఇంట్లో రూ.5 లక్షల విలువైన గృహోపకరణాలకు నష్టం జరిగిందనుకున్నా.. మొత్తం నష్టం రూ.వేల కోట్లలో ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అప్రమత్తం చేయడంలో విఫలం

గత ఏడాది జూలై 26 నుంచి 29వ తేదీ వరకు మూడురోజుల పాటు వరద వస్తే గరిష్టంగా 30.7 అడుగులుగా నమోదైంది. అప్పట్లో వరద ముంపును ముందే ఊహించి అప్రమత్తం చేయడంతో బాధితులు విలువైన సామగ్రితో పాటు పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్లకు తరలిపోయారు. దీంతో ఆస్తినష్టం భారీగా తగ్గింది. అయితే ఈసారి మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో 40 సెం.మీ.కు పైగా వర్షం కురవడం.. వరద ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లోని లోతట్టు ప్రాంతాలకు పోటెత్తడం, దీనిపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలూ లేకపోవడంతో బాధితులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత నెల 31న రాత్రి 9 గంటలకు 11 అడుగులుగా ఉన్న మున్నేరు ఈనెల 1న తెల్లవారుజామున 3 గంటలకు 19 అడుగులుగా నమోదైంది. ఆ తర్వాత గంట గంటకూ వేగంగా పెరుగుతూ ఉదయం 11 గంటలకే 36 అడుగుల పైకి చేరింది. అయితే ఎగువన భారీ వర్షంతో వరద వస్తుందన్న సమాచారాన్ని గత నెల 29, 30 తేదీల్లోనే నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ముంపు ప్రాంతాల ప్రజలకు చేరవేస్తే ఆస్తి నష్టం ఇంతగా జరగకపోయేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది మాదిరి ముందుగా వరద సమాచారం ఇవ్వకపోవడం వల్లే సర్వం కోల్పోయామని బాధితులు విలపిస్తున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రూ.లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని.. అరకొర సాయమే తప్ప ప్రభుత్వం ఈ స్థాయిలో తమను ఆదుకుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. వరద ముంచెత్తుతుండటంతో విలువైన సామాన్లు అటకలపై భద్ర పరిచామని, కానీ ఊహించని స్థాయిలో వరద రావడంతో అన్నీ కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా బురదే

మున్నేటికి ఇరువైపులా ఉన్న దానవాయిగూడెం, రామన్నపేట, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, జలగం నగర్, పెదతండా, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, ప్రకాష్‌నగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్లు, టీఎన్‌జీవో కాలనీ, ధంసలాపురం, అగ్రహారం కాలనీలను వరద ఆగమాగం చేసింది. ముంపు కాలనీల్లో అంతా పేద, మధ్య తరగతి ప్రజలే నివసిస్తున్నారు. ఏళ్లుగా కూడబెట్టి కొన్న విలువైన వస్తువులు కొట్టుకుపోవడంతో తిరిగి తామెప్పుడు కోలుకుంటామోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా అన్ని ఇళ్లల్లో బైక్‌లు, ఫ్యాన్‌లు, ఫ్రిడ్జ్‌లు, బీరువాలు, ఏసీలు, మంచాలు, పరుపులు, దుప్పట్లు, వాషింగ్ మిషన్లు, టీవీలు, మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, గ్యాస్ సిలిండర్లు కొట్టుకుపోయాయి. ఏ వస్తువూ మిగల్లేదు. అక్కడక్కడా సామగ్రి ఉన్నా బురదతో నిండిపోయి పనికొచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఎగువ నుంచి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, చెట్ల మొద్దులు, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. చిన్న కిరాణా షాపులు, మెకానిక్ షాపులు, పండ్ల దుకాణాల్లో సైతం బురద నిండిపోయింది. ఇళ్లు, దుకాణాలు శుభ్రం చేసుకుంటున్న బాధితులు అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టమవుతోంది. పరామర్శకు వచ్చే నేతలు, అధికారులు, సిబ్బంది బురదలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ బురద మేటలు, వ్యర్థాలు తొలగించడం సహాయక సిబ్బందికీ, బాధితులకు సవాల్‌గా మారింది. జేసీబీలు, ట్రాక్టర్లతో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త, బురద తొలగిస్తున్నా ఇదంతా పూర్తికావడానికి ఎన్ని రోజులు పడుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

తిండి లేదు.. నీళ్లు లేవు

వరద కాలనీల్లో బాధితులు తిండి, తాగునీటికి అల్లాడుతున్నారు. పునరావాస కేంద్రాల నుంచి వచ్చి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న బాధితులు ఆహారం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సిబ్బందితో పాటు కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పార్టీల నేతలు ఆహారాన్ని పంపిణీ చేస్తున్నా.. ఇవి ఏ మూలకూ చాలడం లేదు. మధ్యాహ్నం భోజనానికి పొట్లాలు అందిస్తే.. మళ్లీ రాత్రి సమయానికి భోజనం అందుతుందో లేదోననే అనుమానం వ్యక్తవుతోంది. ఇక ఇళ్లల్లో తాగునీటి బోర్ల మోటార్లు, మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసం కావడంతో నీటికి అల్లాడాల్సి వస్తోంది. వస్తున్న మంచినీటి ట్యాంకర్లు ఎటూ సరిపోవడం లేదు.

చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ..

వరద ప్రభావంతో ఈ కాలనీల్లో వందలాది విద్యుత్ స్తంభాలు నేలమట్టమై ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. సబ్ స్టేషన్లు నీట మునిగాయి. దీంతో మున్నేటి లోతట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఇంకా చాలా సమయం పట్టేలా ఉంది. దీంతో ముంపు బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నా రాత్రివేళ చీకట్లోనే ఉంటున్నారు. పాములు, తేళ్ల బెడదతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఇళ్లు సాయం అందేదెన్నడు?

ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆర్‌వీ కర్ణన్, వీపీ గౌతమ్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇతర శాఖల అధికారులు నష్టానికి సబంధించిన వివరాల సేకరణపై సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అయితే రూ.కోట్లలో నష్టం రూ.కోట్లలో ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా..మున్నేరు ముంపు ప్రాంతమంతా బురద మేట వేయడంతో నష్టాన్ని ఎప్పటికి నిర్ధారిస్తారు? ఆపై సాయం ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వినాయకుడి బొమ్మలు కొట్టుకుపోయి రూ.2 లక్షల నష్టం

సూర్యాపేట జిల్లా చంద్రన్నకుంటకు చెందిన సత్‌నామ్ సింగ్ ఏటా కాలువ ఒడ్డులో వినాయక విగ్రహాలు అమ్ముతాడు. ఈసారి వంద విగ్రహాలు తీసుకురాగా మున్నేరు వరదతో 20 విగ్రహాలు కొట్టుకుపోయాయి. ఒక్కో విగ్రహం రూ.10 వేల చొప్పున రూ.2 లక్షలు నష్టపోయాడు. మిగిలిన విగ్రహాలకు సైతం కొన్ని భాగాలు దెబ్బతిని, రంగులు కోల్పోవడంతో మళ్లీ సిద్ధం చేసేందుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని సత్‌నామ్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు.



వరదతో విగ్రహాలకు రంగులు కొట్టుకుపోవడంతో మళ్లీ రంగులు అద్దుతున్న సత్‌నామ్‌సింగ్

రూ.25 వేల విలువైన బియ్యం తడిసి ముద్ద..



తడిసి ముద్దయిన బియ్యం కట్టలతో ఇంటి ముందు దీనంగా కూర్చున్న భూమా ఉపేందర్, ధనలక్ష్మి

ఖమ్మం వెంకటేశ్వరనగర్‌కు చెందిన భూమా ఉపేందర్, ధనలక్ష్మి ఇల్లు ఏటి ఒడ్డున ఉండడంతో సామగ్రి కొట్టుకుపోయింది. ఉపేందర్ గాంధీచౌక్‌లో హమాలీగా చేస్తున్నాడు. ఆయన ఇద్దరు పిల్లలు తొమ్మిది, పదో తరగతి చదువుతున్నారు. బియ్యం ధరలు పెరుగుతాయని ముందుగానే రూ.25 వేలు వెచ్చించి నాలుగు క్వింటాళ్లు కొనుగోలు చేశాడు. అయితే భారీ వరదలో బియ్యం తడిసిపోయాయి. ఎందుకూ పనికి రాకుండా పోవడంతో తిండి గింజలు లేక దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

కొట్టుకుపోయిన రూ.1.80 లక్షల క్యాష్‌బ్యాగ్



ఘంటసాల గోపాల్ దంపతులు

బొక్కలగడ్డకు చెందిన ఘంటసాల గోపాల్, బాలకృష్ణ సోదరులు. వీరి ఇళ్లు ఎదురెదురుగానే ఉన్నాయి. ఇద్దరి ఇళ్లల్లోనూ బురద చేరింది. బురదతో గోపాల్ ఆటో పాడైంది. పాత ఇనుము సామాను వ్యాపారం చేసే బాలకృష్ణ లావాదేవీల కోసం రూ.1.80 లక్షలు అప్పు తెచ్చి పెట్టాడు. వరదలో ఈ డబ్బుల బ్యాగ్ కొట్టుకుపోయింది. వీరి ఇళ్ల పైకప్పులు సైతం లేచిపోవడంతో రెండు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి.

మాది చేతల ప్రభుత్వం

గత ప్రభుత్వంలా కాదు
- నేను రాసిన లేఖపై కేంద్రం ఇంకా స్పందించలేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: విపత్తుల సమయాన గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని.. తమది చేతల ప్రభుత్వం కావడంతో గత హామీలను అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వరదలతో రూ.5,438 కోట్లు నష్టం జరిగినందున తక్షణమే సాయం చేయాలని ప్రధాని మోదీకి లేఖ రాసినా ఇప్పటివరకు స్పందన రాలేదని తెలిపారు. కేంద్రం స్పందించకున్నా ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఇవ్వాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేస్తున్నారని.. తమతో పాటు ఆ పార్టీకీ రాష్ట్రంలో ప్రజలు 8 ఎంపీ సీట్లు ఇచ్చినందున వారు కేంద్రం తరఫున రూ.25 లక్షలు పరిహారం ఇప్పించాలని సూచించారు. మంగళవారం ఉదయం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి నివాసంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్‌లతో కలిసి సీఎం మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

మేం ఇళ్లలో కూర్చోలేదు..

'వరదలు, వర్షాలు వచ్చిన సమయంలో మేము ఇళ్లలో కూర్చోలేదు. మా మంత్రులు ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించారు. మేం పర్యటించినప్పుడు ప్రజలు కోపగించుకున్నా ఫర్వాలేదు.. ఓటు వేసిన వారు మమ్మల్ని కాకపోతే ఎవరిని అడుగుతారు.. ఫామ్‌హౌస్‌లో కూర్చున్న వారిని అడగలేరు కదా.. ప్రభుత్వానికి ఉన్న పరిమితుల దృష్ట్యా నష్టంపై అంచనా వేసి శాశ్వత సాయం అందజేస్తాం. కల్వకుంట్ల కుటుంబం దోచుకున్న రూ.లక్ష కోట్లలో రూ.2 వేల కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇస్తే బాధితులకు ఇంకా ఎక్కువ సాయం చేయొచ్చు..'అని సీఎం వ్యాఖ్యానించారు.

ఆక్రమణలతోనే అనర్థాలు

'నీళ్లలోకి మనం వెళ్లి ఇళ్లు కట్టుకుంటే నీళ్లు ఇళ్లలోకి వస్తాయి. ఖమ్మంలో అనేక ఆక్రమణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో పాత చెరువులు ఆక్రమించుకున్న వారిని వదిలేసి కొత్తగా చెరువులను నిర్మించడం ఎందుకు? కొత్త చెరువులకు భూసేకరణ చేయాల్సి ఉంటుంది.

అది కమీషన్ కాకతీయ

మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బలోపేతం చేసినట్లు గత ప్రభుత్వం చెప్పింది నిజమే అయితే ఇప్పుడు చెరువులు ఎందుకు తెగుతున్నాయి? మిషన్ కాకతీయ అనేది కమీషన్ కాకతీయ అని గతంలో నాయిని నర్సింహారెడ్డి అసెంబ్లీలోనే చెప్పారు. నాటి ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు దీన్ని కమీషన్ కాకతీయగా మార్చారు..'అని సీఎం ఆరోపించారు.



అశ్విని తల్లి నేజీ, కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి

రిటైనింగ్ వాల్‌పై ఇంజనీర్లతో చర్చిస్తాం

'మున్నేరుపై రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపు అంశంపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తాం. మా ప్రభుత్వం ఏర్పడ్డాక రిటైనింగ్ వాల్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించాం. కానీ ఇంతలోనే ఉపద్రవం ముంచుకొచ్చింది. ఇప్పుడు జరిగిన పరిణామాల ఆధారంగా సాంకేతికంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం..'అని రేవంత్ తెలిపారు.

వెంటనే స్పందించాం..

'రాష్ట్రంలో వర్షాలతో ఉపద్రవం సంభవించినప్పుడు వెంటనే బాధ్యతగా స్పందించాం. 42 సెం.మీ. వర్షం గత 75 ఏళ్లలో ఎన్నడూ కురవలేదు. ఆ స్థాయిలో వర్షం పడినా తక్కువ ప్రాణ నష్టం, ఆస్తి నష్టంతో బయటపడ్డామంటే ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలే కారణం. మా మంత్రులు నిరంతరం ప్రజల మధ్యనే ఉన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఎప్పుడూ అండగా నిలిచింది. జిల్లాపై తమకు ఉన్న బాధ్యతతోనే ప్రభుత్వ యంత్రాంగం మొత్తం తనతో సహా ఇక్కడికి తరలి వచ్చింది. ఈ జిల్లాకు నష్టం జరగనివ్వం.

పూర్తి నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది

కాలనీల్లో బురద శుభ్రం చేయడానికి ట్యాంకర్లను పంపాం. పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ప్రజలను ఆదుకోవడానికి పూర్తి నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది..'అని సీఎం చెప్పారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని రేవంత్ అన్నారు.

సైంటిస్ట్ అశ్విని కుటుంబానికి న్యాయం చేస్తా

కారేపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వరదలో కొట్టుకుపోయి చనిపోవడం బాధాకరమని.. వారి కుటుంబానికి న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాలో అశ్విని, మోతీలాల్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అశ్విని తల్లి నేజీతో మాట్లాడారు. బిడ్డ కొత్త జీతంతో ఇల్లు కట్టుకుందామని మొదలుపెడితే ఇప్పుడు ఇలా జరిగిందంటూ ఆమె రోదించారు. సీఎం స్పందిస్తూ.. హైదరాబాద్‌లో తమ కార్యాలయానికి వస్తే చర్చించి అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రూ.10 వేలు దేనికి సరిపోతాయి?

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వరద ముంపు ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిని, సామగ్రి కొట్టుకుపోయిన వారికి తక్షణ సాయంగా రూ.10 వేలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇవి దేనికి సరిపోతాయంటూ బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొందరి ఇళ్లు కొట్టుకుపోగా, మరికొందరి ఇళ్లు కూలిపోయాయి. మరికొన్ని దెబ్బతిన్నాయి. ఇవికాకుండా ఒక్కో కుటుంబం సగటున రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇంట్లో ఉన్న సామగ్రి కోల్పోయారు. ప్రభుత్వం అందించే రూ.10 వేల తక్షణ సాయం ఈ నష్టాన్ని పూడుస్తుందా? అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే పూర్తయ్యాక నష్టాన్ని అంచనా వేసి సాయంపై నిర్ణయం తీసుకుంటామని సీఎం చెబుతున్నారని, సర్వే ఎప్పుడు పూర్తవుతుంది?, పరిహారం ఎప్పుడు అందుతుందని ప్రశ్నిస్తున్నారు.

మునిగే తండాలో ఇక ఉండలేం

మాకు వేరే ప్రాంతంలో ఇళ్లు కట్టించి ఇవ్వండి
సీఎంకు సీతారాం తండావాసుల విజ్ఞప్తి

సాక్షి, మహబూబాబాద్: 'సారూ.. శనివారం రాత్రి వచ్చిన వరదతో చెట్టుకొకరం.. పుట్టకొకరం అయినం. ట్యాంకులు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నం.. ఇట్లా మునిగే తండాలో ఉండలేం.. మాకు వేరేచోట ఇళ్లు కట్టించి ఇవ్వండి.. తండా అంతా అక్కడే ఉంటాం..'అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎదుట మహ బూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివారు సీతారాం తండావాసులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పర్యటనలో భాగంగా మంగళవారం తండాకు వచ్చిన సీఎం స్థానికులతో మాట్లాడారు.

సీఎం: నీ పేరు ఏం పేరు...?

తండావాసీ: నాపేరు మంగీలాల్ సార్..

సీఎం: ఏం జరిగింది? ఎక్కడివరకు నీళ్లు వచ్చాయి? (ఇల్లు చూపిస్తూ)

మంగీలాల్: శనివారం రాత్రి అందాజ 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఇంట్లోకి నీళ్లు రావడం ప్రారంభించాయి. ఏంది అని చూడగానే బయట అంతా కొండ మాదిరిగా నీళ్లతో ఉంది. నా భుజాల వరకు నీళ్లు వచ్చేశాయి. వెంటనే మేము పిల్లల్ని తీసుకుని పెద్ద బిల్డింగ్, ట్యాంకులు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాం..ఇక ఇక్కడ ఉండలేం సార్.. మాకు వేరే ఇల్లు కట్టించండి.

సీఎం: శీనన్నా (పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి) వీళ్లను చూడు. ఈ ఇల్లు మీరే కట్టుకున్నారా? (మళ్లీ మంగీలాల్‌ను ఉద్దేశించి)

మంగీలాల్: లేదు సార్.. ఇందిరమ్మ ఇల్లు అప్పుడు కట్టుకున్నాం.

సీఎం: ఇప్పుడు కూడా ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం.. ఇక్కడే ఉంటారా.. వేరే చోటుకు వెళ్తారా? కలెక్టర్ గారూ అంతా చూడండి. తండా మొత్తం నమోదు చేసుకోండి. మంచి సైట్ చూడండి. ఇంట్లో ఏం తడిసినయి? ఏం ఇబ్బంది జరిగింది?

మంగీలాల్ కొడుకు: సార్ నా పుస్తకాలు తడిసినయి.. ఈ ఇంట్లో ఉండలేము. మళ్లీ మునుగుతాం.. మాకు వేరే ఇల్లు కావాలి.

మంగీలాల్: బియ్యం, బట్టలు అన్నీ తడిసినయ్ సార్

సీఎం: ఈమె తెలుసా? (సీతక్కను చూపిస్తూ) ఈమె నీకు కావాల్సిన పుస్తకాలు కొనిస్తుంది.. ఈయన తెలుసా? (ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను చూపిస్తూ) ఈయన పెద్ద డాక్టర్. ఈయన మాదిరిగానే మంచిగా చదువుకోవాలి.. అధైర్య పడకండి.. అన్నీ చూసుకుంటాం.



మంగీలాల్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్లుప్తంగా...

సహాయక చర్యల్లో కాంగ్రెస్ విఫలం

వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: వరద సహాయక చర్యల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం విపక్షాలపై రాళ్ల దాడులకు దిగుతోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడుల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీని నియంత్రించడం కాంగ్రెస్ తరం కాదన్నారు. మాజీమంత్రి మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నేత దాసోజు శ్రవణ్‌తో కలసి మంగళవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నేతలు ఎవరూ కాంగ్రెస్ దాడులకు భయపడరని స్పష్టం చేశారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్ నేతలపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహమూద్ అలీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రతిపక్ష పార్టీగా ప్రజల్లోకి వెళితే దాడులు చేస్తున్నారని బాల్క సుమన్ మండిపడ్డారు. ఆగస్టు 27న వర్షం గురించి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా సీఎం రేవంత్ మాత్రం సమీక్ష నిర్వహించకుండా కుటుంబంతో కలసి సినిమా చూశారని విమర్శించారు. తెలంగాణలో శాంతిభద్రతలను బిహార్ తరహాలో దిగజార్చుతున్నారని పార్టీ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు.

ప్రజలను పరామర్శించడానికి వస్తే దాడులు చేయిస్తారా?

- కాంగ్రెస్‌ను ప్రశ్నించిన బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శించడానికి బీఆర్‌ఎస్ నేతల బృందం వస్తే దాడులు చేయడం ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ ప్రశ్నించింది. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఖమ్మం ప్రజలను ఆదుకోవడానికి ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ నేతలు దాడులు చేయడం పిరికిపంద చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాతావరణ శాఖ భారీ వర్షాలు ఉన్నాయని ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏదో ఎన్నికల ప్రచారానికి వెళ్లినట్లుగా ప్రచార రథం మీద ఉండి చేతులు ఊపుకుంటూ ర్యాలీగా వెళ్లడం విడ్డూరమన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు డిమాండ్ చేసిన విధంగా చనిపోయిన వారికి రూ.25 లక్షలు, పంట నష్టంకు ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నివేదికలు అందాక కేంద్రం తప్పక ఆదుకుంటుంది

బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారం అందుతుందని భావిస్తున్నామని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇక్కడ వాటిల్లిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి నివేదికలు అందాక కేంద్ర బృందాల పరిశీలన తర్వాత కేంద్ర సర్కార్ తప్పక ఆదుకుంటుందని విశ్వసిస్తున్నామన్నారు. రాజకీయపరంగా సంకుచితంగా ఆలోచించకుండా, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందనే దానితో సంబంధం లేకుండా ప్రధాని మోదీ స్పందించి రెండు తెలుగు రాష్ట్రాలను ఆదుకుంటారని చెప్పారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా ఇద్దరు సీఎంలతో మాట్లాడారని గుర్తుచేశారు. కోతకు గురైన వేల ఎకరాల భూమిని వ్యవసాయ యోగ్యంగా మార్చుకునేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వమే ఇవ్వాలని ఈటల డిమాండ్ చేశారు. ఇళ్లు కూలిన వారికి తక్షణ సాయంతో పాటు ఇల్లు కట్టుకోవడానికి ఎక్కువ ఆర్థికసాయం అందించాలని కోరారు.

వరద ప్రభావిత ప్రాంతాలకు బీజేపీ నేతలు

- నేటి నుంచి పర్యటించాలని నేతల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల కారణంగా ఎక్కువగా నష్టపోయిన ప్రాంతాల్లో బుధవారం నుంచి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు పర్యటించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు...వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, అందుబాటులో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటించనున్నట్టు సమాచారం. ప్రధానంగా అధిక నష్టం వాటిల్లిన ఖమ్మం, ములుగు, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో తొలివిడత పర్యటించి బాధితులకు భరోసా కల్పించాలని నిర్ణయించారు. రెండో విడతలో కోదాడ, సూర్యాపేట్, ఆదిలాబాద్, తదితర చోట్ల పర్యటించాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించాల్సి ఉండగా, వరదలతో ఉత్పన్నమైన పరిస్థితులతో దీనిని వాయిదా వేసిన విషయం తెలిసిందే. వరదలు తగ్గుముఖం పడుతున్నందున...ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ముగిసేదాకా కొనసాగించాలని నిర్ణయించినట్టు సమాచారం.

సర్టిఫికెట్లు మున్నేరుపాలు

ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన వరదలో కొట్టుకుపోయిన దాదాపు 500 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు

ప్రభుత్వం తమకు మళ్లీ సర్టిఫికెట్లు ఇప్పించాలని బాధితుల వినతి

చదువుల తల్లులకు ఎంత కష్టం..

ఖమ్మం మున్నేటి ఒడ్డున వెంకటేశ్వరనగర్‌లో గట్టు రేణుక టైలరింగ్ చేస్తూ ఇద్దరు కూతుర్లను ఉన్నత విద్య చదివించింది. వారిలో తేజశ్రీ మమత మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేయగా.. పావని అదే కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇద్దరూ మెరిట్ స్టూడెంట్స్ కావడంతో ఉచిత సీట్లు సంపాదించారు. తేజశ్రీకి చెందిన ఎంబీబీఎస్, ఇంటర్, టెన్త్ సర్టిఫికెట్లు తడిసి ముద్దయ్యాయి. ఎంబీబీఎస్ స్టడీ మెటీరియల్ బురదమయమైంది. పావని సర్టిఫికెట్లు బురదలో కూరుకుపోయాయి. ల్యాప్‌టాప్‌తోపాటు స్టడీ మెటీరియల్ కలిపి రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. ఇంట్లో 90 శాతం మేర సామగ్రి కొట్టుకుపోవడంతో తమను ఆదుకోవాలని రేణుక, వారి పిల్లలు అధికారులను వేడుకుంటున్నారు.



బుక్స్ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న తేజశ్రీ, పావని



సర్టిఫికెట్లు కొట్టుకుపోయిన వినయ్ ఇల్లు ఇదే..

ఉద్యోగానికి రమ్మనే లోపే..

ఖమ్మం వెంకటేశ్వరనగర్‌కు చెందిన పొరండ్ల వినయ్‌కుమార్ శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరైన ఆయనకు ఈ నెల 2న సర్టిఫికెట్లతో రావాలని పిలుపు వచ్చింది. ఇంతలోనే ఆదివారం (1వ తేదీన) వారి ఇంటిని వరద తాకింది. గంటగంటకు వరద తీవ్రత పెరగడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు వినయ్‌కుమార్ తల్లిదండ్రులతో కలిసి పునరావాస కేంద్రానికి వెళ్లగా ఆయన సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి. రూ.70 వేల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లు కూడా మున్నేటి పాలయ్యాయి. స్టీల్ షాపులో పనిచేస్తూ తనను తల్లిదండ్రులు చదివించారని.. ఇప్పుడు ఉద్యోగానికి ఎలా అర్హత సాధించాలో తెలియడం లేదని వినయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. సుమారు 500 మంది విద్యార్థుల విద్యార్హతల సర్టిఫికెట్లు మున్నేరుపాలయ్యాయి. టెన్త్ మొదలు పీజీ వరకు పూర్తి చేసిన విద్యార్థులే కాక కొందరు ఉద్యోగాలు చేస్తున్న వారి సర్టిఫికెట్లు సైతం వరదలో కొట్టుకుపోయాయి. దీంతో వారంతా దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాన్ని మున్నేరు వరద ముంచెత్తగా 50 కాలనీల్లోకి నీరు చేరింది. అందులో కొన్ని ఇళ్లు కొట్టుకుపోగా.. కొన్ని నేలమట్టమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున మున్నేరు వరద చుట్టుముట్టడంతో బాధితులు కట్టుబట్టలతో వెళ్లిపోయారు. వరద తగ్గాక వచ్చేసరికి వందలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయి. మరికొందరికి చెందిన సర్టిఫికెట్లు పూర్తిగా తడిసిపోయాయి. అలాగే పుస్తకాలు, కోచింగ్ మెటీరియల్, స్కూల్ యూనిఫారాలు, కంప్యూటర్లు/ల్యాప్‌టాప్‌లు కొట్టుకుపోవడం లేదా బురదమయం అయ్యాయి. దీంతో విద్యార్థులంతా కన్నీరుమున్నీరవుతున్నారు. పైచదువులకు లేదా పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకొనేందుకు సర్టిఫికెట్లు లేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు మళ్లీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతున్నారు.

6 లక్షల ఎకరాల్లో పంట నష్టం?

వ్యవసాయ శాఖ అంచనా

క్షేత్రస్థాయిలో ఇంకా కొనసాగుతున్న అంచనాల ప్రక్రియ

పరిహారం మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో అధికారులు

సీఎం ఆమోదించినా అమల్లోకి రాని పంటల బీమా



పొలాలపై వరద నీరు పారడంతో పూర్తిగా బండ తేలగా, పక్కనే ఇసుక మేట వేసిన దృశ్యం

సాక్షి, హైదరాబాద్ /సాక్షి ప్రతినిధి నల్లగొండ/సాక్షి మహబూబాబాద్: కుండపోత వర్షాలు, వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంటలు నీట మునగగా, అందులో దాదాపు 6 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. సోమవారం నాటికి 4.15 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మంగళవారం నాటికి పంట నష్టం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో నష్టం అంచనా ప్రక్రియ కొనసాగుతోందని అంటున్నారు. ప్రధానంగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, జనగాం, ములుగు తదితర జిల్లాల్లో భారీగా నష్టం వాటిల్లినట్లు అంచనా. ఇప్పుడిప్పుడే పొలాల్లో నీరు తగ్గుతుండటంతో అధికారులు అంచనాలను వేగవంతం చేశారు. ఎన్ని ఎకరాల్లో పంటలు చేతికి వస్తాయో పరిశీలిస్తున్నారు. పంట నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంట నష్టం పరిహారానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేస్తామని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

ఈ సీజన్‌లో బీమా ఇక అనుమానమే?

పంట నష్టం జరిగినప్పుడు బీమా రైతులకు ధీమా ఇస్తుంది. ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అందుకు కేంద్రం నుంచి కూడా అనుమతి లభించింది. అనంతరం ముఖ్యమంత్రి కూడా ఆమోదం తెలిపారు. అయినా మార్గదర్శకాలు విడుదల చేయడంలోనూ... అమలు చేయడంలో వ్యవసాయశాఖ విఫలమైంది. పార్లమెంటు ఎన్నికలకంటే ముందునుంచే వ్యవసాయ డైరెక్టర్ కంపెనీలతో చర్చిస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలు తావిస్తోంది. సీఎం ఆమోదం తర్వాత వెంటనే అమలు చేసినట్లయితే ఇప్పటికే బీమా అమల్లోకి వచ్చేది. ఒక కీలక ప్రజాప్రతినిధి పంటల బీమా విషయంలో అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నెలాఖరుకు వానాకాలం సీజన్ ముగుస్తుంది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికిప్పుడు బీమాను అమలు చేసే పరిస్థితి ఉండబోదని అధికారులు అంటున్నారు.

550 ఎకరాల్లో కొట్టుకుపోయిన వరి

మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలోని పెద్ద చెరువు, కోమటి చెరువు తెగిపోయాయి. వీటి కింద 420 మంది రైతులు సాగుచేసే 550 ఎకరాల వరి మొత్తం కొట్టుకుపోయింది. 200 ఎకరాలు ఇసుక, రాళ్లతో నిండిపోయాయి. ఎకరానికి రూ.50 వేల నష్టం జరిగిందనుకున్నా, ఈ ఒక్క గ్రామంలోనే రూ.2.75 కోట్ల పంటనష్టంతో పాటు పొలం మరమ్మతు చేయాలంటే మరో రూ. కోటికి పైగా డబ్బులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

పొలం నిండా ఇసుక మేటలు

నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన మైదం వెంకన్న అనే రైతుకు మూడు ఎకరాల పొలం ఉంది. సాగుకు అవసరమైన విత్తనాల కొనుగోలు, దున్నడం, నాట్లు మొదలైన ఖర్చుల కోసం లక్షా 20 వేల రూపాయలు ఖర్చుపెట్టాడు. భారీ వర్షం కారణంగా పడమటిగూడెంలోని గుండ్ల చెరువు తెగడంతో వరద నీరు కొమ్ముల వంచ పాత చెరువు మత్తడి తెగింది. దీంతో కింద ఉన్న వెంకన్న పొలంపై ఇసుక మేటలు కట్టా యి. పంటపోయింది. పెట్టుబడి పోయింది. రూ.2 లక్షలు ఖర్చు పెట్టి ఇసుక మేటలు తొలగిస్తే కానీ పొలం చేతికిరాదు.

ఆనవాలే లేకుండా పోయిన పొలం



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూదియా తండా గ్రామానికి చెందిన గుగులోతు లోక్యాకు జానకీనగర్ రోడ్డులో రెండెకరాల భూమి ఉంది. అందులో 20 రోజుల కిందట వరినాట్లు వేశారు. మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించి పొలమంతా ఇసుక మేట వేసింది. పొలం ఆనవాళ్లే లేకుండా పోయింది. తిరిగి నాటు వేసే పరిస్థితి కూడా లేదు. ఇప్పటికే అప్పు చేసి రూ.40 వేల పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడు ఏం చేయాలో అర్థంకాక లబోదిబోమంటున్నాడు.

రూ.లక్ష నష్టం



ఈయన గడ్డికొప్పుల చంద్రశేఖర్‌రెడ్డి, కాగిత రామచంద్రాపురం గ్రామ సమీపంలో తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడడంతో నీరంతా పొలంపై నుంచే ప్రవహించింది. దీంతో నాలుగెకరాల్లో పంట దెబ్బతింది. విద్యుత్ మోటారు, మూడు విద్యుత్ స్తంభాలు వరద నీటిలో కొట్టుకుపోయి దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ఆవేదన చెందుతున్నాడు.

ప్రభుత్వం ముందస్తు చర్యలతో ప్రమాదం తప్పింది

- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మఠంపల్లిలోని చెరువు పరిశీలనకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మఠంపల్లి/హుజూర్‌నగర్ రూరల్: రాష్ట్రంలో మూడ్రోజులుగా కురిసిన భారీవర్షాలపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్లనే క్షేత్రస్థాయిలో పెను ప్రమాదం తప్పిందని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా హుజూ ర్‌నగర్ నియోజకవర్గంలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మఠంపల్లి మండలం గుండ్లపల్లిలో ఎత్తిపోతల పథకంను పరిశీలించి కృష్ణానదిరేవులో విలేకరులతో మాట్లాడారు. నష్ట పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లను పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేసేందుకు డ్యామ్‌లలో ఉన్న పూడికను తీస్తామని, అందుకు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేస్తామని ఉత్తమ్ తెలిపారు. మఠంపల్లిలోని మామిళ్లచెరువుకట్ట తెగిపోయి వందలాది ఎకరాలు నీటమునిగిన పొలాలు, గండిపడిన చెరువును పరిశీలించేందుకు సరైన మార్గం లేకపోవడంతో 4 కి.మీ. ట్రాక్టర్‌పై ప్రయాణం చేశారు. కాగా, ప్రకృతి సృష్టించిన బీభత్సానికి చెరువు కట్టలు తెగి వరదకు కొట్టుకుపోయి, ఇసుక మేటలు, రాళ్లు, మట్టి దిబ్బలతో నిండిపోయిన వరి పొలాల పంట నష్టంపై వివరాలను వెంటనే సేకరించాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో తెగిన నల్లచెరువును ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం వరదకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు.

వారానికల్లా వరద నష్టం వివరాలు ఇవ్వాలి: సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)శాంతికుమారి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల వలన జరిగిన నష్టం అంచనా వేయడంపై మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్రస్థాయికి పంపి నివేదికను సమర్పించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలన్నారు. సమీక్షలో డీజీపీ డా.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, అర్వింద్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దానకిశోర్, నవీన్‌మిత్తల్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వాహనశ్రేణిపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి


తోపులాట జరిగింది. ఈ క్రమంలోనే మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రయాణిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కారు సహా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వాహనంపై కొందరు కార్యకర్తలు రాళ్ల దాడి చేయగా, అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. త్రీటౌన్ సీఐ రమేష్, పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను పక్కకు తోసి కాన్వాయ్‌ను ముందుకు పంపించారు. కాగా, ఈ ఘటనలో బీఆర్‌ఎస్ నేత సంతోష్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేరిన ఆయన్ను నేతలు పరామర్శించారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం: హరీశ్‌రావు

ప్రజలను అప్రమత్తం చేసి రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని, వరద ప్రాంతాల ప్రజలు అదే చెబుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఖమ్మంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పరామర్శించిన అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం, మంత్రులు మొద్దునిద్రలో ఉండి వరదలు ముంచెత్తుతున్నా ప్రజలను అప్రమత్తం చేయలేదని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండి.. తొమ్మిది మందిని కాపాడలేకపోయారని, జేసీబీ డ్రైవర్ చూపిన తెగువ ప్రభుత్వం చూపలేకపోయిందన్నారు. రాష్ట్రంలో 30 మంది చనిపోతే ప్రభుత్వం 16 మందేనని అబద్ధపు లెక్కలు చూపిస్తుందని విమర్శించారు. వరద బాధితులకు రూ.10 వేలు కాకుండా రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, వివేకానందగౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



బీఆర్‌ఎస్-కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట

ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలి

వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం సత్వరమే చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సాగర్ ఎడమకాల్వకు పడిన గండ్లతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వకు గండిపడిన ప్రాంతాన్ని మంగళవారం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. నీటమునిగి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున, ఇసుక మేట వేసిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కాగా, ప్రభుత్వ వైఫల్యం వల్లనే సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడ్డాయని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.

ఖమ్మంలో కాంగ్రెస్ దాడిపై కేటీఆర్ ఆగ్రహం

- అసహనంతోనే హరీశ్, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు సాయం చేయడం చేతగాక, సేవ చేసే బీఆర్‌ఎస్ నేతలను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ దాడికి దిగిందని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధ్వజమెత్తారు. ఖమ్మంలో మాజీమంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయటం వారి అసహనానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా మంగళవారం ఆయన పోస్ట్ చేశారు. ఈ దాడికి ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్ ముందుచూపుతోనే నగరానికి తప్పిన ప్రమాదం

హైదరాబాద్‌లో వర్షాల కారణంగా ప్రజా జీవనానికి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ముందుచూపుతో మాజీ సీఎం కేసీఆర్ చేసిన కృషి ఇప్పుడు ఫలితాలనిచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. 2020లో వచ్చిన వరదల కారణంగా జరిగిన భారీ నష్టం మరోసారి ఎదురుకాకుడదని స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఎన్‌డీపీ)కు నాటి కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. కాగా, రాష్ట్రంలో వరదలతో నష్టపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కేన్స్ సంస్థ గుజరాత్‌కు తరలింపు: కేటీఆర్

గతంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన కేన్స్ సంస్థ గుజరాత్‌కు తరలివెళ్తున్నట్లు వస్తున్న వార్తలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆవేదన వ్యక్తంచేశారు. కేన్స్ సంస్థ గుజరాత్‌కు తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నా తరలిపోకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ఎక్కడున్నారు?

- ఏపీలో విపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ ఉన్నారని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు భరోసా ఇస్తూ, సర్కారుకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు. ఏపీలో ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. బాధ్యతగల ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజలకు అండగా నిలబడ్డారని, వరదల్లో ప్రజలు పడుతున్న బాధలను చూసేందుకు స్వయంగా వెళ్లారని అన్నారు. కానీ తెలంగాణలో మాత్రం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, రాజకీయాలను పక్కన పెట్టి సాయం చెయ్యాల్సిన సోయి ప్రతిపక్ష నేతకు లేదా? అని మహేశ్‌కుమార్ ప్రశ్నించారు. తండ్రి ఫామ్‌హౌస్‌లో ఉంటే కేటీఆర్ ఇంగ్లండ్‌లో రిలాక్స్ అవుతున్నాడని, సామాజిక బాధ్యత మరిచి సోషల్ మీడియాలో ట్వీట్లు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వరద బాధితులను ఆదుకోవడానికి రోడ్డు మార్గంలో వెళ్లి పర్యటిస్తున్నారని, నాలుగు రోజులుగా సీఎం, మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి ఇంత విపత్తు వచ్చినా కేసీఆర్, కేటీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలని అన్నారు. కేంద్రంతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి ఆర్థిక సాయం కోరారని చెప్పారు. అయితే విపక్షాలు కొన్ని ప్రసార మాధ్యమాల్లో అడ్డగోలు వార్తలు రాయిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

..ముందు అవి ఖర్చు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగ సర్టిఫికెట్స్(యూసీ) కేంద్రానికి సమర్పించలేదన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గతంలో కేంద్రం ఎస్డీఆర్‌ఎఫ్ నిధులు విడుదల చేసినా, అవి బాధితులకు అందలేదన్నారు. ఇటీవలి వర్షాలతో బాధితులు ఇబ్బందులు పడుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ (యూసీలు) ఇవ్వకపోయినా, తాత్కాలికంగా వరద బాధిత ప్రాంతాలకు తక్షణమే సాయం అందించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని కోరినట్టు తెలిపారు. జూన్ 1న కేంద్రం రూ.208 కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఏజీ) ఇచ్చిన వివరాల ప్రకారం.. తెలంగాణ ఎస్డీఆర్‌ఎఫ్ ఖాతాలో రూ.1,345.15 కోట్లు ఉన్నాయని చెప్పారు. చనిపోయినవారికి కేంద్రం ఇప్పటికే రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గత సంవత్సరమే ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు జరిగిన నష్టాన్ని పూడ్చేలా సహాయ సహకారాలు అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిధులు సమకూర్చాలి'అని సూచించారు. నష్టాన్ని అంచనా వేసి కేంద్రాన్ని నిధులు కోరాలని మంత్రి వ్యాఖ్యానించారు.

అవసరమైతే ప్రధాని పర్యటిస్తారు...

'జాతీయ విపత్తుగా ఎక్కడా ప్రకటించడం లేదు. నిధులు ఇస్తున్నామా లేదా అనేది ముఖ్యం. కేరళలో అంత విపత్తు సంభవించిన వెంటనే ప్రధాని మోదీ వెళ్లలేదు. విపత్తు జరిగిన ప్రాంతానికి రాజకీయనేతలు, మంత్రులు వెళ్లి సహాయక చర్యలకు విఘాతం కలిగించ వద్దన్నది కేంద్ర ప్రభుత్వ విధానం. రాష్ట్రంలో వాటిల్లిన నష్టాన్ని పరిశీలించేందుకు అవసరమైతే ప్రధాని వస్తారు'అని కిషన్‌రెడ్డి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఇప్పటివరకు స్థానిక అధికారులు బాధితుల దగ్గరకు వెళ్లలేదు..వారికి సహాయం అందించలేదు అని బాధితులు చెబుతున్నట్టు టీవీల్లో వస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. 'సీఎంతో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడి రాష్ట్రానికి ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపించారు. సహాయ సహకారాలు అందించారు. వరంగల్, మహబూబాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, రైల్వే ట్రాక్‌లను వెంటనే మరమ్మతులు చేసి, ప్రయాణికులు రాకపోకలు కొనసాగించేలా కేంద్రం సంబంధిత అధికారులను ఆదేశించింది'అని తెలిపారు.

అధికారంలోకి వచ్చాక వాడవాడలో విమోచన ఉత్సవాలు

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతీ గ్రామపంచాయతీ భవనంపై, ప్రభుత్వ పాఠశాలలపై త్రివర్ణ పతాకం ఎగురవేసి వేడుకలు ఘనంగా జరుపుతామని కిషన్‌రెడ్డి అన్నారు. 'సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తున్నాం. ఈనెల 17న ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో వేడుకలు నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. దురదృష్టవశాత్తు తెలంగాణలో మజ్లిస్ పార్టీకి భయపడి గతంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించలేదు. అందుకే, కేంద్రం చొరవ తీసుకుని సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాలను జరుపుతోంది'అని పేర్కొన్నారు.



బీదర బుద్ధి ఎంత తగ్గింది అనేదాన్ని బట్టి,
వివేకపు పెరుగుదలను కచ్చితంగా కొలవొచ్చు.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 4 సెప్టెంబర్ 2024

మళ్ళీ మంటలు

మూడు నెలలుగా కాస్తంత ప్రశాంతత నెలకొన్నట్టుందనుకొనే లోగా కథ మళ్ళీ మొదటి కొచ్చింది. మణిపుర్‌లో శాంతి మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. కల్లోలిత ఈశాన్య రాష్ట్రంలో మెయితీల ప్రాబల్యమున్న కొన్ని ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో మునుపెన్నడూ లేని డ్రోన్ దాడులతో దేశం ఉలిక్కిపడింది. ఇప్పటి దాకా భావిస్తున్నట్టు ఇది కేవలం రెండు వర్గాల మధ్య జాతి, మతఘర్షణలే అనుకోవడానికి వీల్లేదని తేలిపోయింది. ముందుగా వేసుకున్న ఒక పథకం ప్రకారం, వ్యవస్థీకృతంగా సాగిస్తున్న యుద్ధనేరాల స్థాయికి దాడులు చేరిపోయాయి. మణిపుర్‌లో ఘర్షణలు తగ్గిపోయాయంటూ ప్రధాని మోదీ చెప్పిన మాటల్లో పస లేదని క్షేత్రస్థాయి సంఘటనలతో స్పష్టమైంది. పైగా భారత భూభాగం లోపలే, సాక్షాత్తూ దేశ పౌరులపైనే ఇలా సైనిక వ్యూహంతో డ్రోన్ దాడులు మొత్తం ఈ ప్రాంతాన్నే భయంలోకి నెట్టి, అస్థిరపరిచే కుట్రగా కనిపిస్తోంది. మయన్మార్‌లో జుంటాపై ప్రజాస్వామ్య అనుకూల వేర్పాటువాదులు సాగించే ఈ యుద్ధతంత్రం ఇక్కడ దర్శనమివ్వడం సరిహద్దుల ఆవల ప్రమేయాన్ని చూపుతోంది. ఇది ఆందోళనకరమైన పరిణామం.

అత్యాధునిక సాంకేతిక జ్ఞానంతో కూడిన డ్రోన్ల ద్వారా తీవ్రవాదులు రాకెట్ చోదిత గ్రెనేడ్లను ప్రయోగించడంతో ఆదివారం పలువురు గాయపడ్డారు. సోమవారం సైతం మరో గ్రామంపై ఇదే పద్ధతిలో డ్రోన్ దాడులు జరిగాయి. మణిపుర్‌లో హింస కొంతకాలం నుంచి ఉన్నదే అయినా, ఇలా పౌరులపై డ్రోన్లతో బాంబులు జారవిడవడం ఇదే తొలిసారి. అదీ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు వ్యతిరేకంగా గిరిజనుల ఆధిక్యం ఉన్న కొన్ని జిల్లాల్లో కుకీ – జో వర్గాలు నిరసన ప్రదర్శనలు జరిపిన మర్నాడే ఈ ఘటనలు జరగడం గమనార్హం. యుద్ధాల్లో వాడే ఇలాంటి వ్యూహాలను ఇలా అనూహ్యంగా అందరిపై ప్రయోగించి, ఉద్రిక్తతల్ని పెంచినది కుకీలే అన్నది పోలీసుల ఆరోపణ.

అదెలా ఉన్నా, ఇది మన నిఘా సంస్థల వైఫల్యానికీ, తీవ్రవాదుల కట్టడిలో మన భద్రతాదళాల వైఫల్యానికీ మచ్చుతునక. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం మణిపుర్‌లో జరిగిన డ్రోన్ దాడులను నిశితంగా అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. తీవ్రవాదులు ఎలాంటి డ్రోన్లను వాడారన్నది మొదలు పలు అంశాలను ఈ కమిటీ నిశితంగా పరిశీలించనుంది. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై నివేదిక సమర్పించనుంది. అయితే గతేడాది మేలో మొదలైన హింసాకాండ చివరకు ఈ స్థాయికి చేరిందంటే, ఇప్పటికీ చల్లారలేదంటే తప్పు ఎక్కడున్నట్టు? ఉద్రిక్తతల్ని చల్లార్చి, విభేదాలు సమసిపోయేలా చూడడంలో స్థానిక పాలనా యంత్రాంగం ఇన్ని నెలలుగా విఫలమైందన్న మాట. కొండ ప్రాంతాలకూ, లోయ ప్రాంతాలకూ మధ్య బఫర్ జోన్లు పెట్టి, భద్రతాదళాల మోహరింపుతో శాశ్వతంగా శాంతి భద్రతల్ని కాపాడగలమని పాలకులు భావిస్తే పిచ్చితనం.


అసమర్థ పాలనతో పాటు అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ మాత్రం కుర్చీ పట్టుకొని వేలాడుతూ, ఆ మధ్య కూడా గొప్పలు చెప్పారు. తాము నియమించిన శాంతిదూతలు గణనీయమైన పురోగతి సాధించారనీ, ఆరు నెలల్లో శాంతి తిరిగి నెలకొంటుందనీ ఊదరగొట్టారు. ఆ మాటలన్నీ నీటిమూటలేనని తాజా ఘటనలు ఋజువు చేశాయి. పైపెచ్చు, తాజాగా ఆధునిక సాంకేతికత సాయంతో, అత్యాధునిక ఆయుధాలతో సాగుతున్న దాడులను బట్టి చూస్తే, కొన్ని వర్గాలకు దేశం వెలుపల నుంచి అన్ని రకాల వనరులు అందుతున్నట్టు అనుమానం బలపడుతోంది. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికే ముప్పుగా పరిణమించే ఇలాంటి పరిస్థితుల్లో పాలకులు కుంభకర్ణ నిద్ర పోతే పెను ప్రమాదం. శతాబ్దాలుగా అనేక సంక్షోభాలను ఎదుర్కొని, తమ మట్టినీ, మనుగడనూ కాపాడుకొన్న చరిత్ర మణిపుర్ ప్రజలది. అలాంటి ప్రాంతాన్ని పేరుకు మాత్రమే భారత్‌లో భూభాగంగా చూడక, ఆ ప్రాంత ప్రజల బాగోగులు, అక్కడి శాంతి సుస్థిరతలు తాము పట్టించుకుంటామని పాలకులు నిరూపించుకోవాల్సిన సమయమిది.

2023 నుంచి కుకీలు, మెయితీల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం అట్టుడుకుతోంది. ఎక్కడ ఏ వర్గం ప్రాబల్యం ఎక్కువగా ఉంటే, అక్కడ అది ఆ వర్గపు అడ్డాగా ఇప్పటికే మణిపుర్ అనేక జోన్లుగా అనధికారంగా చీలిపోయింది. ఇంటిలోని ఈ గుండెల మీద కుంపటి చాలదన్నట్టు, ఆ పక్కనే మన దేశానికి సరిహద్దులు సైతం అంతే ఉద్రిక్తంగా తయారయ్యాయి. జుంటాకూ, తిరుగుబాటుదారులకు మధ్య ఘర్షణలతో మయన్మార్ రగులుతోంది. ఇటీవలి రాజకీయ సంక్షోభంతో పొరుగున బంగ్లాదేశ్‌తో వ్యవహారం అస్తుబిస్తుగా ఉంది. ఈ గందరగోళ భూభౌగోళిక వాతావరణం మణిపుర్ వ్యవహారాన్ని మరింత సున్నితంగా మార్చేస్తోంది. అంతా బాగానే ఉందనడం మాని, ఇప్పటికైనా బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ తాము అనుసరిస్తున్న ధోరణిని పునస్సమీక్షించుకోవాలి.

మణిపుర్ మరో యుద్ధభూమిగా మిగిలిపోకూడదనుకుంటే, మన పాలకులకు కావాల్సింది రాజకీయ దృఢసంకల్పం, చిత్తశుద్ధి. దేశ అంతర్గత భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదాన్ని గమనించి, తక్షణ నష్టనివారణ చర్యలు చేపట్టాలి. ఏ ఒక్క వర్గానికో కొమ్ము కాయడం మాని, పెద్దన్న తరహాలో అన్ని వర్గాల ప్రజల మధ్య స్నేహ సౌహార్దాలు నెలకొనేలా నిజాయతీగా కృషి చేయాలి. సంబంధిత వర్గాలన్నిటితో రాజకీయ చర్చలు సాగించాలి. ఘర్షణల్ని పెంచిపోషిస్తున్న అంతర్లీన అంశాలను గుర్తించి, వాటిని ముందుగా పరిష్కరించాలి. తాత్కాలిక సర్దుబాటు కాక శాశ్వత శాంతిస్థాపనకై చర్చించాలి. ఇప్పటికైనా పాలకులు వివేకాన్ని చూపగలిగితే, మణిపుర్‌ను మంటల్లో నుంచి బయటపడేయవచ్చు. లేదంటే దేశమంతటికీ కష్టం, నష్టం.

యాభై ఏళ్ల భారత విజయగాథ

విశ్లేషణ



టి.ఎన్. నైనన్

1970ల వరకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా 1.9 శాతానికి తగ్గిపోయింది. కానీ అనంతరం స్థిరమైన పనితీరు నమోదవుతూ వచ్చింది. ఇప్పుడది 3.5 శాతం. ప్రపంచ సగటు కంటే దేశ ఆర్థిక వ్యవస్థ రెండింతలు వృద్ధి చెందుతోంది. అన్నింటిమీదా నియంత్రణలున్న వామపక్ష విధానాల నుండి దూరం జరిగి కొత్త ఆర్థిక విధానం ప్రారంభం కావడమే దీనికి కారణం. భారతీయులు ఉత్సాహవంతులైన షేర్ మార్కెట్ పెట్టుబడిదారులుగా మారారు. ఈ విజయగాథకు వ్యతిరేక కథనం కూడా ఉంది. ఆదాయపు నిచ్చెన దిగువ ఉన్నవారికి మంచి వేతనాలతో కూడిన పని ఉన్నప్పుడే ఆర్థిక వ్యవస్థ 7–ప్లస్ శాతానికి చేరుకోగలుగుతుంది. అప్పుడే నిజంగా అధిక వృద్ధి సాధించిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలుస్తుంది.

అప్పుడు అలా కనిపించక పోయివుండొచ్చు, కానీ 50 ఏళ్ల క్రితం భారతదేశం పెద్ద మలుపును చేరుకుంది. ఆర్థిక సంక్షోభం, రాజకీయ ఉపద్రవం ఏర్పడ్డాయి. ఒక సంవత్సరం తర్వాత దాని నిర్ణయాత్మక చర్య ఏమిటంటే, ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడం. కాకపోతే రెండేళ్ల లోపే అది తారుమారైపోయింది. దేశాన్ని ప్రభావితం చేసిన ఒక ముఖ్య ఘటనను ఆ సమయంలో ఎవరూ గుర్తించలేదు. అదేమిటంటే, ఇందిరా గాంధీ హయాంలో అమలైన సంపూర్ణ వామపక్ష దశ నుండి దూరం జరుగుతూ ఆర్థిక విధానంలో కొత్త దిశ ప్రారంభం కావడమే. అంతవరకు ఆర్థిక వ్యవస్థగా భారత దీర్ఘకాలిక పనితీరు నామమాత్రంగానే ఉండింది. కాలక్రమేణా కొత్త 'భారత విజయ గాథ' పుట్టుకొచ్చింది.

1970ల మధ్యకాలం వరకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కంటే భారత్ చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. వరుస యుద్ధాలు, దిగుబడిలేని పంటలు, క్షామం, వేదనాభరితమైన రూపాయి క్షీణతతో పాటు రెండు చమురు షాక్‌ల రూపంలో దాదాపు 15 ఏళ్ల సంక్షోభాలను ఎదుర్కొన్న తర్వాత మార్పు మొదలైంది. నెహ్రూ హయాంలోని ప్రారంభ ఆశావాదం తర్వాత జరిగిన ఈ సంఘటనలు చాలా వరకు జాతి తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేలా చేశాయి.

ఆర్థిక వ్యవస్థ స్థిరీకరించబడిన తర్వాత, అర్ధ శతాబ్దపు స్థిరమైన పనితీరు నమోదైంది. తక్కువ ఆదాయం, మధ్య ఆదాయం కలిగిన దేశాలతో పాటు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా మన వృద్ధి రేటు అధిగమించింది. పర్యవసానంగా దేశం మునుపెన్నడూ ఆస్వాదించని అంతర్జాతీయ స్థాయిని నేడు కలిగి ఉంది. అయినప్పటికీ, కొనసాగుతున్న పేలవమైన సామాజిక ఆర్థిక కొలమానాలు, పెరుగుతున్న అసమానత కారణంగా మన వృద్ధి రేటు 'ఆశాజనకమైన' రికార్డుగా అయితే లేదు.

ఆర్థిక పరివర్తనకు ముందు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా క్షీణిస్తూ ఉండేది. 1960లో 2.7 శాతం నుండి 1975లో 1.9 శాతానికి మన వృద్ధి క్షీణత మందగించింది. 2013లో కూడా, ప్రపంచ జీడీపీలో భారత్ వాటా 1960 నాటి కంటే కొంచెం తక్కువగా ఉంది. ఇప్పుడు 2024లో ఇది 3.5 శాతం. పైగా ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సగటు కంటే రెండింతలు వృద్ధి చెందుతున్నందున, ప్రపంచ వృద్ధికి భారత్ మూడవ అతిపెద్ద దోహదకారిగా ఉంటోంది.

తలసరి ఆదాయం కూడా అదేవిధంగా మెరుగుపడింది. 1960లో ప్రపంచ సగటులో 8.4 శాతంగా ఉన్న దేశ తలసరి ఆదాయం 1974లో 6.4 శాతానికి తగ్గింది. 2011లో ఈ సంఖ్యలు 13.5 శాతానికి, 2023లో 18.1 శాతానికి మెరుగుపడ్డాయి. దాదాపు ఐదు దశాబ్దాల కాలంలో మూడు రెట్ల పెరుగుదల! అయినప్పటికీ చాలా దేశాల్లోని ప్రజలు మనకంటే మెరుగైన జీవన ప్రమాణాలను



అనుభవిస్తున్నారు. ఆఫ్రికా బయటి దేశాల్లో, మన పొరుగు దక్షిణాసియా దేశాల్లో తలసరి ఆదాయం ఇంత తక్కువగా ఉన్నవి పెద్దగా లేవు. అంటే, మనం ప్రయాణించవలసింది ఇంకా ఎంతో ఉంది.

భారతదేశ కథను మార్చేది దాని జనాభా పరిమాణమే. తలసరి ఆదాయం తక్కువగా ఉంది. కానీ 140 కోట్లసార్లు గుణిస్తే అది భారత ఆర్థిక వ్యవస్థను ఐదవ అతిపెద్దదిగా చేస్తుంది. ఇప్పటికే, భారత్ మొబైల్ ఫోన్లు, మోటార్ సైకిళ్లు, స్కూటర్లకు రెండవ అతిపెద్ద మార్కెట్. విమానయానం, కార్లకు మూడవ లేదా నాల్గవ అతి పెద్ద మార్కెట్. ఈ ఉత్పత్తులు, సేవా మార్కెట్లలో వృద్ధికి, పెరుగుతున్న మధ్యతరగతి కారణమవుతోంది. ఇది 'డాలర్–బిలియనీర్ల' పెరుగుదలకు దారితీసింది (200 బిలియనీర్లు. ప్రపంచంలో మూడో స్థానం). మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా భారత స్టాక్ మార్కెట్ నాల్గవ స్థానంలో ఉంది.

1970ల మధ్యకాలం వరకు, దాదాపు సగం మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసించారు. నేడు, అధికారికంగా 10 శాతం కంటే తక్కువ మంది పేదలు ఉన్నారు. భారత్‌ను ఇప్పుడు పేద ప్రజల దేశంగా కాకుండా అభివృద్ధి చెందుతున్న శక్తిగా అంతర్జాతీయంగా ప్రస్తావిస్తున్నారు. అయినప్పటికీ, వియత్నాం వంటి దేశాలు 'అధిక అభివృద్ధి' హోదాను పొందగా, భారత్ తన మానవాభివృద్ధిలో 'మధ్యస్థ అభివృద్ధి' దేశంగా మాత్రమే కొనసాగుతోంది. మరో దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు 'అధిక అభివృద్ధి' విభాగంలో చేరే అవకాశం లేదు. దీనికి మించి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో కూడిన 'అత్యున్నత అభివృద్ధి' విభాగం ఉంది. ఇందులోకి చేరాలన్నది ప్రస్తుతం దేశ ఆకాంక్ష.

దేశంలో పాఠశాల విద్య సగటు సంవత్సరాలు 2010లో ఉన్న 4.4 ఏళ్ల నుండి ఇప్పుడు 6.57 ఏళ్లకు మెరుగైనాయి. 1,000 జనాభాకు ఒక వైద్యుడు ఉంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన నిష్పత్తి కంటే ఇది ఎక్కువ. దేశ ప్రజల ఆయుర్దాయం 70 సంవత్సరాల పరిమితిని కూడా దాటేసింది. అధిక ఆదాయాలు వైవిధ్యమైన, సమృద్ధికరమైన ఆహారంలో ప్రతిబింబిస్తాయి. పాల వినియోగం 10 రెట్లు పెరిగింది. చేపల వినియోగం కూడా అలాగే ఉంది. గుడ్ల వినియోగం 20 రెట్లు పెరిగింది.

వీటన్నింటి కంటే ముఖ్యమైనది మనస్తత్వంలో మార్పు. 1970ల మధ్య వరకూ భారత్ సామ్యవాద భావజాలానికి కట్టుబడి ఉంది. అనేక పరిశ్రమలను పెద్ద ఎత్తున జాతీయం చేయడమే కాకుండా, కాగితం నుండి ఉక్కు వరకు, చక్కెర నుండి సిమెంట్ వరకు, ఆఖరికి స్నానం సబ్బుల నుండి కార్ల వరకు ప్రతిదానిపై ధర, ఉత్పత్తి నియంత్రణ ఉండేది! దీని అనివార్య ఫలితం ఏమిటంటే కొరత, బ్లాక్ మార్కెట్లు. పారిశ్రామిక వివాదాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘాల పక్షం వహించడం పరిపాటిగా ఉండేది. కానీ పరిస్థితులు మారాయి. కమ్యూనిస్ట్ పార్టీలు ఐసీయూలో ఉన్నాయి. పైగా వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ప్రభుత్వాలు ఇప్పుడు కార్మిక చట్టాలను మార్చాలనుకుంటున్నాయి. పన్ను రేట్లు సహేతుకంగా మారాయి.

భారతీయులు ఇప్పుడు ఉత్సాహవంతులైన షేర్ మార్కెట్ పెట్టుబడిదారులుగా మారారు. 1974లో షేర్ల అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ విలువ రూ. 12 కోట్లు (నేటి డబ్బులో దాదాపు రూ. 350 కోట్లు). దీనితో పోల్చితే, గత రెండేళ్లలో అనేక కంపెనీలు రూ. 15,000–21,000 కోట్ల విలువైన పబ్లిక్ ఇష్యూలు జారీ చేశాయి (ఎల్ఐసీ, అదానీ, వోడాఫోన్ మొదలైనవి). ఒక దశాబ్దం క్రితం వరకు, మ్యూచువల్ ఫండ్ కంపెనీలు బ్యాంకు డిపాజిట్లలో ఎనిమిదో వంతు కంటే తక్కువ మొత్తాలను నిర్వహించాయి; ఆ షేర్ రెండింతలు పెరిగి ఇప్పుడు పావు వంతు కంటే ఎక్కువకు చేరుకుంది. వచ్చే ఐదేళ్లలో భారతదేశం తన జీడీపీకి గత పదేళ్లలో చేసిన దానికంటే, మరింత ఎక్కువ జోడిస్తుంది.

భారత్ సాధించిన ఈ విజయగాథకు వ్యతిరేక కథనం కూడా తక్కువేమీ లేదు. ఏడేళ్ల క్రితంతో పోలిస్తే వినియోగ సరుకుల ఉత్పత్తి ఏమాత్రం పెరగలేదు. నిల్వ ఉండని సరుకుల ఉత్పత్తి వార్షిక సగటు కేవలం 2.8 శాతమే పెరిగింది. దీనివల్ల స్పష్టంగానే, వినియోగదారులు ఆర్థికంగా ఒత్తిడికి గురవుతారు. ఆదాయ నిచ్చెన దిగువ ఉన్నవారికి మంచి వేతనాలతో కూడిన పని లేకపోవడాన్ని ఇది సూచిస్తుంది. ఇది మారినప్పుడు మాత్రమే ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7–ప్లస్ శాతానికి చేరుకోగలుగుతుంది. అప్పుడే నిజంగా అధికంగా వృద్ధి సాధించిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా గుర్తించబడుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొనసాగింపు



ఎమర్జెన్సీ సినిమాను ఆపడం అనేది ఎమర్జెన్సీ ఇంకా పోలేదనడానికి నిదర్శనం. ఎందుకంటే ఎమర్జెన్సీ అనేదే ప్రాథమికంగా భావ స్వేచ్ఛను ఆపడానికి ఉద్దేశించినది.

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

అన్నీ చదివేశాక...



కశ్మీర్ నాయకులు మంచి చదువరులు. కమ్యూనిస్ట్ పార్టీలో చేరడానికి అర్ధరాత్రి దాకా మార్క్స్‌ను చదివారు. కాంగ్రెస్‌లో చేరడానికి పగలు నెహ్రూను చదివారు. 'ఏఐపీ'లో చేరడానికి సాయంత్రం జైలు జ్ఞాపకాలు చదివారు. వారాంతాల్లో 'ఆతిశ్–ఎ–చినార్' (షేక్ అబ్దుల్లా ఆత్మకథ) చదువుతారు. సెలవు రోజుల్లో సావర్కర్, గాడ్సే.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

పాక్‌కు సవాలు



బలోచ్, పష్తూన్, సింధీ ఉద్యమాల మధ్య బలమైన ఐక్యత ఏర్పడితే అది పాకిస్తాన్ రాజ్యానికి గట్టి సవాలు అవుతుంది. ఈ మూడింటి నోరు నొక్కింది రాజ్యమే. ఈ మూడూ ఏకమవడం నిజమైన ఆశ కలిగిస్తోంది.

– నిదా కిర్‌మాణీ, సోషియాలజిస్ట్

ప్రేమతో హైజాక్



కొత్తగా 'నెట్‌ఫ్లిక్స్'లో విడుదలైన 'ఐసీ814–కాందహార్ హైజాక్' వెబ్ సిరీస్‌ను మన పాఠ్యాంశంగా చేర్చాలి. తాలిబన్ అనేది నిజానికి మానవ హక్కుల సంస్థ అనీ, వాళ్లు దయామయులనీ చెబుతున్నారు. వాళ్లకు త్వరగా నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలి. ఇస్లామిక్ తీవ్రవాదం అనేది మిథ్య. నెట్‌ఫ్లిక్స్‌ను మన జాతీయ ఛానెల్‌గా ప్రకటించాలి.

– సుదీప్తో సేన్, ఫిలిం మేకర్

పెంచాల్సినవి...



మన తిండిలో తగ్గుతున్నది మాంసకృత్తులు కాదు, వైవిధ్యం. మన వ్యాయామంలో తగ్గుతున్నది రాశి కాదు, వాసి. మన జీవితంలో తగ్గుతున్నది వినియోగం కాదు, అనుసంధానం.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

కీలెంచి వాతపెడతారు!

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇచ్చే వ్యవహారాన్ని అమెరికా అనుకూల ప్రతిపక్షం సాకుగా చూపి ఆ దేశాన్ని అంతర్యుద్ధానికి సన్నద్ధం చేసిందనేది అక్షర సత్యం. మతం ఆధారంగా ఈ దేశం నుంచి విడిపోయి తూర్పు పాకిస్తాన్‌గా పిలవబడిన బంగ్లాదేశ్‌లో మొదటి నుండి ఉర్దూ మాట్లాడే పాకిస్తాన్ అనుకూల వాదులకూ, బెంగాలీ మాట్లాడే ముస్లింలకూ అనేక విషయాల్లో సైద్ధాంతిక వైరుధ్యం ఉంది. బెంగాలీ మాట్లాడే ముస్లింలు ఎక్కువమంది అవామీ లీగ్ పార్టీకి విధేయులు. ఆ పార్టీ నాయకుడైన షేక్ ముజిబుర్ రెహమాన్‌ను బంగ్లాదేశ్ జాతిపితగా అక్కడి మెజారిటీ ప్రజలు చూస్తారు. అయినప్పటికీ పాకిస్తాన్ అనుకూల వాదులు సైన్యాన్ని అడ్డుపెట్టుకొని 1975లో ముజిబుర్ రెహమాన్‌తో సహా 22 మందిని మట్టు పెట్టారు. ఆయన ఏర్పాటుచేసిన అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలకు మైనారిటీలుగా హిందువులు ఎదుర్కొనే సమస్యలపై కొంత అవగాహన ఉంది. అందుకే వారు అక్కడి హిందుత్వ సంస్థలతో సత్సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఈ కారణంతోనే హసీనా ప్రభుత్వ వ్యతిరేకులు హిందువులపై విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఇక భారతదేశాన్ని పరిపాలించే ప్రభుత్వం హిందుత్వ ప్రభుత్వం అని నమ్మినవారు... షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించడాన్ని సహించలేక బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణహోమం జరిపారు. ఇది అక్షర సత్యం.


షేక్ హసీనా రాజీనామా చేసి, ఇండియాకు పారిపోయి వచ్చిన వెంటనే బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలూ, ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపు సభ్యులూ కలిసి బంగ్లాదేశ్‌లో జరిపిన మారణహోమం, హసీనా ఇంట్లో చొరబడి చేసిన నిర్వాకం భారతదేశంలోని కొంతమందికి అమితానందాన్ని కలిగించింది. ఆ ఆనందంతోనే 'భారత్‌లో కూడా బంగ్లాదేశ్ పరిస్థితులు రాబోతున్నాయనీ, మోదీ కూడా ఏదో ఒక రోజు దేశం విడిచి పారిపోతాడనీ, మోదీ ఇంట్లోకి ఏదో ఒక రోజు ప్రజలు దూరే పరిస్థితి వస్తుందనీ' వారు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ మాటలు దేశ హితైషు లకు పట్టరాని కోపాన్ని తెప్పించాయి.

ఇక భారతీయుల, బంగ్లాదేశీయుల ఆలోచనలు ఒకే కోణంలో ఉంటాయా అనే విషయాన్ని పరిశీలిద్దాం! మతం ఆధారంగా దేశాన్ని కోరుకుని, తమ సొంత మతస్థుల చేతిలో అరాచకానికి గురై, మన సైనిక సహకారంతో ఒక స్వతంత్ర భూభాగాన్ని ఏర్పాటు చేసుకుని, దేశానికి ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియని ఒక గుంపు స్వభావం కలిగిన వారు బంగ్లాదేశీయులు. ఇక భారతీయులు ఎంతో పరిణతి కలిగిన సుసంపన్న సాంస్కృతిక వారసత్వం కలవారు. వీరిని రెచ్చగొట్టి, తమ పైశాచికత్వాన్ని పండించుకోవాలని చూసే నాయకులకు ఇక్కడ మద్దతు లభించదు. 1967లో కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువునా చీలినప్పుడు, రాజభరణాల రద్దు సమయంలో, 1971 బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో మన సైన్యాన్ని పాకిస్తాన్ పైకి పంపినప్పుడు, 1975 ఎమర్జెన్సీ సమయంలో ఈ దేశం అనేక రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొంది. కానీ ప్రజలు సంయమనంతో వ్యవహరించి, ప్రజాస్వామ్య పంథాను అనుసరించి, హుందాగా వ్యవహరించారు. బంగ్లాదేశీయుల్లా భారతీయులు హింసను ఆశ్రయించి ఉంటే– దేశంలో ఎమర్జెన్సీని విధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకూ, ఆ పార్టీ అనుయాయులకూ షేక్ హసీనాకు పట్టిన గతే పట్టేది. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై ప్రజలు తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారు.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

'పేద విజయవాడ'పై దూసిన వరద కత్తి

సందర్భం



జాన్‌సన్ చోరగుడి

విజయవాడ నగర జీవనాడిపై ప్రకృతి కత్తి పడింది. అది సుడులు తిరుగుతూ చేసిన గాయం పొరలు పొరలుగా చర్మాన్ని కండరాలను చీల్చుకుంటూ విజయవాడలోని పేదల ఎముకల్నీ అందులోని మజ్జను సైతం తాకింది. ఈ నగరంలో ఉత్తరాంధ్ర ఉంది. ప్రకాశం ఉంది. తెలంగాణ ఉంది. ఇక ఉత్తరాది రాష్ట్రాలు అంటే, సరే సరి. వీళ్ళ పెళ్ళిళ్ళు పేరంటాల మేళం కోసం ఏకంగా రాజస్థాన్ బ్యాండ్ బృందం ఒకటి మంగళగిరిలో ఉంటున్నది. గడచిన పదేళ్ళలో అయితే, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా కూలీలు, పశ్చిమ బెంగాల్ జరీ నేత పనివాళ్ళు, రాజస్థాన్ మార్బుల్ పనివాళ్ళు నగరంలో ఏడాది పొడుగునా కనిపిస్తున్నారు.

ఇవన్నీ సరే మరి స్థానికులు మాటేంటి? అనేది సహజంగానే వస్తున్నది. దీనికే సరైన సమాధానం ఇప్పుడు 'బెజవాడ' దగ్గర లేదు. 'నేను ఏమిటి?' అని ఆ నగరం కూడా తనకొక 'ఇమేజి' ఉండాలని అనుకున్నట్టుగా పెద్దగా కనిపించదు. ఊళ్ళ నుంచి బెజవాడకు జరిగిన వలసల్లో తొలితరం రైతు కుటుంబాల ఛాయలు ఇప్పుడు పూర్తిగా చెరిగిపోయినట్లే. అవి కూడా వాళ్ళు తీస్తున్న సినిమాలు మాదిరిగానే– 'ప్యాన్ ఇండియా' అయిపోయాయి. ఒకప్పుడు గవర్నర్ పేటలో మొదలైన 'ఫైనాన్స్' ఆఫీసులు ఇప్పుడు– 'జూబిలీ హిల్స్', 'కావూరి హిల్స్'లో స్థిరపడ్డాయి.

మరిక్కడ మిగిలింది ఎవరు? అనేది సమాధానం దొరకని ప్రశ్న. అయితే, శూన్యం ఎప్పుడు ఇలాగే ఉండదు కదా. ప్రతి శూన్యం పూడ్చబడుతుంది. చలన లక్షణం సహజమైన 'రూపాయి' చుట్టూ ఉండే 'యాక్టివిటీ' అనంతం కనుక, పైన చెప్పిన పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి నిరంతరాయంగా జరుగుతున్న వలసలు కారణంగా దీని సహజ లక్షణం పోగొట్టుకోకుండా, బెజవాడ జంక్షన్ అంటే, అది 24X7 సిటీగానే ఇప్పటికీ చలామణీలో ఉంది. తూర్పు నుంచి వచ్చే 'జి.టి. లైన్', ఉత్తరం నుంచి వచ్చే ఢిల్లీ లైన్ ఇక్కడ కలిసి చెన్నై వైపుకు వెళ్ళడంతో ఈ రెండింటికీ మధ్యన ఉన్న నగరంగా బెజవాడ నగరం 'వై జంక్షన్'గా మారింది.

ఉత్తర భారతం నుంచి వింధ్య పర్వతాలను దాటి దక్షిణాది పైకి వచ్చిన అన్ని సైన్య పటాలాలకు 'నది'–'ఓడరేవు'–'పీఠభూమి' అమరింది ఇక్కడే! దాంతో ఈ ప్రాంతం ఏదీ తనకోసం పట్టించుకోకుండా, కాందిశీకుల గుడారాలకు మైదానమై, గుర్రాలకు పచ్చిక బయలై, వచ్చే పోయే వారికి వడ్డించే పూటకూళ్ళ ఇల్లు అయింది.

రాష్ట్ర విభజన జరిగాక, ఈ ఊరిపై జరుగుతున్న ప్రయోగాలు అత్యాచారాన్ని తలపిస్తున్నాయి. ప్రతి ఊరికి ఒక 'స్కేల్' ఉంటుంది కదా! అభివృద్ధి పేరుతో మనం ఏమి చేసినా అది ఆ 'స్కేల్' పరిధిలో కదా ఉండాల్సింది! మన ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ఉన్నప్పుడు కూడా, స్థానికత స్పృహ లేని పరిపాలనతో ఎలా నెగ్గుకుని రావడం?

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి వద్ద తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలు ఒకటి గుంటూరు వైపు, మరొకటి బెజవాడ వైపు వెళతాయి. దాంతో ఒక్క బెజవాడ నగరంలో నుంచే ప్రధానమైన– బందరు కాల్వ , రైవస్ కాల్వ, ఏలూరు కాల్వలు వెళతాయి. నాలుగవది నగరానికి ఉత్తరం వైపున తూర్పు నుంచి పడమరకు ప్రవహించే బుడమేరు. ఇది పశ్చిమ కృష్ణాజిల్లా, ఆ పైన ఖమ్మం జిల్లాల్లో కురిసే వర్షం కారణంగా అరుదుగా ప్రవహిస్తూ చివరికి కొల్లేరులో కలుస్తుంది. ప్రాంతాన్ని అలా



ఉంచి, మళ్ళీ ప్రజల వద్దకు వద్దాం.

నగరంలో కాల్వలతో పాటుగా కొండలు కూడా ఎక్కువే కావడంతో, ఇక్కడికి జరిగే బతుకుదెరువు వలసలకు ఈ రెండు నైసర్గిక అంశాలు ప్రధాన కారణాలు. బతకడానికి బెజవాడ కనుక వెళితే, అయితే కాల్వ ఒడ్డున లేదా కొండమీద ఎక్కడో ఒక చోట 'ల్యాండ్' కావడం మాత్రం తేలిక... అన్నట్టుగా ఒకప్పటి పరిస్థితి ఉండేది. అయితే, అప్పట్లో కేంద్ర ప్రభుత్వం దీన్ని పట్టించుకుంది, 1990–95 మధ్య 'ఓ.డి.ఏ.' (ఓవర్సీస్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) పేరుతో మురికివాడల అభివృద్ధి పనులు మొదలయ్యాయి. దాంతో కొత్తగా పేదలు నివసించే ప్రాంతాల్లో వీధి లైట్లు, రోడ్లు, మంచినీరు, స్కూళ్ళు, వైద్య కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్ళు వచ్చాయి. ఇదే సమయంలో 'డ్వాక్రా' పొదుపు సంఘాలు ఏర్పడడంతో ఈ కాలనీల్లో మహిళలు కొత్త వినియోగదారులు అయ్యారు. ఇదే కాలంలో నగరానికి పశ్చిమాన బుడమేరుకు ఇవతల సింగ్ నగర్ వద్ద 'సుభాస్ చంద్ర బోస్ కాలనీ' పేరుతో కాల్వ ఒడ్డున పేదలకు, మురికివాడ నిర్వాసితులకు ఇల్లు కేటాయించారు. దీన్ని 1986 అక్టోబర్‌లో అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ప్రారంభించారు.

ఆ తర్వాత నగరంలో నుంచి ఈ కాలనీలోకి రావడానికి కొత్తగా 'ఫ్లై ఓవర్' వచ్చింది, దాంతో కాలనీలో ఉండే బలహీనవర్గాల ఉపాధి మెరుగైంది. దీని సమీపాన– 'వాంబే' (వాల్మీకి–అంబేడ్కర్ ఆవాస్ యోజన) పేరుతో ఆదివాసీల కోసం మరొక కాలనీ ఏర్పడింది. ఈ రోజున నగరంలో అది ఏ రంగం అయినా– 'సర్వీస్ ప్రొవైడర్స్' మాత్రం ఈ 'కాలనీల' నుంచి రావలసిందే. ఈ ముప్పై ఏళ్లలో ఈ కాలనీల రూపు రేఖలు మారిపోయాయి. ఇప్పుడు ఇవి ఎగువ మధ్య తరగతి వర్గాల నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. ప్రస్తుత వరదతో ఊహించని రీతిలో వారి ఇళ్ళు నీటిలో మునిగి, కళ్ళముందు వారి విలువైన వస్తువులు అన్నీ నీళ్ళల్లో ధ్వంసమవ్వడంతో వారి కలలు ఛిద్రం అయ్యాయి. నష్టాల అంచనా జరగాల్సి వుంది.

ప్రభుత్వాలు మారడం కొత్త ఏమీ కాదు. కానీ ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు, ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు ఎలా మారతాయి? బందరులో కృష్ణాజిల్లా కలెక్టర్ ఉంటున్న రోజుల్లో కేవలం ఒక వారం పాటు విజయవాడ వచ్చి 'క్యాంప్ ఆఫీస్'లో బసచేసి, వరద నియంత్రణ పర్యవేక్షించి తిరిగి బందరు వెళ్ళడం జరిగేది. మొత్తం జిల్లా అధికారుల నిర్వహణలో వరద నియంత్రణ పనులు పూర్తి అయ్యేవి. కానీ ఒకప్పటి కృష్ణాజిల్లా ఇప్పుడు రెండు అయింది. అదనంగా 'ఎన్.డి.ఆర్.ఎఫ్.' దళాలు అందుబాటులో ఉన్నాయి, అయినా ఏమిటీ వైఫల్యం?

'ఒకప్పుడు బుడమేరుకు వరద వస్తే, కొల్లేరు సరస్సు పొంగి గుడివాడ వద్ద నందివాడ మండలంలో వరద వచ్చేది. కానీ ఇప్పుడు, ప్రభుత్వ నిర్వహణ వైఫల్యం కారణంగా విజయవాడ నగరం మునిగింది' అంటున్నారు ఇరిగేషన్ అంశాలు తెలిసిన మాజీ 'పి.టి.ఐ.' కరస్పాండెంట్ కె.ఆర్.కె. రెడ్డి (75). 'కృష్ణా కమాండ్ ఏరియా'లో వచ్చే వరదలకు తెలంగాణ దక్షిణ జిల్లాల్లో కురిసే వర్షపాతం కారణం కనుక, చిన్న చిన్న వాగులు, వంకల నీటి నిర్వహణకు ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల అధికారులతో జాయింట్ కమిటీ ఏర్పాటు భవిష్యత్తులో ఇటువంటి విపత్తుల నిరోధానికి పరిష్కారం అంటున్నారు. ఏదేమైనా అసంఖ్యాకులైన వర్ధమాన వర్గాల కుటుంబాల కలలు ఛిద్రం చేసిన ఈ ప్రభుత్వ వైఫల్యం మాత్రం సమీప ఏపీ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగులుతుంది.

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.7.56 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర తె.5.19 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.10.47 నుండి 12.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.36 నుండి 12.24 వరకు, **అమృత ఘడియలు:** రా.9.20 నుండి 11.06 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.10.



బీరోలు - బంధంపల్లి మధ్య రోడ్డు తెగడంతో ఆవలి ఒడ్డున ఉన్న బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ముందస్తు చర్యలతోనే మూడు వేల మందిని రక్షించాం
- రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలు

తిరుమలాయపాలెం: కష్టకాలంలో ఉన్న ప్రజలను కాపాడేలా వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యలపై పాలేరు పరిధిలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితులపై కలెక్టర్లతో ఫోన్‌లో సమీక్షించారు. హైదరాబాద్‌లోని విపత్తుల నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడి, వారిని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని, విపత్తుల నిర్వహణ విభాగం కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులపై స్పందించడమే కాక పంట, ఆస్తి నష్టం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు.

117 గ్రామాలు.. 67 వేల మంది

ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలోని 117 గ్రామాల్లో 67 వేల మంది భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయారని.. ఇందులో ఒక్క ఖమ్మం జిల్లాలోనే 49 వేల మంది ఉన్నారని పొంగులేటి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించామన్నారు. తమ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో 3,039 మందిని రక్షించుకోగలిగామని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం 44 ఇళ్లు పూర్తిగా, 600 వరకు పాక్షికంగా దెబ్బతిన్నాయని, ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తవి మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా, 51 వంతెనలు, 249 కల్వర్టులు, 166 చెరువులు దెబ్బతినగా, 13,342 జీవాలు మృతి చెందాయని ఆయన వెల్లడించారు.

రాకాసితండా ప్రజలకు మరో ప్రాంతంలో ఆవాసం

తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా వాసులు తాము ఆకేరు వరద ప్రవాహంతో సర్వం కోల్పోయామని, ఇక్కడ ఉండాలంటే భయమేస్తోందని మంత్రి పొంగులేటి ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో స్పందించిన మంత్రి మూడు ప్రాంతాలను గుర్తించి.. గ్రామస్తుల ఇష్టం మేరకు అక్కడ రెండు నెలల్లో స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటివరకు గ్రామంలో ఉండేలా విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గణేష్‌ను ఆదేశించారు.

పోతే ఒక్కడిని.. వస్తే పది మందిమి

- ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న తొమ్మిది మందిని కాపాడిన జేసీబీ డ్రైవర్
- సాయమందించిన వెంకటగిరివాసులు
- సహాయక చర్యల్లో యంత్రాంగం మీనమేషాలతో రంగంలోకి...



జేసీబీ నుంచి కిందకు దిగుతున్న బాధితులు

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై వరదలో చిక్కుకున్న తొమ్మిదిమందిని కాపాడేందుకు 'పోతే ఒక్కడిని..వస్తే పది మందిమి అంటూ జేసీబీ డ్రైవర్ ఎస్‌కే.సుబాన్ ధైర్యం చేయగా, 'జేసీబీ మధ్యలో ఆగిపోతే మనమైనా తీసుకొద్దామంటూ'వెంకటగిరికి చెందిన మొత్రిమేకల ఉపేందర్, మొత్రిమేకల జవహర్‌లాల్, కనపర్తి నాగేశ్వరరావులతోపాటు కొందరు గ్రామపెద్దలు ముందుకు రావడంతో దాదాపు 14 గంటల పాటు ఆపదలో చిక్కుకున్నవారు ప్రాణాలతో బయటపడ్డారు.

అసలేం జరిగిందంటే...

ఈ నెల 1న ఆదివారం మున్నేరు వాగుకు ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై వోగబోయిన శ్రీనివాసరావు, ఆయన కుమారుడు విక్రమ్, కట్టెలమండె వాచ్‌మెన్ మోహన్–లక్ష్మి దంపతులు, వీరి ఇద్దరు కుమారులు, వర్కర్లు వినోద్, వెంకన్నతో పాటు మరొకరు చిక్కుకున్నారు. షాపుల్లో ఉన్న వీరు వరద పరిస్థితిని గమనించి ఎటూ వెళ్లలేక ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. ఉదయం నుంచి తమకు సాయం చేయాలని వీరితోపాటు కుటుంబీకులు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని వేడుకున్నా స్పందన కనిపించలేదు. హెలికాప్టర్ వస్తోందని.. ఎన్డీఆర్‌ఎఫ్ టీం వస్తుందంటూ రాత్రి 10 గంటల వరకు తాత్సారం చేశారు.

యంత్రాంగం జాప్యంతో...

యంత్రాంగం చెబుతున్న మాటలతో విసుగెత్తిన వెంకటగిరివాసులు తొమ్మిది మంది ప్రాణాలను ఎలాగైనా రక్షించాలని నిర్ణయించుకున్నారు. అక్కడే ఉన్న జేసీబీ యజమాని వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా డ్రైవర్ సరేనంటే వాహనం ఇచ్చేందుకు సిద్ధమేనని చెప్పాడు. డ్రైవర్ ఎస్.కే.సుబాన్(హరియాణావాసి)తో మాట్లాడారు. కాలు కాస్త ఇబ్బందిగా ఉండే ఆయన్ను బండి తీసుకొని వరదలోకి వెళ్లే ధైర్యం ఉందా అని అడగగా.. 'ప్రాణాలను కాపాడేందుకే కదా వెళ్తా.. వస్తే అందరం వస్తాం.. లేకపోతే ఒక్కడిని పోతా' అని ముందుకొచ్చాడు. అయితే రాత్రి 8 గంటల నుంచి రెండుసార్లు ప్రయత్నించగా.. మధ్యలో రోడ్డు కోతకు గురికావడంతో బండి ముందుకు కదల్లేదు. దీంతో మొత్రిమేకల ఉపేందర్, మొత్రిమేకల జవహర్‌లాల్, కనపర్తి నాగేశ్వరరావు తాము తాళ్ల సాయంతో బ్రిడ్జిపైకి వెళతామని చెప్పగా..11 గంటల సమయాన వారు రోడ్డు కోతకు గురైన ప్రాంతం వరకు జేసీబీపై వెళ్లి అక్కడ నుంచి జేసీబీ బకెట్ మీదుగా బ్రిడ్జివైపు దిగారు. అనంతరం బ్రిడ్జిపై చిక్కుకున్న తొమ్మిది మందిని అదే జేసీబీ బకెట్‌లోకి ఎక్కించి సురక్షితంగా ఇవతలికి తీసుకొచ్చారు. తొమ్మిది మందిని సురక్షితంగా తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించిన జేసీబీ యజమాని, స్థానికులతోపాటు డ్రైవర్ సుబాన్ సేవలను కొనియాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

ప్రాణాలను కాపాడాలని..



వరదలోకి వెళ్లేందుకు ధైర్యం ఉందా అని అడిగారు. నేను పోతే ఒక్కడినే.. వస్తే పది మంది అని సాహసించి ముందుకు వెళ్లాను. ఇంజిన్ పైకి నీళ్లు వచ్చాయి. మొదట రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. మూడోసారి స్థానికుల సహకారంతో తొమ్మిది మందిని రక్షించగలిగాం.

– ఎస్.కే.సుబాన్, జేసీబీ డ్రైవర్

డ్రైవర్‌తో పాటే మేం కూడా..



హెలికాప్టర్‌తో కాపాడుతారని అంటుంటే చూద్దామని వచ్చాం. ప్రభుత్వ సాయం ఎంతకూ అందకపోవడంతో వారిని రక్షించేందుకు మేము ముందుకొచ్చాం. జేసీబీ డ్రైవర్‌తో పాటు మేము తాళ్లను తీసుకొని వరదను దాటి వెళ్లి తొమ్మిది మందిని ఒడ్డుకు చేర్చాం.

– మొత్రిమేకల ఉపేందర్, వెంకటగిరివాసి

బండికి నష్టం జరిగినా సరే అన్నా..



జేసీబీ పోయినా పర్వాలేదు.. ప్రాణాలు కాపాడొచ్చనుకుని బండి పంపించా. పోలీసులు ఒప్పుకోకుంటే మాదే బాధ్యత అని ఒప్పందం చేసుకొని బండిని పంపా. జేసీబీ ఇంజిన్‌లోకి నీళ్లు పోవడంతో మరమ్మతుకు రూ.85 వేలు ఖర్చు అవుతుంది. అయినా ప్రాణాలు కాపాడామనే తృప్తి కలిగింది.

– వెంకటరమణ, జేసీబీ యజమాని

నీట మునిగిన 'పాలమూరు' పంప్‌హౌస్

టన్నెల్‌లో 20 కి.మీ. మేర నిలిచిన నీరు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ వట్టెం పంప్‌హౌస్‌లో నీటమునిగిన మోటార్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లోకి వరద నీరు చేరింది. దీంతో పంప్‌హౌస్‌లోని నాలుగు మోటార్లు నీట మునిగాయి. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం సమీపంలోని ప్రాజెక్ట్ ఆడిట్ టన్నెల్‌లోకి వెళ్లిన నీరు 20 కి.మీ దూరంలోని పంప్‌హౌస్‌లోకి చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు నాగనూల్, తూడుకుర్తి, బొందలపల్లి చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. శ్రీపురం సమీపంలో ఆడిట్ టన్నెల్ ముందు చెరువుల నీటి ప్రవాహానికి అడ్డుగా ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తీసిన మట్టి, బండరాళ్లు, శిథిలాలను వేశారు. దీంతో అలుగెత్తి పారుతున్న చెరువుల నీటి ప్రవాహానికి దారిలేక ప్రాజెక్ట్ ఆడిట్ టన్నెల్ వైపు కోత పడింది. ఆ నీరంతా టన్నెల్ ద్వారా వట్టెం రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌లోకి చేరి నాలుగు మోటార్లు నీటిలో మునిగిపోయాయి. దీంతో పంప్‌హౌస్‌లో డీవాటరింగ్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. టన్నెల్‌లోకి వస్తున్న నీటిని నిలిపివేసిన తర్వాత బుధవారం నుంచి పంప్‌హౌస్‌లోని నీటిని ఎత్తిపోస్తామని ప్రాజెక్ట్ ఈఈ పార్థసారథి తెలిపారు. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే పంపుహౌస్‌లోకి నీరు చేరి మోటార్లకు నష్టం వాటిల్లిందని బీఆర్‌ఎస్ నేతలు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విమర్శించారు.

చెరువులకు జలకళ

మత్తడి దుంకుతున్న 15,608 చెరువులు..

- 8,144 చెరువులు 75–100 శాతం మేరకు నిండాయి
- 5,012 చెరువుల్లో 50–75 శాతం మేరకు నీరు
- శ్రీశైలం 10 గేట్లు, సాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణమ్మ పరవళ్లు

సాక్షి, హైదరాబాద్/దోమలపెంట/నాగార్జునసాగర్: భారీ వర్షాలతో చెరువులకు జలకళ సంతరించుకుంది. దీంతో ఈసారి పంటలకు నీటి సమస్య తలెత్తే అవకాశం లేదు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం బాగా పెరుగుతోంది. కోటి పది లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగైనట్టు వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నీటిపారుదల శాఖ మొత్తం 19 డివిజన్లుగా విభజించగా, వాటి పరిధిలోని చీఫ్ ఇంజనీర్లు, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 34,176 చెరువులు ఉంటే.. అందులో 15,608 చెరువులు పూర్తిగా మత్తడి దుంకుతున్నాయి. 5,952 చెరువులు మాత్రం ఇంకా 50 శాతం కంటే తక్కువ నీరు ఉన్నట్టు నీటిపారుదలశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. 75 నుంచి 100 శాతం మేరకు నిండిన చెరువులు 8,144 ఉన్నాయి. ఇవికాక 50–75 శాతం మేరకు నిండిన చెరువులు మరో 5,012 వరకు ఉన్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. వర్షాకాల సీజన్ ఈనెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో ఈ మధ్యలో పడే వర్షాలకు మిగిలిన చెరువులు కూడా పూర్తిస్థాయిలో నిండుతాయన్న ఆశాభావాన్ని నీటిపారుదలశాఖ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. వర్షాలతో భూగర్భ జల నీటిమట్టం కూడా పెరుగుతుందని, తద్వారా నీటి సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. 50 శాతంలోపు నిండిన చెరువుల్లోకి కూడా నీరు వచ్చి చేరితే, ప్రాజెక్టులు, రిజర్వాయర్లతో పాటు, అన్ని జలాశయాలు పూర్తిస్థాయి నిండినట్టు అవుతుందని అంటున్నారు.

మేడిగడ్డ వద్ద ఉధృతంగా గోదావరి

మేడిగడ్డ వద్ద గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. మేడిగడ్డ బరాజ్ నుంచి 9.02 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. దాని ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతుండగా, వచ్చిన వరదను వచ్చినట్టే వదిలేస్తున్నారు. శ్రీరాంసాగర్‌కు 2.45 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంటే.. దిగవనకు 2.40 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలిపెడుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 4.72 లక్షల క్యూసెక్కులు వస్తుంటే.. దిగువకు అంతేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇక సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) బరాజ్‌లో నుంచి 7.23 లక్షల క్యూసెక్కుల నీరు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం) నుంచి 7.55 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తోంది.

శాంతిస్తున్న కృష్ణమ్మ

ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి భారీస్థాయిలో నీటి ప్రవాహం లేకపోయినా.. క్యాచ్‌మెంట్ ఏరియాల్లో పడిన వర్షంతో జూరాల నుంచి 2.09 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలంలోకి వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 4.16 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుంటే.. దిగువకు పదిగేట్లు ఎత్తి 3.61 లక్షల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. నాగార్జునసాగర్ డ్యాంలోకి 3.04 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంటే.. అంతే మొత్తాన్ని ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువన ఉన్న పులిచింతలకు వదిలేస్తున్నారు.



తీర్మాన పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న నాయకులు



సీఎస్‌కు సమ్మతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి తదితరులు

ఉద్యోగుల తరఫున రూ.100 కోట్లు

- సీఎం సహాయ నిధికి ఒకరోజు వేతనం... ముఖ్యమంత్రికి తీర్మాన ప్రతి అందజేత
- పెన్షనర్ల జేఏసీ రూ.33 కోట్లు

మహబూబాబాద్/సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని, తమ వంతుగా సీఎం సహాయ నిధికి ఒక రోజు మూల వేతనాన్ని ప్రకటించినట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రెటరీ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలెక్టరేట్‌లో ఉద్యోగుల జేఏసీ నాయకులు కలిసి ఒకరోజు మూల వేతన తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఒక్కరోజు మూల వేతనం ప్రభుత్వ ఖజానాలో జమయ్యేలా చూడాలని సీఎంను కోరారు.

సీఎస్‌కు సమ్మతి పత్రం అందజేత..

వరద బాధితుల సహాయార్థం రాష్ట్రంలోని ఉద్యోగులందరి తరఫున ఒక రోజు వేతనాన్ని ఇవ్వనున్నట్టు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు రూ.100 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)కి అందజేయాలని కోరుతూ మంగళవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి సమ్మతి పత్రాన్ని అందజేశారు. సీఎస్‌ను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, నేతలు డాక్టర్ నిర్మల, కె.రాములు, శశిధర్‌రెడ్డి, దర్శన్‌గౌడ్, గోపాల్, అశ్వత్థామరెడ్డి, రమాదేవి, రాబర్ట్ బ్రూస్, మహిపాల్‌రెడ్డి, కె.రామకృష్ణ, ఎస్.రాములు, మహేశ్, తిరుపతి, సంపత్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఒక రోజు మూలవేతనం

భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజలను ఆదుకునేందుకు ఒకరోజు మూలవేతనం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలంగాణ ఉద్యోగు ల సంఘం తెలిపింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఉద్యోగుల సంఘం అత్యవసర సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంది. సమావేశంలో చైర్మన్ పద్మాచారి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మఠం రవీంద్రకుమార్, సీహెచ్ హరీశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.నర్సింగ్ రావు, సంఘం నేతలు జాకబ్, కృష్ణారావు, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం అంటూ పెన్షనర్ల జేఏసీ...

వరద బాధితుల సహాయార్థం ఒక రోజు మూల వేతనాన్ని ఇస్తున్నట్టు పెన్షనర్ల జేఏసీ ప్రకటించింది. మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు విరాళం ఇచ్చేందుకు ఏకగ్రీవంగా నిర్ణయించామని, ఇది రూ.33 కోట్ల వరకు ఉంటుందని జేఏసీ చైర్మన్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు.

- అడ్డంగా దోచుకుంటున్న మాఫియా గ్యాంగులు
- రూ.40 లక్షల నుంచి 80 లక్షల దాకా వసూళ్లు
- స్త్రీలపై అత్యాచారాలు, మగవాళ్లకు చిత్రహింసలు
- నిస్సహాయంగా ప్రాణాలూ కోల్పోతున్న వైనం
- అక్రమ వలసల్లో మనోళ్లదే మూడో స్థానం
- 7.25 లక్షలు దాటిన భారతీయులు
- గతేడాది 97 వేల దాకా పట్టుబడ్డ వైనం

ఉసురు తీస్తున్న అమెరికా డ్రీమ్స్

అగ్రరాజ్యంలోకి చొరబడేందుకు మనోళ్ల అడ్డదార్లు



అమెరికా. ఊహల స్వర్గం. ముఖ్యంగా భారత యువతకైతే ఎలాగైనా చేరి తీరాలనుకునే కలల తీరం. ఇందుకోసం చాలామంది ప్రాణాలనే పణంగా పెడుతున్నారు. చదువు, నైపుణ్యం వంటి అర్హతలు లేకున్నా అక్రమంగానైనా అగ్రరాజ్యం చేరాలని ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో కరడుగట్టిన మాఫియా ముఠాల కబంధ హస్తాల్లో చిక్కి సర్వం కోల్పోతున్నారు. ధనం, మానంతో పాటు కొన్నిసార్లు నిస్సహాయంగా ప్రాణాలూ పోగొట్టుకుంటున్నారు. కన్నవారికి, అయినవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. అయినా అత్యంత ప్రమాదకరమైన 'డంకీ' మార్గాల్లో అమెరికా బాట పడుతున్న భారతీయుల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇటీవల వచ్చిన షారుఖ్ ఖాన్ సినిమా డంకీ గుర్తుందా? అక్రమంగా ఇంగ్లండ్ చేరేందుకు కొందరు చేసే ప్రయత్నమే దాని ఇతివృత్తం. ఇలా అక్రమ దారుల్లో దేశాలు దాటడాన్ని 'డంకీ మార్గం'గా పిలుస్తారు. ఇదో పంజాబీ పదం. ఇలా అమెరికా చేరేందుకు ప్రయత్నిస్తున్న భారతీయుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఆ క్రమంలో ప్రమాదకరమైన మార్గాలను ఎంచుకుంటూ, మనుషులను అక్రమంగా చేరవేసే మాఫియా చేతుల్లో నానారకాలుగా చిత్రవధకు గురవుతున్నట్టు స్కై న్యూస్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ విధంగా మానప్రాణాలను రిస్కులో పెట్టుకుంటున్న భారతీయుల సంఖ్య ఏటా పెరుగుతున్నట్టు తన నివేదికలో పేర్కొంది. ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం 2022 నాటికే అమెరికాలోకి అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల సంఖ్య ఏకంగా 7.25 లక్షలు దాటేసింది. ఈ జాబితాలో మెక్సికో, ఎల్ సాల్వెడార్ తర్వాత

> అమెరికాలోకి సరిహద్దు దాటించేందుకు ఏటా మూడు సీజన్లుంటాయి. నేను సీజన్‌కు సగటున 500 మందిని పంపుతుంటా.
>
> - స్కై న్యూస్‌తో ఒక ఏజెంట్

> 'అమెరికా వెళ్లేందుకు నా సేవింగ్స్ అన్నీ ఊడ్చి మరీ మాఫియాకు రూ.40 లక్షలు చెల్లించా. కానీ నన్ను కల్మాండూ తీసుకెళ్లి బంధించారు. మావాళ్ల నుంచి డబ్బులు డిమాండ్ చేశారు.
>
> - సుభాష్ కుమార్ (26)

మనోళ్లు మూడో స్థానంలో ఉన్నారు. 2023లో రికార్డు స్థాయిలో ఏకంగా 96,917 మంది భారతీయులను అమెరికాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా నిర్బంధించడమో, బలవంతంగా వెనక్కు పంపడమో జరిగినట్టు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం గణాంకాలు చెబుతున్నాయి.

అమెరికాకు రూటు ఇలా..

అమెరికాలో అక్రమంగా ప్రవేశించదలచే భారతీయులు తొలుత పనామా, కోస్టారికా, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా వంటి సెంట్రల్ అమెరికా దేశాలకు చేరతారు. మాఫియా ప్రపంచంలో వీటికి అమెరికాకు గేట్‌వేలుగా పేరు. ఈ దేశాల వీసా తేలిగ్గా లభిస్తుంది. పైగా అక్కడి నుంచి తొలుత మెక్సికోకు, ఆపై అమెరికాకు చేరడం సులువు. ఆయా దేశాల నుంచి వీళ్లను అమెరికా చేర్చేందుకు ఒక నమ్మకమైన గైడ్‌ను అక్రమ రవాణా మాఫియాయే ఏర్పాటు చేస్తుంది. అతన్ని కొయెటోగా పిలుస్తారు. అయితే అత్యంత కష్టతరం, ప్రమాదకరం అయిన మార్గాల గుండా సాగే ఈ ప్రయాణం అక్షరాలా ప్రాణాంతకమే! దీనికి కొన్నిసార్లు ఒక్రటెండేళ్ల సమయం కూడా పడుతుంది! భారతీయులపై నానారకాల అకృత్యాలు జరిగేది కూడా ఈ దశలోనే.

ఆ సరిహద్దు.. ప్రత్యక్ష నరకం

కిందా మీదా పడి అమెరికా సరిహద్దు దాకా చేరేవారిది మరో రకం దైన్యం. ముఖ్యంగా మెక్సికో బోర్డర్ వద్ద చిక్కుపడేవారైతే అక్షరాలా నరకం చవిచూస్తున్నారు. ఆ ప్రాంతమంతా మెక్సికన్ మాఫియా నియంత్రణలో ఉంటుంది. దాంతో బాలికలు, మహిళలపై ఇష్టారాజ్యంగా లైంగిక దాడులు, అత్యాచారం జరుగుతున్నాయి. వాళ్లను బలవంతంగా వేశ్యా వృత్తిలోకి కూడా దింపుతున్నారు. అక్కడ సగటున ప్రతి ముగ్గురిలో ఒకరిపై లైంగిక దాడి జరుగుతున్నట్టు అంచనా.

సర్వం తెగనమ్ముకుని..

తమ పిల్లలను ఎలాగైనా అమెరికా పంపడమే లక్ష్యంగా సర్వం తెగనమ్ముకుంటున్న వారికి కొదవ లేదు. మాఫియా అడిగినంత ఇచ్చుకునేందుకు ఇల్లు, పొలం, నగా నట్రా వంటివన్నీ తాకట్టు పెట్టడమో, అమ్మడమో చేస్తున్నారు. అలా ఆస్తులన్నీ అమ్మించి అమెరికా బాట పట్టిన మల్కీత్‌సింగ్ అనే 30 ఏళ్ల టెక్నాలజీ గ్రాడ్యుయేట్ దోహా, అల్మాటీ, ఇస్తాంబుల్, పనామా సిటీ గుండా చివరికి ఎల్ సాల్వడార్ చేరుకున్నాడు. అక్కడ మాఫియా చేతిలో దుర్మరణం పాలయ్యాడు. చివరికి ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా అతని మృతదేహాన్ని గుర్తించి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. సాహిల్ అనే మరో 19 ఏళ్ల యువకుడు పనామా నుంచి బయల్దేరి మార్గమధ్యంలోనే గల్లంతయ్యాడు. అప్పట్నుంచీ అతని ఆచూకీ కోసం తండ్రి శివ కుమార్ (45) చేయని ప్రయత్నమంటూ లేదు.

ఇదీ పరిస్థితి

- డంకీ రూటు సెంట్రల్ అమెరికా దేశాల మాఫియాకు కొన్నేళ్లుగా ఆకర్షణీయమైన వ్యాపారంగా మారింది.
- అమెరికా చేర్చేందుకు 50 వేల నుంచి లక్ష డాలర్ల దాకా (రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షలు) వసూలు చేస్తున్నాయి.
- వీళ్లకు ఉత్తర భారతదేశంలో పలు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఏజెంట్లున్నారు.
- వీరి వల్లో పడేవాళ్లలో ప్రధానంగా పంజాబ్, హరియాణా రాష్ట్రాల యువత సంఖ్యే అధికం.
- ఆశావహులు ముందుగా విమాన మార్గంలో పనామా తదితర దేశాలకు చేరతారు.
- అక్కడినుంచి వీళ్ల జుట్టు పూర్తిగా మాఫియా ముఠాల చేతికి చిక్కుతుంది.
- దట్టమైన అడవులు, పర్వత ప్రాంతాలు, జలమార్గాలను దాటుతూ వెళ్లాల్సి ఉంటుంది.
- అలా అమెరికా చేరేదాకా ప్రయాణమంతా 'వాళ్ల దయ, వీళ్ల ప్రాప్తం' అన్నట్టుగా ఉంటుంది.
- చాలాసార్లు ఫేక్ బోర్డింగ్ పాసులు, వీసాలు చేతిలో పెట్టి 'ఇదే అమెరికా' అంటూ నమ్మించి మార్గమధ్యంలోనే వదిలేస్తుంటారు.
- ఇలాంటి వాళ్లంతా పోలీసులకో, క్రిమినల్ గ్యాంగులకో చిక్కుతారు. అంతిమంగా వాళ్లకు చెప్ప కూడు, చిత్రహింసలే గతవుతాయి.

సైన్యానికి అప్పగించొద్దు: ఇమ్రాన్‌ఖాన్



ఇస్లామాబాద్: గత ఏడాది మే 9న సైనిక స్థావరాలపై దాడుల కేసుల్లో విచారణ నిమిత్తం తనను మిలటరీకి అప్పగించవద్దని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్‌ను మిలటరీ కోర్టులో విచారించే అవకాశం ఉందని రక్షణమంత్రి ఖావజా ఆసిఫ్ రెండురోజుల కిందట అన్నారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పౌర న్యాయస్థానాల పరిధిలోనే విచారణ జరగాలని, తనను సైన్యం కస్టడీకి అప్పగించకుండా అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు: ముఫ్తీ



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికలకు బీజేపీతో పీడీపీ ఎలాంటి పొత్తు పెట్టుకోబోదని ఆ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ తెగేసి చెప్పారు. ఎన్నికల అనంతరం తమ పార్టీ సహకారం లేకుండా ప్రభుత్వం ఏర్పాటు కావడం అసాధ్యమని పేర్కొన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) వైఖరిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. '1947 నుంచీ ఆ పార్టీ చేస్తున్నదిదే. అధికారంలోకి రావడమే ఆ పార్టీ ఏకైక ఉద్దేశం. ఇంకేదీ ఆ పార్టీకి పట్టదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడం, మంత్రి పదవులు పొందడం కోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది'అని మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె విమర్శలు చేశారు. 'పీడీపీకి ఒక ఎజెండా ఉంది. ఆ ఎజెండా అమలే ప్రధాన లక్ష్యం. ఆ తర్వాతే అధికారం. 2002లో కేవలం 16 మంది ఎమ్మెల్యేలతోనే ప్రభుత్వం ఏర్పాటు చేశాం. ఈసారీ అంతే. మనల్ని చేర్చుకోకుండా ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశమే లేదు'అని ఆమె స్పష్టం చేశారు.

కులగణన కోసం ఒత్తిడి తెస్తాం: లాలూ



పట్నా: ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దేశవ్యాప్త కులగణన తప్పక చేపట్టేలా చేస్తాయని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ చెప్పారు. 'కులగణన చేపట్టే వరకు ఆర్ఎస్ఎస్, బీజేపీల చెవులు పట్టుకుని, గుంజీళ్లు తీయిస్తాం. కుల సర్వే జరపబోమనే అధికారం వారికి ఎవరిచ్చారు? సర్వే చేపట్టేదాకా వారిని వదిలేది లేదు. ఇందుకోసం దళితులు, వెనుకబడిన కులాల వారు, గిరిజనులు, పేదలు ఐక్యంగా నిలబడాల్సిన సమయం వచ్చింది'అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఖర్గే, రాహుల్‌తో హేమంత్ సోరెన్ భేటీ



న్యూఢిల్లీ: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) నేత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మంగళవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీలతో భేటీ అయ్యారు. జేఎంఎం సీనియర్ నేత, జార్ఖండ్ మాజీ సీఎం చంపయి సోరెన్ తాజాగా బీజేపీ పార్టీలో చేరిన వేళ కాంగ్రెస్ అగ్రనేతలతో హేమంత్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో జరగబోయే జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో విపక్షాల 'ఇండియా' కూటమి ఘన విజయం సాధిస్తుందని భేటీ సందర్భంగా హేమంత్ వ్యాఖ్యానించారు. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(వ్యవస్థాగతం) కేసీ వేణుగోపాల్ సహా హేమంత్ భార్య కల్పనా సోరెన్ హాజరయ్యారు. అయితే కాంగ్రెస్ నేతలను కేవలం మర్యాదపూర్వకంగా కలిశానని హేమంత్ చెప్పుకొచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
9 మంది మావోయిస్టులు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ –బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 9 మంది మావోయిస్టులు మృతి చెందారు. దంతెవాడ జిల్లా లోహాగావ్, పురంగేల్ అడవుల్లో ఆంద్రి గ్రామం వద్ద 40 మంది వరకు మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ దళాల జవాన్లు ఉదయం 6 గంటల నుంచి కూంబింగ్ చేపట్టారు. ఆ క్రమంలో 10.30 గంటల సమయంలో ఇరువర్గాల మధ్య మొదలైన ఎదురుకాల్పులు దాదాపు మూడు గంటలపాటు సాగాయి. అనంతరం బలగాలు ఘటనా స్థలిలో పరిశీలించగా ఆరుగురు మహిళలు సహా 9 మంది మావోయిస్టులు చనిపోయినట్టు తేలింది. వీరిని దక్షిణ బస్తర్, పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ–2కు చెందిన వారిగా భావిస్తున్నారు. ఘటనాస్థలిలో ఎస్ఎల్ఆర్, 303 రైఫిల్, 12 బోర్ రైఫిల్, 315 బోర్‌గన్లతోపాటు బారెల్ గన్ లాంఛర్లు ఒక్కొక్కటి చొప్పున దొరికాయి.



ప్రవాస భారతీయురాలితో మాట్లాడుతున్న మోదీ

బలమైన బంధానికి ఇదే సంకేతం

- బ్రూనైలో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- నేడు సుల్తాన్ హసనల్ బోల్కియాతో ద్వైపాక్షిక చర్చలు

బందర్ సేరీ బేగావాన్: బ్రూనైలో నూతన రాయబార కార్యాలయం భారత్, బ్రూనైల బలమైన బంధానికి సంకేతమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బ్రూనైలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా అక్కడికి చేరుకున్న మోదీ మంగళవారం మధ్యాహ్నం బందర్ సేరీ బేగావాన్ సిటీలో భారత నూతన రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి ఇండియన్ హైకమిషన్ ప్రాంగణంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి భారతీయ సంతతి ప్రజలతో మోదీ మాట్లాడారు. ''ఇరు దేశాల దౌత్యబంధానికి సజీవ సేతువులుగా మీరు నిలిచారు. భారత వైద్యులు, ఉపాధ్యాయులు బ్రూనై వైద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు'' అని శ్లాఘించారు. అంతకుముందు మోదీకి బ్రూనై రాజధాని నగర ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. అక్కడి యువరాజు హాజీ అల్–మహతాదీ బిల్లాహ్ సాదరంగా మోదీని ఆహ్వానించారు. ఆసియాన్‌సదస్సు కోసం 2013లో నాటి ప్రధాని మన్మోహన్ బ్రూనైలో పర్యటించగా దౌత్య పర్యటనలో భాగంగా భారత ప్రధాని ఒకరు బ్రూనైలో పర్యటించడం ఇదే తొలిసారి. బుధవారం బ్రూనై సుల్తాన్ హసనల్ బోల్కియాతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

ఖలేదా జియాపై కేసులు కొట్టివేత



ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చైర్‌పర్సన్, మాజీ ప్రధాని ఖలేదా జియా(79)కు వేర్వేరు ఐదు కేసుల నుంచి విముక్తి లభించింది. ఉత్తుత్తి బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారని, యుద్ధ నేరస్తులకు మద్దతిచ్చారనే ఆరోపణల కేసులు కూడా ఇందులో ఉన్నాయి. నాలుగు కేసులను కొట్టివేస్తూ ఢాకా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మహబూబ్ ఉల్ హక్ తీర్పివ్వగా, మరో కేసు నుంచి విముక్తి కల్పిస్తూ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ టోఫజ్జల్ హొస్సేన్ మంగళవారం ఆదేశాలిచ్చారని మీడియా తెలిపింది. జియాకు వ్యతిరేకంగా పిటిషన్లు వేసిన వారు విచారణ సందర్భంగా రాకపోవడంతో మేజిస్ట్రేట్లు ఈ మేరకు తీర్పిచ్చారని మీడియా పేర్కొంది. కాగా, వివిధ కేసుల్లో ఐదేళ్లుగా గృహ నిర్బంధంలో ఉన్న జియాకు రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రకటించడంతో ఇటీవలే బయటకు రావడం తెలిసిందే.

మహిళలపై నేరాలకు మరణ శిక్షే

- 'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం
- ఈ బిల్లు చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి మమత ఉద్ఘాటన

కోల్‌కతా: మహిళలపై అత్యాచారం, హత్య వంటి తీవ్ర నేరాలకు పాల్పడే దోషులకు మరణ శిక్ష విధించడానికి ఉద్దేశించిన 'అపరాజిత' బిల్లుకు పశ్చిమ బెంగాల్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 'అపరాజిత మహిళ, బాలలు(పశ్చిమ బెంగాల్ చట్టాలు, సవరణ) బిల్లు–2024'ను రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మలోయ్ ఘటక్ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అధికార, విపక్ష సభ్యులంతా బిల్లుకు అంగీకారం తెలిపారు. బిల్లుకు సంబంధించి ప్రతిపక్ష నేత సువేందు అధికారి ప్రతిపాదించిన కొన్ని సవరణలను సభ తిరస్కరించింది. మహిళలపై అత్యాచారానికి పాల్పడి వారి మరణానికి లేదా జీవచ్ఛవంగా మారడానికి కారణమైన దోషులకు మరణ శిక్ష లేదా పెరోల్‌కు వీల్లేకుండా యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా అపరాజిత బిల్లును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చింది. మహిళలపై నేరాల కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, సత్వరమే కోర్టు నుంచి తీర్పు వచ్చేలా బిల్లులో నిబంధనలు జోడించారు. మహిళలు, చిన్నారులకు భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా అత్యాచారాలు, లైంగిక నేరాలకు సంబంధించి ఇప్పుడున్న చట్టంలో కొన్ని మార్పులు చేశారు, కొత్త అంశాలు చేర్చారు. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దోషులకు మరణ శిక్ష విధించేలా కఠినమైన చట్టం తీసుకొస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అపరాజిత బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించడం కోసమే రెండు రోజులపాటు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు.

మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి: సీఎం మమతా బెనర్జీ డిమాండ్

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు మహిళల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టని ముఖ్యమంత్రులంతా పదవులకు రాజీనామా చేయాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో అపరాజిత బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించి, బాధితులకు సత్వరమే న్యాయం చేకూర్చేలా చట్టాల్లో సవరణలు చేయాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తామే మొదట చొరవ తీసుకున్నామని తెలిపారు. అపరాజిత బిల్లు చట్టంగా మారి అమల్లోకి వస్తే.. ఇది మొత్తం దేశానికి ఒక రోల్‌మోడల్‌గా ఉపయోగపడుతుందని చెప్పారు. ఇటీవల ప్రధాని మోదీకి తాను రాసిన రెండు లేఖలను ఆమె సభ ముందుంచారు. మహిళలు, చిన్నారులకు భద్రత కల్పించేలా చట్టాలను అమలు చేయడంలో విఫలమైన పాలకులంతా పదవుల నుంచి తప్పుకోవాలని తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా, జూనియర్ డాక్టర్ హత్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సభలో విపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు బిగ్గరగా నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో మమతా బెనర్జీ స్పందించారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లో మహిళలపై అధికంగా నేరాలు జరుగుతున్నాయని తిప్పికొట్టారు.

నేరం	అపరాజిత బిల్లు	పోక్సో చట్టం
లైంగిక దాడి	7 నుంచి పదేళ్ల జైలు/జరిమానా	మూడేళ్ల జైలు/జరిమానా
తీవ్ర లైంగిక దాడి	కనీసం ఏడేళ్ల జైలు	ఐదు నుంచి ఏడేళ్ల జైలు
అత్యాచారం	ఆజన్మ ఖైదు/మరణశిక్ష	20 ఏళ్ల కఠిన కారాగారం/ ఆజన్మ ఖైదు/మరణశిక్ష
ఆధారాల సేకరణ	ఏడు రోజుల్లోగా	నెల రోజుల్లోపు
విచారణ గడువు	21 రోజులు	ఏడాది లోపు



అసెంబ్లీలో మాట్లాడుతున్న మమత

ఏమిటీ అపరాజిత బిల్లు?

భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష సంహితతో పాటు పోక్సో చట్టానికి కూడా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అపరాజిత బిల్లు సవరణలను ప్రతిపాదించింది. ''అత్యాచారం, అత్యాచారం–హత్య, సామూహిక అత్యాచారం, బాధితుల గుర్తింపు బయటపెట్టడం, యాసిడ్ దాడి వంటి నేరాలకు విధించే శిక్షలకు సంబంధించి భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 64, 66, 70(1), 71, 72(1), 73, 124(1), 124(2)ను సవరించాలి. మహిళలు, చిన్నారులపై అత్యాచారం, లైంగిక నేరాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించాలి'' అని పేర్కొంది. ''అత్యాచారం కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన 21 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలి. తగిన కారణాలుంటే మరో మూడు వారాలు పొడిగించవచ్చు. దోషులకు మరణ శిక్షతో పాటు జరిమానా లేదా ఆజన్మ ఖైదు (మరణించేదాకా) విధించాలి. మహిళలపై నేరాలకు సంబంధించిన కోర్టు కార్యకలాపాలను, కేసు విచారణ వివరాలను అనుమతి లేకుండా ప్రచురిస్తే 3 నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించాలి. దర్యాప్తు కోసం డీఎస్పీ నేతృత్వంలో జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. దర్యాప్తు వేగంగా పూర్తి చేయడానికి ప్రత్యేక కోర్టును, దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి'' అని అపరాజిత బిల్లు ప్రతిపాదించింది.

8 రోజుల సీబీఐ కస్టడీకి సందీప్ ఘోష్



కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను కోర్టు ఎనిమిది రోజులు సీబీఐ కస్టడీకి అప్పగించింది. మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు సంబంధించి సీబీఐ సందీప్ ఘోష్‌తో పాటు బిప్లవ్ సింఘా, సుమన్ హజ్రా, అఫ్సర్ అలీఖాన్‌లను సోమవారం అరెస్టు చేసింది. వీరిని పదిరోజుల కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోర్టును కోరింది. అయితే కోర్టు ఎనిమిది రోజుల కస్టడీకి అనుమతించింది. బయోమెడికల్ వేస్ట్‌ను అమ్ముకున్నారని, ఆసుపత్రి వనరులను దుర్వినియోగం చేశారని సందీప్ ఘోష్‌పై ఆరోపణలున్నాయి. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7 కింద సందీప్ ఘోష్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది.

తీరిగ్గా సస్పెన్షన్ వేటు

పీజీ ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటన జరిగిన 26 రోజులకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నింపాదిగా స్పందించింది. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను బెంగాల్ ఆరోగ్యశాఖ మంగళవారం సస్పెండ్ చేసింది. సందీప్ ఘోష్‌పై కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు దృష్ట్యా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది.

ఐసీజీ రక్షణ చర్యల్లో అపశ్రుతి

సముద్రంలో చాపర్ కూలి..ముగ్గురు సిబ్బంది గల్లంతు

పోర్‌బందర్: భారత తీర రక్షక దళం(ఐసీజీ) రెస్క్యూ మిషన్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. ఐసీజీ హెలికాప్టర్ సముద్ర జలాల్లో పడిపోవడంతో అందులోని ముగ్గురు సిబ్బంది గల్లంతయ్యారు. పోర్‌బందర్ సమీపంలోని అరేబియా సముద్రంలో ఓ ట్యాంకర్ నౌకలో సిబ్బంది ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను అత్యవసరంగా ఆస్పత్రికి తరలించేందుకు ఐసీజీకి చెందిన తేలికపాటి హెలికాప్టర్ నలుగురు సిబ్బందితో సోమవారం రాత్రి 11 గంటలప్పుడు అక్కడికి చేరుకుంది. ప్రతికూల పరిస్థితుల్లో నౌకపై ల్యాండవ్వాల్సిన చాపర్ అదుపుతప్పి సముద్ర జలాల్లో పడిపోయింది. అందులోని నలుగురు సిబ్బంది గల్లంతయ్యారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టిన ఐసీజీ దళాలు ఒకరిని కాపాడారు. మిగతా ముగ్గురి జాడ కోసం నాలుగు షిప్పులు, రెండు చాపర్లు ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టాయని ఐసీజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

సైనిక స్కూల్‌పై రష్యా దాడి

ఉక్రెయిన్‌లో 51 మంది మృతి

కీవ్: రష్యా మరోసారి ఉక్రెయిన్‌పై భీకర దాడికి పాల్పడింది. సెంట్రల్ ఉక్రెయిన్ ప్రాంతం పొల్టావా నగరంలోని సైనిక శిక్షణా కేంద్రం, ఆ సమీప ఆస్పత్రులే లక్ష్యంగా రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో 51 మంది చనిపోయారు. 219 మంది గాయపడ్డారు. శిథిలాల్లో చిక్కుకున్న 11 మంది సహా మొత్తం 25 మందిని కాపాడినట్లు సహాయక సిబ్బంది తెలిపారు. 2022లో ఉక్రెయిన్‌పై దండయాత్ర మొదలు పెట్టిన తర్వాత రష్యా చేపట్టిన భీకర దాడుల్లో ఇదొకటని పరిశీలకులు అంటున్నారు. కీవ్, ఖర్కీవ్‌లను కలిపే ప్రధాన రహదారి, రైల్వే మార్గంపై పొల్టావా ఉంది. మంగళవారం ఉదయం హెచ్చరిక సైరన్లు మోగడంతో బాంబు షెల్టర్లలోకి పరుగు తీస్తుండగానే క్షిపణులు వచ్చి పడ్డాయని స్థానికులు తెలిపారు. దాడిలో సైనిక శిక్షణ కేంద్రానికి చెందిన ఒక భవనం పాక్షికంగా దెబ్బతింది. అందులోని చాలామంది శిథిలాల్లో చిక్కుకుపోయారు. వీరిలో చాలా మందిని సహాయక సిబ్బంది రక్షించారని పేర్కొంటూ జెలెన్‌స్కీ టెలిగ్రామ్ ఛానల్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. సైనిక సాయం వెంటనే అందజేయాలంటూ మరోసారి ఆయన పశ్చిమదేశాలను కోరారు. రష్యాలోని సరిహద్దులకు దూరంగా ఉండే ప్రాంతాలపై దాడులు చేపట్టేందుకు తమకు అనుమతివ్వాలన్నారు. 'ఉక్రెయిన్‌కు మరిన్ని గగనతల రక్షణ వ్యవస్థలు, రష్యాపై ఎదురుదాడికి దిగేందుకు క్షిపణుల అవసరం ఇప్పుడు ఎంతో ఉంది. ఎప్పుడో తర్వాత కాదు. అవి గోదాముల్లో ఉంటే ఎవరిక్కావాలి?'అంటూ ఆయన వ్యాఖ్యానించారు. సాయం అందించడంలో ఆలస్యం జరిగే ఒక్కో రోజూ దురదృష్టవశాత్తూ మరిన్ని మరణాలకు కారణమవుతోందన్నారు. అమెరికా, పశ్చిమదేశాల నుంచి తక్షణ సైనిక సాయం అందే జాడలు కనిపించకపోవడం విచారకరమని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి కులేబా వ్యాఖ్యానించారు.

జైలు నుంచి తప్పించుకుంటూ...
129 మంది ఖైదీలు మృతి

కిన్షాసా: కాంగో రాజధాని కిన్షాసాలోని సెంట్రల్ మకాలా జైలు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో 129 మంది మృతి చెందారు. వారిలో 24 మంది కాల్పుల్లో చనిపోయినట్టు అంతర్గత వ్యవహారాల మంత్రి జాక్వెమిన్ మంగళవారం తెలిపారు. ''తప్పించుకునేందుకు జైలుకు ఖైదీలు నిప్పు పెట్టారు. జైలు భవనం, ఫుడ్ డిపోలు, ఆసుపత్రిలో మంటలు చెలరేగి ఊపిరాడక చాలామంది చనిపోయారు. ఈ గందరగోళం మధ్యే పలువురు మహిళా ఖైదీలు అత్యాచారానికి కూడా గురయ్యారు'' అని వివరించారు. తప్పించుకోవడానికి ప్రయత్నించిన వారిలో పలువురిని పోలీసులు హతమార్చినట్టు సమాచారం. మకాలా జైలు సామర్థ్యం 1,500 మాత్రమే. కానీ అధికారిక లెక్కల ప్రకారమే 15,000 మంది ఖైదీలున్నారు. వీరిలో ఎక్కువ విచారణ ఖైదీలేనని ఆమ్నెస్టీ నివేదిక పేర్కొంది.

కేంద్రం జోక్యంతో దిగొచ్చిన నెట్‌ఫ్లిక్స్

- ఐసీ814: కాందహార్ వెబ్‌సిరీస్‌లో ఉగ్రవాదులకు 'హిందూ' పేర్లు పెట్టడంపై కేంద్రం సీరియస్
- దీంతో అసలు పేర్లతో కంటెంట్ అప్‌డేట్ చేసిన నెట్‌ఫ్లిక్స్

న్యూఢిల్లీ: ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని 1999లో పాకిస్తాన్ ఉగ్రవాదులు హైజాక్‌చేసి అఫ్గానిస్తాన్‌కు తీసుకెళ్లిన ఉదంతంపై ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'ఐసీ 814: ద కాందహార్ హైజాక్' వెబ్‌సిరీస్ విషయంలో కేంద్రప్రభుత్వం సీరియస్ అయింది. ఉగ్రవాదులు తమ అసలు పేర్లను దాచేసి హిందువుల పేర్లు పెట్టుకున్న అంశాలను వెబ్‌సిరీస్‌లో అలాగే చూపించడాన్ని కేంద్రం తీవ్రంగా తప్పుబట్టింది. వాస్తవాలను దాచిపెట్టడాన్ని ఆక్షేపించింది. దీంతో ఉగ్రవాదుల అసలు పేర్లను జోడిస్తూ 'కంటెంట్'ను అప్‌డేట్ చేసినట్లు నెట్‌ఫ్లిక్స్ మంగళవారం ప్రకటించింది. నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ ఉపాధ్యక్షురాలు మోనికా షెర్గిల్‌కు కేంద్ర సమాచార, ప్రసార(ఐబీ) శాఖ కార్యదర్శి సంజయ్ జాజు సమన్లు జారీచేయడంతో ఆమె మంగళవారం ఐబీ కార్యాలయానికి వచ్చి సంజయ్‌తో మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయిన అంశాలను స్పృశించేటపుడు సమాజంపై అవి చూపే తీవ్ర ప్రభావాన్ని దృష్టిలోపెట్టుకోవాలని మందలించారు. దీంతో '' సిరీస్ ఆరంభంలో వచ్చే ఓపెనింగ్ డిస్‌క్లేమర్‌లో ఉగ్రవాదుల అసలు పేర్లను, వారు వాడిన కోడ్ పేర్లను జతచేస్తున్నాం'' అని షెర్గిల్ భేటీ తర్వాత పేర్కొన్నారు. హైజాకర్లు తమ నిజమైన పేర్లు ఇబ్రహీం అథర్, షాహీద్ అఖ్తర్ సయీద్, సన్నీ అహ్మద్ ఖాజీ, జహూర్ మిస్త్రీ, షకీర్‌లను దాచి భోలా, శంకర్, డాక్టర్, బర్గర్, చీఫ్‌లుగా హైజాక్ వేళ పరిచయం చేసుకున్నారు. ఒక వర్గానికి చెందిన పేర్లను దాచిపెట్టి హిందువుల పేర్లను హైజాకర్లకు చూపించడం వెనుక నెట్‌ఫ్లిక్స్ దురుద్దేశం ఉందని నెటిజన్లు ఆరోపించారు. #BoycottNetflix, #BoycottBollywood, #IC814 హ్యాష్‌ట్యాగ్‌లతో సామాజిక మాధ్యమాల్లో వెబ్‌సిరీస్ వ్యతిరేక ఆందోళన ఉధృతం చేశారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సహాయ నిరాకరణ

బెంగాల్ సర్కారుపై సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీకి భద్రత కల్పిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి వసతి, రవాణా సదుపాయాలు కల్పించడంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం క్షమార్హం కాని సహాయనిరాకరణ చేస్తోందని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పూర్తి సహాయసహకారాలను అందించేలా బెంగాల్ సర్కారుకు ఆదేశాలు జారీచేయాలని మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఒకవేళ బెంగాల్ ప్రభుత్వం నుంచి సహకారం లభించకపోతే కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసినందుకు సంబంధిత బెంగాల్ అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. ఈమేరకు కేంద్ర హోం శాఖ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

బుధవారం ❘ 4 ❘ సెప్టెంబర్ ❘ 2024

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎం



గరిష్టం/కనిష్టం
28.0/23.0

వాతావరణం
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

తొలి అడుగు

గ్రేటర్ కార్పొరేషన్ల పెంపునకు..

- తేలాల్సింది రెండా, మూడా అనేదే..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని రెండు లేదా అంతకంటే ఎక్కువ కార్పొరేషన్లు చేసే ప్రక్రియలో తొలి అడుగు పడింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతంతో పాటు ఔటర్‌కు వెలుపల కూడా ఉన్న కొన్ని గ్రామపంచాయతీలను పురపాలికల్లో కలుపుతూ ఆర్డినెన్స్ జారీ కావడంతో మలి దశలో ఆయా పురపాలికలను కూడా జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో పాటు జీహెచ్ఎంసీని రెండు కానీ, అంతకంటే ఎక్కువ కానీ కార్పొరేషన్లుగా చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ ఓఆర్ఆర్ సరిహద్దుగా పలు చర్యలకు శ్రీకారం చుట్టడం తెలిసిందే. అందులో భాగంగానే ప్రస్తుతం విలీన ప్రక్రియ పూర్తి చేశారు. తొలుత ఔటర్ వరకు మాత్రమే అనుకున్నప్పటికీ కొన్ని సడలింపులతో మొత్తం 51 గ్రామపంచాయతీలను పురపాలికల్లో విలీనం చేశారు. ఇక మలిదశలో సదరు పురపాలికలను జీహెచ్ఎంసీ పరిధిలోకి తేనున్నారు.

ఎన్ని కార్పొరేషన్లు ?

ఇప్పటికే 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లుగా ఉన్న జీహెచ్ఎంసీలో వివిధ పనుల పర్యవేక్షణ క్లిష్టంగా మారడంతోఎక్కువ కార్పొరేషన్లు చేస్తారని కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. కచ్చితంగా ఎన్ని కార్పొరేషన్లు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. కొన్నిసార్లు రెండు కార్పొరేషన్లు అని, మరికొన్నిసార్లు మూడు కార్పొరేషన్లు అని ప్రచారం జరిగింది. వీటికి సంబంధించి ఏర్పాటు కానున్న ఉన్నత స్థాయి కమిటీ కార్పొరేషన్ల సంఖ్యను నిర్ణయిస్తుందని మున్సిపల్ విభాగానికి చెందిన సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం ఆరు జోన్లున్నందున ఆరు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు అభివృద్ధి, ప్రభుత్వానికి ఆదాయం, పాలనా సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకొని సంబంధిత కమిటీ నిర్ణయం తీసుకోనుంది. జీహెచ్ఎంసీని ఒకటి కంటే ఎక్కువ కార్పొరేషన్లు చేసే యోచనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. తద్వారా అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధితో పాటు సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని సర్కారు ఆలోచన. జీహెచ్ఎంసీ జనాభా ఇప్పటికే కోటి దాటి పోయింది. విలీనంతో మరింత పెరగనుంది.

అసెంబ్లీ నియోజకవర్గాలు పరిగణనలోకి..

భవిష్యత్‌లో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను కూడా పరిగణనలోకి తీసుకొని గ్రేటర్ కార్పొరేషన్‌ను విభజించే అవకాశం ఉంది. ప్రస్తుతం డివిజన్ల జనాభాలో వ్యత్యాసం ఉంది. కొన్ని డివిజన్లలో 30వేల జనాభా ఉంటే కొన్ని డివిజన్లలో లక్షకు పైగా ఉంది. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రస్తుత బల్దియా పాలకమండలి గడువు 2026 ఫిబ్రవరిలో ముగుస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2025 డిసెంబర్ నాటికి కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు పూర్తి చేయొచ్చు. కొత్త కార్పొరేషన్లూ ప్రస్తుత తరహాలోనే జోన్లు, సర్కిళ్లు, డివిజన్లుగా ఉంటాయా? లేక వాటి స్వరూపం మారుతుందా? వంటి వివరాలు ముున్ముందు వెల్లడి కానున్నాయి.



'కిక్' మొదలైంది






పదహారేళ్ల తర్వాత భాగ్యనగరం భారత సీనియర్ ఫుట్‌బాల్ జట్టు మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చింది. గచ్చిబౌలి స్టేడియంలో మూడు దేశాల మధ్య నిర్వహిస్తున్న ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీని మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముున్ముందు మన రాష్ట్రంలో మరిన్ని పెద్ద టోర్నీలు నిర్వహిస్తామని, అందుకు కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కొత్త క్రీడా పాలసీని రూపొందించి దాని ప్రకారం అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మ్యాచ్ ఆరంభానికి ముందు భారత్, మారిషస్ జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. మ్యాచ్ ఆద్యంతం వీక్షించడం విశేషం. ఈ టోర్నీలో భాగంగా రెండో మ్యాచ్‌లో ఈ నెల 6న మారిషస్, సిరియా జట్లు తలపడతాయి. అనంతరం భారత్, సిరియా జట్ల మధ్య 9న చివరి మ్యాచ్ ఉంటుంది.
– సాక్షి, హైదరాబాద్



స్థిరాస్తికి హైడ్రా దెబ్బ



రియల్టీ రంగం నేలచూపులు

- నయా ప్రాజెక్టులకు బిల్డర్ల వెనకంజ
- ఏ కారణంతో ఇల్లు కూలుస్తారో?
- గృహ వినియోగదారుల్లో గుబులు

నిలిచిపోయిన క్రయ విక్రయాలు

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ స్థిరాస్తి రంగానికి హైడ్రా గుబులు పట్టుకుంది. సాధారణంగా ఎన్నికల ఏడాదిలో రియల్టీ మార్కెట్ స్తబ్దుగానే ఉంటుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అవలంబించే కొత్త పాలసీలు, నిర్ణయాలతో మార్కెట్ రెట్టింపు ఉత్సాహంతో పరుగులు పెడుతుంది. కానీ.. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 9 మాసాలవుతున్నా రియల్టీ మార్కెట్‌లో జోష్ లేకుండాపోయింది. పైగా ఇటీవల హైడ్రా దూకుడుతో నేలచూపులు చూస్తోందని పరిశ్రమ వర్గాలు ఆందోళనలో ఉన్నాయి. బఫర్ బూచితో ఎప్పుడో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలను సైతం కూల్చివేస్తుండటంతో వినియోగదారుల్లో గుబులు నెలకొంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కొత్త ప్రాజెక్టుల జోలికెళ్లేందుకు బిల్డర్లు జంకుతున్నారు. దీంతో నగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పట్లో తేరుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒప్పందాలు రద్దు..

నాలాలు, చెరువులను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చడం ఆహ్వానించాల్సిందే కానీ.. ఏళ్ల క్రితం అన్ని రకాల ప్రభుత్వ విభాగాల అనుమతులతో నిర్మించిన భవనాలను సైతం నేలమట్టం చేస్తుండటంతో కస్టమర్లలో భయం నెలకొంది. మధ్యవర్తుల మాటలు నమ్మి అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేసిన వారు ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ సురక్షితమేనా, గ్యారంటీ ఏంటని బిల్డర్లను సంప్రదిస్తున్నారు. పలువురు కస్టమర్లు ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నారని ఓ బిల్డర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెలకు 30– 35 అపార్ట్‌మెంట్లను విక్రయమయ్యేవని.. కానీ, ఇప్పుడు 15 కూడా దాటడం కష్టమైపోయిందని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ ఇమేజ్‌కు నష్టం..

కాస్మోపాలిటన్ కల్చర్, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, తక్కువ జీవన వ్యయం, అందుబాటులో ధరలు, కట్టుదిట్టమైన శాంతి భద్రతలు, సులువైన వ్యాపార, పారిశ్రామిక విధానం, అనుమతుల జారీలో పారదర్శకత కారణంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచ దేశాలకు చేరింది. దీంతో గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో కంపెనీల ఏర్పాటు, పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌పై దెబ్బ పడుతోందని ఓ డెవలపర్ల సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు తెలిపారు. ఒక వైపు పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ కంపెనీలను ఆహ్వానిస్తూనే మరోవైపు బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. గతంలో ద్వితీయ తృతీయ శ్రేణి బిల్డర్లు సమూహంగా ఏర్పడి హైరైజ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ముందుకొచ్చేవారు. కాగా.. ప్రస్తుత పరిస్థితులు అంత సానుకూలంగా లేవని, ఇలాగే కొనసాగితే మార్కెట్‌లో కొందరు బడా డెవలపర్లు మాత్రమే మిగిలిపోతారని, దీంతో ధరలు పెరిగి, సామాన్య, మధ్యతరగతి సొంతింటి కల మరింత దూరమవుతోంది.

సేల్‌డీడ్ ఉంటే పరిహారం చెల్లించాలి..

- ముందుగా చెరువుల్లో పట్టా భూములు లేకుండా చూడాలి. కొత్త ప్రాజెక్ట్ చేపడుతున్నప్పుడు ఎలాగైతే ప్రభుత్వం భూసమీకరణ చేపడుతుందో అలాగే చెరువుల్లోని పట్టా భూముల టైటిల్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. సంబంధిత స్థల యజమానికి అభివృద్ధి హక్కుల బదిలీ (టీడీఆర్) అందించాలని ఓ కార్పొరేషన్ మాజీ మేయర్, డెవలపర్ సూచించారు.
- చెరువుల్లోని పట్టా భూములకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వ విభాగాలే. వీటి ఆధారంగానే డెవలపర్లు నిర్మాణ అనుమతులు తీసుకొని భవనాలను నిర్మించారు. ఫీజులు, స్టాంప్ డ్యూటీల రూపంలో ఆదాయం ప్రభుత్వానికే సమకూరింది. అలాంటప్పుడు నష్టం కూడా ప్రభుత్వమే భరించాలి. సేల్‌డీడ్ ఉన్న భవనాలకు ప్రభుత్వం పరిహారం అందించాలి. అలాకాకుండా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వ అధికారులు, కట్టిన బిల్డర్లపై క్రిమినల్ కేసులు పెట్టడం, నివాసం ఉంటున్న భవనాలను కూల్చి భయభ్రాంతులకు గురి చేయడం సరి కాదు.
- భూమి సూక్ష్మ వివరాలను తెలిపే టోపో షీట్స్‌ను ప్రామాణికంగా తీసుకొని జలాశయాల పరిధిని నిర్ధారిస్తున్నారు. 50 ఏళ్ల నాటి టోపో షీట్స్‌కు తాజా పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అందుకే ముందుగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలి. చెరువులకు ప్రహరీలను, జియో ట్యాగింగ్ ఫెన్సింగ్, సూచికలను ఏర్పాటు చేయాలి. పరిధి దాటి అనుమతులు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకునేలా ప్రత్యేక నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరముంది.

జల వనరులకు దన్నుగా..

హైడ్రా పరిధిలోకి లేక్ ప్రొటెక్షన్ కమిటీ

చెరువుల పరిరక్షణ బాధ్యతలూ దీనికే..

- త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు
- ఇతర విభాగాలతోనూ సమన్వయం



సాక్షి, సిటీబ్యూరో: కబ్జాకు గురైన చెరువులు, కుంటలు, నాలాల చెర విడిపిస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇకపై జల వనరుల పరిరక్షణ బాధ్యతలూ తీసుకోనుంది. దీనికోసం లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ)ని హైడ్రా పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌పీసీ చైర్మన్‌గా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను నియమిస్తూ ఒకటిరెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఆపై 'గ్రేటర్'తో పాటు చుట్టుపక్కల ఉన్న ఏడు జిల్లాల్లోని చెరువులు హైడ్రా అధీనంలోకి వస్తాయి. వీటిని సర్వే చేయడం, నోటిఫై చేయడంలాంటి విధులనూ హైడ్రా కమిషనర్ చేపడతారు.

ఇప్పటి వరకు అడపాదడపా సమావేశాలు

జీఓ 111ను ఉల్లంఘిస్తూ ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాలు జరగా.. వాటి పరిరక్షణకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ పర్యావరణ వేత్తలు గతంలో హైకోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం 2010 ఫిబ్రవరి 2న హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల పరిరక్షణకు లేక్ ప్రొటెక్షన్‌కమిటీని ఏర్పాటు చేయాలంటూ ఆదేశించింది. అందుకు అనుగుణంగా అదే ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధి విధానాల ప్రకారం ఎల్‌పీసీ ప్రతి మూడునెలలకోసారి సమావేశమై ఆయా చెరువుల పరిరక్షణకు తీసుకున్న అంశాలపై సమీక్షించాలి. ఈ సమావేశాలు అప్పుడప్పుడు జరుగుతూ ఉండగా, నిర్ణయాలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయి.

265 చెరువులకే ఫైనల్ నోటిఫికేషన్

రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి చెరువుల సర్వే చేయడంతోపాటు పూర్తి నీటినిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) గుర్తించి ఆ మ్యాప్‌లను సంబంధిత కన్సల్టెన్సీకి ఇవ్వాలి. వారు ఆయా వివరాలను మాస్టర్ ప్లాన్‌లో సూపర్ ఇంపోజ్ చేసి సర్వే నంబర్లు, ఎఫ్‌టీఎల్‌కు సరిపోతున్నాయా? లేదా? అనేది సరిచూసి ఈ మేరకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే ఎల్‌పీసీ ఆధ్వర్యంలో అంతర్గత కమిటీ వేసి విచారణ చేసి వారి ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. ఇలా హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలోనే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కలిసి చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. హెచ్ఎండీఏ పరిధిలో 3,534 చెరువులున్నట్టుగా ఎల్‌పీసీ అధికారులు గుర్తించారు. 1,972 చెరువులను రెవెన్యూ, నీటిపారుదల శాఖ, హెచ్ఎండీ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. గడచిన 14 ఏళ్లలో 265 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ వెలువడింది.

అన్ని విభాగాల భాగస్వామ్యంతో..

ఎల్‌పీసీని హైడ్రా పరిధిలోకి తీసుకొస్తే.. చెరువుల నోటిఫికేషన్‌లో వేగం పుంజుకుంటుంది. హైడ్రా అధికారులు ఇతర విభాగాలతో కలిసి చెరువుల మ్యాప్‌ల తయారీ, ఎఫ్‌టీఎల్ సరిహద్దు, బఫర్ జోన్‌ల గుర్తింపు ప్రస్తుతం ఓ ప్రహసనంగా ఉంది. ఆయా జల వనరులకు సంబంధించిన సర్వేనంబర్లు, ఎఫ్‌టీఎల్ సరిపోలకపోతే తిరిగి రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖకు పంపించడం, వారి నుంచి సమాధానాలు తెలుసుకోవడంలో తీవ్ర ఆలస్యమవుతోంది. హైడ్రా పరిధిలోకి ఎల్‌పీసీ వస్తే ఇందులోనే ఇతర విభాగాలనూ భాగస్వాముల్ని చేస్తారు. తద్వారా చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ త్వరితగతిన పూర్తవుతుంది. ఈ ప్రక్రియ త్వరగా పూర్తయితే ఆక్రమణల తొలగింపు, పరిరక్షణ చేపట్టే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వాస్పత్రుల సేవలు వినియోగించుకోవాలి

- జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (హెల్త్) పంకజ

సాక్షి, సిటీబ్యూరో: దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు జీహెచ్ఎంసీ ప్రణాళికాబద్ధమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ కమిషనర్ (హెల్త్) పంకజ పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో 56 కాలనీల్లో నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీలోని బస్తీ దవాఖానాలు, ప్రాథమిక వైద్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు వినియోగించుకోవాలన్నారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ ఆపరేషన్లు నిర్వహించాలని సిబ్బందికి ఆమె సూచించారు.

మేడ్చల్ పెద్ద చెరువు కట్ట వంతెనకు భారీ కన్నం



మేడ్చల్: మేడ్చల్ పెద్ద చెరువు కట్ట వంతెనకు భారీ కన్నం ఏర్పడింది. ప్రస్తుతం చెరువు అలుగు పోస్తుండటంతో వాగు పారుతోంది. కట్టకు లింకు చేస్తూ మత్తడి నుంచి వాగులోకి నీరు వెళ్లేలా నిర్మించిన వంతెనకు భారీ కన్నం పడింది. దీంతో వంతెన ప్రమాదకరంగా మారింది. మున్సిపల్ చైర్ పర్సన్ దీపికా నర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, ఇరిగేషన్ ఏఈ నిఖిత మంగళవారం వంతెనను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వంతెన కట్టకు ఇరువైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు.

వదల గంజాయీ.. వదలా..



ఆపరేషన్ ధూల్‌పేట్ కొనసాగింపు

- మహమ్మారి అంతమే లక్ష్యంగా ఎక్సైజ్ దాడులు
- మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం

ఎన్ని అడ్డంకులెదురైనా దాడులు ఆపం..

గంజాయి అమ్మకాల్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎన్ని ఆటంకాలు ఎదురైనా దాడులు ఆగవు. గంజాయి, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించే వరకు దాడులు కొనసాగుతాయి.
– కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ ఎక్సైజ్ శాఖ చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట్'ను కొనసాగించనున్నారు. ఆగస్టు 31 నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు అధికారులు మరికొంత కాలం దాడులు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు చేసిన దాడుల ఫలితంగా చాలా వరకు గంజాయి సరఫరా, అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. కొందరు నేరస్తులు జైలుపాలయ్యారు. మరికొందరు పరారీలో ఉన్నారు. మరోవైపు ఆగస్టు నెలాఖరుతో ఎక్సైజ్ శాఖ దాడులను ముగించనున్నట్లు భావించిన వ్యాపారులు మరోసారి రెచ్చిపోయేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలియడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

ఆపరేషన్ ధూల్‌పేట్ ఇలా..

నగరంలోని వివిధ ప్రాంతాలకు పెద్ద ఎత్తున గంజాయిని సరఫరా చేసే అడ్డాగా మారిన ధూల్‌పేట్‌పై ఎక్సైజ్ అధికారులు ఈ ఏడాది జూలై 17న ఆపరేషన్ ధూల్‌పేట్ ప్రారంభించారు. ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎస్‌టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తదితర ఉన్నతాధికారుల నేతృత్వంలో ధూల్‌పేట్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. మొత్తం 15 బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దింపారు. తనిఖీ బృందాలు 24 గంటల పాటు విధులు నిర్వహించాయి. ఎక్కడికక్కడ గంజాయి అడ్డాలపై ఉక్కుపాదం మోపాయి.

53 రోజులుగా..

గత 53 రోజులుగా ఎక్సైజ్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 34 కేసులు నమోదు చేశారు. 207 కిలోల గంజాయి, 4.2 కిలోల హాష్ ఆయిల్ పట్టుకున్నారు. 66 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అమ్మకందార్లలో 61 మంది ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరో 33 మందిని బైండోవర్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ధూల్‌పేట్‌లో 90 శాతం గంజాయి అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. వినాయక చవితి అనంతరం దాడులను ఉధృతం చేయనున్నారు.

ఒకరు ఫాంహౌస్‌లో, మరొకరు అమెరికాలో ఉండి మాట్లాడటం సరికాదు



హిమాయత్ సాగర్‌ను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

మీరు కూడా ప్రజల్లోకి వచ్చి సాయపడండి

- కేసీఆర్, కేటీఆర్‌లనుద్దేశించి మంత్రి పొన్నం వ్యాఖ్యలు

బండ్లగూడ: భారీ వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రతిపక్ష నాయకులు ఒకరు ఫాంహౌస్‌లో, మరొకరు అమెరికాలో ఉండి విమర్శలు చేయడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హితవు పలికారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ పరిధిలోని హిమాయత్ సాగర్ జలాశయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రంగారెడ్డి, హైదరాబాద్ కలెక్టర్లు శశాంక, అనుదీప్ దురిశెట్టిలతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. జలాశయంలోకి వచ్చే వరద నీటిని గేట్లు ఎత్తి ఈసీలోకి వదిలే క్రమంలో దిగువన ఉన్న ప్రాంతాలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలతో పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా మేరకు రూ.5వేల కోట్ల నష్టం వాటిల్లిందని, జాతీయ విపత్తుగా పరిగణించి తక్షణ సాయం కింద రాష్ట్రానికి రూ.2వేల కోట్లు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరారని గుర్తు చేశారు. కానీ.. రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులు రాజకీయ విమర్శలు చేసే సమయం ఇది కాదని పొన్నం హితవు చెప్పారు. 'ఒకరు ఫాంహౌస్‌లో, మరొకరు అమెరికాలో ఉండి ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం సబబు కాదు' అని పరోక్షంగా కేసీఆర్, కేటీఆర్‌లనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. 'మీరు కూడా ప్రజల్లోకి రండి. మీ పార్టీ తరఫున సాయం చేయండి. సహాయక చర్యలలో పాల్గొనండి' అని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ రాములు, మేయర్ లతాప్రేమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై భయాందోళన వద్దు

- అదుపులోనే ఉన్నాయి.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేదు..
- రూ.80 కోట్లతో 'గాంధీ' వైద్యవిద్యార్థులకు వసతి సౌకర్యం
- గాంధీ ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తనిఖీ



గాంధీ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతూ వైద్యసేవలపై ఆరా తీస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



హెల్ప్‌డెస్క్ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి

గాంధీఆస్పత్రి : సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై ప్రజలు భయాందోళన చెందవద్దని, అవి అదుపులోనే ఉన్నాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, డీఎంఈ వాణి, ఇతర అధికారులతో కలిసి మంత్రి మంగళవారం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారులతోపాటు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, గాంధీ పాలనా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న ప్రధాన సమస్యలు, పరిష్కార మార్గాలు, రోగులకు అందిస్తున్న సేవలు, పడకలు, ఐపీ, ఓపీ వివరాలు, శానిటేషన్, డైట్, వైద్యులు, నర్సింగ్, టెక్నీషియన్లు, పేషెంట్ కేర్ టేకర్లు, క్లినికల్, డయాగ్నోస్టిక్, వైద్యపరికరాలు, సిబ్బంది తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు సూచనలు, సలహాలు అందించారు. వివరాలు సరిగా చెప్పలేని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోగులతో మంత్రి మాటామంతీ...

గాంధీ అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాలతోపాటు సర్జికల్, ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సెంట్రల్ లెబోరేటరీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలను మంత్రి రాజనర్సింహ సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ హెల్ప్‌డెస్క్ వద్ద సేవలు అందిస్తున్న శ్రీలత, సుధాతో మాట్లాడి వారిని అభినందించారు. అనంతరం అలుమ్నీ భవన సమీపంలో నిర్మించనున్న వైద్య విద్యార్థుల వసతిగృహ స్థలాన్ని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరతో కలిసి పరిశీలించారు.

గాంధీ ఆస్పత్రిలోనే పుట్టాను.. నేను దళిత బిడ్డను..

'పాత గాంధీ ఆస్పత్రిలోనే పుట్టాను. అందుకే ఇక్కడి సాధకబాధకాలు, వైద్యసేవలపై నాకు పూర్తి అవగాహన ఉంది' అని మంత్రి రాజనర్సింహ అన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా చర్యలు

కోల్‌కతాలో ఇటీవల జరిగిన ఘటన తెలంగాణలో పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది భద్రతపై కేంద్ర ప్రభుత్వం అడిగిన వివరాలను ఈ నెల 14లోగా పంపిస్తామన్నారు. వైద్యుల కొరత లేదని, దీర్ఘకాలంగా ఒకేచోట తిష్ట వేసుకుని ఉన్న వైద్యులకు మాత్రమే స్థానచలనం చేశామని, ఖాళీ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేశామన్నారు. రూ. 80 కోట్ల వ్యయంతో గాంధీ వైద్యవిద్యార్థులకు బాయ్స్, గర్ల్స్‌కు వేర్వేరుగా వసతిగృహాలు నిర్మించనున్నామని, గాంధీ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఐవీఎఫ్ సెంటర్, ప్రధాన భవనం ఎనిమిదో అంతస్తులో అత్యాధునిక అవయవ మార్పిడి శస్త్రచికిత్స సదుపాయాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు.

'నేను దళిత బిడ్డను, గాంధీఆస్పత్రికి వచ్చేవారు దొరల బిడ్డలు కాదు, దొరల బిడ్డలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తారు. నిరుపేదలు మాత్రమే గాంధీకి వస్తారు, వీళ్లంతా నా తోబుట్టువులు, కుటుంబసభ్యులు. వీరికి అత్యుత్తమ వైద్యసేవలు అందించడం నా బాధ్యత' అని మంత్రి అన్నారు.

ఓపెన్ నాలాల్లో పడి ఇద్దరి మృతి

- మద్యం మత్తులో ఘటనలు..
- కొంపల్లిలో ఒకరు.. జీడిమెట్లలో మరొకరు..

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం చిన్నతడ్గుర్ గ్రామానికి చెందిన హన్మంతు(24) గత నెల 30న కొంపల్లి సెంట్రల్ పార్కులోని మహాలక్ష్మి హాస్టల్‌లో ఉంటున్న తన సోదరుడి వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో 31వ తేదీ రాత్రి కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్ సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లాడు. మద్యం సేవించిన హన్మంతు లిక్కర్ మార్ట్ వెనుక భాగంలో ఓపెన్ నాలా కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన అతని సోదరుడు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే మంగళవారం ఉదయం మద్యం దుకాణం సమీపంలోని నాలా గుంతలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం అందుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మృతుడు హన్మంత్ అని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. మద్యం మత్తులో గుంతలో పడి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రైనేజీలో పడి..

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలం కంసెట్‌పల్లికి చెందిన వెంకట్‌గౌడ్(48) కొన్నేళ్ల కుటుంబం కుటుంబంతో కలిసి నగరానికి వలసవచ్చి జీడిమెట్ల విలేజ్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఉండే ఓ కల్లు కాంపౌండ్ వెంకట్‌గౌడ్ పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి మద్య మత్తులో బయటకు వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం జీడిమెట్ల గ్రామం ప్రధాన రహదారిలోని ఓపెన్ డ్రైనేజీలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని పోలీసులు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూసి, మృతుడు వెంకట్‌గౌడ్ అని గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి చర్యలు

కింగ్‌కోఠిలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన మంత్రి


లక్డీకాపూల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి చర్యలు చేపట్టామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కింగ్ కోఠి ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుకు వెళ్లి పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎంసీహెచ్ వార్డును పరిశీలించి వైద్యులతో కలిసి సౌకర్యాలపై ఆరా తీశారు.

కింగ్ కోఠి ఆస్పత్రి ప్రాంగణంలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మందిర్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి అవసరమైన సదుపాయాల కల్పనపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ.. కింగ్ కోఠి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

సామాన్యులకు ఉపయోగపడేలా..

- బయో ఈ–3 పాలసీకి అనుగుణంగా పరిశోధనలు
- ఎన్ఐఏబీ డైరెక్టర్ తరు శర్మ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన బయో ఈ3 పాలసీకి అనుగుణంగా తమ పరిశోధనలు సాగుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) డైరెక్టర్ తరు శర్మ తెలిపారు. బయో మెడిసిన్ తయారీ కోసం తాము ఎంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఎన్ఐఏబీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ఎలాంటి కర్బన పదార్థాలు విడుదల కాకుండా ఆర్థికాభివృద్ధి సాధించడమే బయో ఈ–3 పాలసీ లక్ష్యమని పేర్కొన్నారు. పర్యావరణహిత వృద్ధితో పాటు పునర్వినియోగ బయో ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఈ పాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ–3 అంటే ఎకానమీ (ఆర్థికవ్యవస్థ), ఎన్విరాన్‌మెంట్ (పర్యావరణం), ఎంప్లాయ్‌మెంట్ (ఉపాధి) అని, పర్యావరణహితమైన ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తాము ముందుకు సాగుతున్నామని తెలిపారు.



తక్కువ ధరకే ఇన్సులిన్..

డయాబెటిస్‌తో బాధపడేవారికి తక్కువ ధరకే ఇన్సులిన్ ఇంజెక్షన్లు లభ్యమయ్యేలా పరిశోధనలు చేశామని శాస్త్రవేత్త డాక్టర్ గంగూలీ తెలిపారు. అలాగే బ్రుసెల్లోసిస్ అనే బ్యాక్టీరియా జంతువులతో పాటు మానవులకు కూడా సోకుతుందని, ఈ బ్యాక్టీరియా వల్ల జంతువుల్లో సంభవిస్తున్న మరణాలను 2030 నాటికి పూర్తిగా తగ్గించాలనే ఉద్దేశంతో తాము ఓ పరిశోధన నిర్వహించామని డాక్టర్ గిరీశ్ వివరించారు. డీపీఎస్ అనే ప్రోటీన్‌ను తాము గుర్తించామని, ఈ యాంటీబాడీ ద్వారా సహజంగా సోకిన జంతువులను (దివా కేపబిలిటీ) గుర్తించవచ్చని చెప్పారు. ఈ పరిశోధనలు చేసేందుకు ఆరేళ్లు కష్టపడ్డామన్నారు. దీనికి సంబంధించిన ఉత్పత్తిని మెడికల్ డివైజెస్ పార్కులో ఉన్న ఎన్‌గ్రేవ్ బయోల్యాబ్స్ అభివృద్ధిపరిచింది. త్వరలోనే ఈ కిట్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తామని సంస్థకు చెందిన డాక్టర్ శశి భూషణ్‌రావు వెల్లడించారు.

సీఎం దృష్టికి మున్సిపల్ సమస్యలు

ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ల నిర్ణయం

శంషాబాద్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు శంషాబాద్ పట్టణంలో సమావేశమయ్యారు. అనంతరం సమావేశంలో చర్చించిన విషయాలను వెల్లడించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వీధిదీపాల బాధ్యతల నుంచి ఈఈఎస్ఎల్ సంస్థను తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేవలం దీపాలను బిగించడం తప్ప వాటి మరమ్మతులు, నిర్వహణను ఆ సంస్థ పట్టించుకోవడంలేదన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హెచ్ఎండీఏ ఇస్తున్న అనుమతులకు స్థానిక సంస్థల ఎన్‌ఓసీలను కూడా తప్పనిసరిచేయాలని, స్టాంప్ డ్యూటీల్లో యాభైశాతం స్థానికసంస్థలకే అందించాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో ఉద్యోగుల సంఖ్యను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పై డిమాండ్లన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, వీర్లపల్లి శంకర్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత , శంషాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మా, ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్రవంతి, తుర్కయంజాల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'వరద బాధితులకు అండగా నిలుద్దాం'

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యూత్ కన్వీనర్ మణిదీప్



సమావేశంలో మాట్లాడుతున్న మణిదీప్

సనత్‌నగర్: వరద బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలుస్తుందని సంస్థ హైదరాబాద్ యూత్ కన్వీనర్ మణిదీప్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెడ్ క్రాస్ చైర్మన్ మామిడి భీం రెడ్డి, కన్జ్యూమర్ ఫోరం ప్రతినిధి మానసలతో కలిసి సొసైటీ చేపట్టే కార్యక్రమాలను ఆయన వెల్లడించారు. గత నాలుగు రోజులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. చాలా ఇళ్లు నీట మునిగిన దృష్ట్యా చదువుకునే పిల్లల కోసం హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ నుంచి మొత్తం 2 లక్షల నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు, పెన్నులు, స్టేషనరీ సామగ్రిని అందజేస్తామన్నారు. తాము చేపట్టే ఈ కార్యక్రమంలో నగరంలోని విద్యార్థులను భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులు మానవతా దృక్పథంతో ముందుకువచ్చి వరద బాధిత విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించేందుకు ముందుకురావాలన్నారు. అలాగే తమ సొసైటీ తరఫున వరద బాధితులకు ఆహార పొట్లాలు, వాటర్ వాటిళ్లు, బిస్కెట్లు అందజేస్తామని వివరించారు.

వర్షపాతం అంచనా ఎలా?

ఆరా తీసిన హైడ్రా కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ వర్షపాతానికి సంబంధించి కీలకాంశాలపై దృష్టి పెట్టారు. వర్షం కురిసిన సందర్భంలో ఈ విభాగమే విపత్తు నిర్వహణ చేపట్టాలి. అయితే ఇటీవల వాతావరణ శాఖ వర్షం రాకపై చెప్తున్న వివరాలు, కురుస్తున్న వర్షానికి మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉంటున్నాయి. ఈ కారణంగా హైడ్రాలోని డీఆర్ఎఫ్ సిబ్బందిసహా ఇతర విభాగాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్ వర్షం అంచనా (వెదర్ ఫోర్ కాస్ట్), కురుస్తున్న వర్షానికి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడంపై దృష్టి పెట్టారు. దీన్ని సాంకేతికంగా తేల్చడానికి ఆయన మంగళవారం అమీర్‌పేటలోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్, ఖైరతాబాద్‌లోని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లకు వెళ్లి నిపుణులను కలిశారు. కురవబోయే వర్షాన్ని ఎలా అంచనా వేస్తున్నారు.. కురిసిన వర్షాన్ని ఎలా లెక్కిస్తున్నారు.. అనే విషయాల గురించి తెలుసుకున్నారు. నగర వ్యాప్తంగా ఉన్న 154 ఆటోమేటెడ్ వెదర్ స్టేషన్స్ పని తీరును కూడా ఆయన పరిశీలించారు.

ఈ నిర్మాత.. సైబర్ మోసగాడు

- బిర్లా సంస్థకు రూ.40 కోట్ల మేర టోకరా
- అక్రమ సంపాదనతోనే రాజంపేట లోక్‌సభ స్థానంలో పోటీ
- కస్టడీ అనంతరం జైలుకు తరలించిన పోలీసులు



నిందితుడు షేక్ బషీద్ (బాబు)

బంజారాహిల్స్: ఆయన సినీనిర్మాత.. సైబర్ మోసానికి పాల్పడి రూ.40 కోట్లు కొల్లగొట్టిన ఘనుడు.. ఎట్టకేలకు పోలీసులు చిక్కి జైలుపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్– 10సీలో నివసించే షేక్ బషీద్ అలియాస్ బషీర్ అలియాస్ బాబు (39) ఎస్‌బీకే ఫిలిమ్స్ బ్యానర్‌పై 'అల్లరే అల్లరి', 'మెంటల్', 'సత్యమేవ జయతే', 'నోటుకు పోటు'తదితర సినిమాలను నిర్మించారు. 'ఎవడ్రా హీరో'అనే సినిమాలో హీరోగా కూడా నటించాడు. అయితే, సినిమాలను నిర్మించడానికి, రాజకీయాల్లో పోటీ చేయడానికి అవసరమైన డబ్బు కోసం అడ్డదారులు ఎంచుకున్నాడు. ఇందులో భాగంగానే ఏకంగా ఆదిత్యా బిర్లా సంస్థకే ఎసరు పెట్టాడు. శంషాబాద్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజర్ రామస్వామి, అసిస్టెంట్ మేనేజర్ రాజేష్‌లతో కుమ్మక్కయ్యాడు. జూలై 12న ఫాల్కన్ సాఫ్ట్‌వేర్‌ను ఉప యోగించి ఆదిత్యబిర్లా సంస్థ నుంచి రూ.40 కోట్లను తన వద్ద పనిచేసే ఉదయ్‌కుమార్‌రెడ్డి ఖాతాలోకి మళ్లించాడు.

చీటింగ్ కేసు...

ఆ తర్వాత మూడు రోజులకు జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో ఎన్ఆర్ఐ మహిళకు చెందిన ఓ ఇంటిని కొనుగోలు చేసి రూ.10 కోట్లను ఆమె బ్యాంకు ఖాతాలోకి మళ్లించాడు. అయితే టీడీఎస్ చలానా కట్టాలంటూ వాటిల్లోంచి రూ.1.21 కోట్లను తిరిగి తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఆ కొద్దిసేపటికే ఆమె అకౌంట్ ఫ్రీజ్ అయింది. ఆమె ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బషీద్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. అయితే తనకు తెలియకుండా తన ఖాతాలోకి రూ.40 కోట్లు సైబర్ మోసం చేసి మళ్లించిన బషీద్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఉదయ్‌కుమార్‌రెడ్డి సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసులో బషీద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు విచారణ కోసం సోమ, మంగళవారాలు అతడిని కస్టడీకి తీసుకున్నారు. సైబర్ మోసం ద్వారా సంపాదించిన రూ.10 కోట్లతో జూబ్లీహిల్స్‌లోనే మరో ఇల్లు కూడా కొన్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రాజంపేట స్థానానికి పోటీ చేసి ఓడిపోయినట్లుగా కూడా దర్యాప్తులో తేలింది.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా సేకరించిన వ్యక్తి అరెస్టు

శంషాబాద్ రూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్‌పట్టణానికి చెందిన రెహాన్ బాబా గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరిస్తుంటాడు. మంగళవారం పలు గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి బియ్యం బస్తాలను ఓ చోట పెట్టాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. 800 కిలోల రేషన్ బియ్యంతో ఉన్న 16 సంచులను గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అపార్ట్‌మెంటు పైనుంచి పడి వాచ్‌మన్ మృతి

చైతన్యపురి: అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు పైనుంచి పడి ఓ వాచ్‌మన్ మృతి చెందాడు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు... కర్ణాటక రాష్ట్రానికి చెందిన భీమశంకర్ అలియాస్ భీమేష్(39) బతుకుతెరువు కోసం నగరానికి వచ్చాడు. సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలోని శ్రీబాలాజీ నివాస్ అపార్ట్‌మెంటులో మూడేళ్లుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంటు యాజమాన్యం వినాయక మండపానికి సంబంధించిన సామగ్రి తీసుకురావాలంటూ అతడిని మూడో అంతస్తుకు పంపించారు. ఈ క్రమంలో భీమశంకర్ ప్రమాదవశాత్తు జారి మొదటి అంతస్తుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి చూడగా, అప్పటికే అతడు మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'మధుకాన్'పై సీబీఐ చార్జిషీట్

సిటీ కోర్టులు: మనీ లాండరింగ్ కేసులో మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుకు సంబంధించిన కంపెనీ మధుకాన్ ప్రాజెక్టులపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. మంగళవారం మనీ లాండరింగ్ కేసులో భాగంగా రాంచీ ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ మధుకాన్ ప్రాజెక్టులపై సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. మధుకాన్ ప్రాజెక్టుల కేసులో ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు మేరకు న్యాయస్థానం పీఎంఎల్ఏ యాక్ట్ 2002 ప్రకారం విచారణ చేపట్టింది. రాంచీ ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్, దాని డైరెక్టర్లపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. అయితే రాంచీ –రార్‌గావ్–జమ్‌షెడ్‌పూర్ సెక్షన్‌లో ఎన్‌హెచ్–33 సంబంధించిన 4 లేనింగ్ ప్రాజెక్టుపై మధుకాన్ కంపెనీ బ్యాంక్ నుంచి పూర్తి రుణం తీసుకున్నా ప్రాజెక్టును మాత్రం పూర్తి చేయలేకపోయింది. ఆ తర్వాత కంపెనీ కాంట్రాక్ట్ రద్దు అయింది. అనంతరం జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల ఆధారంగా సీబీఐ కేసు నమోదు చేసింది. కెనరా బ్యాంక్ నుంచి మధుకాన్ కంపెనీ రూ.1,030 కోట్ల రుణం తీసుకుని ఇతర కంపెనీలకు తరలించినట్లు ఈడీ పేర్కొంది. షెల్ కంపెనీలకు నగదు బదిలీ చేసి మోసానికి పాల్పడినట్లు వివరించింది. రూ.365.78 కోట్లను కూడా దారి మళ్లించినట్లు గుర్తించామని ఈడీ తెలిపింది. గతంలో మధుకాన్ కంపెనీలపై ఈడీ సోదాలు నిర్వహించి రూ.34 లక్షల నగదుతోపాటు 105 ఆస్తులను అటాచ్ చేసినట్లు పేర్కొంది. అయితే మధుకాన్ కంపెనీకి సంబంధించి మరో రూ.96.21 కోట్లపై దర్యాప్తు చేపట్టామని, తదుపరి విచారణలోపు వివరాలు ఇస్తామని తెలిపింది.

నాలాల పూడికలపై ప్రత్యేక దృష్టి

కల్వర్టుల వద్ద చెత్తను తొలగించాలి: కమిషనర్ ఆమ్రపాలి

లక్డీకాపూల్: గ్రేటర్‌లో వర్షంలేని సమయాల్లో నాలాలు, కల్వర్టుల వద్ద చెత్తను తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కల్వర్టుల వద్ద వర్షపునీరు నిల్వకుండా, లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. నాలాలను శుభ్రపర్చే పనులను ఫొటోగ్రఫీతోసహా పంపించాలన్నారు. వరద ముంపునకు గురై కనీసం రెండు గంటలపాటు నీరు నిలిచిన కాలనీలను గుర్తించి, అక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు తీసుకోవాలని హెల్త్ అడిషనల్ కమిషనర్‌కు సూచించారు. ఈ క్రమంలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల వైద్య అధికారులను సంప్రదించి ఆయా కాలనీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఎక్కువ దెబ్బతిన్న చోట్ల హెచ్చరిక బోర్డులు గానీ, బారికేడ్లుగానీ ఏర్పాటు చేయాలన్నారు.

బ్లాస్టింగ్‌లపై హైకోర్టు సుమోటో విచారణ

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ న్యాయవిహార్ సమీపంలో నిరంతరం బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయని, జడ్జీల గృహాలతో పాటు సమీపంలోని ఇతర ఇళ్లు దెబ్బ తింటున్నాయని పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా స్వీకరించింది. ఆ కథనం ఆధారంగా ప్రధాన న్యాయమూర్తికి.. న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక లేఖ రాశారు. రోజుకు పది బ్లాస్టింగ్‌లు జరుతున్నాయని, ఈ అంశంపై సుమోటోగా విచారణ చేపట్టాలని కోరారు. జడ్జి విజ్ఞప్తిని సమ్మతించిన సీజే విచారణకు స్వీకరిస్తూ..నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. త్వరలో పిల్ విచారణకు రానుంది.

ప్రభుత్వభూమిని ప్రైవేటుగా మార్చిన అధికారులపై కేసు

కుషాయిగూడ: ప్రభుత్వ భూమిని తప్పుడు ధ్రువపత్రాలతో ప్రైవేటు భూమిగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో కాప్రా పూర్వ తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌తోపాటు మరో ముగ్గురు ఉద్యోగులపై కేసు నమోదైంది. గత జూలైలో వారిని అరెస్టు చేయాలంటూ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో విచారణ జరిపిన కుషాయిగూడ పోలీసులు కాప్రా పూర్వపు తహసీల్దార్ ఎస్తేర్ అనిత, పూర్వపు సబ్‌రిజిస్ట్రార్ రాజశేఖర్‌రెడ్డి, సర్వేయర్ శ్రీష్మా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శాలిని, పానుగుబాటి విశ్వనాథ్‌లపై కేసు నమోదు చేశారు. కేసు వివరాలను హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ వెల్లడించారు. కాప్రా మండలం సర్వే నెంబరు 199లోని ప్రభుత్వస్థలాన్ని సర్వే నెంబరు 177లో పట్టాభూమిగా చూపిస్తూ ఆక్రమణదారులతో అధికారులు కలిసి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. దీనిపై సామాజిక కార్యకర్త చప్పిడి కృష్ణారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేశారు. నేరం రుజువు కావడంతో గత జూలై-24న హైకోర్టు సదరు అధికారులను అరెస్టు చేయాలని కుషాయిగూడ పోలీసులను ఆదేశించింది.

రూ. 14 లక్షల నగదు చోరీ

కుత్బుల్లాపూర్: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి రూ.14 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కుత్బుల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉండే స్టీల్ వ్యాపారి హన్మంతు రెండు రోజులు క్రితం బెంగళూరుకు పని నిమిత్తం కుటుంబంతోసహా వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన రూ.14 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా స్టీల్ దుకాణంలో పనిచేసే వ్యక్తే చోరీ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అనుమానితులపై నిఘా పెట్టినట్లు సమాచారం..

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి


నాగార్జున సర్కిల్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: ప్రధాన కూడళ్ళు, జంక్షన్ల వద్ద సుందరీకరణ పనులు వేగవంతంగా చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం ఆయన పంజగుట్ట, నాగార్జున సర్కిళ్ళలో జరుగుతున్న సుందరీకరణ పనులను సర్కిల్-17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కూడలికి నలువైపులా ఏర్పాటు చేయబోయే నమూనాలను గురించి తెలుసుకున్నారు. రోడ్డు దాటే వారికి, వాహనాలు మలుపు తీసుకునే సమయంలో నమూనాలు తగలకుండా ఏర్పాటు చేయడంతోపాటు, అందరికీ కనిపించే విధంగా సుందరంగా ఉండే నమూనాలను మాత్రమే ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆ నమూనాలతో జంక్షన్‌కే వన్నె వచ్చేలా ఉండాలని సూచించారు. అదే విధంగా ఫుట్‌పాత్ సుందరీకరణ పనులను సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఇందిర, డీఈ చైతన్య, ఏఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 ప్రారంభం


చీరలను తిలకిస్తున్న శైలజారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024ను నగర సోషలైట్ వై.శైలజారెడ్డి ప్రారంభించారు. చేనేత కళాకారులను ప్రోత్సహించి వారి వస్త్రాలను ధరించాలని కోరారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 11 వరకూ కొనసాగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పచ్చదనంతో కొత్తదనం

బంజారాహిల్స్: గడిచిన కొద్ది నెలలుగా పంజగుట్ట, జూబ్లీహిల్స్, ఎర్రమంజిల్, ఖైరతాబాద్ మెట్రో మార్గాల్లోని మెట్రో సెంట్రల్ మీడియన్లలో మొక్కలు ఎండిపోయి ఆయా ప్రాంతాలు అందవిహీనంగా కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో కొత్త మొక్కలను ఏర్పాటు చేయగా పచ్చదనంతో కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే పంజగుట్ట, ఎర్రమంజిల్ కారిడార్‌లో మెట్రో సిబ్బంది మొక్కలు నాటగా, మంగళవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం.36 మెట్రో కారిడార్‌లో మొక్కలు నాటారు. ఒకే రకమైన మొక్కలు కాకుండా ఒక్కో చోట ఒక్కో రకమైన మొక్కలను నాటుతున్నారు.


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 మెట్రో సెంట్రల్ మీడియన్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు


విద్యార్థులకు అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎన్.సురేష్‌రెడ్డి

బంజారాహిల్స్: గోల్కొండ హోటల్స్‌అండ్ రిసార్ట్స్ ఎండీ ఎన్.సురేష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య ఘనంగా జరిగింది. విద్యార్థులతో కలిసి ఆయన కేక్‌కట్ చేసిన అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తన పుట్టినరోజును ఇలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, పుట్టినరోజు కానుకగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు.

ఇటు బురద.. అటు మురుగు పరుగు..!

పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

బంజారాహిల్స్: వరుసగా కురిసిన వర్షాల కారణంగా ఇప్పుడు ఈ రోడ్డును చూసినా మురుగు, బురద దర్శనమిస్తున్నాయి. చాలా భవనాల సెల్లార్లలో ఊరుతున్న నీటితో పాటు సెల్లార్ నిర్మాణాల్లో పేరుకుపోయిన బురదను నిర్మాణదారులు నేరుగా మ్యాన్‌హోళ్ళు, వరద నీటి కాల్వల్లోకి పంపింగ్ చేస్తుండటంతో అవి ఓవర్ ఫ్లోకావడంతో రోడ్డుపై పారుతున్నాయి. ఫిలించాంబర్ వద్ద గడిచిన రెండు రోజులుగా పెద్ద ఎత్తున మ్యాన్‌హోళ్ళ నుంచి బురద బయటికి వస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మరో వైపు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5 చౌరస్తాలో పెద్ద ఎత్తున మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగు నీరు కింద ఉన్న కృష్ణానగర్ ప్రధాన రోడ్డు వరకు పారుతున్నాయి. దీంతో ఈ రోడ్డుగుండా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.


ఫిలించాంబర్ వద్ద మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న బురద


జూబ్లీహిల్స్‌రోడ్ నెం. 5 చౌరస్తాలో పారుతున్న మురుగు

ఎమ్మెల్యేకు వినతి


మాగంటి గోపీనాథ్‌తో జేసీఎఫ్ ప్రతినిధులు

రహమత్‌నగర్: బోరబండ సైట్-3 శ్మశాన వాటిక (బరియల్ గ్రౌండ్)ను అభివృద్ధి చేయాలని జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం ప్రతినిధులు మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు డా.కె.విద్యాసాగర్‌పాల్ మాట్లాడుతూ సైట్-3 బరియల్ గ్రౌండ్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నింటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బరియల్ గ్రౌండ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేసీఎఫ్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ ఎస్. యేసు రాజు, ఎస్. విజయ్ కుమార్, ఎం. రాకేష్ క్రిష్టాఫర్, ఆనంద్, డెవిడ్, విలీయం తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో పోలీసు ఉన్నతాధికారుల పర్యటన

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో మట్టితో రూపుదిద్దుకుంటున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల ఏర్పాట్లను మంగళవారం లా అండ్ ఆర్డర్ అడిషినల్ సీపీ విక్రంసింగ్‌మాన్, ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్‌లు ఖైరతాబాద్ మహాగణపతి మంటప ప్రాంతాల్లో పర్యటించారు. భక్తులు తరలివచ్చే ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ హడ్ హక్ కమిటీ సభ్యులు స్థానికులకు రెసిడెన్సీ పాస్‌లు, కార్లకు పాస్‌ల తోపాటు శాశ్వత బారికేడ్లు ఏర్పాటు చేయకుండా స్థానికంగా నివాసముంటున్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు వీలుగా బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకా ఎదురయ్యే సమస్యలపై కమిటీ నిర్వాహకులతో చర్చించారు. సీపీ ఆదేశాల మేరకు మహాగణపతి వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించామని తెలిపారు. అధికారుల వెంట ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఉత్సవ కమిటీ, హడ్ హక్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, మహేష్ యాదవ్, కృష్ణయాదవ్, బాక్సర్ అశోక్, రాంరెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, ప్రవీణ్, పృద్వీరాజ్ తదితరులు ఉన్నారు.

మురుగుకు చోటు.. దోమ కాటు..!

- వరదల కారణంగా దోమల వృద్ధి
- నివారణ చర్యలకు తీవ్ర అడ్డంకి
- ఫాగింగ్‌ను సైతం చేపట్టలేని పరిస్థితి
- ఆసుపత్రుల బాటపడుతున్న రోగులు
- లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


బస్తీల్లో ఫాగింగ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ ఎంటమాలజిస్ట్ సిబ్బంది


పనులను పర్యవేక్షిస్తున్న ఖైరతాబాద్ సర్కిల్-17 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: కొద్ది రోజులనుంచి ఎడతెరిపి లేని వానలతో వరదనీరు పొంగుతూ లోతట్టు ప్రాంతాలను మురుగుమయం చేసింది. దీంతో వరద వల్ల పేరుకపోయిన బురద, కొట్టుకువచ్చిన వ్యర్థాలతో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఫాగింగ్ చేయడానికి పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడంతో సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో దోమల బెడద తీవ్రరూపం దాల్చింది. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18, యూసుఫ్‌గూడ సర్కిల్-19 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ప్రజలను దోమల స్వైరవిహారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల నుంచి దోమల నివారణ తీసుకుంటున్న చర్యలకు వర్షం అడ్డంకిగా మారింది. దీంతో యాంటీ లార్వాను నివారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు దోమల నివారణకు రోజూ చేసే ఫాగింగ్ కూడా కుదరడం లేదు. వారం రోజుల క్రితం అన్ని చోట్ల ఫాగింగ్ చేపట్టినా ఆ తర్వాత ఎడతెరిపి లేని వర్షం తీవ్ర అడ్డంకులను సృష్టించింది. దీంతో పలు కాలనీలు, బస్తీల్లో ప్రజలు దోమకాటు వల్ల వివిధ వ్యాధులు ప్రబలి రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బారులు తీరుతున్నారు. మంగళవారం వర్షం కొద్దిగా తెరిపి నివ్వడంతో సాయంత్రం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజిస్ట్ సిబ్బంది లోతట్టు ప్రాంతాల బస్తీల్లో ఫాగింగ్ చేపట్టారు. అయితే వారం రోజులుగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో దీని ప్రభావం ప్రజలపై చూపనుంది.

వెంకటస్వామికి సత్కారం


వెంకటస్వామిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సొంత డివిజన్‌కు వచ్చిన వెంకటస్వామిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేతృత్వంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, అరుణ్‌గౌడ్, యాదగిరి తదితరులు స్వామిని సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి మంచి గుర్తింపు లభిస్తుందనటానికి తన నియామకమే నిదర్శనమన్నారు.

పబ్ పార్కింగ్‌లో బైక్ చోరీ

బంజారాహిల్స్: పబ్‌లో పని చేస్తున్న వ్యాలెట్ డ్రైవర్ పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కుత్బుల్లాపూర్‌లో నివసించే జె. ఆనంద్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని బేబీలాన్ పబ్‌లో వ్యాలెట్ కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి వచ్చి తన బుల్లెట్ బైక్‌ను పబ్ పార్కింగ్‌లో ఉంచి లోనికి వెళ్ళాడు. తెల్లవారుజామున పార్కింగ్ వద్దకు వచ్చి చూడగా బైక్ కనిపించ లేదు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం


బుదియమ్మ

పంజగుట్ట: వృద్ధురాలు కనిపించకుండాపోయిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా, జాహిరా సంఘం మండలం, కప్పాడు గ్రామానికి చెందిన బ్యాగారి బుదియమ్మ (72) గత నెల 26వ తేదీన అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే కొడుకు దౌలప్ప ఇంటికి వచ్చింది. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల గ్రామంలో వెతికినా ఫలితం లేకపోవడంతో కొడుకు దౌలప్ప పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712571535 నెంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై వెంకట కిషన్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

వెంగళరావునగర్: కాలేజీకి వెళ్ళిన వివాహిత అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హనుమకొండ జిల్లాకు చెందిన ఎస్.మణికృష్ణ నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతనికి మామ కుమార్తెతో వివాహమైంది. ఆమె నాంపల్లిలోని ఒక కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగా వీరు గత నెల కిందట రహమత్‌నగర్‌కు వచ్చి భార్యాభర్తలు నివాసం ఉంటున్నారు. ఈనెల 2వ తేదీన ఉదయం మణికృష్ణ డ్యూటీకి వెళ్ళగా, 9 గంటలకు ఆమె కాలేజీకి వెళ్ళింది. కాగా మణికృష్ణ సాయంత్రం 4 గంటలకు తన భార్యకు వాట్సాప్ మెసేజ్ పంపాడు. అయితే ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. కొంత సేపటి తర్వాత ఆమెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె కోసం మణికృష్ణ చుట్టుపక్కల, బంధువులు ఇళ్ళల్లో గాలించినా ప్రయోజనం లేదు. దీంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిరస్త్రాణంతో ప్రాణాలు నిలుస్తాయి


హెల్మెట్లు అందజేస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్: ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు శిరస్త్రాణం ధరించడం వల్ల ప్రాణాలు నిలుస్తాయని ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో రైడ్ టూ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ట్రాక్స్ ఎన్జీవో, గ్లోబల్ గ్రామర్ స్కూల్ సంయుక్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం బాధ్యత లేకుండా ప్రవర్తించడం రెండూ ఒకటేనని ఖచ్చితంగా ప్రతీ ఒక్కరు రోడ్డు నియమాలు పాటించాల్సిందేనని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఇలా విద్యార్థులను స్కూల్ వద్ద దింపే తల్లిదండ్రులతోపాటు వారి పిల్లలకు కూడా హెల్మెట్లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, స్టార్స్ కో-ఆర్డినేటర్ షేక్ అక్రం, గ్లోబల్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ కట్టా సునీల్, ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్లాబు పనులు ప్రారంభం


కమ్యూనిటీహాల్ స్లాబు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజెఆర్‌నగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను మంగళవారం కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. రూ. 35లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన పనులను స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్‌కె షరీఫ్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముస్తఫా, సుధాకర్‌లతో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలబడదాం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: వరద బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో బీజేపీ శ్రేణులు ముందుండాలని ఆ పార్టీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు అండగా నిలబడాలని నేతలకు ఆయన సూచించారు. గత మూడేళ్లుగా ప్రధాన మంత్రి సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదుపై దృష్టిసారించాలని సూచించారు.

అత్యధికంగా బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయించండి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ఫిలింనగర్: 'సర్వవ్యాప్తి సర్వస్పర్శి' నినాదంతో అత్యధిక స్థాయిలో బీజేపీ సభ్యత్వాలను నమోదు చేయించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడిగారి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామిలు కోరారు. బీజేపీ సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమం-2024 జూబ్లీహిల్స్ డివిజన్ సాగర్ సొసైటీలో మంగళవారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భోజిరెడ్డి, వెంకటస్వామిలు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు దండుగుల శ్రీనివాస్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, గణేష్‌యాదవ్, సీతల అనిల్‌కుమార్, గురుబ్రహ్మ, బోయ రామాంజనేయులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే మంచి ఫలితాలు


నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో సీఎన్ రెడ్డి

అక్క మహంకాళి కురుమ మహిళా సంఘం ఎన్నిక

రహమత్‌నగర్: ఐకమత్యంతో ముందుకెళితే ఏ రంగాల్లోనైనా మంచి ఫలితాలు వస్తాయని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం అక్క మహంకాళి కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.అన్నపూర్ణ, ఉపాధ్యక్షులుగా కె.అనిత, ఎస్. శ్రావణి, ప్రధాన కార్యదర్శిగా జె.రజిత, జాయింట్ సెక్రటరీగా ఏ.సరిత, ఆర్గనైజింగ్ సెక్రటరిగా కె.రాధ, కోశాధికారిగా ఎం.అంజలిలు ఎన్నికైయ్యారు. వీరంత రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు సంఘంగా ఏర్పడి ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. కురు మ మహిళా సంఘానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికై న మహిళా ప్రతినిధులను ఆయన సన్మానించారు.

నిమజ్జన యాత్ర మార్గాలను పరిశీలించిన ఏసీపీ


శ్రీరాంనగర్‌లో పర్యటిస్తున్న ఏసీపీ వెంకటరమణ

రహమత్‌నగర్ (బోరబండ): గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీ వెంకటరమణ సూచించారు. మంగళవారం గణేష్ నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలను ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, జీహెచ్‌ఎంసీ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాంనగర్, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో వారు పర్యటించి అక్కడ పరిస్థితులను సమీక్షించారు. అనంతరం వెంకటరమణ నిమజ్జన యాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూబ్లీహిల్స్ నియోజకవర్గం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తంగలపెల్లి లక్ష్మణ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్, సెక్టార్ ఎస్ఐలు, జీహెచ్‌ఎంసీ వివిధ శాఖలను చెందిన అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్స్ పరిశీలనను పర్యవేక్షిస్తున్న లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఐసెట్ (ఎంసీఏ, ఎంబీఏ) సర్టిఫికెట్ పరిశీలన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ దీనిని ప్రారంభించి పర్యవేక్షణ జరిపారు. ఈ నెల 9 వరకు సర్టిఫికెట్స్ పరిశీలన కొనసాగుతుందని, స్లాట్‌బుక్ చేసుకున్న వారికి ప్రతిరోజూ 400 మంది విద్యార్థులకు వెరిఫికేషన్ చేస్తున్నామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ సమర్పించాలన్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, బొనఫైడ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నవనీత, వెంకటరమణ, బాలకృష్ణ, ఎల్లమంద తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (గెస్ట్ ఫ్యాకల్టీ) అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టులలో పీజీలో 55 శాతం ఉత్తీర్ణతతో పాసై ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని జాతీయ అర్హత పరీక్ష (నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష (సెట్), పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంగ్లిష్ బీబీఏ, డేటాసైన్స్, స్టాటిస్టిక్స్, మైక్రో బయోలజీ, బయో టెక్నాలజీ, కంప్యూటర్స్ అప్లికేషన్స్‌ల్లో ఖాళీలు ఉన్నాయని అర్హత గల అభ్యర్థులు ఈనెల 5లోపు తమ దరఖాస్తులను కాలేజీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 11గంటలకు కాలేజీలో జరిగే ఇంటర్వ్యూ అన్ని ధృవపత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

కొట్లాటను ఆపినందుకు చితకబాదారు

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్: మద్యం మత్తులో ముగ్గురు యువకులు కొట్లాటపడుతుండగా ఆపడానికి వెళ్ళిన యువకుడిపై తీవ్రంగా దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్ రోడ్ నెం.7 ఫైర్ స్టేషన్ సమీపంలో నివసించే టి. అజయ్‌కుమార్ సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని జూబ్లీ వైన్స్ సిట్టింగ్‌లో మద్యం సేవిస్తున్నాడు. అక్కడే ఉన్న రాజ్‌కుమార్ అలియాస్ మైఖేల్‌తో పరిచయం ఉండటంతో అతడితో మాట్లాడుతుండగా సమీపంలో ముగ్గురు యువకులు కొట్లాటపడుతున్నారు. దీంతో అజయ్‌కుమార్ వారిని ఆపేందుకు ప్రయత్నించాడు. అక్కడి నుంచి బయటికి వెళ్ళిన ఆ ముగ్గురు బయటికి వచ్చిన రాజ్‌కుమార్‌ను అడ్డుకొని మేం కొట్లాడుకుంటుంటే మధ్యలో నువ్వెందుకు వచ్చావని చితకబాదారు. ఈ ఘటనలో అజయ్ కన్ను పూర్తిగా దెబ్బతినగా, ముఖంపై గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డాబూ దర్పం చూపించి...

విలువైన ఆభరణాలతో ఉడాయించాడు

బంజారాహిల్స్: ఖరీదైన ఫ్లాట్‌లో ఉంటున్నానని నమ్మించడమే కాకుండా డాబూ దర్పం చూపించి రూ. 30 లక్షల విలువ చేసే ఆభరణాలతో ఓ వ్యక్తి ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని తిబారుమల్ జ్యువెలర్స్ యజమాని సందీప్ అగర్వాల్‌కు సుమన్ గుంటి అనే వ్యక్తి ఫోన్ చేసి తనకు మూ డు డిజైన్ల ఆభరణాలు కావాలని చెప్పాడు. వాట్సాప్‌లో మోడల్స్ పంపించాలని కూడా అడిగాడు. దీంతో సందీప్ అగర్వాల్ సుమన్ గుంటి కోరిన మేరకు నార్సింగిలోని రాజ్‌పుష్ప ఎటర్నియా అపార్ట్‌మెంట్స్‌కు మూడు బంగారు ఆభరణాలను పంపించాడు. అయితే ఇందుకు సంబంధించి సుమన్ రూ. 16.75 లక్షలు రూ. 12.60 లక్షలకు రెండు చెక్కులు ఇచ్చాడు. వీటిని డిపాజిట్ చేస్తానని చెప్పగా బ్యాలెన్స్ లేదని త్వరలోనే డబ్బులు ఇస్తానని నమ్మించాడు. ఇటీవల సుమన్ గుంటిని కలిసేందుకు రాజ్‌పుష్ప ఎటర్నియాకు వెళ్ళగా ఆ ఫ్లాట్ ఖాళీ చేసినట్లు తెలిసింది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- శ్రీత్యాగరాయ గానసభ నివారణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12.30గంటలకు కళాసుబ్బారావు కళావేదికపై ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్‌కు పురస్కారం ప్రదానం చేస్తారు.
- స్వదేశ్ జాగరణ్ మంచ్, స్వవలంబి భారత్ అభియాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలోని ది ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారు.
- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభలో పౌర సన్మానం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ర్యాలీగా బయలుదేరతారు.
- సైదాబాద్ డివిజన్ రెవెన్యూ బోర్డ్ కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌లో సాంప్రదాయ వైద్యంలో ఔషధాల అభివృద్ధిపై జాతీయ సెమినార్ జరుగుతుంది.
- శ్రీకళానికేతన్ 60 వసంతాల వజ్రోత్సవంలో భాగంగా ప్రసిద్ధ నాటక సినీరచయిత మాడభూషి దివాకర్ బాబుకు రవీంద్రభారతిలో సాయంత్రం 4 గంటలకు రంగస్థల పురస్కారం ప్రదానం, సాధుశ్యాంప్రసాద్ కల్చరల్ గోల్డ్‌మెడల్ బహుకరణ ఉంటుంది.
- విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా సాయంత్రం 6.30గంటలకు మాడభూషి దివాకర్ రచించిన 'వన్ ప్లస్ వన్' నాటిక ప్రదర్శన జరుగుతుంది. రాత్రి 7.30గంటలకు కల్చరల్ అవార్డు బహుకరణ ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నల్లానీటి 'నాణ్యత'పై నజర్!

- దినసరి 11,500పైగా తాగునీటి శాంపిల్ సేకరణ
- మూడంచెల్లో తాగునీటి క్లోరినేషన్ ప్రక్రియ
- బస్తీల్లో క్లోరిన్ బిళ్లల సరఫరా
- ఇప్పటికే 8.80 లక్షలపైనే పంపిణీ
- క్షేత్రస్థాయిలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పర్యటన
- వర్షాల నేపథ్యంలో కలుషిత నీటి నివారణ చర్యలు

కలుషిత నీటి సరఫరాకు కట్టడి



బస్తీలో నీటి శాంపిల్ పరీక్ష నిర్వహిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

కరపత్రం



సాక్షి, సిటీబ్యూరో: వరుస వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. కలుషిత నీటి కట్టడికి చర్యలు చేపట్టింది. ప్రధాన జలాశయాల నుంచి నీటి సేకరణ, తరలింపు, ట్యాంకుల్లో నిల్వ, శుద్ధి ప్రక్రియ, క్లోరినేషన్, పంపింగ్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ల తీరును క్షుణంగా పరిశీలిస్తోంది. జలమండలి క్యూఏటీ, వాటర్ లైన్‌మెన్స్, థర్డ్‌పార్టీ, ఐపీఎం సిబ్బంది రంగంలోకి దిగి వేర్వేరుగా నీటి శాంపిల్స్ సేకరిస్తున్నారు. మొత్తం మీద దినసరి సుమారు 11,500 శాంపిల్స్ సేకరించి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరో వైపు సాక్షాత్తు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మూడు రోజులుగా బస్తీల్లో తిరుగుతూ నీటి నాణ్యతను పరిశీలిస్తున్నారు.

తగిన మోతాదులో క్లోరిన్



నగరవాసులకు సరఫరా అయ్యే తాగు నీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జలమండలి జాగ్రత్తలు తీసుకుంటోంది. కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ నదుల నుంచి తరలిస్తున్న జలాలపై మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ చేపడుతోంది. మొదటి విడతగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల(డబ్ల్యూటీపీ) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల(ఎంబీఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ చేపడుతోంది. ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఐఎస్ఓ 10500 – 2012 ప్రకారం శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు జలమండలి అధికారులు వెల్లడిస్తున్నారు.

మహానగర పరిధిలో దినసరి నీటి శాంపిల్స్ సేకరణ

ఏజెన్సీ	శాంపిల్స్ సేకరణ
జలమండలి-క్యూఏటీ	3,400
వాటర్ లైన్‌మెన్లు	7,500
థర్డ్‌పార్టీ	600
ఐపీఎం	50

బస్తీల్లో క్లోరిన్ బిళ్లలు పంపిణీ

బస్తీలు, వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాపై జలమండలి మరింత జాగ్రత్తగా వ్యవహిస్తోంది. ఇళ్లలో నిల్వ చేసుకున్న నీటి నాణ్యత గురించి కూడా ఆరా తీస్తోంది. నిల్వ చేసిన నీటిని శుద్ధి చేసుకోవడానికి ఇంటింటికీ 20 క్లోరిన్ బిళ్లల ప్యాక్‌ను పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు సుమారు 8.80 లక్షల క్లోరిన్ బిళ్లలను పంపిణీ చేసింది. క్లోరిన్ బిళ్లలతో నీటిశుద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేందు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తోంది.

దినసరి 580 ఎంజీడీలపైనే..

కృష్ణా, గోదావరి, సింగూర్, మంజీరా జలాశయాల నుంచి నీటిని సేకరించి, శుద్ధి చేసి జలమండలి దినసరి 560 నుంచి 580 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తోంది. మహానగర పరిధిలో సుమారు 23 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్లు, 50కి పైగా సెక్షన్లు ఉండగా, వాటి పరిధిలో మొత్తం మీద 13.25 లక్షల నీటి నల్లా కనెక్షన్లు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

నేటి నుంచి రెట్టింపు నీటి నమూనా పరీక్షలు

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

తాగునీటి సరఫరాలో కలుషితం కట్టడికి బుధవారం నుంచి రెట్టింపు సంఖ్యలో శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించనున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. నీటి పరీక్షల తర్వాతే సరఫరా చేయాలని, క్లోరిన్ సైతం తగిన మోతాదులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నామని, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మంచి నీటి పైపు నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.

మ్యాప్‌లతో హుస్సేన్‌సాగర్ విస్తీర్ణం తేల్చండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ మెమైర్ (గతంలో నిర్ధారించిన మ్యాప్)ను పరిశీలించి.. అసలు సాగర్ విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ ఎంతో తేల్చాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. 1970 నాటి మ్యాప్‌లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. తమ స్థలం చుట్టూ బ్లూషీట్స్ వేసుకోవడానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, తాము దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని శరణప్పస్వామి సహా మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ స్థలం చుట్టూ షీట్స్ ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. హుస్సేన్ సాగర్ ప్రాంతంలో ఈ స్థలం ఉన్న కారణంగా ఎఫ్‌టీఎల్‌ను తేల్చాలని అధికారులను ఆదేశించారు. తదుపరి విచారణలోగా మెమైర్‌ను తమ ముందు ఉంచాలని స్పష్టం చేస్తూ, విచారణ వాయిదా వేశారు. ఇదిలాఉండగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లోని నిర్మాణాల తొలగింపునకు ఇచ్చిన ఆదేశాలను షోకాజ్ నోటీసులుగా పరిగణించి వివరణ ఇవ్వాలని పిటిషనర్లను సీజే ధర్మాసనం ఆదేశించింది. వారి వాదనలు విన్న తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని తహసీల్దార్‌కు స్పష్టం చేసింది. తహసీల్దార్ నోటీసులను సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశిస్తూ, ఈ పిటిషన్ల విచారణను ముగించింది.

బీసీల ఆమరణ దీక్షపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రాష్ట్రంలో సమగ్ర కులగణనను తక్షణమే చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ నేతలు చేపట్టిన ఆమరణ దీక్షపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనికరించని పరిస్థితి కనిపిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. కాచిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. దీక్ష చేస్తున్నవారి ఆరోగ్యం క్షీణిస్తున్నా లెక్కచేయని దుస్థితి నెలకొందన్నారు. బీసీల కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీల కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిందన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లను అమలు చేయని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. నందగోపాల్, మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, ఉదయ్ పాల్గొన్నారు.

హాట్ స్ప్రింగ్స్ స్మారకం వద్ద డీఐజీ ప్రకాష్‌రెడ్డి

అమరవీరులకు నివాళులర్పించిన టూరిజం ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఉన్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీఐజీ) ఎన్.ప్రకాష్‌రెడ్డి మంగళవారం హాట్ స్ప్రింగ్స్ స్మారకం వద్దకు వెళ్లారు. లడఖ్‌లో ఉన్న ఈ అమరవీరుల స్మారకం వద్దకు తెలంగాణ పోలీసు ప్రతినిధిగా వెళ్లిన ఆయన నివాళులర్పించారు. సముద్ర మట్టానికి 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ ప్రాంతంలో 1959 అక్టోబర్ 21న చైనా బలగాలు దుశ్చర్యకు పాల్పడ్డాయి. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్(ఆర్పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) బలగాలకు చెందిన పది మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాలు, కేంద్ర బలగాలకు చెందిన అధికారులు నిత్యం ఆ ప్రాంతానికి వెళ్లి నివాళులర్పిస్తుంటారు. ఇందులో భాగంగానే ప్రకాష్‌రెడ్డి తెలంగాణ పోలీసు విభాగం తరఫున వెళ్లారు.

ప్రజావాణిలో 611 అర్జీలు



లక్డీకాపూల్: వర్షాల్లో సైతం సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పెద్ద ఎత్తున ప్రజావాణికి తరలివచ్చారు. సంక్షేమ పథకాలు ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు కోరుతూ అత్యధికంగా దరఖాస్తులు అందాయి. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 611 అర్జీలు వచ్చాయి. ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 149, బీసీ వెల్ఫేర్ శాఖకు 123, మైనార్టీ వెల్ఫేర్‌కు 94, విద్యుత్ శాఖకు 57 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ పరమైన సమస్యలపై 54, ఇతర శాఖలకు సంబంధించి 134 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకుని వారికి ప్రభుత్వ పరంగా భరోసా కల్పించారు.

నేడు మేడ్చల్ కలెక్టరేట్‌లో మీడియా వర్క్‌షాప్

– హాజరు కానున్న ఎంపీ ఈటల

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రభుత్వం ద్వారా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో వార్తాలాప్ అనే అంశంతో బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొంటున్నారు. ఇందులో సైబర్ క్రైమ్స్, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు.

రక్తమార్పిడికి.. శిబిరాల పాత్ర కీలకం..



సాక్షి, సిటీబ్యూరో: రక్తమార్పిడికి కావాల్సిన రక్తాన్ని సేకరించడంలో రక్తదాన శిబిరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని మ్యాక్స్ ఆస్పత్రికి చెందిన రక్తమార్పిడి వైద్య నిపుణురాలు డా.సంగీతా పాఠక్ అన్నారు. తలసేమియా–సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) వుప్పల వెంకయ్య మెమోరియల్ బ్లడ్ సెంటర్‌తో కలిసి స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వాహకులను మంగళవారం సన్మానించారు. టీఎస్‌సీఎస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.సంగీతాపాఠక్ రక్తదాన శిబిరాల నిర్వాహకుల సేవల్ని కొనియాడారు. ఈ సందర్భంగా టీఎస్‌సీఎస్ ప్రెసిడెంట్ డా.చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ ఒక్కరి రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందన్నారు. బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ వ్యవస్థాపక సెక్రటరీ జనరల్ అపుర్వాఘోష్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రక్తదానాన్ని ప్రోత్సహించే దాదాపు 110 సంస్థలు పాల్గొన్నాయి.

బీసీల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి పట్టదా..?

బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



గాంధీలో సిద్దేశ్వర్‌ను పరామర్శిస్తున్న జాజుల శ్రీనివాసగౌడ్ తదితరులు

గాంధీఆస్పత్రి: బీసీ నేతల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే సమయం ప్రభుత్వానికి లేదా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన, కామారెడ్డి బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న బత్తుల సిద్దేశ్వర్‌ను ఆయన మంగళవారం పరామర్శించి మద్దతు ప్రకటించారు. ప్రజాసమస్యలపై పోరాడే వారిని గౌరవించి చర్చలకు ఆహ్వానించాల్సింది పోయి ఆమరణ దీక్ష చేపట్టి పది రోజులైనా బీసీ నేతలో మాట్లాడే ధైర్యం ప్రభుత్వ నాయకులకు లేదా అని నిలదీశారు. బీసీల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదని, యావత్తు బీసీలకు తీరని అవమానం అన్నారు. సిద్దేశ్వర్ పరిస్థితి విషమంగా ఉందని, ఆయనకు ఏమైనా అయితే అది ప్రభుత్వ హత్యగా భావిస్తామని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కులగణన రోడ్ మ్యాప్ ప్రకటించాలని, మిగిలిన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చి సిద్దేశ్వర్‌తో దీక్ష విరమింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కేంద్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దానకర్ణచారి, వివిధ బీసీ సంఘ నాయకులు రామరాజు, రవికుమార్, చెన్నయ్య, పురుషోత్తం, రఘురామ్, రాజారామ్, పిడికిలి రాజు, కేవీ గౌడ్, మేకల కృష్ణ, వేణుకుమార్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఉచిత వసతి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ పి.రామకృష్ణ

నల్లకుంట: గ్రామీణ నిరుపేద విద్యార్థులకు శ్రీలక్ష్మీవేంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వసతి కల్పించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పోలాప్రగడ రామకృష్ణ తెలిపారు. నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్టీ సభ్యులతో కలిసి రామకృష్ణ వివరాలు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ఈ వసతి గృహాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో విద్యార్థులకు ఉచిత నివాసం, భోజనం వసతి, ప్రతి హాస్టల్‌లో రెండు ల్యాప్‌టాప్‌లు, ఇంటర్‌నెట్, బస్‌పాస్ తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నామని తెలిపారు. అమీనాపూర్(లింగంపల్లి), సన్‌సిటీ(లంగర్ హౌజ్), సుచిత్ర, నేరేడ్‌మెట్, నారపల్లి తదితర ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. తల్లి లేక తండ్రిని కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత అడ్మిషన్ల కోసం 8వ తేదీ ఉదయం 10గంటల నుంచి నల్లకుంట శంకరమఠం మార్కెట్ సమీపంలోని ఎస్ఎల్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆవరణలో సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్ నం.95504 72190. సమావేశంలో ట్రస్టీ సభ్యులు పోలాప్రగడ శ్రీనివాస్, ప్రసాద్, చిరంజీవి రావు, పీవీకే ప్రసాద్, అరుణ్ కుమార్ సింగ్, ట్రస్టీ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీలో కాంట్రాక్టు బోధనలు

- శాశ్వత బోధనా సిబ్బంది కరువు
- ఇద్దరు ప్రొఫెసర్లతోనే వర్సిటీ నిర్వహణ
- ప్రతి యేటా పెరుగుతున్న ప్రవేశాలు



తెలుగు వర్సిటీ అకాడమిక్ భవన సముదాయం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న రెగ్యులర్ కోర్సులకు శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బంది కరువయ్యారు. వర్సిటీ నిర్వహిస్తున్న కోర్సుల్లో సగానికి పైగా శాఖలలో ఒక్క శాశ్వత బోధనా సిబ్బంది కూడా లేకుండా కేవలం తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగ విరమణ పొందిన బోధనా సిబ్బందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించుకుని విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. అనుభవం ఉన్న బోధనా సిబ్బంది ఉన్నారనే ఆశతో విద్యార్థులు సంప్రదాయ కోర్సులైన సంగీతం, నృత్యం, రంగస్థలం, చిత్రం తదితర శాఖలు అందించే కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఈ కోర్సుల్లో పాఠాలు చెప్పే తాత్కాలిక బోధనా సిబ్బందిని చూసి విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. భాషా ప్రాతిపదికన ఏర్పాటైన తెలుగు వర్సిటీలోని తెలుగు శాఖలోనే అనుభవం ఉన్న బోధనా సిబ్బంది లేకపోవడం శోచనీయం. హైదరాబాద్ ప్రాంగణంలో కేవలం ఇద్దరే ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తుండటం గమనార్హం. ఇటీవలి కాలంలో జ్యోతిషం కోర్సుకు మంచి డిమాండ్ ఉండటం పట్ల విద్యార్థులు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. కానీ ఆ శాఖలో ఒక్కరు కూడా శాశ్వత బోధనా సిబ్బంది లేకపోవడం విచారకరం. ఈ ఏడాది ప్రవేశాల గడువు ఆగస్టు 31 ముగిసేనాటికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరుకున్నట్లు తెలిసింది. ఆయా కోర్సులను నేర్చుకునే ఆసక్తి విద్యార్థులకు ఉన్నప్పటికీ, వారికి బోధించే అనుభవం కలిగిన శాశ్వత బోధనా సిబ్బంది లేకపోవడం నిరాశజనకంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో పూర్తిస్థాయి బోధనా సిబ్బంది లేని కోర్సులు చరిత్ర, పర్యాటకం, జర్నలిజం, తెలుగు, జ్యోతిషం, యోగా, జానపదం తదితర కోర్సులు ఉన్నాయి. మొత్తం 60 మంది బోధనా సిబ్బందికి గాను కేవలం తొమ్మిది మందే పనిచేస్తున్నారు. మిగతా ప్రాంగణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, ఒకరిద్దరితోనే వర్సిటీని నెట్టుకువస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడిచిన పదేళ్లుగా వర్సిటీ పరిస్థితి ఇలాగే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని భాషా ప్రాతిపదిక ఏర్పాటైన వర్సిటీకి శాశ్వత పద్ధతిన సిబ్బందిని నియమించుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

మున్నూరు కాపుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి చిన్నారెడ్డి



కాచిగూడ: రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో మున్నూరుకాపు ప్రతినిధులు ప్రజాభవన్‌లో చిన్నారెడ్డిని, ప్రజాభవన్ ఇన్‌చార్జి ఆఫీసర్ దివ్య ఐఏఎస్‌లను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఉగ్గే శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గంలో మున్నూరు కాపులకు ప్రాతినిధ్యం కల్పించాలని, మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5 వేల కోట్ల నిధులను ప్రతిఏటా అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సామాజికంగా, రాజకీయంగా, అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మున్నూరు కాపులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

విద్యుత్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

- విధుల్లో నిర్లక్ష్యం, అవినీతిని సహించేది లేదు
- సీఎండీ ముషారఫ్ ఫరూఖి

సాక్షి, సిటీబ్యూరో: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతికి పాల్పడటం, విధులకు గైర్హాజరు, పర్యవేక్షణ లోపం వంటి వివిధ కారణాలతో పాటు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో ముగ్గురు విద్యుత్ అధికారులపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నార్సింగి అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఇబ్రహీంబాగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అంబేడ్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. వీరితో పాటు ఇబ్రహీంబాగ్ డివిజనల్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ జ్ఞానేశ్వర్‌రావుకు చార్జ్‌షీట్‌లను జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతికి పాల్పడటం వంటి అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతూ, వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని సీఎండీ ముషారఫ్ ఫరూఖి హెచ్చరించారు.

సీవరేజీ ఓవర్ ఫ్లో నివారణ చర్యలు

- ముందస్తుగానే పూడికతీత పనులు
- వాటర్ లాగింగ్ పాయింట్లపై నిత్యం పర్యవేక్షణ
- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు కట్టడి చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హాఫీజ్‌పేట్‌లోని సాయినగర్, యూత్ కాలనీ, మజీద్‌బండ, ఇజ్జత్‌నగర్ ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. మ్యాన్‌హోళ్లు పొంగితే వెంటనే పూడిక తీయాలని వివరించారు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎక్కువ లోతు ఉన్న మ్యాన్‌హోళ్లపై మూతలు, సేఫ్టీ గ్రిల్స్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని, తాగునీటి పైపు నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా జీఎంలు జాగ్రత్త వహించాలని సూచించారు. పనులు చేస్తున్నప్పుడు కచ్చితంగా సేఫ్టీ ప్రోటోకాల్ పాటించాలని, బారికేడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయండి

నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసం అయినా, తెరిచి ఉంచినట్లు తెలిస్తే జలమండలి కస్టమర్ కేర్ 155313 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ

వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్లు, ఓవర్ ఫ్లో, కలుషిత నీరు తదితర అంశాలను పర్యవేక్షించడానికి ఎండీ అశోక్‌రెడ్డి ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్.ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, ఆపరేషన్ డైరెక్టర్–2 స్వామి, ఆపరేషన్ డైరెక్టర్–1 విజయ రావు ఉన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

సాక్షి, సిటీబ్యూరో: తాగునీరు, మురుగు సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జలమండలి ఎక్సక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. డివిజన్–3 పరిధిలోని విజయ నగర్ కాలనీ సెక్షన్ ఆఫీస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. సెక్షన్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలించిన ఈడీ మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని, రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ, జీఎమ్ సుబ్రహ్మణ్యం డీజీఎం, మేనేజర్లు పాల్గొన్నారు.



1500 మంది ఐటీ ఉద్యోగులకు షాక్

లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు

గచ్చిబౌలి: కొద్ది నెలలుగా ఓ ఐటీ కంపెనీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తోంది. బాధిత ఐటీ ఉద్యోగులు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మైండ్ స్పేస్‌లో ఓ ఐటీ కంపెనీలో 2,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. సింగపూర్, బెంగళూర్, ముంబై తదితర ప్రాంతాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న సదరు కంపెనీ మాదాపూర్‌లోని ఐటీ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు. దీంతో కొందరు బాధితులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అక్కడ ఫిర్యాదు తీసుకోలేదు. దీంతో వారు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. జీతాలు చెల్లించకపోవడం, నోటీసులు లేకుండా విధుల నుంచి తొలగించడం తదితర అంశాలపై కంపెనీకి నోటీసులు ఇస్తామని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. చీటింగ్, ఇతర వ్యవహారాలు ఉంటే పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

చెట్టులెక్కగలరా ఓ నరహరి పుట్టలెక్కగలరా.. చెట్టులెక్కి ఆ చిటారుకొమ్మన చిగురు కోయగలరా.. ఓ నరహరి చిగురు కోయగలరా.. చెట్టులెక్కగలమే ఓ చెంచిత పుట్టలెక్కగలమే.. చెట్టులెక్కి ఆ చిటారుకొమ్మన చిగురు కోయగలమే. ఓ చెంచిత బ్రమలు తీయగలమే.. అని అలనాటి చిత్ర కథానాయకుడు ఏఎన్ఆర్ పాడిన పాట ఎంతో పాపులర్.. ఆ మాదిరిగానే.. నేడు నగరంలో చెట్లు పుట్టలు ఎక్కడం సర్వసాధారణ ట్రెండ్‌గా మారుతోంది.. అయితే గుట్టలు, పుట్టలు, చెట్లు ఎక్కడం పల్లెల్లో సర్వసాధారణం..కానీ నగరంలో నాల్గు మెట్లు ఎక్కడానికి కూడా ఇబ్బంది పడడం ఇక్కడి ప్రజల నైజం. అయితే కొందరు నగరవాసులు మాత్రం గోడలు, గుట్టలు కూడా చకచకా ఎక్కేస్తున్నారు. ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ఇచ్చే సరదా క్రీడగా క్లైంబింగ్ హాబీ దినదిన ప్రవర్ధమానమవుతోంది. -సాక్షి, సిటీబ్యూరో

ఇప్పుడే ఏమీ చెప్పలేను



- నగరంలో తళుక్కుమన్న ప్రముఖ సినీతార మిల్కీ బ్యూటీ..
- మరి కొద్ది రోజుల్లో ఓదెల -2తో ప్రేక్షకుల ముందుకు

సాక్షి, సిటీబ్యూరో: మిల్కీ బ్యూటీ, ప్రముఖ సినీతార తమన్నా భాటియా మంగళవారం నగరంలో తళుక్కున మెరిశారు. నగరంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి హాజరై తమన్నా ఈ సందర్భంగా మాట్లాడారు.. చాలా రోజుల తరువాత హైదరాబాద్ వచ్చాను, చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. మరి కొద్ది రోజుల్లో ఓదెల -2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నానని, ఆ సినిమాకు సంబంధించిన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఇక సినిమాకు సంబంధించి చిన్న పార్ట్ మాత్రమే పెండింగ్ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎప్పటి నుంచో తన పెళ్లి విషయమై ఊరిస్తున్న తమన్నా, ఈ సారి కూడా పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్నకు..., 'పెళ్లి ఎప్పుడు అనేది ఇప్పుడే ఏం చెప్పలేనని' దాటవేశారు. అయితే ఈ సందర్భంగా తమన్నా ప్రత్యేకంగా డిజైనింగ్ చేయించుకుని ధరించిన నీలి రంగు డ్రెస్ విశేషంగా ఆకట్టుకుంది.



- గోడల నుంచీ కొండగుట్టల దాకా ఎక్కే సెయ్
- నగరంలో వేగంగా విస్తరిస్తున్న క్లైంబింగ్ ట్రెండ్
- అధిరోహణ.. ఆరోగ్యాన్నిచ్చే అభిరుచిగా..
- వారాంతాల్లో రాక్ ఈవెంట్స్ షురూ


సూచనలు

* క్లైంబింగ్ చేయడానికి తగినంత శారీరక సామర్థ్యం ఉండాలి.
* స్పోర్ట్స్ డ్రెస్సింగ్ కావాలి. అలాగే ప్రత్యేకమైన మాస్ తప్పనిసరి.
* ఇందులో ఒకరికొకరు మంచి సపోర్టింగ్‌గా ఉండాలి. ఎక్కే సమయంలో పడిపోవడం వంటివి ఉంటాయి అలాంటి సందర్భాల్లో ఒకరికొకరు సాయం చేసుకోవాలి.
* అవుట్‌డోర్‌లో ప్రాథమిక దశలో చేసినప్పటికీ... రెగ్యులర్ క్లైంబర్‌గా మారాలంటే ఇన్‌డోర్ ట్రైనింగ్ తీసుకోవడం అవసరం.

హైదరాబాద్ వైబ్స్

కిరాక్ క్లైంబింగ్

సవాళ్లకు సిద్ధం అంటున్న యువత



ఫన్ ప్లస్ ఫిట్‌నెస్..

లీడ్, స్పీడ్ క్లైంబింగ్‌లు ఈ క్రీడను సీరియస్ హాబీగా తీసుకున్నవారికి మాత్రమే కావడంతో బౌల్డరింగ్ ఒక ఫన్ యాక్టివిటీగా, ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ఉపకరించేదిగా ఇప్పుడు ఆకర్షిస్తోంది. దీంతో జిమ్స్‌లోనూ ఈ బౌల్డరింగ్ వాల్స్ కొలువుదీరుతున్నాయి. గంట పాటు బౌల్డరింగ్ చేస్తే 900 కేలరీలు బర్న్ అవుతాయని, ఒక గంటలో చేసే పరుగు అరగంట పాటు చేసే క్లైంబింగ్‌తో సమానమని నిపుణులు చెబుతున్నారు. అంతేకాక శరీరంలో టాప్ టూ బాటమ్ అన్ని అవయవాలనూ ఇది బలోపేతం చేస్తుందని అంటున్నారు. వయసుకు అతీతంగా దీన్ని సాధన చేయవచ్చు. హై ఎనర్జీ, హైపర్ యాక్టివిటీ ఉన్న చిన్నారులకు ఇప్పుడు వాల్ క్లైంబింగ్ బాగా నప్పే హాబీగా నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా నలుగురితో కలిసి చేసే గ్రూప్ యాక్టివిటీ కాబట్టి అలసట ఎక్కువగా రాదు. శరీరానికి బ్యాలెన్సింగ్ సామర్థ్యం పెరుగుతుంది. కోర్ మజిల్స్ శక్తివంతంగా మారతాయి. చేతులు, కాళ్ల మజిల్స్ టోనప్ అవుతాయి.

క్లైంబింగ్ అనేది ఇప్పటికే అంతర్జాతీయంగా ప్రాచుర్యంలో ఉన్న క్రీడ. అయితే ఇటీవలి కాలంలో నగరంలో దీన్ని ఒక మంచి ఎనర్జిటిక్ ఎంజాయ్‌మెంట్‌గా గుర్తిస్తున్నారు. ఇలా ఫన్‌గానూ ఫిట్‌నెస్ సాధనంగా క్లైంబింగ్‌ను అనుసరించేవారి కోసం పలు చోట్ల వాల్స్ అందుబాటులోకి వచ్చాయి. షాపింగ్ మాల్స్, అడ్వెంచర్ జోన్స్‌లో అన్నింటితో పాటు క్లైంబింగ్ ప్రదేశాలు కూడా ఉండగా, కేవలం క్లైంబింగ్ కోసమే కొన్ని ప్రత్యేకమైన సెంటర్లు, హాబీగా చేసే క్లబ్స్ కూడా వచ్చేశాయి. ఈ అభిరుచి వాల్స్ నుంచి రాక్స్ దాకా విస్తరించి సిటీయూత్‌కి చక్కని వ్యాపకంగా మారిపోయింది.

క్లైంబింగ్ కథా కమామీషు ఇలా..

క్లైంబింగ్ వాల్ ఎత్తు 15 అడుగులు అంతకన్నా లోపుంటే బౌల్డరింగ్ సెగ్మెంట్ అంటారు. ఈ సెగ్మెంట్‌లో పాల్గొనేవాళ్ల కోసం కిందపడినా గాయాలు కాకుండా ఫ్లోర్ మీద పరుపులు వేసి ఉంచుతారు. ఇక లీడ్ క్లైంబింగ్‌లో గోడ 30–40 అడుగుల ఎత్తుపైన ఉంటుంది. సరిపడా ఆత్మవిశ్వాసం ఉండి, భయం లేకుండా ఉంటేనే లీడ్ క్లైంబింగ్ చేయగలరు. దీనిలో గోడకు హ్యాంగర్స్ ఉంటాయి. దీనికి తగినంత శారీరక సామర్థ్యం ఉండాలి. ఈ రెండూ కాకుండా వేగం ప్రధానంగా సాగే ఈ స్పీడ్ క్లైంబింగ్ చాలా వరకూ ప్రొఫెషనల్స్ మాత్రమే ఎంచుకుంటారు. దీనిలో క్రీడాకారుడు రోప్ కట్టుకుని వాల్ మీద ఎక్కుతాడు. ఎంత స్పీడ్ ఉంటుందంటే చూడడానికి నేల మీద పరుగులు తీసినట్టు ఉంటుంది.


పర్సనల్‌గా.. ఇంట్లోనే..

వీటిని ఇంట్లో కూడా వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆర్టిఫీషియల్ వాల్‌ని ఫైబర్‌తో చేసి సపోర్ట్ స్ట్రక్చర్ సాలిడ్ వుడ్, లేదా స్టీల్ ఉంటుంది. అయితే వుడ్ ఖరీదు ఎక్కువ కాబట్టి.. స్టీల్ బెటర్. క్లైంబింగ్ సర్ఫేస్‌గా ప్లైవుడ్ లేదా ఫైబర్ గ్లాస్ గాని వాడి చేసే 8 విడ్త్ 12 ఫీట్ హైట్ వాల్‌కి రూ.లక్ష ఖర్చులోనే అయిపోతుంది. అదే 24 ఫీట్ వాల్‌కి అయితే రూ.4 లక్షలు వరకూ అవుతుంది.

ఎక్కేయాలంటే.. లుక్కేయాలి..

నగరం ఒకప్పుడు రాక్స్‌కి నిలయం.. అద్భుతమైన రాళ్ల గుట్టలు, కొండ గుట్టలు మన ప్రాంతానికి ప్రత్యేకంగా ఉండేవి. అభివృద్ధి బారిన పడి చాలా వరకూ కనుమరుగయ్యాయి. నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న ఖాజాగూడ, మహేంద్రా హిల్స్, ఘర్ ఎ మొబారక్, అడ్డకల్, మర్రిగూడెం, పాండవుల గుట్ట, భువనగిరి లతో పాటు కర్నూలు దాకా వెళ్లి ఓర్వకల్ రాక్ గార్డెన్స్‌లో సైతం క్లైంబింగ్ చేస్తున్నారు.





కొండకు తాడేసి..

వీకెండ్ క్లైంబింగ్ ఈవెంట్స్ జరగడం ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయింది. నగరంలో హైదరాబాద్ క్లైంబర్స్ పేరుతో ఒక క్లబ్ కూడా ఏర్పాటైంది. ఈ క్లబ్ సభ్యులు ప్రతి వారం ఒక రాక్ ఏరియాను ఎంచుకుని క్లైంబింగ్‌కి సై అంటున్నారు. అయితే ఇక్కడ కూడా నిపుణుల ఆధ్వర్యంలోనే రోప్‌ల బిగింపు తదితర ఏర్పాటు జరగాల్సి ఉంటుంది. చాలా మంది అవుట్‌డోర్ క్లైంబింగ్ తర్వాత అది సీరియస్ హాబీగా మారిన తర్వాత ఇన్‌డోర్ క్లైంబింగ్‌కు మళ్లుతున్నారు. అక్కడ శిక్షణ తీసుకుంటున్నారు.

మంచి వ్యాయామంగా..

25 నుంచి 40 మధ్య వయస్కులు వస్తున్నారు. ఫిట్‌నెస్‌లో వెరైటీని కోరుకునేవారూ దీన్ని ఎంచుకుంటున్నారు మా దగ్గర 40 వరకూ రూట్స్ ఉన్నాయి. వీటిలో తేలికగా చేసేవి కష్టంగా చేసేవి.. ఇలా ఉంటాయి. చాలా మంది హాబీగా చేస్తుంటే ప్రొఫెషన్‌గా ఎంచుకుంటున్నవారూ పెరుగుతున్నారు. వారానికో రోజు అవుట్‌డోర్‌లో న్యాచురల్ రాక్స్ దగ్గర చేయిస్తున్నాం.

– రంగారావు, క్లైంబింగ్ శిక్షకులు

ఈవెంట్స్ నిర్వహిస్తున్నా..

కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ హాబీగా క్లైంబింగ్ ప్రారంభించి ఇప్పుడు దీంతో కనెక్ట్ అయ్యాను. వారాంతాల్లో క్లైంబింగ్ ఈవెంట్స్ కూడా నిర్వహిస్తున్నా. సాహసక్రీడలపైన ఆసక్తి ఉంటేనే దీన్ని ఎంచుకోవాలి. –చాణక్య నాని, క్లైంబర్

'గ్రీస్'లో రాక్ క్లైంబింగ్‌కు వెళ్తున్నాం..

గ్రేట్ హైదరాబాద్ అడ్వెంచర్ క్లబ్ ద్వారా 12 సంవత్సరాల క్రితం క్లైంబింగ్ పరిచయమైంది..ఆ తర్వాత రాక్ క్లైంబింగ్ ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా హైదరాబాద్ క్లైంబర్స్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం ఇన్‌స్టాలో మా గ్రూప్‌కి 2500 మంది సభ్యులున్నారు. వీరిలో కనీసం 200 మంది గ్రూప్ యాక్టివిటీలో పాల్గొంటుంటారు. వరంగల్‌లో ఉన్న పాండవుల గుట్ట నగరానికి 2 గంటల ప్రయాణ దూరంలోని అడక్కల్ వంటి ప్రదేశాల్లోనే కాక రాష్ట్రం దాటి మనాలి, కర్ణాటకలోని హంపి, బాదామి వంటి ప్రాంతాలతో పాటుగా ఇతర దేశాలైన వియత్నాం, ఇండోనేషియాలో కూడా క్లైంబింగ్ ఈవెంట్స్ చేశాం. త్వరలోనే మన దేశం నుంచి గతంలో ఎవరూ వెళ్లని స్థాయిలో అతిపెద్ద గ్రూప్‌గా గ్రీస్‌కి ఈ డిసెంబర్‌లో క్లైంబింగ్ యాక్టివిటీ చేపట్టనున్నాం.

– రేణుక, హైదరాబాద్ క్లైంబర్స్...



ఫ్యాషన్ ఇలాకా.. ట్రిపుల్ ధమాకా..



ఒకేరోజున 3 స్టోర్స్ ప్రారంభోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: ఒకేరోజున ముగ్గురు ఆల్ ఇండియా టాప్ క్లాస్ ఫ్యాషన్ డిజైనర్లు తమ డిజైన్లతో నగరాన్ని పలకరించారు. తమదైన శైలికి చెందిన అంతర్జాతీయ దుస్తుల శ్రేణిని నగరవాసులకు అందుబాటులోకి తెచ్చారు. దేశంలోనే అగ్రగామి డిజైనర్లుగా పేరొందిన ఢిల్లీకి చెందిన అబ్రహమ్, ఠాకూర్ ద్వయంతో పాటు రాహుల్ మిశ్రాలు హాజరయ్యారు. అదే విధంగా ప్రముఖ డిజైనర్ దుస్తుల బ్రాండ్ సత్యపాల్.. బంజారా హిల్స్ రోడ్ నెం1లో ఉన్న సత్వా సిగ్నేచర్ టవర్‌లో వరుసగా తమ స్టోర్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఒకేరోజున వాటిని ప్రారంభించారు. సిటీ ఫ్యాషన్ సర్కిల్‌లో సందడి నింపిన ఈ అత్యాధునిక దుస్తుల స్టోర్ల ప్రారంభోత్సవం, లాంచింగ్ పార్టీలకు సినీనటులు తమన్నా, నిహారికా, శోభితా దూళిపాళ్ల, సిరత్ కపూర్‌తో పాటు నగరంలోని పలువురు సెలబ్రిటీలు హాజరై డిజైనర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులతో డిజైనర్లు తమ కలెక్షన్స్ గురించిన విశేషాలను పంచుకున్నారు.

లెటస్.. సెటస్.. గో..



కిట్టీపార్టీ.. ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. మహిళలే కాదు. మగవాళ్లు కూడా తాము సైతం అంటూ నెలకోసారి కిట్టీ పార్టీలకు జై కొడుతున్నారు. పది, పదిహేనుమంది ఒక చోట చేరి సరదాగా గడిపేస్తున్నారు. అంతేకాదు.. ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ ఆర్థిక అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఆపదలో ఉన్నవాళ్లను ఆదుకుంటున్నారు. నెల నెలా పొదుపు చేసిన డబ్బుతో విహార యాత్రలకు వెళ్తున్నారు. నగరంలో ఈ తరహా కిట్టీ పార్టీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒకే విధమైన ఆలోచన కలిగిన వారి మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే మహిళలు నెలకోసారి ఒక చోట చేరి ఈ వేడుకలను ఏర్పాటు చేసుకోవడం అందరికీ తెలిసిందే. కానీ లేడీస్ స్పెషల్ కిట్టీ పార్టీల తరహాలోనే 'జెంట్స్ స్పెషల్' కిట్టీ పార్టీలు కూడా నగర సంస్కృతిలో ఒక భాగంగా కనిపిస్తున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

- నగరంలో జెంట్స్ కిట్టీపార్టీల ట్రెండ్
- నెలకోసారి సమావేశం.. ఏడాదికోసారి విహారం
- ఒకేవిధమైన ఆలోచన కలిగిన స్నేహితులకు వేదికలు
- నయాట్రెండ్‌గా ఆకట్టుకుంటున్న 'కిట్టీ కల్చర్'

ఉరుకుల పరుగుల జీవితం. ఒకే కాలనీలో ఉన్నా, ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నా సరే ఒకరికొకరు అపరిచితులే. కనీస పలకరింపులు ఉండవు. చుట్టూ మనుషులే ఉన్నా ఆకస్మాత్తుగా ఏదో ఒక ఆపద ముంచుకొస్తే ఆదుకొనే వారెవరూ అంటే చెప్పడం కష్టమే. అలాంటి సాధారణ, మధ్యతరగతి జీవితాల్లో కిట్టీ పార్టీలు సరికొత్త సంబంధాలను, అనుబంధాలను ఏర్పాటు చేస్తున్నాయి. అదీ ఓ ఐదారు గంటల పాటు సరదాగా గడిపే సమయం. ఆట పాటలు, ఉరకలెత్తే ఉత్సాహాలు, సరదా కబుర్లు.. దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను అధిగమించేందుకు అద్భుతమైన టానిక్‌లా పనిచేసే ఔషధం కిట్టీ పార్టీ. ఉప్పల్‌కు చెందిన కొందరు వాకింగ్ ఫ్రెండ్స్ కిట్టీ పార్టీకి శ్రీకారం చుట్టారు. వారిలో కొందరు ఉద్యోగులు, మరి కొందరు వ్యాపారులు. ప్రతి నెలా ఒక చోట సమావేశమవుతారు.

ఒకరికొకరు అండగా...

ఒక్కొక్కరూ నెలకు రూ.5000 చొప్పున 15 మంది కలిసి రూ.75000 పొదుపు చేస్తున్నారు. అందులో రూ.60 వేల వరకూ ఆ నెల అవసరమైన వారికి ఇచ్చేస్తారు. మిగతా రూ.15000 లతో సరదాగా గడిపేస్తారు. నెలకోసారి కిట్టీ పార్టీని నిర్వహించేందుకు ఆ గ్రూపులో ఒకరిని ఆతిథ్యం ఇచ్చే హోస్ట్‌గా ఎంపిక చేసుకుంటారు. 'రోజంతా సరదాగా గడిపేస్తాం. అంతా చుట్టుపక్కల కాలనీల్లో ఉండేవాళ్లమే. కానీ కనీసం పరిచయాలు కూడా ఉండేవి కాదు. ఇప్పుడు మేమంతా మంచి స్నేహితులుగా ఉన్నాం. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునేందుకు మా టీమ్ రెడీగా ఉంటుంది.' అని చెప్పారు టీమ్‌కు సారథ్యం వహించే రవి.



నగర శివారుకు...

అపార్ట్‌మెంట్‌లలో మహిళల బృందంలోని ఒకరి ఇంట్లో కానీ లేదా కమ్యూనిటీ హాల్‌లో కానీ నిర్వహిస్తారు. కానీ జెంట్స్ పార్టీల్లో ఔటింగ్ కల్చర్ ఎక్కువగా కనిపిస్తోంది. సిటీకి దూరంగా వెళ్లి ఒక రోజంతా గడిపేందుకే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

విహారయాత్రలు కూడా..

కిట్టీ పార్టీల మరో ప్రత్యేకత ఏడాదికి ఒకసారి దేశ, విదేశాల్లోని పర్యాటక ప్రాంతాల్లో విహరించడం, ప్రతి నెలా పొదుపు చేసే డబ్బులతో గోవా, కేరళ, కాశ్మీర్, జైపూర్ వంటి ప్రాంతాల్లో పర్యటనలకు వెళ్తారు. అలాగే దుబాయ్, సింగపూర్, మలేసియా, బ్యాంకాక్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు సైతం కిట్టీ పార్టీలు పరుగులు తీస్తున్నాయి. ఏటా ఓ పది రోజులు టూర్‌కు వెళ్లి రావడం కూడా ఈ పార్టీల కల్చర్‌లో భాగంగా కొనసాగుతోంది.

ఇదీ 'కిట్టీ' చరిత్ర...

దేశవిభజన అనంతరం 1950లో ఈ వినూత్నమైన కిట్టీపార్టీ సంస్కృతి ప్రారంభమైంది. ఒకే ప్రాంతంలో నివసించే మహిళల మధ్య స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా మొదలయ్యాయి. దేశవిభజన ఫలితంగా ఆర్థికంగా తీవ్ర కష్టాలకు గురైన కుటుంబాలను ఆదుకునేందుకు పది మంది మహిళలు కలిసి రావడం ఒక ఉన్నతమైన సంప్రదాయంగా నిలిచింది. పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో మొదలైన ఈ సంస్కృతి 1980 తరువాత క్రమంగా అంతటా విస్తరించింది.

ఫార్మా సిటీ రద్దయిందా? లేదా?

వివరాలు తెలియజేయాలని సర్కారుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మా సిటీ రద్దైందా? లేదా? అన్న దానిపై పూర్తి వివరాలు అందజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సంబంధిత అధికారుల నుంచి ఈ నెల 6వ తేదీలోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లాలోని ఫార్మాసిటీ భూ సేకరణ ప్రక్రియను పరిహారం ప్రకటించిన నాటి నుంచి నిలిపివేస్తూ గతేడాది సింగిల్ జడ్జీ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో...తమ భూములపై ఆంక్షలు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేస్తూ బొడ్డు దేవల్‌రెడ్డితో పాటు మరో 48 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. 2017లో జారీ చేసిన భూ సేకరణ నోటిఫికేషన్ ఆధారంగా ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించకుండా అవార్డు ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. భూ సేకరణను రద్దు చేసినందున రైతుల భూములపై ఉన్న ఆంక్షలను తొలగించేలా అధికారులను ఆదేశించాలని సింగిల్ జడ్జీ చెప్పారు. అదేవిధంగా రైతుబంధు, రుణాలు పొందేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల వాదనను ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి... అసలు మేడిపల్లిలో ఫార్మా సిటీ ఉందా..రద్దైందా..లిఖిత పూర్వక వివరాలు తెలియజేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

రవిప్రకాశ్‌పై పరువు నష్టం కేసు

సీసీసీ చరిత్రలో అత్యధిక కోర్టు ఫీజు

సాక్షి, హైదరాబాద్: ఆర్‌టీవీ, రవిప్రకాశ్‌పై యూరో ఎగ్జిమ్ బ్యాంక్ లిమిటెడ్ రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేసింది. ఈ మేరకు కోర్టు ఫీజు రూ.1,00,05,852 చెల్లించినట్లు పిటిషనర్ తెలిపారు. 1958 నుంచి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు (సీసీసీ) చరిత్రలో ఇదే అత్యధిక ఫీజుగా పేర్కొన్నారు. తమపై ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా పరువుకు నష్టం కలిగించేలా కథనాలు ప్రసారం చేశారని చెప్పారు. సంఘం అత్యంత గౌరవం కలిగిన తమపై నిరాధార కథనాలను ఖండిస్తున్నామని, అలాగే పరువు నష్టం కేసు దాఖలు చేశామని చెప్పారు. ఆర్‌టీవీ, రవిప్రకాశ్.. బేషరతుగా క్షమాపణలు కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రతివాది రవిప్రకాశ్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే నెల 16వ తేదీన తమ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

ఏకలవ్య కార్పొరేషన్‌తో హక్కుల సాధన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఏకలవ్య కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా ఎరుకల కులస్తుల హక్కుల సాధనకు అవకాశం కలిగినట్లయిందని అఖిల భారత ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఎరుకల హక్కుల పోరాట సమితికి ఇవ్వాలని ఆయన కోరారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు.

పీవోడబ్ల్యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అనసూయ, మంగళ



ముషీరాబాద్ (హైదరాబాద్): ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలిగా కథారచయిత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.అనసూయ, ప్రధాన కార్యదర్శిగా అందే మంగళ ప్రదలు ఎన్నికయ్యారు. ఈనెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకుని.. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల వివరాలను వివరించారు. ఉపాధ్యక్షులుగా ఎం.జ్యోతి (మంచిర్యాల), సరిత (నిజామాబాద్), కె.జ్యోతి (పెద్దపల్లి), సహాయ కార్యదర్శులుగా గీత (వికారాబాద్), ఆర్.సీత (ఆలేరు), హరిత (భైంసా), కోశాధికారిగా వై.జానకి (ఖమ్మం)తో పాటు మరో 16 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసినట్లు నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఝాన్సీ తెలిపారు. మూడ్రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల్లో పలు నిర్ణయాలు, తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. మద్యం, మాదక ద్రవ్యాలు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని, మహిళా రిజర్వేషన్లను 33 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని, గృహహింస చట్టం, 498ఏ, స్త్రీల ఆస్తి హక్కు, పోక్సోలాంటి చట్టాలను మరింత బలోపేతం చేసి పకడ్బందీగా అమలు చేయాలని ఝాన్సీ డిమాండ్ చేశారు. కోల్‌కతా డాక్టర్‌పై జరిగిన అమానుష దాడికి వ్యతిరేకంగా జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఆకలి కేకలు!

మూడు రోజులుగా వరద గుప్పిట్లోనే కనీసం తాగునీరు అందక.. ఆకలితో నకనక

గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేదు

ఇక్కడే అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కింద ఫ్లోర్‌లో కుమార్తె రమణమ్మతో ఉంటున్నా. ఆదివారం అపార్ట్‌మెంట్ కింద ఫ్లోర్ నీట మునిగింది. ఇంటిలో సామాన్లన్నీ వదిలేసి కట్టుబట్టలతో బిల్డింగ్ పైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాం. మూడు రోజులుగా ప్రభుత్వం వరద బాధితులకు భోజనం, మంచినీటి బాటిళ్లు అందిస్తున్నట్టు చెబుతున్నా.. మాకైతే గుక్కెడు నీళ్లు కూడా రాలేదు. ఆహారం లేక విధిలేని పరిస్థితుల్లో వాటర్ ట్యాంక్‌లోని అశుభ్రమైన నీటిని తాగి బతికాం. మంగళవారం మా బంధువుల సాయంతో నీటిలోనే నడుచుకుంటూ బయటపడ్డాం.

- చిడగాని అప్పయ్య, సింగ్‌నగర్

రెండు రోజులు పస్తులే

వరద అకస్మాత్తుగా రావడంతో పక్కనే ఉన్న అపార్టుమెంట్‌కు వెళ్లి తల దాచుకున్నాం. నీరంతా ఇంట్లోకి చేరటంతో సామాన్లన్నీ పాడయ్యాయి. హెలికాప్టర్లలో వచ్చే ఆహారం బురదలో పడిపోయింది. రెండ్రోజులు పస్తులున్నాం. ఇద్దరు పిల్లలు ఆకలితో అల్లాడుతుంటే.. వారిని ఓదార్చటానికి చాలా ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వం అయితే మాకేమీ ఇవ్వలేదు.

- రజియా, న్యూ రాజరాజేశ్వరిపేట



జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఆహారం, మంచినీరు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి వరద నీటిలో వెళ్తున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మూడు రోజులుగా వరద నీటిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్నా ఇప్పటికీ సహాయం అందకపోవడంతో బాధితులు విలవిల్లాడుతున్నారు. తిండి మాట దేవుడెరుగు కనీసం గుక్కెడు తాగునీరు కూడ అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ప్రజల ప్రాణాలను గాలికి వదిలేసి చేతులెత్తేసింది. లక్షలాది మంది వరదలో చిక్కుకుని బయటకు వచ్చే మార్గం లేక ప్రాణ భయంతో క్షణమొక యుగంలా గడుపుతున్నారు. బాధితులు సాహసించి స్వచ్ఛందంగా బయటకు రావడం మినహా ప్రభుత్వం వారిని కాపాడే యత్నం చేయటం లేదు. పలు చోట్ల చంటిబిడ్డలు పాలు లేక గుక్కపట్టి ఏడుస్తుండగా తల్లిదండ్రులు నిస్సహాయంగా కుమిలిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య బాధితులు మందులు లేక సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. తమవాళ్లు ఎక్కడున్నారో.. ఉన్నారో లేదో అంతుబట్టక నరకయాతన అనుభవిస్తున్నారు.

ఇంట్లో ఉండలేక.. బయటకు రాలేక

వరద ప్రాంతాల్లో మూడు రోజులుగా కరెంట్ లేదు. ఫోన్లు పని చేయడం లేదు. నెట్ వర్క్ మొరాయించింది. దీంతో వరద కాలనీల్లో చిక్కుకున్న వారి సమాచారం తెలియక కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సింగ్ నగర్ బ్రిడ్జి వద్ద ఆదుర్దాగా నిరీక్షిస్తున్నారు. రాత్రి బయట అడుగు పెట్టాలంటే వరద నీటిలో జలగలు, పాములు, విష జంతువులు ఉండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నారు. ఆహారం లేక ఇంటి నుంచి బయటకు వద్దామనుకుంటే చచ్చిపోతామని భయం వేస్తోందని, అలాగని ఇంట్లో ఉంటే పిల్లలకు ఆహారం అందక చచ్చిపోతారేమోనని భయంగా ఉందని విలపిస్తున్నారు. ఇంట్లో ఉండలేక బయటకు రాలేక కన్నీటి పర్యంతం అవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కనీసం తామైనా బతికితే చాలని... రక్త సంబంధీకులు, శవాలను అక్కడే వదిలి వేస్తున్నారంటే ఎలాంటి దుస్థితి దాపురించిందో ఊహించవచ్చు. పడవ ఎక్కాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

15 ఏళ్ల కష్టం నిమిషాల్లో నీళ్ల పాలు

వరద తాకిడికి పలు చోట్ల కార్లు, బైకులు, ఆటోలు కొట్టుకుపోగా సెల్లార్‌లో ఉన్న వాహనాలు బురద నీటిలో మునిగిపోయాయి. కింది ఫ్లోర్లలో నివసించే ఇళ్లలో సామాను అంతా నీటమునిగి పనికి రాకుండా పోయింది. కూలి పనులకు వెళ్లి ఏడాదంతా కూడబెట్టిన డబ్బులతో కొనుక్కున్న ఫ్రిజ్, సామాన్లు వరద పాలు కావడంతో ఓ నిరుపేద మహిళ నిర్వేదంలో మునిగిపోయింది. ఇంట్లో ఒక్కో సామాను సమకూర్చుకునేందుకు 15 ఏళ్లు పట్టిందని, కష్టం అంతా నిమిషాల్లో నీటి పాలైందని విలపించింది. ఎవరిని పలుకరించినా ఇవే దీనగాథలు కనిపిస్తున్నాయి.

కన్నెత్తి చూడలేదు..

మూడు రోజులు గడుస్తున్న ఇప్పటికి చాలా కాలనీల్లోకి అధికారులు కనీసం వెళ్లిన దాఖలాలు లేవు. 'సాక్షి' బృందం పీకల్లోతు నీళ్లలో మారుమూల కాలనీలకు వెళ్లినప్పుడు హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. బాధితుల కష్టాలు మాటల్లో వర్ణించలేని విధంగా ఉన్నాయి. రాజీవ్‌నగర్, ఉడా కాలనీ, రాధానగర్, పాయకాపురం, కండ్రిక, ఇందిరా నాయక్‌నగర్, సన్‌సిటీ కాలనీ, గుండపు చలపతిరావు కాలనీ, రాజరాజేశ్వరిపేట, భరతమాత మందిరం కాలనీ, నందమూరి నగర్, తోటవారి వీధి, వాంబేకాలనీ, వైవీరావు ఎస్టేట్, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, ఊర్మిళానగర్, రాజీవ్‌శర్మ కాలనీ, విజయవాడ రూరల్ అంబాపురం, పాతపాడు, నున్న, పి.నైనవరం పంచాయతీల్లోకి అధికారులు ఇంత వరకు వెళ్లలేదు. కనీసం తాగునీరు అందించే ప్రయత్నం చేయలేదని 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. ఇక్కడ కొంతమేర వరద తగ్గినా 2 లక్షల మందికి పైగా బాధితులు వరదలో ఉన్నారు. వీరి గురించి సమాచారం తెలియక బయట ఉన్న కుటుంబీకులు రోదిస్తున్నారు. కొన్నిచోట్ల బయట పడ్డ శవాలను చూసి తమవారి పరిస్థితి ఎలా ఉందోనని తల్లడిల్లిపోతున్నారు. లోపల నుంచి బయటికి వచ్చేవారు చెప్పే సమాచారం మినహా ప్రభుత్వం తరఫున ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు.

సాయం శూన్యం...

వరద ప్రాంతాల్లో స్వయంగా తిరుగుతున్నట్లు గాంభీర్యంగా ప్రకటిస్తూ ప్రచారం చేసుకోవడం మినహా ప్రజలకు అందుతున్న సాయం గురించి సీఎం చంద్రబాబు పట్టించుకోవటం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానంటూ వైఫల్యాలను వారిపైకి నెట్టేయత్నం చేస్తున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బుడమేరు వరదతో ప్రజలను ముంచిన విషయాన్ని కప్పిపుచ్చేందుకు నానా పాట్లు పడుతున్నారు.

కాలనీల్లోకి కాలు పెట్టకుండా..

వరద ప్రాంతాల్లో సహాయ చర్యలు అందకపోవడంతో ప్రభుత్వం తీరుపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. దీంతో లోపలి కాలనీలకు వెళ్లకుండా సీఎం చంద్రబాబు జాగ్రత్త పడుతున్నారు. డివిజన్‌కో మంత్రి, ఐఏఎస్ అధికారులు అంటూ హడావుడి చేస్తున్నా వారు కూడా ఎటు వెళ్లినా నిలదీస్తుండటంతో మమ అనిపిస్తున్నారు. కాలనీలలోకి కాలు మోపితే బాధితులు ప్రశ్నిస్తుండటంతో ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు. సహాయ చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వరద బాధితులతో పాటు ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.





చంద్రబాబూ.. ఎవరిదీ పాపం?

బుడమేరు వరదకు 32 మంది బలి.. లెక్కతేలని మరణాలు మరెన్నో?

సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షి, అమరావతి : విజయవాడ కన్నీటి సంద్రాన్ని తలపిస్తోంది. ప్రభుత్వ వైఫల్యం వరద బాధితుల పాలిట అంతులేని విషాదాన్ని మిగులుస్తోంది. వరదల గురించి ముందుగా అప్రమత్తం చేయడంలో విఫలమైన ప్రభుత్వం.. కనీసం గల్లంతైన వారి ఆచూకీ అయినా చెబుతుందేమోన్న బాధిత కుటుంబాల ఆశలపై నీళ్లు చల్లుతోంది. బాధితుల కేకలు.. పిలుస్తున్న పిలుపులు.. గుండెలు అవిసేలా ఆర్తనాదాలు అరణ్య రోదనగానే మిగిలిపోతున్నాయి. వరద తగ్గుముఖం పడుతున్న కొద్దీ నీటిపై తేలియాడుతున్న శవాలతో ముంపు వాసుల గుండె చెరువవుతోంది. అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక తదితర ప్రాంతాల్లో మూడ్రోజులుగా గల్లంతైన వారు శవాలుగా మారి నీటిలో కొట్టుకుపోతూ కనిపిస్తున్న దృశ్యాలు అత్యంత హృదయ విదారకంగా మారాయి. మృతదేహాలు అలా కృష్ణా నదిలో కొట్టుకుపోతున్నా ప్రభుత్వ అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందే తప్ప.. వాటిని గుర్తించి బాధిత కుటుంబాలకు అప్పగించాలన్న కనీస ధర్మాన్ని పాటించకపోవడం విస్మయ పరుస్తోంది. మృతదేహాలకు గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడం కనీస భారతీయ సంప్రదాయమనే విషయాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడం విభ్రాంతి కలిగిస్తోంది. కోవిడ్ మహమ్మారి కష్టకాలంలోనూ ఈ దుస్థితిలేదు. ఇప్పటిదాకా 32 మృతదేహాలు వెలుగుచూడగా ప్రభుత్వం మాత్రం తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్యపెడుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ విజయవాడ బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో తేలుతున్న శవాలు ఇప్పుడు అందరినీ కలవరపెడుతున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో శవాలు తేలాయి. ఇంకా ఎంతమంది చనిపోయారోనని ఇక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. కనికరంలేని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 12 మంది మృతిచెందినట్లు చెబుతున్నప్పటికీ ఈ సంఖ్యకు.. వెలుగుచూస్తున్న మృతదేహాలకూ లంకె కుదరడం లేదు. వరద వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంవల్లే శవాలు గుట్టలుగా బయటపడుతున్నాయని.. ఈ మరణాలన్నీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైనవేనని బాధితులు సర్కారును దుమ్మెత్తిపోస్తున్నారు. పైగా.. ఒక్క మరణాన్ని ప్రకటించని దొంగ సర్కారు ఇదని మండిపడుతున్నారు. కళ్లెదుటే 15 మందికి పైగా కనిపిస్తుంటే సమయం గడిచేకొద్దీ మరణాల సంఖ్య ఇంకా ఎంత ఉంటుందోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమరావతి.. వరదావతే..

బడాయి బాబూ.. సాక్ష్యాలివిగో..

- ప్రభుత్వమే హైకోర్టుకు ఈ విషయం చెప్పింది.. హైకోర్టుకు రెండు రోజులు సెలవు ప్రకటించాలని కోరింది
- సచివాలయాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయిన అధికారులు.. మునిగిన చంద్రబాబు కరకట్ట బంగ్లా, ఇతర భవనాలు
- రాజధానిలో పలు గ్రామాలను ముంచిన వరద నీరు..
- అమరావతిలో రాజధాని వద్దని నాడే చెప్పిన శివరామకృష్ణన్ కమిటీ
- ఐఐటీ నిపుణులూ ఇదే చెప్పడంతో వారినీ పక్కన పెట్టిన ప్రభుత్వం!

వరద బాధితులకు రూ.కోటి సాయం

ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటన

- బాధితుల కష్టాలను స్వయంగా చూశా..
- వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- ఈ విపత్తు కూడా కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లేనని వైఎస్ జగన్ ధ్వజం



సాక్షి, అమరావతి: వరద బాధితుల కోసం వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోటి రూపాయలు సాయం ప్రకటించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, ఎన్టీ ఆర్ జిల్లా నేతలతో వైఎస్ జగన్ సమావేశమ య్యారు. కృష్ణా నదికి భారీ వరదలతో విజయవా డలో తలెత్తిన పరిస్థితిపై ఆయన నాయకులతో సమీక్షించారు. మాజీ సీఎం జగన్ మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించినప్పుడు బాధి తులు పడుతున్న కష్టాలను స్వయంగా చూశానని చెప్పారు. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లే ఈ విపత్తు చోటు చేసుకుందని.. అయినా తమపై నింద మోపే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ తరఫున కోటి రూపాయల సాయం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ఆ మొత్తాన్ని ఏ రూపంలో.. ఎలా ఇవ్వాలనేది పార్టీ నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, వెలంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, కురసాల కన్నబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, పార్టీ నాయకుడు షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు.

నేడు లక్ష పాల ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ బాటిళ్ల పంపిణీ

విజయవాడలో వరద బాధితులకు వైఎస్సార్‌సీపీ తరఫున రూ.కోటి సాయం చేయబోతున్నామని, అందులో భాగంగా బుధవారం ఉదయం లక్ష పాల ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తామని, ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్ణయించారని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆ తర్వాత స్థానిక అవసరాలు గుర్తించి, పార్టీ నుంచి సాయం అందిస్తామని, మొత్తం ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు.

మార్క్‌ఫెడ్ అధికారిణి అరెస్ట్

- కరీంనగర్ జిల్లాలో రూ. 1.70 కోట్లు పక్కదారి
- మొత్తం రాష్ట్రంలో రూ.5 కోట్లు గోల్‌మాల్?
- హైదరాబాదులో ఒక కీలక వ్యక్తి అండదండలు!

సాక్షి, హైదరాబాద్: అక్రమాలు వెలుగు చూడటంతో మార్క్‌ఫెడ్ కరీంనగర్ జిల్లా మేనేజర్ దివ్యభారతిని పోలీసులు అరెస్టు చేయడంతో వ్యవసాయ శాఖలో సంచలనం చెలరేగింది. ఆ జిల్లాలో ఎరువుల సొమ్ము రూ. 1.70 కోట్లు కాజేసినట్టు ప్రాథమిక నిర్ధారణలో తేలింది. దీంతో ఆమెను పోలీసులు అరెస్టు చేసినట్టు మార్క్ ఫెడ్ వర్గాలు వెల్లడించాయి. ఆ జిల్లాతోపాటు ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోనూ ఇటువంటి అక్రమాలు జరిగినట్లు మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులే చెబుతున్నారు. ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లోనూ అక్రమాలు జరిగిఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తం కలిపి రూ. 5 కోట్లు పక్క దారి పట్టినట్టు తెలుస్తుంది.

డీసీఎంఎస్ సేల్ పాయింట్ల ద్వారా అక్రమాలు

మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా, డీఏపీ సహా వివిధ రకాల ఎరువులను జిల్లాలకు పంపిస్తారు. వాటిలో కొంతభాగాన్ని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల ద్వారా రైతులకు సరఫరా చేస్తారు. కరీంనగర్ జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు రికార్డులను సరిగ్గా నిర్వహించకపోవడం, డేటా తారుమారు చేయడం, రికార్డుల చోరీ, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు మార్క్‌ఫెడ్ గుర్తించింది. డీసీఎంఎస్ వేములవాడ సేల్ పాయింట్‌లో ఎరువుల బకాయిలు రూ. 1.70 కోట్లు దుర్వినియోగం అయినట్లు అంచనాకు వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1,100 డీసీఎంఎస్ సేల్ పాయింట్లలో ఎన్నింటిలో అక్రమాలు జరుగుతున్నాయో విచారణ చేపట్టాల్సిన అవసరముందన్న చర్చ జరుగుతోంది. కరీంనగర్ జిల్లాలో జరిగిన అక్రమాల్లో అక్కడ గతంలో పని చేసిన ఒక అధికారి హస్తం ఉందన్న ప్రచారం జరుగుతోంది. అతనే దివ్యభారతికి పూర్తి భరోసా ఇచ్చినట్లు సమాచారం. హైదరాబాదులో ఉంటూ అతను ఆమె అక్రమాలను వెనకేసుకొచ్చారని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు.

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటికి మంత్రి దుద్దిళ్ల

నిర్మల్: నిర్మల్ జిల్లాలో వర్షాలు, వరదలను పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటికెళ్లడం ఆసక్తికరంగా మారింది. ఆదిలాబాద్ నుంచి నేరుగా నిర్మల్ చేరుకున్న మంత్రి ముందుగా ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో బ్రాహ్మణ సంఘం సభ్యులను కలిశారు. అక్కడి నుంచి స్థానిక ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, జిల్లా అధికారులతో కలిసి వరుసగా ముంపునకు గురవుతున్న జీఎన్‌ఆర్ కాలనీకి చేరుకున్నారు. స్థానిక కాలనీవాసుల సమస్యలను తెలుసుకుని, వారికి పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం ఆయన ఏలేటి నివాసానికి వెళ్లారు. అక్కడ టీ తాగి కాసేపు మహేశ్వర్‌రెడ్డితో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన మంత్రి శ్రీధర్‌బాబు, బీజేఎల్పీ నేత ఇంటికి వెళ్లడం, జీఎన్‌ఆర్ కాలనీలోనూ తాము పాతమిత్రులమే అంటూ మాట్లాడటం చర్చనీయాంశమైంది. అయితే ఏలేటి ఇంటికి కలెక్టర్, ఎస్పీ, అధికారులు కూడా వెళ్లడం రాజకీయంగా చర్చకు తావివ్వలేదు. ఈ టీ సమావేశంలో జిల్లా సమస్యలు, అభివృద్ధి పనులపైనే ఏలేటి, దుద్దిళ్ల, పటేల్, జిల్లా అధికారులు చర్చించినట్లు అక్కడి వర్గాలు తెలిపాయి.

మీ ఇష్టం వచ్చినట్లు ఆస్తుల స్వాధీనమా?

సీఎంఆర్ విషయంలో సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం ● రైస్ మిల్లర్లకు ఊరట



సాక్షి, హైదరాబాద్: నిర్దేశిత సమయానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వలేదని రైస్ మిల్లర్ల భూములు, ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వాధీనం చేసుకున్న ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడం, రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకున్న భూములను విక్రయించడానికి ప్రయత్నించడం వంటి చర్యలను తప్పుబట్టింది. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సరికాదని చెప్పింది. 'మీ ఇష్టం వచ్చినట్లు ఆస్తుల విక్రయం చేపడతారా' అంటూ మండిపడింది. ఇప్పటివరకు పిటిషనర్లకు జారీ చేసిన అన్ని ఉత్తర్వులను రద్దు చేసింది. చట్ట ప్రకారం అన్ని నిబంధనలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని తేల్చిచెప్పింది. తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం 1864 ప్రకారం చర్యలు చేపట్టడంతో పాటు తమ ఆస్తులను జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన చీదెళ్ల కేశవరావు సహా పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దారి మళ్లించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించారని ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. దీంతో ఆయా రైస్ మిల్లులు పౌరసరఫరాల కార్పొరేషన్‌కు దాదాపు రూ.70 నుంచి 90 కోట్ల వరకు బకాయి పడ్డాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే రైస్ మిల్లర్ల భాగస్వాములతో సహా ఆస్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బకాయిల వసూలు కోసం ఆస్తులను విక్రయించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

భారీగా నిల్వలు.. ఖర్చులూ ఇవ్వలేదు..

రైస్ మిల్లర్ల తరఫున సీనియర్ న్యాయవాది హేమేంద్రనాథ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'గత రెండు, మూడేళ్లుగా వరి పంట అధికంగా పండింది. ఒక్కో రైస్ మిల్లు సామర్థ్యం కంటే మూడింతలు వడ్లను కార్పొరేషన్ డంప్ చేసింది. పెద్ద మొత్తంలో వచ్చిన వడ్లను మిల్లులో నిల్వచేసే పరిస్థితి లేకుండా పోయింది. బయట ఉంచడంతో వడ్లు తడిసి నాసిరకంగా మారాయి. భారీగా నిల్వ చేసినా.. నిల్వ, రవాణా ఖర్చులు కూడా చెల్లించలేదు. అయినా మిల్లర్లకు అవకాశం ఇవ్వకుండా ఎగవేతదారుగా ప్రకటించడం సరికాదు. అంతేకాదు, ఆస్తులను స్వాధీనం చేసుకునే ముందు రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం నిబంధనలను పాటించలేదు. అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలి' అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల ఆస్తులను జప్తు చేయడంలో అధికారులు చేపట్టిన చర్యలను నిలిపివేయడంతో పాటు ఉత్తర్వులను రద్దు చేశారు.

పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

'దిశ' కేసులో సుప్రీంకోర్టు న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు

తదుపరి విచారణ నేటికి వాయిదా వేసిన సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: దిశ హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని హైకోర్టులో సుప్రీంకోర్టు న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు వినిపించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ 200 మంది సాక్షులను విచారించి నివేదిక అందజేసిందని.. దాన్ని తోసిపుచ్చడం సరికాదన్నారు. ఎన్‌కౌంటర్ మృతుల్లో ముగ్గురు మైనర్లు కూడా ఉన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. సమయాభావం కారణంగా తదుపరి విచారణను ధర్మాసనం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేసింది. 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పూర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అనంతరం కేసు విచారణను హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. కొందరు పిటిషనర్ల తరఫున హక్కుల కార్యకర్త, న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు వినిపించారు. దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని.. అది బూటకమా? కాదా? అన్నది తేల్చాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పష్టం చేసిందన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, మార్గదర్శకాలను ఆమె కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది. కాగా, ఇదే కేసులో సిర్పూర్కర్ కమిషన్ ఆధారంగా పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా హైకోర్టు సింగిల్ జడ్జి మూడు నెలల క్రితం స్టే విధించిన విషయం తెలిసిందే.

ప్రీ వెడ్డింగ్ షూట్
వెడ్డింగ్ షూట్ తెలిసిందే.
కాని ఇప్పుడు మెటర్నిటీ షూట్
ట్రెండ్‌లో ఉంది.
స్త్రీలు తమ నిండు గర్భం సమయంలో
భర్తతో కలిసి ఫొటో షూట్‌లో పాల్గొనడం
ఒక ముఖ్య ఉత్సవంగా మారింది.
తాజాగా దీపికా పడుకోన్ విడుదల చేసిన
మెటర్నిటీ షూట్ ఫొటోలు
ఈ ట్రెండ్ గురించి ప్రోత్సాహంగా
మాట్లాడుతున్నాయి.

మెటర్నిటీ షూట్




నిండు నెలల జ్ఞాపకం

తొలి చూలుతో పుట్టింటికి వచ్చిన కూతురు రేపో మాపో కాన్పు అవుతుందనగా 'నొప్పులొస్తే నన్ను లేపమ్మా' అందట నిద్రపోతూ. అప్పుడు తల్లి నవ్వుతూ 'పిచ్చి పిల్లా... నొప్పులొస్తుంటే నేను నిన్ను లేపడం కాదే. నువ్వే గోల చేసి ఊరంతా లేపుతావు' అందట.

మాతృత్వపు మధురిమ స్త్రీ జీవితంలో అత్యంత ముఖ్యమైనది. గర్భం దాల్చడంతో మొదలు నెలలు నిండుతూ వెళ్లడం, శరీరంలో మార్పు ఉదర భాగం బిడ్డకు గూడుగా మారుతూ ఎదుగుతూ ఉండటం, ఆ మార్పులన్నీ చూసుకోవడం, చివరకు కాన్పు జరిగి అంతవరకూ గర్భంలో ఉన్న బిడ్డ ఒడికి చేరడం... స్త్రీకి ఇదంతా అద్భుత ఘట్టం. మానసిక శాస్త్ర అధ్యయనం ప్రకారం చాలామంది స్త్రీలకు గర్భం దాల్చినప్పుడు ఆ నిండుదనాన్ని నలుగురికీ చెప్పుకోవాలని ఉంటుందట. నిండు గర్భంతో అప్పుడప్పుడు నలుగురిలోకి రావడాన్ని ఇష్టపడతారట. కాలక్రమంలో ఈ ఇష్టం ఆ క్షణాలను ఫొటోలుగా దాచుకునే వరకూ వచ్చింది.







1991లో మొదలైన ట్రెండ్

హాలీవుడ్ ప్రసిద్ధ నటి డెమి మూర్ 1991లో తన ఏడు నెలల గర్భాన్ని ప్రదర్శిస్తూ ఒక మేగజీన్ కవర్ పేజీ మీద కనపడినప్పుడు అది ప్రపంచ వ్యాప్తంగా పెను సంచలనం అయ్యింది. ప్రఖ్యాత మహిళా ఫొటోగ్రాఫర్ ఆనీ లీబోవిజ్ ఈ ఫొటో తీసింది. చాలామంది దీనిని స్త్రీ శరీర ధర్మానికి సంబంధించిన ఒక గౌరవ ప్రకటనగా భావిస్తే మరికొందరు ఇందులో అశ్లీలత ఉందని విమర్శలు చేశారు. అయితే కాలక్రమంలో సెలబ్రిటీలు చాలా మంది మెటర్నిటీ ఫొటోస్‌ను జనం ముందుకు తీసుకురాసాగారు.

2012 నుంచి ఇండియాలో

మన దేశంలో బాలీవుడ్ నుంచి సెలబ్రిటీలు మెటర్నిటీ షూట్‌ను 2010 నుంచి పరిచయం చేయసాగారు. కొంకణా సేన్, సోహా అలీ ఖాన్, నేహా ధూపియా, బిపాషా బసు, అనుష్కా శర్మ, కరీనా కపూర్, సోనమ్ కపూర్, ఇటీవల ఆలియా భట్... వీళ్ల ఫొటోషూట్‌లు సామాన్యజనానికి కుతూహలం రేకెత్తించాయి. మనం కూడా ఎందుకు ఇలాంటి జ్ఞాపకాలు నిక్షిప్తం చేసుకోకూడదు అనిపించేలా చేశాయి. ఇప్పుడు దీపికా పడుకోన్ తన భర్త రణ్‌వీర్ సింగ్‌తో కలిసి బ్లాక్ అండ్ వైట్‌లో చేసిన మెటర్నిటీ షూట్ అందరి చేత ప్రశంసలు పొందుతోంది. రెండు ఫ్యాషన్ బ్రాండ్‌ల నుంచి ప్రత్యేకంగా ఎంచుకున్న దుస్తులతో దీపిక ఈ షూట్ చేసింది. రణ్‌వీర్ సింగ్ ఈ షూట్‌లో సంబరంగా పాల్గొన్నాడు.

మధ్యతరగతికి దూరం కాదు

మెటర్నిటీ షూట్‌లకు సెలబ్రిటీలు లక్షలు ఖర్చు పెడుతుంటే మధ్యతరగతి స్త్రీలకు అదేమీ అందని కల కాదు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌లతో మొదలు హాబీగా ఫొటోలు తీసేవారి వరకూ ఇలాంటి ఫొటోలు తీసి పెట్టేవారు ఉన్నారు. నాలుగు గంటల వ్యవధిలో మూడు రకాల డ్రస్సులతో ఫొటోలు తీసి పెట్టే ప్యాకేజీలు కూడా ఉన్నాయి. 'ఒకప్పుడు గర్భిణులు కెమెరా ముందుకు రావడానికి సిగ్గు పడేవారు. కాని తమ మాతృత్వ దశలను పదిలం చేసుకునేందుకు ఇప్పుడు సంతోషంగా ముందుకొస్తున్నారు' అని ఇలాంటి ఫొటోలు తీసే ఒక ఫొటోగ్రాఫర్ అన్నారు.

థీమ్ ఫొటోలు

ప్రెగ్నెన్సీ షూట్‌లో కూడా థీమ్స్ ఉన్నాయి. పల్లెటూరి జంటలుగా, నగర శ్రీమంతులుగా, గుడి ప్రాంగణంలో, తెలుగుదనంతో ఇలా చాలా రకాలున్నాయి. ఎనిమిదవ నెలలో ఈ ఫొటోషూట్ చేయించుకుంటే ఫొటోలు బాగావస్తాయంటున్నారు నిపుణులు. ఇంకెందుకు ఆలస్యం. మీ మనసులో ఈ ముచ్చట ఉంటే వెంటనే అందుకు సిద్ధం కండి.

నేడు అంతర్జాతీయ దాత్రుత్వ దినోత్సవం

ఖమ్మం గుమ్మంలో వరద.
బెజవాడ కంటిలో బుడమేరు పొంగు.
ఆకలి ఆర్తనాదాలు తెలుగువారిని చుట్టుముట్టాయి.
ఈ సమయంలో సాయం చేసే చేతులే కాదు
దాతృత్వం చూపే గుండెలూ కావాలి.
నోట్ బుక్స్ తడిసిపోయిన ఒక చిన్నారికి
స్కూల్ బ్యాగ్‌తో మొదలు గుడిసె కూలిన ఒక పేదవాడికి
చిన్న ఆసరా వరకూ దాతృత్వంతో సాయం చేయవచ్చు.
ప్రభుత్వాలు చేసే పనులు ప్రభుత్వాలు చేస్తాయి.
మనుషులం మనం. ఇవ్వడం తెలిసినవాళ్లం.
ఇది ఇవ్వాల్సిన సమయం.



వరదెత్తిన కష్టాల్లో కరుణే ప్రదానం

'దానం చేయడం వల్ల ఎవరూ పేద కాబోరు' అంటుంది ఆనీ ఫ్రాంక్ అనే యూదు బాలిక. 'ఎంత దానం ఇస్తున్నావన్నది కాదు... ఎంత ప్రేమగా దానం ఇస్తున్నావన్నదే ముఖ్యం' అంది మదర్ థెరిసా. 'దానమీయని వాడు ధన్యుండుగాడయ' అన్నాడు వేమన. 'దానం చేయనివారు భూమికి పెద్ద భారం' అన్నాడు శ్రీనాథుడు. 'పిట్టకు చారెడు గింజలు... చెట్టుకు చెంబుడు నీళ్లు... ఇవి అందించడానికి మించిన మానవ జన్మకు పరమార్థం ఏముటుంది' అంటుంది ఓ కథలోని బామ్మ. దానం మనిషి గుణం. ముఖ్యంగా సాటి మనిషి కష్టకాలంలో ఉన్నప్పుడు దానం చేయడానికి తప్పకుండా ముందుకు రావాలి.

మనది దానకర్ణుడి నేల

మనది దాన కర్ణుడి నేల. ఒకసారి కృష్ణుడు కర్ణుడిని చూడటానికి వెళితే ఆ సమయానికి అతను స్నానానికి సిద్ధమవుతూ రత్నాలు పొదిగిన గిన్నెలో నూనె తలకు రాసుకుంటున్నాడట. కృష్ణుడు ఆ గిన్నె చూసి 'కర్ణా.. గిన్నె చాలా బాగుంది ఇస్తావా' అనగానే ఎడమ చేతిలో ఉన్న గిన్నెను 'తీసుకో' అని అదే చేత్తో ఇచ్చేశాడట కర్ణుడు. కృష్ణుడు ఆశ్చర్యపోయి 'అదేమిటి కర్ణా... ఎడమ చేత్తోనే ఇచ్చేశావు' అనంటే కర్ణుడు 'అంతే కృష్ణా. దానంలో ఆలస్యం కూడదు. నువ్వు అడిగాక ఎడమ చేతిలో నుంచి కుడి చేతిలోకి మారేలోపు నా మనసు మారొచ్చు. లేదా నాకు మృత్యువు సమీపించవచ్చు. అందుకే ఇచ్చేశాను' అన్నాడట. లోకంలో ఎందరో చక్రవర్తులు పుట్టి ఉంటారు, గిట్టి ఉంటారు. కాని దానం కోసం నిలిచిన శిబి, బలి చక్రవర్తులే ఇన్ని వేల ఏళ్ల తర్వాత కూడా శ్లాఘించబడుతున్నారు.

వరదల్లో అన్నం పెట్టిన తల్లి

తూర్పు గోదావరి జిల్లాలోని లంకలగన్నవరంలో తరచూ వరదల చేత లేదంటే పొలాలు పండకపోవడం చేత జనం ఆకలితో అల్లాడుతుంటే వారి కోసమని అన్నదానం మొదలెట్టి ఆంధ్రుల అన్నపూర్ణగా కొలవబడుతున్న తల్లి డొక్కా సీతమ్మ (1841–1909)ను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. మన దగ్గర ఉన్నది అవసరమున్న వారికి పంచడం వల్ల కలిగే తృప్తి, దొరికే ఆశీర్వచనం దైవికమైనవి. దానాల్లోకెల్లా శ్రేష్ఠమైనది అన్నదానం అంటారు. ఇవాళ వరదల్లో చిక్కుకున్నవారి కోసం అన్నదానం చేయవలసినవారే కావాల్సింది.

స్పందించే హృదయం

మనిషి హృదయానికి ఉన్న గొప్ప లక్షణం స్పందించే గుణం. అదే మానవత్వ గుణం. కరుణ, కనికరం, దయ, సానుభూతి ఇవన్నీ సాటి మనిషి కోసం సాయపడమంటాయి. సాయంలో ఉన్నతమైనది దాతృత్వం. కొందరు అడగకపోయినా దానం చేస్తారు. కొందరు అడిగినా చేయరు. ఉండి కూడా చేయరు. ఒకప్పుడు పెద్ద పెద్ద ఘటనలు జరిగితే సినిమా హీరోలతో మొదలు సామాన్యుల వరకూ స్పందించేవారు. కనీసం నూట పదహార్లు పంపే పేదవారు కూడా ఉండేవారు. ఇవాళ దానం కోసం ప్రోత్సహించే వ్యక్తులు లేరు. తామే తార్కాణంగా నిలవాలని కూడా అనుకోవడం లేదు. వేల కోట్లు ఉన్నవారు కూడా రూపాయి విదల్చకపోతే ఆ సంపదకు అర్థం ఏమిటి?

లక్ష సాయాలు

ఇవాళ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో వరద బీభత్సంగా ఉంది. పిల్లలకు పుస్తకాల దగ్గర నుంచి వృద్ధులకు మందుల వరకు అన్నీ కావాలి. వంట పాత్రలు నాశనమయ్యాయి. స్టవ్‌లు పాడయ్యాయి. ఇళ్లు కూలిన వారు ఎందరో. పశువులు కొట్టుకుని పోయాయి. చేతి వృత్తుల పరికరాలు, ఉపాధి సామాగ్రి అంతా పోయింది. జనం రోడ్డున పడ్డారు. వీరి కోసం ఎన్ని వేల మంది సాయానికి వస్తే అంత మంచిది. సరియైన చారిటీ సంస్థలకు విరాళాలు ఇచ్చి సాయం అందగలిగేలా చూడటం అందరి విధి. లేదా ముఖ్యమంత్రుల సహాయనిధికే విరాళం ఇవ్వొచ్చు. మన దగ్గర డబ్బు లేకపోతే సమయం అయినా దానం ఇవ్వొచ్చు. సమయం వెచ్చించి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నా చాలు. నేడు 'అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం' సందర్భంగా చంద్రునికో నూలుపోగైనా ఇద్దామని సంకల్పిద్దాం.

● స్వీడన్ - వెల్‌డన్

మాయ 'తెర'కు పరిమితులు



'చిన్నీ.... పడుకో...'

'ఫైవ్ మినిట్స్ మమ్మీ...'

'ఫైవ్ మినిట్స్ అంటావు.....గంటలకొద్దీ ఫోన్‌లో గేమ్స్ ఆడుతుంటావు. త్వరగా లేవడానికి మాత్రం ఏడుస్తుంటావు'

.....ఇలాంటి మాటలు ఎన్నో ఇండ్లలో వినిపిస్తుంటాయి.

సాధారణంగా పెద్దవాళ్లు 'నిద్రలేమి' సమస్యను ఎదుర్కొంటారు. అయితే స్వీడన్‌లో మాత్రం పిల్లలు కూడా 'నిద్రలేమి'కి గురవుతున్నారు. దీనికి కారణం వారు ఎక్కువ సమయం డిజిటల్ మీడియా, టీవీల ముందు గడపడమే. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్వీడన్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ పిల్లల స్క్రీన్ టైమ్‌కు సంబంధించి తల్లిదండ్రులు పరిమితులు విధించాలని సూచించింది. రెండు నుంచి అయిదు సంవత్సరాల మధ్య పిల్లలు రోజుకు ఒక గంట, ఆరు నుంచి పన్నెండేళ్ల వయసు మధ్య ఉన్న పిల్లలు గంట లేదా అంత కంటే కొంచెం ఎక్కువ 'స్క్రీన్‌టైమ్' ఉండేలా చూసుకోవాలన్నారు.

ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపం అనేది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఈ నేపథ్యంలో వారి స్క్రీన్ టైమ్‌పై పరిమితులు విధించడం తప్పనిసరి అంటుంది స్వీడన్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ. స్వీడన్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ మార్గదర్శకాలు స్క్రీన్ టైమ్ తగ్గించడానికే కాదు పిల్లల అలవాట్లలో మార్పు తేవడానికి ఉద్దేశించినవి కూడా. 'బెటర్ స్లీప్ హైజీన్'లో భాగంగా రాత్రి సమయంలో పిల్లల బెడ్‌రూమ్‌లో ఫోన్‌లు, ట్యాబ్‌లాంటివి దూరంగా పెట్టాలని ఏజెన్సీ తల్లిదండ్రులకు సూచించింది.

స్వీడన్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ గణాంకాల ప్రకారం పదమూడు నుంచి పదహారు సంవత్సరాల మధ్య వయసు వారు ఆరు లేదా అంతకంటే ఎక్కువ సమయం స్క్రీన్‌ల ముందు గడుపుతున్నారు. దీని వల్ల ఫ్యామిలీ ఇంటక్షరాక్షన్, ఫిజికల్ యాక్టివిటీలకు దూరం కావడమే కాదు 'నిద్రలేమి' 'డిప్రెషన్'...మొదలైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

పిల్లలు ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం అనేది మన దేశంలోనూ పెద్ద సమస్యగా మారింది. 'అధిక స్క్రీన్ టైమ్' వల్ల కలిగే నష్టాలను పిల్లలకు అర్థమయ్యేలా చెబితే ఫలితం ఉంటుందని చెబుతున్నారు వైద్య నిపుణులు.



నేటి 'సాక్షి' ఈపేపర్‌లో 'సాగుబడి' పేజీ

'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

హర్ ఘర్ దుర్గ

కోల్‌కతాలో అభయ...
హైదరాబాద్‌లో దిశ...
ఢిల్లీలో నిర్భయ.
చెప్పుకుంటూ పోవడమేనా?
వేదన నింపుకోవడమేనా?
లేడి కొమ్ములు దిగబడిన పులి కళ్లల్లో
భయం కూడా సాధ్యమే.
శిక్షణ తీసుకుంటే
రక్షణాయుధాన్ని వాడితే
దుర్మార్గం ఆగుతుంది.
దుష్టుడు మన చేత చిక్కి
కటకటాల పాలవుతాడు.



ఆపద వస్తే ఎవరు సహాయం చేస్తారా అని నిస్సహాయంగా చూడడం కాదు, తనను తాను రక్షించుకోవడానికి 'ఆమె'ను సమాయత్తం చేయాలి. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ పని చేస్తోంది. 'హర్ ఘర్ దుర్గ' (ప్రతి ఇంట్లో దుర్గ) అనే నినాదంతో మహిళలకు స్వీయరక్షణ ప్రచారం మొదలుపెట్టింది. అమ్మాయిలకు కరాటే, జూడోలలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ఐటీఐలన్నింటిలోనూ అమ్మాయిలకు ఆత్మరక్షణ కోసం కరాటే, జూడో క్లాసులు నిర్వహించనుంది. వారంలో కనీసం రెండు గంటల సమయం శారీరక వ్యాయామం, ఆత్మరక్షణ విద్యలకు కేటాయిస్తున్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంఘాల సహకారం తీసుకోనున్నట్లు తెలియచేశాయి అధికార వర్గాలు. మనదగ్గర ఈ పని ఐదేళ్ల కిందటే మొదలైంది. తెలంగాణ, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన తగుళ్ల స్వర్ణయాదవ్ అనే యువతి కర్రసాము నేర్చుకుని, హైదరాబాద్‌లో అకాడమీ స్థాపించి బాలికలకు నేర్పిస్తోంది.



కర్రసాము... మార్షల్ ఆర్ట్స్

స్వర్ణ యాదవ్ ఫోక్ సింగర్. పాటలు పాడడానికి ఒంటరిగా వెళ్లాల్సి వచ్చేది. ప్రోగ్రామ్ పూర్తయిన తర్వాత ఇంటికి చేరేసరికి రాత్రి పది దాటుతుంది. తనను తాను రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలనుకుందామె. మన దగ్గర కర్రసాము ఉందిగాని నేర్పించేవారు లేరు. తమిళనాడులో సిలంబం (కర్రసాము) ఆర్ట్ బాగా విస్తరించి ఉంది. తమిళనాడు వెళ్లి రెండేళ్ల కోర్సు చేశారు స్వర్ణ. తాను నేర్చుకుంటే సరిపోదు, వీలయినంత ఎక్కువ మంది అమ్మాయిలకు నేర్పించాలని నిర్ణయించుకుంది. హైదరాబాద్‌కి తిరిగి వచ్చిన తర్వాత 2019 నుంచి స్కూళ్లలో నేర్పించడం మొదలు పెట్టింది. 'స్వర్ణ ఆర్ట్స్ అకాడమీ'ని 2022లో రిజిస్టర్ చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్ బంగ్లాలో ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకుంది. పది మందికి శిక్షణ ఇచ్చి పూర్తి స్థాయిలో శిక్షకులుగా తయారు చేసి వారి సహాయంతో యూసుఫ్‌గూడ, ఉప్పల్, పటాన్‌చెరు, ఎల్‌బీనగర్, మాదాపూర్, కూకట్‌పల్లిలో ఫ్రీ క్యాంపులు నిర్వహించింది. స్కూళ్లలో కూడా ఉచితంగా నేర్పించింది.. హైదరాబాద్ నగరంలో శిక్షణ తర్వాత తమ సర్వీస్‌ని తెలంగాణ జిల్లాలకు విస్తరించాలనుకుంటున్నట్లు చెబుతోందామె.

అబ్బాయిలకు కూడా!

''కర్రసాముతో పాటు మనదేశీయ యుద్ధకళలన్నింటినీ మా అకాడెమీలో పరిచయం చేయాలనేది భవిష్యత్తు ఆలోచన. రాబోయే వేసవికి పంజాబ్ మార్షల్ ఆర్ట్ 'గట్కా'ను ప్రవేశపెడుతున్నాం. స్కూళ్లలో అమ్మాయిలతోపాటు అబ్బాయిలకు కూడా నేర్పిస్తున్నాం. ఎందుకంటే ఈ జనరేషన్ అబ్బాయిల్లో దేహదారుఢ్యం తగినంతగా ఉండడం లేదు. స్మార్ట్ ఫోన్‌లలో మునిగిపోయి ఊబకాయులవుతున్నారు. అమ్మాయిలకు ఆత్మరక్షణ ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, అబ్బాయిల్లో ఫిట్‌నెస్ పెంపొందించడానికి ప్రయత్నం చేస్తున్నాం' అన్నారు స్వర్ణ యాదవ్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వైరల్

పందొమ్మిదేళ్లకు 'ఫ్యామిలీ ట్రీ'ట్



జపాన్‌లోని ఒసాకా యూనివర్శిటీ ఆఫ్ ఆర్ట్స్‌లో ఒక విద్యార్థి రిన్. ఇరవై ఏళ్ల రిన్ ని ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా కాలేజీ వాళ్లు 'ఫ్యామిలీ ట్రీ' తయారుచేయమన్నారు. తల్లి తప్ప మరెవరూ లేకపోవడంతో తండ్రి ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నించాడు రిన్.

తల్లి సచియే తకహాతాను అడిగాడు. తల్లి–తండ్రి విడిపోయే సమయంలో రిన్ వయసు కేవలం ఒక సంవత్సరం మాత్రమే. వారు విడిపోయిన తర్వాత ఇద్దరి మధ్య ఎటువంటి కమ్యూనికేషన్ లేదు. 'ఆధారాల కోసం వెతికే క్రమంలో కొన్ని పాత ఫ్యామిలీ ఫొటోలు, తండ్రి సుఖ్‌పాల్ పేరు, అమృతసర్ అడ్రస్ దొరికాయి. గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ కోసం వెతికి, టికెట్ బుక్ చేసుకొని ఆగస్టు 15న పంజాబ్‌లోని అమృత్‌సర్‌కి చేరుకున్నాడు.

అయితే విధి అతన్ని మరింతగా పరీక్ష పెట్టింది. సుఖ్‌పాల్ అక్కడి నుండి ఎప్పుడో వేరే ప్రాంతానికి షిఫ్ట్ అయ్యాడని తెలిసింది. తండ్రి ప్రస్తుతం ఉంటున్న అడ్రెస్ ఎవరూ చెప్పలేకపోయారు. 'నా దగ్గర మా నాన్న పాత ఫొటోలు ఉండటంతో స్థానిక ప్రజలను అడిగి కనుక్కోవడానికి ప్రయత్నించాను. చాలా మందిని అడిగాక అదృష్టం కొద్దీ ఒక వ్యక్తి నా తండ్రి ఫొటో గుర్తించి, అతని కొత్త చిరునామా నాకు ఇచ్చే ఏర్పాటు చేశాడు. అలా 19 ఏళ్ల తర్వాత మా నాన్నను మళ్లీ కలవగలిగాను' అని తండ్రిని కలుసుకున్న ఉద్విగ్న క్షణాలను పంచుకుంటున్నాడు రిన్.



'ఇలా జరుగుతుందని నేనెప్పుడూ ఊహించలేదు. కానీ, జరిగింది. నా ప్రస్తుత భార్య గుర్విందర్‌జీత్ కౌర్, నా ఏకైక కుమార్తె అల్లీన్ కూడా రిన్‌ను కుటుంబంలోకి హృదయపూర్వకంగా స్వాగతించినందుకు సంతోషంగా ఉన్నాను. నా మాజీ భార్య సచియేతో ఫోన్‌లో మాట్లాడాను. రిన్ క్షేమం గురించి చెప్పాన'ని సుఖ్‌పాల్ కొడుకును కలుసుకున్న మధుర క్షణాలను పంచుకుంటున్నాడు.

రక్షాబంధన్ రోజే...

రిన్ తండ్రి కుటుంబాన్ని కలవడం, పండగ ప్రాముఖ్యతను గురించి తెలుసుకొని, ఆ రోజు సవతి సోదరి అల్లీన్ చేత రాఖీ కట్టించుకోవడం.. వంటివి రిన్‌ను థ్రిల్ అయ్యేలా చేశాయి. 'మా సోదర–సోదరీ బంధం చాలా బలమైనది' అని ఆనందంగా చెబుతాడు రిన్.

కొడుకును అమృత్‌సర్‌కి తీసుకెళ్లి

ఇన్నేళ్లకు వచ్చిన కొడుకును వెంటబెట్టుకొని సుఖ్‌పాల్ స్వర్ణదేవాలయాన్ని సందర్శించుకున్నాడు. అటారీ వాఘా సరిహద్దులో జరిగిన జెండా వేడుకను వీక్షించారు. సుఖ్‌పాల్ తన గతాన్ని వివరిస్తూ '2000 సంవత్సరం మొదట్లో థాయ్‌లాండ్ విమానాశ్రయంలో భారతదేశానికి తిరిగి వస్తున్నప్పుడు అనుకోకుండా సచియేను చూశాను. విమానంలో మా సీట్లు పక్కపక్కనే ఉన్నాయి. అలా మా మొదటి సంభాషణ జరిగింది. ఆమె వరుసగా ఎర్రకోట, తాజ్‌మహల్‌లను సందర్శించడానికి న్యూఢిల్లీ, ఆగ్రాకు వెళుతోంది. గోల్డెన్ టెంపుల్ గురించి చెప్పి, అమృత్‌సర్‌కి తన పర్యటనను పొడిగించమని సచియేని నేనే అడిగాను. ఆమె వెంటనే 'ఓకే' చెప్పి అమృత్‌సర్‌కి నాతో పాటు వచ్చింది. మా కుటుంబంతో కలిసి 15 రోజులకు పైగా ఉంది. ఇక్కడ ఉన్న సమయంలో స్థానిక పర్యాటక ప్రదేశాలతో పాటు ఎర్రకోట, తాజ్‌మహల్‌ను సందర్శించాం. సచియే జపాన్‌కు వెళ్లాక కూడా ఇద్దరం ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం. అప్పుడు తనకు 19 ఏళ్లు, నాకు 20 ఏళ్లు. 2002లో సచియేను వివాహం చేసుకుని, జపాన్ పర్యటనకు వెళ్లాను. ఏడాది తర్వాత రిన్ జన్మించాడు. నేను జపనీస్ నేర్చుకున్నాను. అక్కడ చెఫ్‌గా పని చేశాను. కొన్ని రోజుల తర్వాత మేం కొన్ని కారణాల వల్ల కలిసి ఉండలేకపోయాం. దీంతో నేను భారతదేశానికి తిరిగి వచ్చేశాను. ఆమె రిన్‌తో కలిసి నన్ను చూడటానికి భారతదేశం వచ్చింది. మరోసారి తనతో కలిసి జపాన్‌కు వెళ్లాను. కానీ, కలిసి ఉండలేకపోయాం. 2004లో విడాకులు తీసుకున్నాం. ఆ తర్వాత మూడేళ్లు జపాన్‌లోనే ఉన్నా కానీ, వారిని కలవలేదు. 2007లో స్వదేశానికి తిరిగి వచ్చి మళ్లీ పెళ్లి చేసుకున్నాను. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. ఇప్పుడు మేమంతా రిన్‌తో టచ్‌లో ఉంటాం' అని గత స్మృతులను, ప్రస్తుత ఆనందాన్ని ఏకకాలంలో పొందుతూ ఆనందంగా చెబుతున్నాడు సుఖ్‌పాల్.



పారిస్ పారాలింపిక్స్‌లో నేటి భారత షెడ్యూల్

షూటింగ్
మిక్స్‌డ్ 50 మీటర్ల పిస్టల్ ఎస్‌హెచ్1 (క్వాలిఫికేషన్): నిహాల్ సింగ్–రుద్రాన్ష్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి)

అథ్లెటిక్స్
పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 (పతక పోరు): యాసిర్, రోహిత్, సచిన్ (మధ్యాహ్నం గం. 1:35 నుంచి), మహిళల షాట్‌పుట్ ఎఫ్46 (పతక పోరు): అమిషా రావత్ (మధ్యాహ్నం గం. 3:17 నుంచి), పురుషుల క్లబ్ త్రో ఎఫ్51 (పతక పోరు): ధరమ్‌వీర్, ప్రణవ్, అమిత్ కుమార్ (రాత్రి గం. 10:50 నుంచి), మహిళల 100 మీటర్ల టి12 (హీట్): సిమ్రన్ (రాత్రి గం. 11:03 నుంచి)

సైక్లింగ్
పురుషుల సి2 వ్యక్తిగత రోడ్ టైమ్ ట్రయల్ (పతక పోరు): అర్షద్ షేక్ (రాత్రి గం. 11:57 నుంచి), మహిళల సి1–3 వ్యక్తిగత రోడ్ టైమ్ ట్రయల్ (పతక పోరు): జ్యోతి గడేరియా (మధ్యాహ్నం గం. 12:32 నుంచి)

పవర్ లిఫ్టింగ్
పురుషుల 49 కేజీలు (పతక పోరు): పరమ్‌జీత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి), మహిళల 45 కేజీలు (పతక పోరు): సకీనా ఖాతూన్ (రాత్రి గం. 8:30 నుంచి)

టేబుల్ టెన్నిస్
మహిళల సింగిల్స్ క్లాస్ 4 (క్వార్టర్ ఫైనల్స్): భవీనా పటేల్ X జో యింగ్ (చైనా) (మధ్యాహ్నం గం. 2:15 నుంచి)

ఆర్చరీ
పురుషుల రికర్వ్ (ప్రిక్వార్టర్ ఫైనల్): హర్వీందర్ సింగ్ X సెంగ్ లుంగ్ హుయి (చైనీస్ తైపీ) (సాయంత్రం గం 5:49 నుంచి)

భళా బంగ్లాదేశ్

పాక్‌పై 2–0తో టెస్టు సిరీస్ కైవసం



రావల్పిండి: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సంచలనం సృష్టించింది. పాకిస్తాన్ పర్యటనలో భాగంగా రెండో టెస్టులో 6 వికెట్ల తేడాతో గెలిచిన బంగ్లాదేశ్... 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. టెస్టు క్రికెట్ చరిత్రలో పాకిస్తాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. 185 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 42/0తో మంగళవారం ఐదో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 56 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసింది. ఓపెనర్లు జాకీర్ హసన్ (40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాద్‌మన్ ఇస్లామ్ (24), కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (38), మోమినుల్ హక్ (34), ముష్ఫికర్ రహీమ్ (22 నాటౌట్), షకీబ్ అల్ హసన్ (21 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు. అంతకుముందు పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేయగా... బంగ్లాదేశ్ 262 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌటైన పాకిస్తాన్... బంగ్లాదేశ్ ముందు స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. లిటన్ దాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', మెహదీ హసన్ మిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు లభించాయి.

సెమీస్‌లో నవారో

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో 13వ సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో నవారో 6–2, 7–5తో పౌలా బడోసా (స్పెయిన్)పై నెగ్గి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), ఆరో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ యానిక్ సినెర్ (అమెరికా), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)–అల్దిలా సుత్జియాది (ఇండోనేసియా) ద్వయం 7–6 (7/4), 2–6, 10–7తో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)–క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) జంటను ఓడించి సెమీఫైనల్‌కు చేరింది.

దీప్తికి కాంస్యం

మహిళల 400 మీటర్ల టి20 విభాగంలో మూడో స్థానం

పారాలింపిక్స్‌లో పతకం నెగ్గిన తొలి తెలంగాణ ప్లేయర్‌గా ఘనత



పారాలింపిక్స్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శనను అధిగమించే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. సోమవారం ఏకంగా ఎనిమిది పతకాలతో భారత క్రీడాకారులు అదరగొట్టగా... మంగళవారం కాంస్యం రూపంలో ఒక పతకం లభించింది. మహిళల అథ్లెటిక్స్ 400 మీటర్ల టి20 రేసులో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజి కాంస్య పతకం సాధించింది. ప్రపంచ పారా చాంపియన్, పారా ఆసియా గేమ్స్ చాంపియన్ హోదాలో తొలిసారి పారాలింపిక్స్‌లో అడుగుపెట్టిన దీప్తి మూడో స్థానాన్ని సంపాదించింది. దీప్తి కాంస్యంతో పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 16కు చేరుకుంది. మరిన్ని మెడల్ ఈవెంట్స్‌లో మన క్రీడాకారులు పోటీపడాల్సి ఉండటంతో ఈసారి భారత్ పతకాల సంఖ్య 20 దాటే అవకాశముంది. మూడేళ్ల క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో భారత్ 19 పతకాలతో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది.

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్ ఖాతాలో 16వ పతకం చేరింది. మంగళవారం జరిగిన మహిళల అథ్లెటిక్స్ 400 మీటర్ల టి20 కేటగిరి ఫైనల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజి కాంస్య పతకాన్ని సాధించింది. ఎనిమిది మంది పోటీపడ్డ ఫైనల్లో 20 ఏళ్ల దీప్తి 55.82 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానాన్ని దక్కించుకుంది. యూలియా షులియర్ (ఉక్రెయిన్; 55.16 సెకన్లు) స్వర్ణం సంపాదించగా... టర్కీ అథ్లెట్ ఐసెల్ ఒండెర్ (55.23 సెకన్ల) రజత పతకాన్ని గెల్చుకుంది. ఈ ఏడాది మేలో జపాన్‌లో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 55.07 సెకన్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు స్వర్ణ పతకం నెగ్గిన దీప్తి అదే ప్రదర్శనను 'పారిస్'లో పునరావృతం చేయలేకపోయింది. ఒకవేళ ఇదే టైమింగ్‌ను దీప్తి 'పారిస్'లో నమోదు చేసి ఉంటే ఆమెకు స్వర్ణ పతకం లభించేది. ఫైనల్ రేసు ఆరంభంలో చివరి వరకు రెండో స్థానంలో ఉన్న దీప్తి ఆఖరి పది మీటర్లలో వెనుకబడిపోయి మూడో స్థానంలో నిలిచింది. సోమవారం రాత్రి జరిగిన హీట్స్‌లో 54.96 సెకన్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించిన టర్కీ అథ్లెట్ ఐసెల్ ఒండెర్ చివరి పది మీటర్లలో వేగంగా పరుగెత్తి దీప్తిని దాటేసి రజత పతకాన్ని ఖరారు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత ముగిసిన మహిళల బ్యాడ్మింటన్ ఎస్‌హెచ్6 సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణి నిత్యశ్రీ శివన్ కాంస్య పతకాన్ని సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో నిత్యశ్రీ 21–14, 21–6తో రీనా మార్లిన్ (ఇండోనేసియా)పై గెలిచింది. మహిళల షాట్‌పుట్ ఎఫ్34 కేటగిరీలో భారత అథ్లెట్ భాగ్యశ్రీ జాదవ్ ఇనుప గుండును 7.28 మీటర్ల దూరం విసిరి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.

అవనికి ఐదో స్థానం
తన పారాలింపిక్స్ కెరీర్‌లో మూడో పతకం సాధించాలని ఆశించిన భారత మహిళా షూటర్ అవని లేఖరాకు నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఎస్‌హెచ్1 ఈవెంట్ ఫైనల్లో 22 ఏళ్ల అవని ఐదో స్థానంలో నిలిచింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అవని 420.6 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానాన్ని దక్కించుకుంది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో అవని 1159 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది.

ముగిసిన పూజ పోరు
మహిళల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత ప్లేయర్ పూజ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో పూజ 4–6 (28–23, 25–24, 27–28, 24–27, 24–27)తో వు చున్‌యాన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. వరుసగా రెండు సెట్‌లు గెలిచిన పూజ 4–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మరో సెట్‌లో స్కోరును సమం చేసినా పూజ సెమీఫైనల్‌కు చేరుకునేది. కానీ పూజ తడబడి మూడు సెట్‌లను కోల్పోయి ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో పూజ 6–0 (27–24, 26–22, 272–6)తో యాగ్మర్ (టర్కీ)పై నెగ్గింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కల్లెడ నుంచి 'పారిస్' దాకా...



పారా అథ్లెటిక్స్‌లో టి20 కేటగిరీ అంటే 'మేధోలోపం' ఉన్న క్రీడాకారులు ప్లేయర్లు పాల్గొనే ఈవెంట్. దీప్తి స్వస్థలం వరంగల్ జిల్లాలోని కల్లెడ గ్రామం. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి రోజువారీ కూలీలు. ఒకవైపు పేదరికం ఇబ్బంది పెడుతుండగా... మరోవైపు దీప్తిని 'బుద్ధిమాంద్యం' ఉన్న అమ్మాయిగా గ్రామంలో హేళన చేసేవారు. ఇలాంటి తరుణంలో భారత అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ ఆమెకు అన్ని విధాలా అండగా నిలిచారు. ఒక స్కూల్ టోర్నీలో దీప్తి రన్నింగ్ ప్రతిభ గురించి తన స్నేహితుడి ద్వారా రమేశ్‌కు తెలిసింది. దాంతో రమేశ్ ఆ అమ్మాయిని హైదరాబాద్‌కు రప్పించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రంలో ట్రెయినింగ్ అందించే ఏర్పాట్లు చేశారు. మానసికంగా కొంత బలహీనంగా ఉండటంతో దీప్తికి శిక్షణ ఇవ్వడంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. భారత బ్యాడ్మింటన్ హెడ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా 'మైత్రా ఫౌండేషన్'తో కలిసి దీప్తికి ఆర్థికంగా సహకారం అందించారు. కెరీర్ ఆరంభంలో దీప్తి అందరూ పాల్గొనే సాధారణ అథ్లెటిక్స్ ఈవెంట్లలోనూ పోటీ పడి విజయాలు సాధించడం విశేషం. 2019 ఆసియా అండర్–18 చాంపియన్‌షిప్‌లో కాంస్యం, 2021 సీనియర్ నేషనల్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి 2022లో చివరిసారిగా రెగ్యులర్ పోటీల బరిలోకి దిగింది. రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనడం ద్వారా దీప్తికి 'పారా క్రీడల' లైసెన్స్ లభించింది. దాంతో పూర్తిగా పారా పోటీలపైనే ఆమె దృష్టి పెట్టింది. గత ఏడాది జరిగిన గ్వాంగ్జూ ఆసియా పారా క్రీడల్లో 400 మీటర్ల ఈవెంట్‌లోనే దీప్తి స్వర్ణం గెలుచుకుంది. ఆర్థిక సమస్యలతో ఒకదశలో తమ భూమిని అమ్ముకున్న తల్లిదండ్రులు దీప్తి 'ఆసియా' స్వర్ణ ప్రదర్శనతో ప్రభుత్వం ఇచ్చిన రూ. 30 లక్షలతో మళ్లీ భూమి కొనుక్కోగలిగారు. ఈ ఏడాది మే నెలలో జపాన్‌లో జరిగిన ప్రపంచ పారా చాంపియన్‌షిప్‌లో దీప్తి 55.07 సెకన్లతో కొత్త ప్రపంచ రికార్డును సృష్టించి పారాలింపిక్స్‌లో మెడల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. తనపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ పతకం సాధించింది.

భారత్ 0 మారిషస్ 0

'డ్రా'గా ముగిసిన ఇంటర్ కాంటినెంటల్ కప్ టోర్నీ తొలి మ్యాచ్



సాక్షి, హైదరాబాద్: భారత ఫుట్‌బాల్ జట్టు అంతర్జాతీయ వేదికపై ఇంకా ఎంతో ఎదగాల్సిన అవసరం ఉందని మరోసారి రుజువైంది. కొత్త కోచ్ మార్కెజ్ నేతృత్వంలో కొత్తగా జట్టు విజయాల బాట పడుతుందని ఆశించినా అది సాధ్యం కాలేదు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 179వ స్థానంలో ఉన్న మారిషస్ జట్టు కూడా భారత్‌ను నిలువరించింది. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం మొదలైన ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా జరిగిన భారత్, మారిషస్ తొలి మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. ఇరు జట్లూ గోల్ చేయడంలో విఫలమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ టోర్నీని ప్రారంభించారు.

సినిమా


చార్మిలా


సోమీ అలీ


కామ్యా పంజాబీ


మినూ మునీర్


శ్రుతీ హరిహరన్


ఏక్తా కపూర్


తారల వెనుక చీకటి

సర్దుబాట పడితేనే కెరీర్ దారిలోకి?

'పనికి తగ్గ జీతం' అనేది కామన్. అయితే పనితో పాటు 'వేరే పనులు' కూడా చేయాలి... లేకపోతే పని పోయే అవకాశం ఉంది. సినిమా పరిశ్రమకి చెందిన పలువురు నటీమణులు అంటున్న మాట ఇది. అయితే తాము ఎదుర్కొంటున్న ఈ రకమైన ఒత్తిడి గురించి నటీమణులు అంత త్వరగా బయటపెట్టరు. 'మీటూ'లో భాగంగా ఆ మధ్య కొందరు పెదవి విప్పితే, ఇప్పుడు మలయాళంలో 'హేమా కమిటీ' వల్ల ఎందరో తారలు ధైర్యంగా తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంటున్నారు. ఆ విషయాల్లోకి....

చాలా అవకాశాలు కోల్పోయా! - చార్మిలా

''నా కెరీర్‌లో చేదు అనుభవాలు చాలా ఉన్నాయి. దర్శకుడు హరిహరన్, నిర్మాత ఏంపీ మోహనన్ నా పట్ల అమానుషంగా ప్రవర్తించారు. ఇంకా ఓ 28 మంది నాతో అభ్యంతరకరంగా వ్యవహరించారు'' అని నటి చార్మిలా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏయన్నార్, లక్ష్మీ జంటగా నటించిన 'ప్రాణదాత' (1992)లో వీరి కూతురిగా నటించిందామె. భానుమతీ రామకృష్ణ స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'అసాధ్యురాలు'లో నటించారు. 'ప్రేమ ఖైదీ'లో మాలాశ్రీ ఫ్రెండ్‌గా నటించారు. తమిళంలో పలు చిత్రాల్లో నటించిన చార్మిలా మలయాళంలో దాదాపు 40 చిత్రాల్లో నటించారు. తాజాగా ఓ మలయాళ మీడియాతో చార్మిలా మాట్లాడుతూ – ''హరిహరన్ డైరెక్షన్‌లో మలయాళ చిత్రం 'పరిణయం' (1994) అంగీకరించా. అదే సినిమాలో నటుడు విష్ణు కూడా నటించాల్సింది. 'చార్మిలా అడ్జెస్ట్‌మెంట్‌కి ఒప్పుకుంటుందా' అని విష్ణు ద్వారా హరిహరన్ అడిగించారు. 'ఒప్పుకోదు' అని విష్ణు చెప్పడంతో తనని, నన్ను ఆ సినిమా నుంచి తీసేశారు. అడ్జస్ట్ కాకపోవడంతో చాలా సినిమాలు కోల్పోయాను. నేను చాలామంది పేర్లు బయటపెట్టకపోవడానికి కారణం నాకో కొడుకు ఉన్నాడు. తల్లిగా నా బాధ్యతలు నాకున్నాయి కాబట్టి ఈ ఘటనలకు సంబంధించి యాక్షన్ తీసుకోవాలని కూడా అనుకోవడంలేదు'' అన్నారు. ఇంకా మలయాళ నిర్మాత ఎంపీ మోహనన్ గురించి చెబుతూ– ''అర్జునన్ పిళ్లయుమ్ అంజు మక్కళుమ్' (1997) నిర్మాత ఎంపీ మోహనన్ ఆ సినిమా చివరి రోజు షూటింగ్ పూర్తయ్యాక తన హోటల్ గదికి రమ్మంటే, నా స్టాఫ్‌తో కలిసి వెళ్లాను. మోహనన్, అతని ఫ్రెండ్స్ నాపై అత్యాచారం జరపడానికి ట్రై చేశారు. నేను తప్పించుకుని బయటపడ్డాను. నేనైతే బయటపడ్డాను కానీ వాళ్లు జూనియర్ ఆర్టిస్టులపై అత్యాచారం జరిపారు. నేను నాలుగు భాషల్లో (మలయాళం, తమిళ్, తెలుగు, కన్నడ) సినిమాలు చేశాను. కానీ ఇలాంటి ఘటనలు మలయాళ పరిశ్రమలోనే ఎక్కువ'' అని చార్మిలా పేర్కొన్నారు.


హరిహరన్


మలయాళంలో అత్యంత ప్రతిభ గల దర్శకుడిగా హరిహరన్‌కి పేరుంది. జాతీయ అవార్డు సాధించిన పలు చిత్రాలను తెరకెక్కించారు. వాటిలో చార్మిలా కోల్పోయిన 'పరిణయమ్' ఒకటి. 'శరపంచరమ్, పంచాగ్ని, ఒరు వడక్కన్ వీరగాథ, సర్గమ్' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు హరిహరన్. మలయాళ సినిమాకి చేసిన కృషికిగాను కేరళ అత్యున్నత పురస్కారం అయిన 'జేసీ డేనియల్ అవార్డు'ని కూడా అందుకున్నారు ఈ దర్శకుడు.

ఇది వేకప్ కాల్ - సోమీ అలీ

1990లలో తాను హిందీ సినిమాలు చేసినప్పుడు లైంగిక దాడులు ఎదుర్కొన్నానని ఇటీవల సోమీ అలీ పేర్కొన్నారు. ''కెరీర్‌లో కొనసాగాలంటే రూమ్‌కి వెళ్లాల్సిందే, లేకపోతే కుదరదు లాంటి హెచ్చరికలు నాకొచ్చాయి. కెరీర్ కోసం కొందరమ్మాయిలు అలా రూమ్‌లకు వెళ్లి, మర్నాడు ఉదయం ఇబ్బందిగా, సిగ్గుపడుతూ బయటకు వచ్చిన ఘటనలు చూశా. కానీ ఆ వ్యక్తులు మాత్రం 'ఫ్యామిలీ మేన్'లా చలామణీ అవుతుంటారు. నాకు ఎదురైన చేదు అనుభవాల వల్లే 'నో మోర్ టియర్స్' ఫౌండేషన్ ఆరంభించా. ఇక మలయాళ పరిశ్రమలోని హేమా కమిటీ ఓ వేకప్ కాల్ లాంటిది'' అని సోమీ అన్నారు.

ఎవరూ ఎవర్నీ బలవంత పెట్టరు - కామ్యా పంజాబీ

''గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ ప్రస్తుతం టీవీ రంగం క్లీన్‌గా ఉంది. ఇక్కడ (హిందీ టెలివిజన్ రంగాన్ని ఉద్దేశించి) ఏ మురికి (మహిళలపై లైంగిక దాడులు, క్యాస్టింగ్ కౌచ్‌లను ఉద్దేంచి) లేదు. ఎవరు ఎవర్నీ ఫోర్స్ చేయడం లేదు. స్క్రిప్ట్‌లోని రోల్‌కు సరిపోయి, మనలో నటించే ప్రతిభ ఉంటే చాలు. చాన్స్‌లు వస్తాయి'' అని బుల్లితెర ఫేమ్ కామ్యా పంజాబీ పేర్కొన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''వినోద రంగంలో ప్రస్తుతం మహిళలకు సేఫ్టీ ప్లేస్ ఏదైనా ఉందంటే అది టీవీ విభాగంలోనే. ఒకవేళ ఏదైనా జరుగుతుందంటే అది పరస్పర అంగీకారంతోనే. అమ్మాయి సమ్మతించకపోతే ఏదీ జరగదు. ఎవరూ ఎవర్నీ బలవంతపెట్టరు. కొందరు పురుషులు ఉమనైజర్స్‌గా ఉండొచ్చు.. కాదనడం లేదు'' అన్నారు కామ్య.



విష్ణు

దర్శకుడు హరిహరన్‌పై చార్మిలా చేసిన ఆరోపణలను మలయాళ నటుడు విష్ణు ధ్రువీకరించారు. ఓ మలయాళ మీడియాతో మాట్లాడుతూ – "తను సర్దుబాటుకి ఒప్పుకుంటుందా? అని చార్మిలాని అడిగి, తెలుసుకోమని డైరెక్టర్ నాతో అన్నారు. చార్మిలా తిరస్కరించిన విషయాన్ని నేను హరిహరన్‌తో చెప్పాను. దాంతో 'పరిణయం' సినిమా చాన్స్‌ని చార్మిలా కోల్పోయారు" అని విష్ణు పేర్కొన్నారు.

ఆరు సినిమాలు చేస్తేనే సభ్యత్వం వచ్చింది - మినూ మునీర్

మలయాళ తార మినూ మునీర్ తన పట్ల నటులు జయసూర్య, ఇడవెల బాబు, నటుడు–నిర్మాత మణియన్‌పిల్ల రాజు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్)లో సభ్యత్వం పొందాలంటే 3 చిత్రాల్లో నటిస్తే చాలట. కానీ తాను 6 సినిమాల్లో నటించినా సభ్యత్వం ఇవ్వలేదని మిను పేర్కొన్నారు. 'అమ్మ'లో వివిధ పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించిన ఇడవెల బాబుకి ఫోన్ చేసి, సభ్యత్వం గురించి అడిగారట మిను. ''మెంబర్‌షిప్ ఫామ్ పూర్తి చేయడానికి తన ఫ్లాట్‌కి రమ్మన్నాడు ఇడవెల. వెళ్లి, ఫామ్ పూర్తి చేస్తుండగా నా మెడపై ముద్దు పెట్టాడు. నేను వెంటనే అక్కణ్ణుంచి వెళ్లిపోయా'' అన్నారు మినూ మునీర్.

నాపై ఆరోపణలు అవాస్తవం - నివిన్ పౌలి



మలయాళ పరిశ్రమలో మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఇప్పటికే 15 మందికి పైగా నటులపై కేసులు నమోదు అయినట్లు వార్తలు ఉన్నాయి. తాజాగా నివిన్ పౌలి పేరు తెరపైకి వచ్చింది. ఓ మూవీలో చాన్స్ ఇప్పిస్తామని మోసం చేసిన ఆరుగురిలో నివిన్ పౌలి కూడా ఉన్నారని, ఇది 2023 నవంబరులో దుబాయ్‌లో జరిగిందని ఓ మహిళ కేరళ పోలీసులకు ఫిర్యాదు చేసిందనే వార్త వినిపిస్తోంది. దాంతో "నాపై తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినట్లుగా నా దృష్టికి వచ్చింది. ఆమె ఎవరో నాకు తెలియదు. నాపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. నా లీగల్ టీమ్ చూసుకుంటుంది" అని నివిన్ పౌలి తెలిపారు.

కన్నడంలోనూ హేమా కమిటీలాంటిది కావాలి - శ్రుతీ హరిహరన్

మలయాళంలో ఉన్నట్లుగా కన్నడ పరిశ్రమలోనూ హేమా లాంటి కమిటీ ఉండాలని కన్నడ నటి శ్రుతీ హరిహరన్ అంటున్నారు. ''హేమా కమిటీ ఇచ్చిన నివేదిక మలయాళ పరిశ్రమ గౌరవాన్ని దిగజార్చేలా ఉందన్న కొందరి మాటలతో ఏకీభవించను. సినిమా అనేది మంచి కళ. ఆ కళలో ఉన్న కొన్ని విషయాలను మార్చే టైమ్ వచ్చింది. మన ఇంటిని మనమే శుభ్రపరచుకోవాలి'' అని శ్రుతీ హరిహరన్ పేర్కొన్నారు. ఇక గతంలో నటుడు అర్జున్‌పై శ్రుతీ హరిహరన్ కొన్ని ఆరోపణలు చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే తాను అలాంటి పనులు చేయలేదంటూ అర్జున్ ఆమెపై పరువు నష్టం దావా వేశారు.

మహిళా నాయకత్వం ఉండాలి - ఏక్తా కపూర్

కరీనా కపూర్ లీడ్ రోల్‌లో హన్సల్ మెహతా దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'ది బకింగ్‌హమ్ మర్డర్స్' ఈ నెల 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన ఈవెంట్‌లో చిత్రనిర్మాత ఏక్తా కపూర్ మాట్లాడుతూ– ''ప్రతి రంగంలో మహిళలకు కూడా నాయకత్వ బాధ్యతలు అప్పగించాలి. అప్పుడు వారు మహిళల భద్రతను గురించి కొంత ఆలోచన చేస్తారు. అలాగే నాయకత్వం బలంగా ఉండేలా తోటి మహిళలు తోడ్పాటు అందించాలి. నివేదికలు వచ్చినప్పుడు చదువుతాం... చాలా తెలుసుకుంటాం. కానీ మహిళల సాధికారికత, భద్రత విషయాల్లో పని ప్రదేశాల్లో మహిళలకు మెరుగైన వాతావరణం నెలకొల్పాలి'' అన్నారు. ''మహిళలకు మెరుగైన పని వాతావరణం ఉండేలా పురుషులు కూడా బాధ్యతగా చొరవ తీసుకోవాలి'' అని హన్సల్ అన్నారు.

35ని మిస్ కాకండి - హీరో నానీ


విశ్వ, రానా, నివేదా, నానీ, నందకిశోర్, ప్రియదర్శి

''నేను '35: చిన్న కథ కాదు' సినిమా చూశాను. ఒక్కరోజు స్కూల్‌కి సెలవు పెట్టి థియేటర్‌కి వెళ్లి ఈ సినిమా చూసినా ఫర్వాలేదు. '35' తరహా సినిమా మాత్రం మళ్లీ రాదు. పొరపాటున కూడా మిస్ కాకండి'' అని నానీ అన్నారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35: చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''నేను కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తానని అంటున్నారు. చెప్పాలంటే రానా ముందు నేను నథింగ్. ఏ రంగంలో ఉన్న ప్రతిభవంతుల్నైనా రానా ప్రోత్సహిస్తారు. ఇండస్ట్రీలో నాకు ఉన్న ఓ మంచి ఫ్రెండ్ రానా. యాక్టర్స్ నుంచి మంచి పెర్ఫార్మెన్స్‌ను రాబట్టుకుంటాడు దర్శకుడు నందకిశోర్'' అని అన్నారు. ''నేను టెన్త్‌లో మ్యాథమేటిక్స్‌లో ఫెయిల్ అయ్యాను. 35 మార్క్స్ నాకు పెద్ద టాస్క్‌లా అనిపించేది. సినిమాలో అమ్మానాన్నలుగా విశ్వ, నివేదా బాగా నటించారు. కొన్ని సన్నివేశాల్లో కన్నీళ్లొచ్చాయి'' అని వెల్లడించారు రానా. ''ఈ సినిమా మనల్ని ప్రశ్నిస్తుంది.. ఆలోజింపజేస్తుంది'' అని పేర్కొన్నారు ప్రియదర్శి. ''థియేటర్లలో మీ పిల్లల చెవులు, కళ్లు మూయక్కర్లేదు'' అని తెలిపారు నందకిశోర్.

గోపీచంద్, కావ్యా థాపర్ హీరో హీరోయిన్లుగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'విశ్వం'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేసి, సినిమాను దసరా సందర్భంగా అక్టోబరు 11న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించింది





సన్నీ అఖిల్ హీరోగా బాజ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేసి, మాట్లాడుతూ– "ఈ పోస్టర్‌లో పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం కొత్తగా ఉంది. కొత్త కథలతో సినిమాలు తీసే బాజ్జీ రూపొందించిన ఈ చిత్రం సక్సెస్ అవ్వాలి" అన్నారు.



శ్రీవిష్ణు హీరోగా హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం 'శ్వాగ్'. ఈ చిత్రాన్ని అక్టోబర్ 4న విడుదల చేయనున్నామని చిత్రబృందం ప్రకటించింది. రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో మీరా జాస్మిన్, సునీల్, దక్షా నగార్కర్, శరణ్య ప్రదీప్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	4	82,555
నిఫ్టీ △	1	25,280

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,253	▽ 459
డోజోన్స్	41,064	▽ 499
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,298	▽ 65
డాక్స్	18,747	▽ 184
షాంఘై	2,802	▽ 9
నికాయ్	38,389	△ 17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,511	▽ 17
బంగారం (99.5 స్వచ్ఛత)	71,225	▽ 17
వెండి (కిలో)	82,780	▽ 505

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.53	54.55
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	109.05	111.66
€	యూరో	ఒకటికి	91.75	94.15
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	56.70	57.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	55.77	57.72
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.82	66.49
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.46	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.95	23.70
¥	చైనా యువాన్	ఒకటికి	10.90	12.72


మనోళ్లు విదేశాలను చుట్టేస్తున్నారు..!

- ఏటా రెండు సార్లు పైగా వెళ్తున్నవారి సంఖ్య 32% అప్
- మహారాష్ట్ర, కర్ణాటకలో అత్యధికంగా ఇంటర్నేషనల్ ట్రావెల్ సెర్చ్‌లు
- మేక్‌మైట్రిప్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: సానుకూల స్థూలఆర్థిక పరిస్థితుల దన్నుతో విదేశాల్లో పర్యటించే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా రెండుసార్లు లేదా అంతకు మించి పర్యటిస్తున్న వారి సంఖ్య 32 శాతం పెరిగింది. ఇక అంతర్జాతీయంగా ప్రయాణాలకు సంబంధించి ఎక్కువగా సెర్చ్‌లు నమోదవుతున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ టాప్‌లో ఉన్నాయి. 2023 జూన్ నుంచి 2024 మే మధ్య కాలానికి సంబంధించి ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫాం మేక్ మైట్రిప్ రూపొందించిన 'హౌ ఇండియా ట్రావెల్స్ ఎబ్రాడ్' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం విదేశాలకు వెళ్లే భారతీయులకు యూఏఈ, థాయ్‌లాండ్, అమెరికా టాప్ గమ్యస్థానాలుగా ఉంటున్నాయి. ఇప్పుడిప్పుడే కజకిస్తాన్, అజర్‌బైజాన్, భూటాన్‌లపై కూడా ఆసక్తి పెరుగుతోంది. 'చేతిలో కొంత మిగిలే స్థాయిలో ఆదాయాలు పెరుగుతుండటం, అంతర్జాతీయ సంస్కృతుల గురించి మరింతగా తెలుస్తుండటం, ప్రయాణాలు సులభతరం కావడం తదితర అంశాల కారణంగా విహారయాత్రలు లేదా వ్యాపార అవసరాల రీత్యా దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రయాణించే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. దేశీయంగా పర్యాటకం ప్రోత్సాహకరంగానే ఉండగా మా తాజా విశ్లేషణ ప్రకారం స్థూలఆర్థిక అంశాల ఊతంతో భారతీయుల్లో అంతర్జాతీయంగా ప్రయాణాలు చేసే ధోరణులు గణనీయంగా పెరుగుతున్నాయి' అని మేక్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు రాజేశ్ మెగో తెలిపారు.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- టాప్ 10 వర్ధమాన గమ్యస్థానాలకు సంబంధించి సెర్చ్ చేయడం 70 శాతం పెరిగింది. అజర్‌బైజాన్‌లోని అల్మటీ, బకూ కోసం సెర్చ్‌లు వరుసగా 527 శాతం, 395 శాతం పెరిగాయి.
- విలాసవంతమైన ప్రయాణాలపై కూడా భారతీయుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇంటర్నేషనల్ సెగ్మెంట్‌లో బిజినెస్ తరగతి ఫ్లయిట్స్ కోసం చేసే సెర్చ్‌లు 10 శాతం పెరగడం ఇందుకు నిదర్శనం.
- సెర్చ్‌లలో 131 శాతం వృద్ధితో హాంకాంగ్ టాప్‌లో ఉంది. శ్రీలంక, జపాన్, సౌదీ అరేబియా, మలేషియా తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- ఇంటర్నేషనల్ హోటల్ బుకింగ్స్‌లో దాదాపు సగం బుకింగ్స్ టారిఫ్ రోజుకు రూ. 7,000 పైనే ఉంటున్నాయి. హోటళ్ల విషయంలో న్యూయార్క్ అత్యంత ఖరీదైన నగరంగా ఉంది. ఈ విషయంలో బడ్జెట్‌కు అనుకూలంగా ఉండే టాప్ గమ్యస్థానాల జాబితాలో దక్షిణాసియాలోని పోఖారా, పట్టాయా, కౌలాలంపూర్ మొదలైనవి ఉన్నాయి.
- సీజన్‌లతో పనిలేకుండా విదేశీ ప్రయాణాలకు సంబంధించి సెర్చ్‌ల పరిమాణం అన్ని కాలాల్లోనూ స్థిరంగా ఉంటోంది. డిసెంబర్‌లో మాత్రం అత్యధికంగా సెర్చ్‌లు నమోదవుతున్నాయి.



జావా కొత్త బైక్ 42 ఎఫ్‌జే



ముంబై: మహీంద్రా గ్రూప్‌నకు చెందిన క్లాసిక్ లెజెండ్స్ తాజాగా సరికొత్త జావా 42 ఎఫ్‌జే బైక్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూం ధర రూ.1.99 లక్షల నుంచి రూ.2.2 లక్షల వరకు ఉంది. ఆరు వేరియంట్లలో లభిస్తుంది. 42 సిరీస్‌లో ఇది మూడవ మోడల్. 334 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ 350 ఆల్ఫా2 ఇంజన్‌తో తయారైంది. స్లిప్, అసిస్ట్ క్లచ్‌తో 6 స్పీడ్ గేర్‌బాక్స్ పొందుపరిచారు. ఎల్‌ఈడీ లైటింగ్, పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్ వంటి హంగులు జోడించారు. అక్టోబర్ 2 నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350, హోండా సీబీ350 ఆర్‌ఎస్‌కు పోటీనిస్తుంది. 2018 నవంబర్‌లో జావా బ్రాండ్ భారత్‌లో రీఎంట్రీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 450 డీలర్‌షిప్స్ ఉన్నాయి. పండుగల సీజన్ నాటికి మరో 100 జావా కేఫ్స్ రానున్నాయి. జావా వంటి పునరుత్థాన బ్రాండ్‌ల పునర్నిర్మాణంలో ఎలాంటి సవాళ్లనైనా క్లాసిక్ లెజెండ్స్ ఎదుర్కొంటుందని ఈ సందర్భంగా మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు.

6.6% నుంచి 7 శాతానికి అప్



- 2024–25లో వృద్ధి అంచనా పెంచిన ప్రపంచ బ్యాంక్
- వ్యవ'సాయం', గ్రామీణ డిమాండ్ రికవరీ నేపథ్యం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ పెంచింది. ఎకానమీ పురోగతి ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) 6.6 శాతం ఉంటుందన్న తొలి (జూన్ నివేదికలో) అంచనాలను తాజాగా 7 శాతానికి పెంచింది. వ్యవసాయ రంగంలో రికవరీ, గ్రామీణ డిమాండ్ పుంజుకోవడం తమ అంచనాల పెంపునకు కారణంగా తాజా 'ఇండియన్ డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో పేర్కొంది. రుతుపవనాల మెరుగుదల, ప్రైవేట్ వినియోగం–ఎగుమతులు పెరిగే అవకాశాలు.. అంచనాల తాజా పెంపుదలకు తోడ్పడినట్లు ప్రపంచ బ్యాంక్ సీనియర్ ఆర్థికవేత్త రాన్‌లీ చెప్పారు.

అవుట్‌లుక్ పాజిటివ్...: అంతర్జాతీయ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశ ఆర్థిక వ్యవస్థ మధ్యకాలిక అవుట్‌లుక్ 'పాజిటివ్' గా ఉందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తోంది. 2024–25లో 7 శాతం వృద్ధి రేటు నమోదయితే, తదుపరి రెండు ఆర్థిక సంవత్సరాలు (2025–26, 2026–27) ఎకానమీ పటిష్టంగా ఉంటుందని ఉద్ఘాటించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అగ్రిటెక్ స్టార్టప్‌లకు బూస్ట్
2.75 లక్షల ఫోన్ నంబర్లకు ట్రాయ్ చెక్

సెన్సెక్స్ వరుస లాభాలకు బ్రేక్

- కొనసాగిన నిఫ్టీ రికార్డు ర్యాలీ
- అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం

ముంబై: రికార్డుల స్థాయిల వద్ద ఐటీ, ఆయిల్, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణతో సెన్సెక్స్ పది రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఉదయం సెన్సెక్స్ స్వల్ప లాభంతో మొదలైంది. రోజంతా 82675 – 82401 మధ్య పరిమిత శ్రేణిలో ట్రేడైంది. చివరికి నాలుగు పాయింట్లు నష్టపోయి 82,555 వద్ద నిలిచింది. వరుసగా 14 రోజులు లాభాలు గడించిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ ఒక పాయింటు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,280 వద్ద స్థిరపడింది. ఫైనాన్స్ సర్వీసెస్, ఫార్మా, ఇండస్ట్రియల్స్, బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా, యూరప్ మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. అమెరికా సూచీలు ఒకటిన్నర శాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.

ప్రీమియర్ ఎనర్జీ బంపర్ లిస్టింగ్




సోలార్ సెల్, పీవీ మాడ్యూల్ తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.450తో పోలిస్తే 120% ప్రీమియంతో 991 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 121% ఎగసి రూ.993 గరిష్టాన్ని తాకింది. మిడ్ సెషన్ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివరికి 87% లాభంతో రూ.840 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.37,849 కోట్లుగా నమోదైంది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవో @ రూ. 6,560 కోట్లు

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తమ ఐపీవోకి (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) సంబంధించి షేరు ధర శ్రేణిని రూ. 66–70గా నిర్ణయించింది. ఈ ఇష్యూ సెప్టెంబర్ 9న ప్రారంభమై 11న ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం బిడ్డింగ్ సెప్టెంబర్ 6న ఉంటుంది. ప్రతిపాదిత ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 6,560 కోట్లు సమీకరిస్తోంది. ఇందుకోసం రూ. 3,560 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, మాతృ సంస్థ బజాజ్ ఫైనాన్స్ రూ. 3,000 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో విక్రయించనుంది. ఇన్వెస్టర్లు కనీసం 214 షేర్లు చొప్పున బిడ్ చేయొచ్చు. సమీకరించే నిధులను భవిష్యత్ మూలధన అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర లాభం రూ. 1,258 కోట్ల నుంచి 38% పెరిగి రూ. 1,731 కోట్లకు పెరిగింది.

- రూ. 66–70 శ్రేణిలో షేరు ధర
- సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు ఇష్యూ



రూ. 500 కోట్ల క్రోస్ ఇష్యూ ..

ఆటో విడిభాగాల సంస్థ క్రోస్ లిమిటెడ్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కూడా సెప్టెంబర్ 9న ప్రారంభమై 11తో ముగియనుంది. ఈ ఐపీవో ద్వారా కంపెనీ రూ. 500 కోట్లు సమీకరించనుంది. క్రోస్ తాజాగా రూ. 250 కోట్ల షేర్లను జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో ప్రమోటర్లు రూ. 250 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. జంషెడ్‌పూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ 1991లో ఏర్పాటైంది.

కళ్లద్దాల అవసరం లేకుండా ఐ డ్రాప్స్

- చత్వార చికిత్సకు ఎన్‌టాడ్ ఫార్మా ఔషధానికి అనుమతి
- అక్టోబర్ తొలివారంలో మార్కెట్లోకి ప్రెస్‌వ్యూ; ధర రూ. 350

న్యూఢిల్లీ: చత్వార (ప్రెస్‌బయోపియా–లాంగ్ సైట్) సమస్యకు రీడింగ్ గ్లాసెస్ అవసరం లేకుండా చేసేలా రూపొందించిన ఔషధం 'ప్రెస్‌వ్యూ' తొలిసారి భారత్‌లో అందుబాటులోకి రానుంది. ఈ కంటి చుక్కల మందును దేశీయంగా మార్కెటింగ్ చేసేందుకు ఔషధ రంగ నియంత్రణ సంస్థ డీసీజీఐ నుంచి తుది అనుమతులు లభించినట్లు ఎన్‌టాడ్ ఫార్మా వెల్లడించింది. ప్రెస్‌వ్యూ ధర రూ.350గా ఉంటుందని సమాచారం. అక్టోబర్ తొలివారంలో ఈ ఔషధాన్ని మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ సీఈవో నిఖిల్ కె. మాసూర్కర్ తెలిపారు. ముందుగా దేశీయంగా, అలాగే ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని వర్ధమాన మార్కెట్లలో దీన్ని విక్రయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com



సీఐఎస్‌ఎఫ్‌లో 1130 కానిస్టేబుల్/ఫైర్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా కానిస్టేబుల్ /ఫైర్(మేల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1130(యూఆర్–466, ఈడబ్ల్యూఎస్–114, ఎస్సీ–153, ఎస్టీ–161, ఓబీసీ–236).
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–32, తెలంగాణ–26.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్శిటీ నుంచి 12వ తరగతి సైన్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణులై ఉండాలి లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 30.09.2024 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఈఎస్ఎం/ఓబీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, రాతపరీక్ష(ఓఎంఆర్/సీబీటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **రాత పరీక్ష:** ఓఎమ్మార్/సీబీటీ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు–25 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–25 మార్కులు), ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్(25 ప్రశ్నలు–25 మార్కులు), ఇంగ్లిష్/హిందీ (25 ప్రశ్నలు–25 మార్కులు). పరీక్ష సమయం 2 గంటలు. ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 31.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
» **వెబ్‌సైట్:** https://cisfrectt.cisf.gov.in

ఐడబ్ల్యూఏఐ, నోయిడాలో 37 పోస్టులు

నోయిడాలోని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ డైరెక్టర్–02, అసిస్టెంట్ హైడ్రోగ్రాఫిక్ సర్వేయర్–01, లైసెన్స్ ఇంజన్ డ్రైవర్–01, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్–05, డ్రెడ్జ్ కంట్రోల్ ఆపరేటర్–05, స్టోర్ కీపర్–01, మాస్టర్ సెకండ్/థర్డ్ క్లాస్–04, స్టాఫ్ కార్ డ్రైవర్–03, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–11, టెక్నికల్ అసిస్టెంట్–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్, డిప్లొమా, డిగ్రీ(మెకానికల్/సివిల్/మెరైన్/నావల్/ఆర్కిటెక్చర్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2024.
» **వెబ్‌సైట్:** https://iwai.nic.in

ఐటీబీపీలో 128 హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్–సి విభాగంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 128.
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ) (పురుషులు /మహిళలు)–09, కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) (పురుషులు /మహిళలు)–115, కానిస్టేబుల్(కెన్నెల్‌మన్)(పురుషులు మాత్రమే)–04.
» **అర్హత:** హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి, వెటర్నరీలో సర్టిఫికేట్/డిప్లొమా కోర్సు, కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 10.09.2024 నాటికి హెడ్ కానిస్టేబుల్ (డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్(కెన్నెల్‌మన్) పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు, కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాతపరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్,రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పే స్కేల్:** హెడ్ కానిస్టేబుల్‌కు రూ.25,500. కానిస్టేబుల్‌కు రూ.21,700.


ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2024.
» **వెబ్‌సైట్:** https://itbpolice.nic.in

ఐఓబీలో అప్రెంటీస్‌కు మార్గం

» దేశ వ్యాప్తంగా 550 అప్రెంటీస్ ట్రైనీ నియామకాలు
» ఏపీలో 22, తెలంగాణలో 29 ఖాళీలు
» రెండు దశల ఎంపిక ప్రక్రియ
» నెలకు రూ.15 వేల వరకూ స్టయిఫండ్

బ్యాంకింగ్ రంగంలో.. కొలువుదీరాలనుకునే వారికి చక్కటి అవకాశం! ఈ రంగంలో అనుభవం కోసం ఎదురు చూస్తున్న గ్రాడ్యుయేట్లకు ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐఓబీ) స్వాగతం పలుకుతోంది!! అప్రెంటీస్ ట్రైనీ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఏడాది శిక్షణతోపాటు.. స్టయిఫండ్ పేరిట ఆర్థిక ప్రోత్సాహం సైతం లభిస్తుంది! ఈ నేపథ్యంలో.. ఐఓబీ తాజాగా విడుదల చేసిన అప్రెంటీస్ ట్రైనీ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, విధులు, ఆర్థిక ప్రోత్సాహం, ఈ శిక్షణతో ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..



ఇటీవల కాలంలో అప్రెంటీస్ ట్రైనీల నియామకం అన్ని రంగాల్లోనూ విస్తృతంగా జరుగుతోంది. బ్యాంకింగ్ రంగంలోనూ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు.. ఈ విధానానికి శ్రీకారం చుడుతున్నాయి. దీన్ని బ్యాంకు ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకుంటే.. భవిష్యత్తులో బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో ఇతర అవకాశాల విషయంలో ముందంజలో నిలవొచ్చు అంటున్నారు నిపుణులు.

550 అప్రెంటీస్ ట్రైనీ నియామకాలు

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్.. తాజా నోటిఫికేషన్ ద్వారా దేశ వ్యాప్తంగా 550 అప్రెంటీస్ ట్రైనీ నియామకాలను చేపట్టనున్నట్లు తెలిపింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 29 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత (2020 ఏప్రిల్ 1 తర్వాత డిగ్రీ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు)ఉండాలి.ఇప్పటి వరకు ఎలాంటి అప్రెంటీస్ ట్రెనింగ్ తీసుకోకుండా ఉండాలి.
- **వయసు:** ఆగస్ట్ 1, 2024 నాటికి 20–28 ఏళ్లు (ఆగస్ట్ 1, 1996–ఆగస్ట్ 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి) ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ (నాన్ –క్రీమీ లేయర్) వర్గాలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్.. అప్రెంటీస్ ట్రైనీల నియామక ప్రక్రియలో రెండు దశల ఎంపిక విధానాన్ని అనుసరిస్తోంది. ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న రీజియన్/రాష్ట్రాల వారీగా తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో వ్యక్తిగత సంప్రదింపులు(పర్సనల్ ఇంటరాక్షన్) ప్రక్రియ నిర్వహిస్తారు. ఇందులోనూ అర్హత సాధిస్తే అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారు చేస్తారు.

నాలుగు విభాగాల్లో రాత పరీక్ష

- రాత పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నాలుగు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు), జనరల్ ఇంగ్లిష్ (25 ప్రశ్నలు); క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు), కంప్యూటర్ / సబ్జెక్ట్ నాలెడ్జ్ (25 ప్రశ్నలు)లపై పరీక్ష ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలతో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి గంటన్నర.
- ఆబ్జెక్టివ్ విధానంలోని రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఆయా రాష్ట్రాల స్థానిక భాషల్లో కూడా పరీక్ష నిర్వహిస్తారు. సదరు భాషలకు సంబంధించి రీడింగ్, రైటింగ్, స్పీకింగ్, అండర్ స్టాండింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ఈ పరీక్ష ఉంటుంది. దీనికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ సమయంలో హాజరవ్వాల్సి ఉంటుంది. పది, 12వ తరగతుల్లో సంబంధిత స్థానిక భాషను చదివిన వారికి ఈ పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తారు.

ఏడాది వ్యవధిలో శిక్షణ

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి అప్రెంటీస్ ట్రైనీలుగా నియమితులైన వారికి ఏడాది వ్యవధిలో ఐఓబీ బ్యాంకు శాఖల్లో శిక్షణనిస్తారు. ఈ సమయంలో వారు బ్యాంకులో క్లరికల్ కేడర్ స్థాయిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కస్టమర్ రిలేషన్‌షిప్, మార్కెటింగ్, బుక్ కీపింగ్, అకౌంటింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది.

స్టయిఫండ్

అప్రెంటీస్ ట్రైనీలుగా నియమితులైన వారికి స్టయిఫండ్ కూడా అందిస్తారు. ఈ స్టయిఫండ్ ఆయా శాఖలు నెలకొన్న ప్రాంతాలను అనుసరించి వేర్వేరుగా ఉంటుంది. మెట్రో బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.15 వేలు; అర్బన్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.12 వేలు; సెమీ–అర్బన్/రూరల్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.10 వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు. స్టయిఫండ్ మొత్తంలో ప్రతి నెల రూ.4,500ను కేంద్ర ప్రభుత్వం నేరుగా అప్రెంటీస్ ట్రైనీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తుంది. మిగతా మొత్తాన్ని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ అందిస్తుంది. అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌లో భాగంగా రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా..ప్రభుత్వం,బ్యాంక్ కలిసి స్టయిఫండ్ ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఎన్ఏటీఎస్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. ముందుగా నేషనల్ అప్రెంటీస్ ట్రెనింగ్ స్కీమ్ పోర్టల్‌లో తమ ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి. ఆ రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగానే (రిజిస్ట్రేషన్ నెంబర్).. ఐఓబీ నోటిఫికేషన్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.అదే విధంగా దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకుంటున్న రాష్ట్రంలోని మూడు జిల్లాలను తమ ప్రాథమ్యాలుగా పేర్కొనే వెసులుబాటు కల్పించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 10
- **ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ:** 2024, సెప్టెంబర్ 22
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.iob.in/Careers

రాత పరీక్షలో రాణించేలా

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో ఆర్థిక రంగంలో పరిణామాలకు ప్రాధాన్యమివ్వాలి. సామాజిక సమకాలీన పరిణామాలతోపాటు, బ్యాంకింగ్ రంగంలో తాజాగా ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలను అనుసరిస్తూ వాటిపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా ఇడియమ్స్, టెన్సెస్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, యాక్టివ్–ప్యాసివ్ వాయిస్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో రాణించేందుకు శాతాలు, నిష్పత్తులు, కాలం–దూరం, కాలం–పని, నంబర్ సిరీస్‌లను అవపోసన పట్టాలి. కోడింగ్–డీ కోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్స్‌పై పట్టు పెంచుకోవాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి జామెట్రీపై అవగాహన కలిసొస్తుంది. అదే విధంగా పైచార్ట్స్, ఫ్లో చార్ట్స్‌ను విశ్లేషించడం, డేటా ఆధారంగా ఒక సమాచారాన్ని విశదీకరించడం ప్రాక్టీస్ చేయాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

కంప్యూటర్/సబ్జెక్ట్ నాలెడ్జ్

బేసిక్ కంప్యూటర్ ఆపరేటింగ్ స్కిల్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కీ–బోర్డ్ షార్ట్ కట్ కమాండ్స్ గురించి తెలుసుకోవాలి.

క్లుప్తంగా...

నేడు కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు

- మరికొన్నిచోట్ల రెండ్రోజులు తేలికపాటి వర్షాలు..
- వాతావరణ శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశముందని తెలిపింది. అదేవిధంగా బుధవారం చాలాచోట్ల, గురువారం కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం మధ్య విదర్భ, పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న అల్పపీడన ప్రాంతం బలహీనపడి పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవరించి ఉందని పేర్కొంది. అలాగే రుతుపవన ద్రోణి సోమవారం సగటు సముద్ర మట్టం నుంచి జై సల్మేర్, ఉదయపూర్, పశ్చిమ విదర్భ వద్ద ఉన్న అల్పపీడన కేంద్రం, దాని పరిసర ప్రాంతాల్లోనూ... రామగుండం, కళింగపట్నం అక్కడి నుంచి ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. గత 24 గంటల్లో రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా జైనూరులో 8.5 సెంటీమీటర్లు, నార్నూరులో 8.2 సెంటీమీటర్లు, ఇచ్చోడలో 5, సిద్దిపేట జిల్లా లక్దారం 4.6, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో 4.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రెడ్‌క్రాస్ సొసైటీకి గవర్నర్ రూ.30 లక్షలు



సాక్షి, హైదరాబాద్: వరద సహాయక చర్యల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్)కి రూ.30 లక్షలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంజూరు చేశారు. ఈ మేరకు తన ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేసిన రూ.30 లక్షల చెక్కును ఐఆర్‌సీఎస్ ప్రతినిధులకు మంగళవారం రాజ్‌భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్జీవోలు ప్రభుత్వ యంత్రాంగంతో మమేకమై సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. వరద బాధితులకు ఆహారం, తాగునీరు, మందులు తదితర అత్యవసర వస్తువులను అందజేయడంలో అందరి సహకారం కావాలన్నారు. ఇలాంటి విపత్తుల సమయంలోనే ప్రభుత్వ యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించి ప్రజలను ఆదుకోవాలని గవర్నర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి డీజీపీ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను, ముఖ్యమంత్రి సన్మానం అందుకున్న ఎస్సై నగేశ్, సీఐలు సర్వయ్య, దేవేందర్‌ను డీజీపీ జితేందర్, శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్‌లో డీజీపీ ఓ పోస్ట్ చేశారు. అలాగే మెదక్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోతున్న రమావత్ నందును కాపాడిన జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని, క్యూఆర్‌టీ సభ్యులు బండి శ్రీనివాస్ (హెడ్ కానిస్టేబుల్), సురేశ్‌నాయక్ (పోలీస్ కానిస్టేబుల్), కృష్ణ (పోలీస్ కానిస్టేబుల్), రమేశ్ (పోలీస్ కానిస్టేబుల్), మహేశ్ (హోంగార్డ్) తదితరులను డీజీపీ అభినందించారు.

బెస్తలకు హెల్ప్‌లైన్ నంబర్

సాక్షి, హైదరాబాద్: చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులెదురైనా ఆదుకునేందుకు మత్స్యశాఖ హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అలా, ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కలిసి హెల్ప్‌లైన్ 8090199299 నంబర్‌ను విడుదల చేశారు.

నేడు పలు రైళ్ల రద్దు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో పట్టాలు దెబ్బ తినడం వల్ల ఈ నెల 4 తేదీన కూడా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. సికింద్రాబాద్–గుంటూరు (12710), హైదరాబాద్–షాలీమార్ (18046) రైళ్లను రద్దు చేశారు.

సికింద్రాబాద్–కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లు

దసరా, దీపావళి పండుగల సందర్భంగా సికింద్రాబాద్–కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–కొల్లాం (07193/07194) ప్రత్యేక రైలు ఈ నెల 9వ తేదీ నుంచి నవంబర్ 27 వరకు ప్రతి బుధవారం సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 13 నుంచి నవంబర్ 29 వరకు ప్రతి శుక్రవారం కొల్లాం నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరనుంది. రెండు వైపులా 24 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు.

ఆకాశంలో ఆపద్బంధు!

వరదల్లో విశేష సేవలందించిన డ్రోన్లు | బాధితులకు ఆహారం, తాగునీరు, లైఫ్ జాకెట్లు చేరవేత



◀ ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న వారి కోసం లైఫ్ జాకెట్లు తీసుకెళుతున్న డ్రోన్

వరదల్లో చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు రంగంలోకి దిగినా ఫలితం కానరాని వేళ... డ్రోన్లు అండగా నిలుస్తున్నాయి. బాధితుల ఆచూకీ గుర్తించడం, వారికి ఆహారం, తాగునీరు, లైఫ్ జాకెట్లు చేరవేయడంతో డ్రోన్ల సాయం తీసుకుంటున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో వచ్చిన వరదలో వీటిపాత్ర కీలకంగా మారింది. 20 కేజీల బరువును మోసుకెళ్లే సామర్థ్యం ఉన్న ఈ డ్రోన్లతో బాధితులకు లైఫ్ జాకెట్లు, ఆహారం, తాగునీరు చేరవేశారు.

– ఖమ్మం మయూరిసెంటర్

అక్కడ కూడా..

కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పాలేరు అలుగుల ప్రాంతంలో షేక్ యాకూబ్, సైదాబి, షరీఫ్ వరదలో చిక్కుకున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారి నివాసాన్ని వరద చుట్టుముట్టడంతో ఇంటి పైభాగంలో ఉండిపోయారు. వారి వద్దకు వెళ్లే పరిస్థితి లేకపోగా సాయం చేసే అవకాశం కనిపించలేదు. వీరికి డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు, ట్యూబ్‌లు, ఆహారం, తాగునీరు అందించాలనే ఆలోచనకు వచ్చారు. ఆ వెంటనే మోతె నుంచి డ్రోన్లు తెప్పించి యాకూబ్ కుటుంబ సభ్యులకు లైఫ్‌జాకెట్లు, ఆహారం, తాగునీరు పంపించారు. అయితే, జాకెట్ ధరించిన షరీఫ్ ప్రాణాలను దక్కించుకోగా.. యాకూబ్, సైదాబీలు మాత్రం వరదలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు.

ఆ తొమ్మిది మందికి..

గత ఆదివారం మున్నేరుకు వచ్చిన భారీ వరదతో ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై తొమ్మిది మంది చిక్కుకుపోయారు. వరద భారీగా పెరగడంతో బ్రిడ్జిపై ఓ పక్క ఎత్తయిన స్థలానికి చేరి బిక్కుబిక్కుమంటూ ఉండిపోయారు. ఉదయం 9గంటలకు వరదనీరు మరింత పెరగడంతో బ్రిడ్జిపైకి చేరుకున్న వీరిని రక్షించేందుకు ఎలాంటి మార్గం కానరాలేదు. మధ్యాహ్నం 2గంటల సమయాన అధికారులు రెండు డ్రోన్లు పంపి వీరి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం డ్రోన్ల ద్వారానే లైఫ్ జాకెట్లు, ఆహారం, తాగునీరు పంపించారు. రాత్రి వరకు సహాయక చర్యలు ప్రారంభం కాకపోవడంతో కుటుంబ సభ్యులు అదే డ్రోన్ల సాయంతో బ్యాటరీ లైట్లు చేరవేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వారు డ్రోన్ అందించిన లైఫ్ జాకెట్లు, ఆహారం, తాగునీటితో బాధితులు గడిపారు.

ఓఆర్ఆర్ లోపల.. ఇక గ్రామ పంచాయతీల్లేవ్

51 పంచాయతీలకు పట్టణ హోదా.. | 13 మున్సిపాలిటీల్లో విలీనం | ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం.. హైదరాబాద్ మహానగరం దిశగా తొలి అడుగు

జనవరి తరువాత ఏడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనమయ్యే చాన్స్

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరాన్ని దేశంలోని మరో మహానగరంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమైంది. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు అటుఇటుగా ఉన్న 51 గ్రామ పంచాయతీలను సమీపంలోని 13 పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. 51 గ్రామ పంచాయతీలతో విలీనమైన పురపాలక సంఘాలను వాటి పాలకమండళ్ల పదవీకాలం ముగిశాక జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. ఈ విలీనం నేపథ్యంలో హైదరాబాద్ మహానగరానికి తొలి అడుగు పడినట్లయింది. వచ్చే ఏడాది జనవరితో మున్సిపాలిటీల పాలకమండళ్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ 13 మున్సిపాలిటీలను, గ్రేటర్ శివార్లలో ఉన్న 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే అవకాశం ఉంది. ఓఆర్ఆర్ సరిహద్దుగా ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లయితే దేశంలో ముంబై, ఢిల్లీ తర్వాత అతిపెద్ద నగరంగా హైదరాబాద్ మారనుంది. అయితే ఓఆర్ఆర్ పరిధిలోని ప్రాంతాన్ని ఒకే నగరపాలక సంస్థగా మార్చాలా లేక మూడుగా విభజించాలా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకే..

ఓఆర్ఆర్ పరిధిలో జీహెచ్ఎంసీతోపాటు ఏడు కార్పొరేషన్లు, పలు మున్సిపాలిటీలు, గ్రామాలు ఉన్నాయి. వాటన్నింటినీ ఒకే కార్పొరేషన్‌గా మార్చాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన. ఈ మేరకు పురపాలక శాఖకు బాధ్యత అప్పగించారు. దీనిపై కసరత్తు చేసిన పురపాలక శాఖ ఓఆర్ఆర్ లోపల ఉన్న 45 గ్రామ పంచాయతీలతోపాటు ఔటర్ ఆవల ఉన్న మరో 6 గ్రామాలను (మొత్తం 51) ఒకే గొడుగు కిందకు తేవాలని ప్రాథమికంగా సీఎంకు నివేదిక అందజేసింది. దీంతో ప్రభుత్వం ఆగస్టు 1న కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. శ్రీధర్‌బాబు చైర్మన్‌గా పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ సభ్యులుగా ఏర్పాటైన సబ్ కమిటీ ఆగస్టు 22న సమావేశమై ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న 51 గ్రామ పంచాయతీలను సమీప పురపాలిక సంఘాల్లో విలీనం చేయాలని ప్రభుత్వానికి సూచించింది.

పంచాయతీల్లో తీర్మానాలు సైతం..

దీనికి ముందు 51 పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలతో సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించి సమీప పురపాలక సంఘాల్లో తమ పంచాయతీలను విలీనం చేసేందుకు అభ్యంతరం లేదని తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను సంబంధిత జిల్లా పంచాయతీ శాఖల ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం 51 గ్రామ పంచాయతీలను సమీప పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది.

జిల్లాల వారీగా విలీన ప్రక్రియ...

ఈ లెక్కన రంగారెడ్డి జిల్లాలోని 12 గ్రామ పంచాయతీలు సమీప పురపాలికల్లో విలీనం అవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 28 గ్రామ పంచాయతీలు, సంగారెడ్డి జిల్లాలో 11 గ్రామ పంచాయతీలను సమీప పురపాలికల్లో కలిపారు. గ్రామాల విలీనంతో పెరిగిన వార్డుల సంఖ్యను కూడా ఆయా మున్సిపాలిటీల్లో కలపాలని నిర్ణయించారు.

గ్రామ పంచాయతీల విలీనం ఇలా...

రంగారెడ్డి జిల్లాలో...: రంగారెడ్డి జిల్లాలో 12 గ్రామ పంచాయతీలు సమీపంలోని 4 పురపాలికల్లో విలీనమయ్యాయి.

1. **పెద్దఅంబర్‌పేటలో నాలుగు జీపీలు:** బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట (వార్డులు 24)
2. **శంషాబాద్ లో ఆరు జీపీలు:** బహదూర్‌గూడ, పెద్ద గొల్కొండ, చిన్న గొల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘన్సీమియాగూడ (వార్డులు 25)
3. **తుక్కుగూడలో ఒక జీపీ:** హర్షగూడ (వార్డులు 15)
4. **నార్సింగిలో ఒక జీపీ:** మీర్జాగూడ (వార్డులు 18)

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా..: ఈ జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల్లో సమీప 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి.

1. **మేడ్చల్ పురపాలక సంఘంలో రెండు జీపీలు:** పూడూరు, రాయిలాపూర్ (వార్డులు 23)
2. **దమ్మాయిగూడలో ఆరు జీపీలు:** కీసర, యాద్గర్‌పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి (వార్డులు 18)
3. **నాగారంలో నాలుగు జీపీలు:** బోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లి దయారా (వార్డులు 20)
4. **పోచారంలో ఐదు జీపీలు:** వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ (వార్డులు 18)
5. **ఘట్‌కేసర్‌లో ఆరు జీపీలు:** అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘనపూర్, మర్పల్లిగూడ (వార్డులు 18)
6. **గుండ్లపోచంపల్లిలో రెండు జీపీలు:** మునీరాబాద్, గౌడవెల్లి (వార్డులు 15)
7. **తూముకుంటలో మూడు జీపీలు:** బొమ్మరాశిపేట్, శామీర్‌పేట్, బాబాగూడ (వార్డులు 16)

సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి జిల్లాలోని రెండు పురపాలక సంఘాల్లో 11 గ్రామ పంచాయతీలను కలిపారు.

1. **తెల్లాపూర్‌లో ఐదు జీపీలు:** కర్దనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనపూర్ (వార్డులు 17)
2. **అమీన్‌పూర్‌లో ఆరు జీపీలు:** ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దయారా, కిష్టారెడ్డిపేట్, సుల్తాన్‌పూర్ (వార్డులు 24)

సమయం లేదు.. మిత్రమా !

- ఇంటి నంబర్లు, ఇళ్ల అనుమతులకు అప్పటికప్పుడు పత్రాలు జారీ
- రాత్రి 11 వరకూ కొనసాగిన కీసర గ్రామ పంచాయతీ కార్యాలయం





రాత్రి 10 గంటల సమయంలో కీసర గ్రామపంచాయతీ కార్యాలయం తెరిచి ఉన్న దృశ్యాలు

కీసర: కీసర గ్రామ పంచాయతీని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం జీఓ జారీచేసింది... మిత్రమా సమయం లేదు. తెల్లవారితే మున్సిపల్ అధికారులు గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకుంటారు. ఇక మిగిలింది ఈ ఒక్క రాత్రే.. పంచాయతీ నుంచి ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతి, లేదా ఇంటి నంబర్లు కావాలంటే రాత్రి ఎంత సమయమైనా..మీ కోసం మేము సిద్ధంగా ఉన్నాం అన్నట్టు కీసర గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది తీరు చూసి గ్రామస్తులు నివ్వెరపోయారు. మంగళవారం మాత్రం రాత్రి 10 గంటలైనా పంచాయతీ కార్యాలయంలో లైట్లు వేసుకొని మరీ విధులు నిర్వర్తించారు. రాత్రికి రాత్రే పొందిన ఇంటి అనుమతులు, ఇంటినంబర్ల విషయంలో మున్సిపల్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన పంచాయతీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గమ్యం చేరే ‘దారి’ ఏది?

అత్యవసరాలకు మూసుకుపోయిన ‘దారులు’

రోడ్లు, కల్వర్టులు తెగిపోయి నిలిచిన రాకపోకలు

రోడ్డుమార్గం లేక.. సకాలంలో వైద్యం అందక

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన ఏర్పుల రామకృష్ణ (40) సకాలంలో వైద్యం అందక చనిపోయాడు. రెండు రోజులు కురిసిన వర్షాలకు డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామంలో ఆకేరు వరదతో ముల్కలపల్లి–ఖమ్మం, ముల్కలపల్లి–తిరుమలాయపాలెం మధ్య రోడ్లు కొట్టుకుపోయాయి. ఖమ్మం మార్గంలో ఆకేరువాగుపై బ్రిడ్జి డిస్క్ స్లాబ్‌లు ధ్వంసమయ్యాయి. ముల్కలపల్లి వైపు బ్రిడ్జి నుంచి కొంతమేర రోడ్డు, కొంతవరకు కోతకు గురైంది. తిరుమలాయపాలెం మార్గంలోనూ ఆకేరుపై నిర్మించిన మరో బ్రిడ్జికి సంబంధించి అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఉయ్యాలవాడ, ముల్కలపల్లిల నుంచి ఖమ్మంకి పూర్తిగా రాకపోకలు నిలిచాయి. ఆదివారం 11 గంటల ప్రాంతంలో ఉయ్యాలవాడలో రామకృష్ణ అపస్మారకస్థితికి చేరగా..ఆయన్ను చికిత్స నిమిత్తం ఖమ్మం తీసుకెళ్లేందుకు అన్ని మార్గాలు మూసుకుపోయాయి. 108 అందుబాటులో ఉన్నా సకాలంలో చికిత్స అందక రామకృష్ణ సాయింత్రం 5.30 ప్రాంతంలో మృతిచెందాడు. వరదలతో దారులు మూసుకుపోవడంతో రామకృష్ణకు సకాలంలో వైద్యం అందక మృతి చెందాడని భార్య సంధ్య, కుమారులు సిద్ధు, రాంచరణ్‌లు కన్నీరు మున్నీరయ్యారు.



ముల్కలపల్లి-ఖమ్మం మార్గంలో వరదతో కోతకు గురైన రోడ్డు

సాక్షిప్రతినిధి, వరంగల్ : వానలు జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. రోడ్లకు గండ్లు పడడం, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 30 మండలాల్లో అధిక వర్షం కురవగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనివే 15 మండలాలున్నాయి. మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో రోడ్లు, వంతెనలు తెగిపోయి సుమారు 94 గ్రామాలకు మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంకా 32 గ్రామాలకు రాకపోకల పునరుద్ధరణ జరుగుతోందని అధికారులు ప్రకటించారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం పరిస్థితి యథాస్థితికి చేరుతుందని నివేదికలో పేర్కొన్నారు.

నాలుగు రోజులు ఇబ్బందులు పడ్డాం

ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు బ్రిడ్జి వరదలకు మునిగిపోయింది. వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రహదారిపైకి గోదావరి వరద చేరడంతో నాలుగు రోజులు రాకపోకలు లేక ఇబ్బంది పడ్డం. చుట్టూ ఐదారూళ్లు తిరిగి మండల కేంద్రానికి పోవాల్సి వస్తోంది.

– పాయం రామదాసు, గుమ్మడిదొడ్డి

82 ప్రాంతాల్లో తెగిపోయిన రోడ్లు

- మరమ్మతులకు రూ.256 కోట్లు అవసరం
- పూర్తిస్థాయిలో రోడ్ల పునరుద్ధరణకు రూ.1,200 కోట్లు కావాలని అంచనా

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. 587 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమైనట్టు అధికారులు గుర్తించారు. ఇందులో 82 ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా తెగిపోయాయి. మరో 559 ప్రాంతాల్లో రోడ్ల మీదుగా వరద ప్రవహిస్తోంది. 336 ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభం కాగా, ఇంకా 111 ప్రాంతాల్లో ఇప్పటికీ వాహనాలు ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది. రాకపోకలు పునరుద్ధరించాలంటే వెంటనే రోడ్లకు మరమ్మతు చేపట్టాలి. ఇందుకు రూ.256 కోట్లు అవసరమవుతాయని రోడ్లు, భవనాల శాఖ తాజాగా అంచనా వేసింది. ఆ రోడ్లను పూర్వపు స్థితిలోకి తెచ్చేందుకు మాత్రం రూ.1,200 కోట్లు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

వేగంగా రైలు మార్గం పునరుద్ధరణ పనులు

కేసముద్రం సమీపంలో రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. బుధవారం ట్రాక్‌ను సిద్ధం చేసి రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. మంగళవారం 108 రైళ్లతోపాటు మరో రెండు రైళ్లను పాక్షికంగా రద్దు చేసి.. 31 రైళ్లను మళ్లింపు దారుల్లో నడిపారు. బుధవారం 88 రైళ్లు, గురువారం 61 రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ట్రాక్‌ను పునరుద్ధరిస్తేనే వాటిని నడుపుతామని స్పష్టం చేశారు. 350 ఆర్టీసీ బస్సులను మంగళవారం కూడా రద్దు చేశారు. విజయవాడ దారిలో నెమ్మదిగా ముందుకు సాగుతున్నందున, బస్సుల సంఖ్య తగ్గించి నడుపుతున్నారు.

వరద బాధితులకు కేంద్ర సాయం ఇలా..

మృతుల కుటుంబాలకు రూ. 3 లక్షల ఎక్స్‌గ్రేషియా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్ఎఫ్) కింద అందే సహాయానికి సంబంధించిన మార్గదర్శకాలను గతేడాది జూలై 13న సవరించింది. 2022–23 నుంచి 2025–26 వరకు ఈ సవరణలకు అనుగుణంగా కేంద్ర సాయం అందుతుందని ప్రకటించింది.

- వరదల కారణంగా ఎవరైనా చనిపోతే.. వారి కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.



- క్షతగాత్రులకు అంటే.. 60% పైబడిన వైకల్యానికి రూ.2.5 లక్షలు, ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి.. వారానికన్నా ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉంటే రూ.16వేలు, వారంకన్నా తక్కువ రోజులుంటే రూ.5,400 చొప్పున అందిస్తుంది.

వరదల కారణంగా వస్తువులు నష్టపోయిన వారికి. దుస్తులు కోల్పోయిన వారికి రూ.2,500, వంటపాత్రలు నష్టపోయిన వారికి రూ.2,500, పాడి పశువులను కోల్పోయిన రైతులకు గేదె, ఆవులకు అయితే ఒక్కోదానికి రూ.37,500, గొర్రె, మేకలకు అయితే.. ఒక్కోదానికి రూ.4వేలు, ఒక్కో ఎద్దుకు రూ.32వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది.

వరదల కారణంగా జీవనోపాధి కోల్పోయిన వారికి 2 హెక్టార్ల (5 ఎకరాలు) వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు కూడా సాయం అందిస్తుంది.

- పంటపొలాల్లో కూరుకుపోయిన మట్టిని తొలగించేందుకు హెక్టారుకు (2.5 ఎకరాలు) రూ.18వేలు, ఒక రైతుకు కనీసం రూ.2,200 చొప్పున సహాయం అందజేస్తుంది.






వర్షాధార ప్రాంతాల్లో హెక్టారుకు రూ.8,500, నీటివసతి అందుబాటులో ఉన్న పంటలకు హెక్టారుకు రూ.17వేలు, పామాయిల్, కొబ్బరి వంటి శాశ్వత పంటలకు..హెక్టారుకు రూ.22,500 అందిస్తుంది.

విద్యార్థుల్లో ప్రమాణాలెంత?

నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా న్యాస్ పరీక్ష

- 3, 6, 9 తరగతుల వారి సామర్థ్యంపై అంచనా
- ఈ నెల నుంచే మోడల్ పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో ప్రమాణాలను గుర్తించేందుకు, వారి సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడేళ్ళకోసారి జాతీయ సాధన సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహిస్తుంది. 2021లో ఈ పరీక్షను నిర్వహించారు. కేంద్రం ఆదేశాల మేరకు తాజాగా ఈ ఏడాది నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా న్యాస్ పరీక్షను నిర్వహించేందుకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్‌టీ) సిద్ధమవుతోంది. త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ప్రాథమిక స్థాయిలో మూడవ, ఐదవ తరగతి, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో 6– 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష ఉంటుంది. అయితే ఈ పరీక్ష కోసం విద్యార్థులను ముందే సమాయత్తం చేస్తారు. వారికి ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ క్రమంలో ఈ నెల నుంచే వీరికి అంతర్గత మోడల్ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. న్యాస్ ప్రశ్నపత్రంలోని 50 శాతానికి పైగా ప్రశ్నలకు సరైన సమాధానం రాసేలా తీర్చిదిద్దేందుకు టీచర్లకు బోధనపై నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నారు.



▲ అడవిలో కూలిన చెట్లు

మేడారం అడవుల్లో నేలకూలిన లక్ష చెట్లు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని తాడ్వాయి–మేడారం మధ్య అడవుల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు వీచిన గాలిదుమారానికి (టోర్నడోలు) 180 హెక్టార్లలో చెట్లు నేలకూలినట్లు అటవీశాఖ అధికారులు అంచనా వేశారు. అడవుల్లో నేలకూలిన వృక్షాలను కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ మంగళవారం పరిశీలించారు. 180 హెక్టార్లలో (సుమారుగా 500 ఎకరాలు) లక్షకు పైగా చెట్లు నేలకూలినట్లు అంచనాకు వచ్చారు. కూలిన చెట్లను డ్రోన్ కెమెరా ద్వారా వీడియో తీయిస్తున్నారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట ఏటూరునాగారం ఎఫ్‌డీఓ రమేశ్, ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి కృష్ణవేణి, సెక్షన్ ఆఫీసర్ లింగయ్య ఉన్నారు.

విద్యా కమిషన్ ఏర్పాటు

చైర్మన్‌గా ఆకునూరి మురళి!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ సహా ముగ్గురు సభ్యులతో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన చెప్పారు. విద్యారంగంలో ప్రావీణ్యం ఉన్న వారికే ఈ బాధ్యతలు ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. కమిటీ సిఫార్సులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. విద్యాశాఖలో ఓడీలు, డిప్యుటేషన్లు కూడా కమిషన్ పరిధిలోకి వస్తాయని వెల్లడించారు. కమిషన్ కాలపరిమితిని రెండేళ్లుగా నిర్ణయించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర మార్పులే లక్ష్యంగా ఈ కమిషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని, ఇదే క్రమంలో ప్రైవేటురంగ భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎందుకీ కమిషన్..

అన్ని స్థాయిల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చడానికే కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) ప్రకారం విద్యార్థుల అభ్యాసన, పాఠశాలల్లో నాణ్యత క్రమంగా క్షీణిస్తోంది. విశ్వవిద్యాలయాల్లోనూ ప్రమాణాలు తగ్గుతున్నాయి. పరిశోధనల్లో నాణ్యత లేదని గుర్తించారు. మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగ విద్యావ్యవస్థ లేదని, నైపుణ్య లోపం కన్పిస్తోందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిని పునరుద్ధరించేందుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపింది.

చైర్మన్‌గా ఆకునూరి మురళి?

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నియమితులు కానున్నట్టు తెలుస్తోంది. కమిషన్‌లో మహిళా కోటాలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి నాయకురాలు బాలలక్ష్మికి అవకాశం దక్కనుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన సభ్యులుగా ఎవరుండాలన్న దానిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. అలాగే, తెలంగాణ వెనుకబడిన వర్గాల కమిషన్ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి నిరంజన్, ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ అల్దాసు జానయ్య పేర్లు ఖరారైనట్టు సమాచారం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాగుబడి
పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
సాక్షి ప్లస్
బుధవారం ॥ 4-9-2024



జన్యుమార్పిడి పుట్టు పూర్వోత్తరాలు

జన్యుమార్పిడి(జిఎం) పంటల సాగు మొదట అమెరికాలో 32 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. కనీసం 15రకాల పంటలతోపాటు.. చేపలు, పందులకూ జన్యుమార్పిడి చేశారు. మన దేశంలో ఆమోదం పొందిన ఏకైక జీఎం పంట బీటీ పత్తి. 22 ఏళ్ల నుంచి సాగులో ఉంది. 2009లో బీటీ వంగపై, తర్వాత బీటీ ఆవాలు, తాజాగా బీటీ బాస్మతి వంగడాలపై పెద్ద దుమారమే రేగినా న్యాయపరమైన చిక్కుల వల్ల ఆమోదం పొందలేకపోయాయి. ఈ నేపథ్యంలో సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు భారత ప్రభుత్వాన్ని ఆదేశించినందున.. జిఎం పంటల చరిత్రను తెలిపే ఈ ఇన్ఫోగ్రాఫిక్..

1992 – అమెరికాలో తయారైన, సాగైన తొలి జీఎం పంట.. టొమాటో

1994 – జీఎం సోయాజిన్ వంగడంపై యుఎస్‌డిఏ నియంత్రణ రద్దు

1995 – సమ్మర్ స్క్వాష్ జిఎం పంటకు యుఎస్‌డిఏ ఆమోదం

1996 – అమెరికా మార్కెట్‌లోకి జీఎం మొక్కజొన్న, జీఎం పత్తి వంగడాల విడుదల

1998 – హవాయిలో రైతులకు చేరిన జీఎం బొప్పాయి విత్తనాలు

2005 – జీఎం ఆల్ఫాల్ఫా మార్కెట్‌లోకి వచ్చింది

2008 – జీఎం సుగర్ బీట్స్ పంటకు ఆమోదం

జన్యుమార్పిడి చేసిన సూక్ష్మజీవుల వినియోగం ప్రారంభం. దీన్ని సింథటిక్ బయాలజీ లేదా 'సిన్‌బయో' అని వ్యవహరిస్తారు.

2014 – 'సిన్‌బయో' వనిల్లా మార్కెట్‌లోకి వచ్చింది.

2015 – ఆర్ఎన్ఏఐతో జన్యుమార్పిడి చేసిన ఆపిల్స్ సిద్ధం. జీఎం సాల్మన్ చేపకు ఎఫ్‌డిఏ ఆమోదం

2016 – రంగు మారని క్రిస్పర్ జీఎం పుట్టగొడుగులపై యుఎస్‌డిఏ నియంత్రణ రద్దు. జన్యుమార్పిడి చేసిన సూక్ష్మజీవుల ద్వారా కృత్రిమ మాంసం రుచితో తయారైన బర్గర్

2017 – ఆర్ఎన్ఏ ద్వారా తయారైన బంగాళ దుంపకు కెనడా (సిఎఫ్ఐఏ) ఆమోదం

2018 – జీఎం చెరకు సురక్షితమని ఎఫ్‌డిఏ ప్రకటన

2019 – జన్యు సవరణ చేసిన తొలి ఆహారోత్పత్తి సోయా నూనె అమెరికాలో అందుబాటులోకి వచ్చింది

2020 – జన్యుమార్పిడి పంది మాంసం మార్కెట్‌లోకి వచ్చింది

2021 – జపాన్ మార్కెట్‌లోకి క్రిస్పర్ జన్యుమార్పిడి టొమాటోలు. జీఎం పైనాపిల్ మార్కెట్‌లోకి విడుదల. అమెరికా మార్కెట్‌లోకి తొలి బ్యాచ్ జీఎం సాల్మన్ చేపలు

NON GMO Project VERIFIED nongmoproject.org

ఐరోపా దేశాల మార్కెట్లలో విక్రయించే ఆహారోత్పత్తుల్లో జన్యుమార్పిడి చేసిన జన్యువులు లేవని నిర్ధారించే సంస్థ 'నాన్ జీఎంఓ ప్రాజెక్ట్' లోగో.

గ్లైఫొసేట్‌ను తట్టుకునేలా పంటలకు జన్యుసవరణ చేశారు. 1990వ దశకం తర్వాత ఈ గడ్డి మందు వాడకం 15 రెట్లు పెరిగింది.

జన్యు సవరణ సాంకేతికత వేగంగా వ్యాప్తిలోకి వస్తోంది. పనితీరు మార్చేందుకు డిఎన్ఏను కత్తిరించటం దీని ప్రత్యేకత.

సిన్‌బయోబెటా కథనం ప్రకారం.. సింథటిక్ బయాలజీపై 600కి పైగా కంపెనీలు పనిచేస్తున్నాయి. వీటి సంఖ్య ఏటా 5-10% పెరుగుతోంది.

ఆరోరూట్.. ఓ అరుదైన పోషక విలువలతో పాటు ఔషధ విలువలు కూడా కలిగిన విలక్షణ దుంప పంట. అమెరికా దీని పుట్టిల్లు. బ్రెజిల్, భారత్, శ్రీలంక, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు విస్తరించింది. ప్రపంచంలో పండే మొత్తం ఆరోరూట్ పంటలో 95% వెస్ట్ ఇండీస్‌లోని సెయింట్ విన్సెంట్ ప్రాంతంలోనే పండుతోంది. ఔషధ విలువలు కలిగిన ఈ దుంపలను బిస్కెట్లు, బ్రెడ్, కేకులు, పాస్తా, ఐస్‌క్రీమ్, జెల్లీలు, సాస్‌లు వంటి పారిశ్రామిక ఆహారోత్పత్తులలో, ఔషధాల తయారీలో వాడుతున్నందున గిరాకీ ఉంది. కొన్ని మాత్రలు, బేబీ పౌడర్, ఫేస్ పౌడర్, మాయిశ్చరైజర్ క్రీమ్‌లు, హెయిర్ డైలు, కంప్యూటర్ పేపర్ తయారీలోనూ దీన్ని వాడుతున్నారు.



అరుదైన పంట ఆరోరూట్!

మన దేశంలో పశ్చిమ కనుమలు, ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజనులకు చిరకాలంగా పరిచితమైన పంట ఇది. మైదాన ప్రాంత రైతులకు పెద్దగా తెలియదు. ఈ దుంపల్ని అనేక రూపాల్లో తినటం గిరిజనులకు అలవాటు. కోళ్లకు ఈ దుంప ముక్కల్ని మేతగా కూడా వేస్తున్నారు.

వంగడాల వైవిధ్యం

మరింత అరుండినేసియా దీని శాస్త్రీయ నామం. మొక్కని చూసినా, దుంపల్ని చూసినా పసుపును పోలి ఉంటుంది ఆరోరూట్. ఈ దుంపలు ఒకటి-రెండు అంగుళాల లావుంటాయి. కొన్ని రకాలు పొట్టిగా ఉంటే, మరికొన్ని రకాలు 8 నుంచి 20 అంగుళాల పొడవు ఉంటాయి. దుంప లోపల కండ అనేక రంగుల్లో ఉంటుంది. దేశం మొత్తంలో 45 ఆరోరూట్ వంగడాలు సాగులో ఉన్నాయి. కేరళ తిరువనంతపురంలోని ఐసిఏఆర్ సంస్థ కేంద్రీయ దుంప పంటల పరిశోధనా సంస్థ(సిటిసిఆర్ఐ) ఈ పంటపై పరిశోధనలు చేస్తోంది. పాక్షిక నీడలో పెరిగేందుకు ఇష్టపడే ఈ పంటను కొబ్బరి, వక్క తదితర ఉద్యాన తోటల్లో అంతర పంటగా లేదా సహపంటగా సాగు చేయటానికి ఆరోరూట్ పంట అనువైనదని ఈ సంస్థ తెలిపింది. దుంప ముక్కల్ని నాటిన తర్వాత 10-11 నెలల్లో కోతకు వస్తుంది. ఎత్తుమడులపై దుంపలు నాటుకుంటే హెక్టారుకు 20-31 టన్నుల దిగుబడి వస్తుంది. పసుపు కొమ్ముల మాదిరిగానే ఈ దుంపలను కూడా రైతు స్థాయిలోనే సులువుగా ప్రాసెసింగ్ చేసుకోవచ్చు.

వేడి వాతావరణం, గాలిలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పాక్షిక నీడ ఉండే దీర్ఘకాలిక పండ్ల/ఉద్యాన తోటల్లో అంతర పంటగా సాగుకు అనుకూలం. 25-30 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు.. 1500-2000 ఎంఎం మేరకు అధిక వర్షపాతం ఉండే ప్రాంతాలు.. నీరు నిలవ ఉండని, సారవంతమైన ఎర్ర నేలలు అనుకూలం.

మే-జూన్ నెలల్లో వర్షాలు ప్రారంభం కాగానే 4-10 సెం.మీ. పొడవైన (2-4 గణుపులున్న 20-25 గ్రాముల) దుంప ముక్కల్ని 30×15 సెం.మీ. దూరంలో లేదా పిలకలను 30 సి.ఎం.ల దూరంలో నాటుకోవాలి. పొలంలో అయితే మీటరు వెడల్పు, 6-8 అంగుళాల ఎత్తుండే మడులపై నాటుకోవాలి. హెక్టారుకు 4.4-5.5 టన్నుల విత్తనం అవసరం. తోటల్లో ఎండిన ఆకులు, కొమ్మలు, కొబ్బరి డెక్కలతో మల్చింగ్ చేస్తే మంచి దిగుబడి వస్తుంది.

భూమిలో ఎకరానికి 10 టన్నుల మాగిన పశువుల ఎరువు వేయాలి.దీనితో పాటు 50:25:75 కిలోల ఎన్‌పికె ఎరువులు రెండు దఫాలుగా వేయాలని సిటిసిఆర్ఐ చెబుతోంది.





సేంద్రియ/ ప్రకృతి సాగుకు అనుకూలం

ఆరోరూట్ పంటకు చీడపీడలు పెద్దగా సోకకపోవటం మరో విశేషం. అంటే, ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో పండ్ల తోటల మధ్యలో.. ఇంటిపంటల్లో / మిద్దె తోటల్లో పందిళ్ల కింద పాక్షిక నీడలో సాగు చేసుకోవచ్చు. ఎక్కడ సాగు చేస్తామన్న దాన్ని బట్టి అందుకు అనువైన వంగడాన్ని ఎంచుకోవాలి.

సేంద్రియ సాగుదారులైతే ఈ పంట నాటే ముందు అలసంద/బొబ్బర్లను పచ్చిరొట్ట ఎరువు పంటగా హెక్టారుకు 20 కిలోలు చల్లి.. 40-60 రోజులకు రొటోవేటర్ ద్వారా భూమిలోకి కలియదున్నాలి. ఇలాచేస్తే హెక్టారుకు 10-15 టన్నుల పచ్చిరొట్టను అందించినట్లవుతుందని సిటిసిఆర్ఐ చెబుతున్న లెక్క. ఆరోరూట్ దుంపలు నాటే ముందు ఆఖరి దుక్కిలో హెక్టారుకు 10 టన్నుల మాగిన పశువుల ఎరువు వేయాలి. హెక్టారుకు 3 కిలోల జీవన ఎరువులు వేయాలి.



కొత్త పంట

అన్నీ అనుకూలిస్తే హెక్టారుకు పచ్చి దుంపలు 20-25 టన్నుల దిగుబడి వస్తుంది. వీటిని ప్రాసెస్ చేసి గంజి పొడి (స్టార్చ్)ని ఉత్పత్తి చేసి విక్రయిస్తారు. పచ్చి దుంపల బరువులో 16-20% స్టార్చ్ ఉత్పత్తి అవుతుంది. తేమ 18.5% గల తెల్లని పరిశుద్ధమైన గంజి పొడికి కమర్షియల్‌గా మంచి ధర లభిస్తుంది.

ఆరోరూట్ అనే పేరు ఎలా వచ్చిందో తెలిస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. తేలు కాటుకు, విషం పూసిన బాణం (ఆరో) గాయాలను మాన్పటంలో ఆరోరూట్ దుంపల పొడి సమర్థవంతంగా ఉపయోగపడుతుందట. అందుకే దీనికి ఆరోరూట్ అనే పేరు వచ్చిందట. ఈ (పాత) కొత్త పంట సంగతులు భలే బాగున్నాయి కదూ..!

నిర్వహణ: **పంతంగి రాంబాబు**,సాగుబడి డెస్క్



> ప్రకృతిని చూసే విధానం యుగయుగానికి మారవచ్చు. కానీ, ప్రకృతి మారదు. ఏ యుగమైనా సరే వ్యవసాయానికి ఆలంబనగా ప్రకృతి సేద్యం ఉండనే ఉంటుంది.
>
> మసనోబు ఫుకుఓక (గడ్డి పరకతో విప్లవం' నుంచి)

అధిక పోషకాలున్న కూరగాయలతో

టైప్ 2 డయాబెటిస్‌కు చెక్!

హైడ్రోపోనిక్ కూరగాయలతో కెనడాలో పరిశోధనలు

టైప్ 2 డయాబెటిస్ సహా అనేక ఆహార సంబంధిత వ్యాధులను అధిక పోషక విలువలతో కూడిన కూరగాయల ఆహారం ద్వారా నయం చేయటం సాధ్యమేనా? కెనడా పశ్చిమ ప్రాంతంలోని పురాతన మనిటోబ యూనివర్సిటీ పరిశోధకులు ఇది సుసాధ్యమేనంటున్నారు. అది కూడా జన్యుమార్పిడి చేయని సాధారణ వంగడాలతోనే ఇది సాధ్యమంటున్నారు. హైడ్రోపోనిక్ పద్ధతుల్లో ఇన్‌డోర్ వర్టికల్ ఫామ్‌లో ప్రత్యేక పద్ధతిలో పండించే అధిక పోషక విలువలతో కూడిన కూరగాయలతోనే డయాబెటిస్ తదితర వ్యాధులకు కళ్లెం వేసి మరణాలను నివారించవచ్చని కూడా వారు ఆశిస్తున్నారు. తుది దశలో ఉన్న ఈ పరిశోధనల్లో వారు అనుకుంటున్న సత్ఫలితాలు సాధిస్తే గనక.. ఇది కెనడాకే కాదు ప్రపంచానికే ఓ గొప్ప వార్త అవుతుంది.



హైడ్రోపోనిక్ స్మార్ట్ వర్టికల్ ఫామ్

మనిటోబ రాష్ట్రం విన్నిపెగ్ నగరంలోని మనిటోబ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.. మారుమూల ప్రాంతంలోని ఆదివాసుల స్వయం పాలిత ప్రాంతమైన 'ఒపాస్క్వాక్ క్రీ నేషన్ (ఒ.సి.ఎన్.)'తో కలిసి ఈ ప్రయోగం చేపట్టారు. 15 వేల ఎకరాల విస్తీర్ణంలోని ఒ.సి.ఎన్.లో 6 వేలకు పైగా జనాభా ఉంటారు. వీరిలో సగానికి సగం మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. నెలకు కనీసం ఇద్దరు, ముగ్గురైనా డయాబెటిస్‌తో మృత్యువాతపడుతున్నారు. తాజా కూరగాయలు ఆహారంలో చేర్చాలంటే.. చలి ప్రాంతం కావటంతో వేసవిలో తప్ప ఏడాది పొడవునా ఆరుబయట కూరగాయలు పండించేందుకు అక్కడ వీలు లేదు. అందుకని అత్యాధునిక సాంకేతికతో కూడిన ఇన్‌డోర్ హైడ్రోపోనిక్ స్మార్ట్ వర్టికల్ ఫార్మ్‌ను 2016లో పైలట్ ప్రాజెక్టుగా నెలకొల్పారు. కూరగాయలను పండిస్తూ స్థానికులకు పంపిణీ చేస్తున్నారు. ఒ.సి.ఎన్. ఇటీవలే పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించింది.

కెనడియన్ సెంటర్ ఫర్ అగ్రిఫుడ్ రీసెర్చ్ ఇన్ హెల్త్ అండ్ మెడిసిన్, సెయింట్ బొనిఫేస్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్‌తో కలిసి మనిటోబ యూనివర్సిటీ ప్రొఫెసర్ మియంగ్ సుహ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు చేస్తోంది.



ఇంటి పంట

వర్టికల్ ఫామ్‌లో కూరగాయల సాగు, పంటకోత, కోత అనంతర ప్రాసెసింగ్ పరిస్థితుల్లో అనేక రకాలుగా ప్రయోగాత్మక సాగు చేపట్టిన తర్వాత.. కొన్ని పద్ధతుల వల్ల కూరగాయల్లో పోషక విలువలు అధికమవుతున్నాయని, వాటిని తిన్న వారిలో డయాబెటిస్ తదితర వ్యాధులు నెమ్మదిస్తున్నాయని గుర్తించారు. ఈ బృందంలో భారతీయ మూలాలు ఉన్న ఫుడ్ సైంటిస్ట్ డాక్టర్ రుచిర నందసిరి కూడా ఉన్నారు. ఈ స్మార్ట్ ఫామ్‌లో కూరగాయల సాగు నిర్వహణ, ప్రొఫైలింగ్ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు.

ఎలుకల్లో ఈ కూరగాయల ప్రభావంపై బృందంలోని మరో శాస్త్రవేత్త బ్రియాన్నె సెమెంకో పరిశోధనలు చేస్తున్నారు. ఈ ప్రయోగాలు మరో మూడు నెలల్లో పూర్తికానున్నాయని, ఇందులో ఖచ్చితమైన ఫలితాలు వెలువడతాయన్నారామె.

ఓసిఎన్ స్మార్ట్ ఫామ్ కూరగాయల్లో మార్కెట్‌లో అమ్మే కూరగాయల్లో కన్నా బీటా కెరటిన్, పొటాషియం, మాంగనీసు 4 నుంచి 11 రెట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించామని ప్రొఫెసర్ మియంగ్ సుహ్ వెల్లడించారు. పోషక విలువలు ఎక్కువగా ఉండే ఈ కూరగాయలు తక్కువ పరిమాణంలో తిన్నా మంచి ఆరోగ్యం పొందవచ్చని అంటూ.. 'ఆరోగ్యదాయకమైన జనసమూహాలను రూపొందించాలంటే ఆహారమే తొలి సాధనం' అన్నారు. ప్రజల నుంచి సానుకూల స్పందన ఉన్నప్పటికీ, ఈ కూరగాయలను దైనందిన ఆహారంలో భాగం చేసుకోవటాన్ని ప్రజలకు నేర్పించటమే వారి ముందున్న అతిపెద్ద సవాలు.

జన్యుమార్పిడి చేయకుండా..



బ్రకోలి, క్యాబేజీ, కలే, బ్రస్సెల్ స్ప్రవుట్స్ తదితర కూరగాయలను పరిశోధన కోసమే ప్రత్యేకంగా సాగు చేస్తున్నాం. పోషకాలు అధికంగా ఉన్న ఈ కూరగాయల ద్వారా టైప్ 2 డయాబెటిస్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. వంగడాలకు జన్యుమార్పిడి చేయకుండా.. కేవలం సాగు స్థితిగతుల్లో మార్పులతోనే కూరగాయల్లో పోషక విలువలు పెంచుతున్నాం. అనేక రంగుల కాంతినిచ్చే లైట్లు, మొక్కలు పెంచేందుకు వాడే ద్రవరూప పోషకాలతో సాగు చేస్తున్నాం. ఊబకాయం, రక్తంలో గ్లూకోజ్ నియంత్రణ, ఇన్‌ఫ్లమేషన్, రక్తపోటు, గుండె పనితీరులో గుణాత్మక మార్పులు వస్తున్నట్లు కనుగొన్నాం.

– డాక్టర్ రుచిర నందసిరి,
మనిటోబ యూనివర్సిటీ, విన్నిపెగ్, కెనడా

దేశీ విత్తనాలే మేలు



> తిరిగి విత్తుకోవటానికి ఉపయోగపడని ఖరీదైన విత్తనాలను భారతీయ వ్యవసాయాన్ని ఆక్రమించటమే పంటలు విఫలం కావటం, రైతులు కుంగిపోవటానికి మూల కారణం. మనం ఇప్పుడు చేయాల్సిందేమిటంటే తిరిగి మన సంప్రదాయక దేశీ విత్తనాలనే తిరిగి చేపట్టాలి. ఇవి మరింత పోషకాల సాంద్రతతో ఉంటాయి. వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకుంటాయి. మరింత మెరుగ్గా చీడ పీడలను తట్టుకుంటాయి. తక్కువ నీటితోనే పంటలు పండుతాయి. విత్తన స్వరాజ్యం చేకూరుతుంది.
>
> – డాక్టర్ వందనా శివ, ప్రసిద్ధ స్వతంత్ర శాస్త్రవేత్త

బిజినెస్ రీల్

ఎయిర్ ఇండియా విమానాల్లో వైఫై

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా విమాన ప్రయాణంలో వైఫై సేవలను విస్తరించనుంది. ఢిల్లీ–లండన్ హీత్రో మార్గంలో ఏ350 సిరీస్ విమానంతో తొలుత ఈ సేవలను మొదలు పెట్టనున్నట్టు సంస్థ తెలిపింది. ఢిల్లీ–లండన్ హీత్రో రూట్లో సర్వీసును ఎయిర్ ఇండియా ఆదివారం ప్రారంభించింది. ఈ రూట్లో ఎయిర్ ఇండియా ప్రతిరోజు రెండు సరీ్వసులను నడుపుతోంది. బోయింగ్ 777–300 ఈఆర్ స్థానంలో ఏ350–900 విమానాలను రంగంలోకి దింపుతున్నట్టు సంస్థ వెల్లడించింది. తద్వారా ప్రతివారం ఢిల్లీ–లండన్ హీత్రో మార్గంలో అదనంగా 336 సీట్లు అందుబాటులోకి వస్తాయని వివరించింది.

ఐవోటెక్ ఏవిగేషన్ 'రిమోట్ పైలట్ శిక్షణ'

డీజీసీఏ నుంచి అనుమతులు



గురుగ్రామ్: డ్రోన్ల తయారీ సంస్థ ఐవోటెక్ వరల్డ్ ఏవిగేషన్.. రిమోట్ పైలట్ ట్రెయినింగ్ ఆర్గనైజేషన్ (ఆర్‌పీటీవో) ఏర్పాటుకు పౌరవిమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నుంచి ఆమోదం పొందినట్టు ప్రకటించింది. దేశంలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ, శిక్షణకు కట్టుబడి ఉన్నట్టు కంపెనీ తెలిపింది. తాజా ఆమోదంతో చిన్న, మధ్య స్థాయి డ్రోన్లపై సమగ్రమైన శిక్షణ ఇవ్వడానికి వీలు లభిస్తుందని, కంపెనీ సామర్థ్యాలు పెద్ద ఎత్తున విస్తరణకు ఇది అనుకూలిస్తుందని పేర్కొంది. డీజీసీఏ సర్టిఫైట్ శిక్షకులతో శిక్షణ అందిస్తామని, భద్రత, నైపుణ్యాల పరంగా అత్యున్నత ప్రమాణాలను పాటిస్తామని వివరించింది.

అపోలో మైక్రో సిస్టమ్స్‌కు బీడీఎల్ నుంచి ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాలకు ఎలక్ట్రో మెకానికల్ సొల్యూషన్స్ అందించే అపోలో మైక్రో సిస్టమ్స్‌కి తాజాగా భారత్ డైనమిక్స్ (బీడీఎల్) నుంచి రూ. 10.90 కోట్ల ఆర్డరు లభించింది. ఇది భారీ టార్పిడోల కోసం అధునాతన సాఫ్ట్‌వేర్ ఆధారిత 'యూనివర్సల్ హోమింగ్ సిస్టమ్'ను అందించేందుకు ఉద్దేశించినదని కంపెనీ తెలిపింది. ఈ కొత్త తరహా సాంకేతికత, డీఆర్‌డీవో సహకారంతో రూపొందినట్లు వివరించింది. ఇప్పటివరకు ఈ హోమింగ్ సిస్టమ్‌లను సరఫరా చేసేందుకు అపోలో మైక్రో సిస్టమ్స్ మాత్రమే అర్హత పొందినట్లు కంపెనీ పేర్కొంది. మరోవైపు యాంటీ–సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌కి సంబంధించి రాకెట్ గైడెడ్ బాంబుల తయారీ కోసం కంట్రోలరేట్ ఆఫ్ నేవల్ ఆర్మమెంట్ బిడ్డింగ్‌లో తమ సంస్థ ఎల్1 నిల్చినట్లు వివరించింది. ఈ ఆర్డరు విలువ రూ. 5.73 కోట్లుగా ఉంటుంది.

అగ్రిటెక్ స్టార్టప్‌లకు బూస్ట్

రూ.750 కోట్ల 'అగ్రిష్యూర్' ఫండ్ ప్రారంభం

- ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులప్రోత్సాహం అవశ్యం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉద్ఘాటన



'అగ్రిష్యూర్' ఫండ్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి చౌహాన్ తదితర అధికారులు

న్యూఢిల్లీ: అగ్రిటెక్ స్టార్టప్‌లకు ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం రూ.750 కోట్ల ఫండ్– 'అగ్రిష్యూర్'ను ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను పెంచాల్సిన అవసరాన్ని మంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. వ్యవసాయ రంగం పురోగతి లక్ష్యంగా దాదాపు రూ.14,000 కోట్లతో ఏడు పథకాలకు కేంద్ర మంత్రివర్గం సోమవారం ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా 'అగ్రిష్యూర్' ఆవిష్కరణ సందర్భంగా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేసిన ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు...

- రూ. 750 కోట్ల 'అగ్రిష్యూర్' (స్టార్టప్‌లు, రూరల్ ఎంటర్‌ప్రైజెస్) ఫండ్ ఈక్విటీ అలాగే డెట్ క్యాపిటల్ రెండింటినీ అందించడం ద్వారా స్టార్టప్‌లు, 'అగ్రిప్రెన్యూర్'లకు మద్దతు ఇస్తుంది.
- స్టార్టప్‌లు ఈ నిధిని వినియోగించుకోవాలి. వ్యవసాయ రంగంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న అగ్రిటెక్ స్టార్టప్‌లకు ఎటువంటి నిధుల కొరతనూ ఎదుర్కొనకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- గ్రామీణ భారతదేశంలో వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ప్రారంభించింది.
- వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఈ రంగం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 18 శాతం వాటాను కలిగి ఉంది.
- రైతులు అతిపెద్ద ఉత్పత్తిదారులు మాత్రమే కాకుండా అతిపెద్ద వినియోగదారులు కూడా అన్న విషయాన్ని గమనించాలి. ఇది ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన పరోక్ష సహకారం.
- రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతోపాటు ఆహారం, పౌష్టికాహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.
- ఉత్పత్తి పెంపు, ముడి పదార్థాల వ్యయం తగ్గింపు, వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు, పంటల వైవిధ్యం, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడంపై కేంద్రం దృష్టి సారించింది. ఎరువులపై కేంద్రం భారీ రాయితీలూ కల్పిస్తోంది.
- వ్యవసాయ రంగానికి కొత్త ప్రయోగాలు అవసరం. చిన్న రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయం చేసేందుకు గ్రూపులుగా ఏర్పడే అంశాన్ని వారు పరిశీలించాలి.
- మితిమీరిన రసాయన పురుగుమందులు, ఎరువుల వాడకం మంచిది కాదు. సాగునేలను సారవంతమైనదిగా కొనసాగించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

'కృషినివేష్' పోర్టల్ ఆవిష్కరణ..

'కృషినివేష్' పేరుతో ఇంటిగ్రేటెడ్ అగ్రి ఇన్వెస్ట్‌మెంట్ పోర్టల్‌ను కూడా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పోర్టల్ పెట్టుబడి అవకాశాలు సంబంధిత వ్యవసాయ సమాచారాన్ని కేంద్రీకరించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మార్చగలదన్న విశ్వాసాన్ని మంత్రి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. వ్యవసాయ వ్యాపారాలను మెరుగుపరచడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన సమగ్ర వేదికే పోర్టల్ అని ఆయన అభివర్ణించారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేసుకోవడానికి సంబంధించి రైతులు, పారిశ్రామికవేత్తలు, ఈ రంగంలోని విభిన్న వాటాదారులకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని చౌహాన్ తెలిపారు.

ఏఐఎఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

వ్యవసాయ రంగంలో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) కింద వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన బ్యాంకులు, రాష్ట్రాలకు వారి కృషిని గుర్తింపుగా వ్యవసాయ మంత్రి ఏఐఎఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులను ఈ సందర్భంగా అందజేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ అవార్డులు అందుకోగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రైవేట్ రంగ బ్యాంకుగా అవార్డును స్వీకరించింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విభాగంలో బరోడా రాజస్థాన్ క్షేత్రీయ గ్రామీణ బ్యాంక్, పంజాబ్ గ్రామీణ బ్యాంక్, బరోడా యూపీ గ్రామీణ బ్యాంక్, మహారాష్ట్ర గ్రామీణ బ్యాంక్, సర్వ హర్యానా గ్రామీణ బ్యాంక్ ఉత్తమ పనితీరుకు అవార్డులు అందుకున్నాయి. అత్యుత్తమ పనితీరు కనబరిచి, అవార్డులను అందుకున్న రాష్ట్రాలలో తెలంగాణసహా మధ్యప్రదేశ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ ఉన్నాయి.

డ్రోన్ హబ్ ప్లాట్‌ఫాం ప్రారంభం

న్యూఢిల్లీ: డీఏఏఎస్ (డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్) సంస్థ డ్రోన్ డెస్టినేషన్ కొత్తగా డ్రోన్ హబ్ పేరిట వినూత్న ఈ–కామర్స్ ప్లాట్‌ఫాంను ప్రారంభించింది. ఇందులో డ్రోన్లు, వాటికి సంబంధించిన విడిభాగాలు, బ్యాటరీలు మొదలైనవి లభిస్తాయి. దేశీయ డ్రోన్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానికంగా, విశ్వసనీయమైన ఉత్పత్తులకు నెలకొన్న డిమాండ్‌ను ఈ ప్లాట్‌ఫాం తీర్చగలదని కంపెనీ సీఈవో చిరాగ్ శర్మ తెలిపారు. ఆఫ్టర్–సేల్స్ సేవలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు.

2.75 లక్షల ఫోన్ నంబర్లకు చెక్

- ఉక్కుపాదం మోపుతున్న ట్రాయ్
- ఇబ్బందిపెడితే నంబర్ డిస్‌కనెక్ట్

న్యూఢిల్లీ: ఇబ్బందికర కాల్స్, నమోదుకాని టెలిమార్కెటర్లపై టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఉక్కుపాదం మోపుతోంది. ట్రాయ్ ఆదేశాలతో 2.75 లక్షల టెలిఫోన్ నంబర్లను టెలికం సంస్థలు డిస్‌కనెక్ట్ చేశాయి. అలాగే 50 టెలిమార్కెటింగ్ కంపెనీలకు టెలికం సేవలు బ్లాక్ అయ్యాయని ట్రాయ్ మంగళవారం వెల్లడించింది. ఈ చర్యలు స్పామ్ కాల్స్‌ను తగ్గించడంలో, కస్టమర్లకు ఉపశమనం కలిగించడంలో గణనీయ ప్రభావాన్ని చూపుతాయని ట్రాయ్ భావిస్తోంది. స్పామ్ కాల్స్ గణనీయంగా పెరుగుతున్నాయని, 2024 ప్రథమార్థంలో నమోదుకాని టెలిమార్కెటర్లపై 7.9 లక్షలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని ట్రాయ్ తెలిపింది. ఇబ్బందికర కాల్స్‌కు కట్టడి చేసేందుకు ట్రాయ్ 2024 ఆగస్టు 13న అన్ని యాక్సెస్ ప్రొవైడర్లకు కఠిన ఆదేశాలను జారీ చేసింది. టెలికం వనరులను దుర్వినియోగం చేస్తున్న నమోదుకాని టెలిమార్కెటర్ల నుండి ప్రమోషనల్ వాయిస్ కాల్స్‌ను తక్షణమే నిలిపివేయాలని, రెండేళ్ల వరకు డిస్‌కనెక్షన్ లేదా బ్లాక్ లిస్టులో పెట్టాలని యాక్సెస్ ప్రొవైడర్లను కోరింది. ఇబ్బంది కలిగించే కాల్స్‌ను కట్టడి చేసే ప్రయత్నంలో భాగంగా.. 50కి మించిన కాల్స్ లేదా ఎస్ఎంఎస్‌లు పంపే నిర్దిష్ట నంబర్‌కు గ్రేడ్స్ ప్రకారం అధిక టారిఫ్‌ను ప్రవేశపెట్టాలని ట్రాయ్ ఇటీవలే తన చర్చా పత్రం ద్వారా టెలికం కంపెనీలను కోరింది.

భారత్‌లోకి ఎఫ్‌డీఐల వరద

ఏప్రిల్–జూన్‌లో 48% పెరిగి 16.17 బిలియన్ డాలర్లకు



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) ఆకర్షించడంలో భారత్ దూసుకుపోతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో ఎఫ్‌డీఐలు 48% పెరిగి 16.17 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ1లో 10.94 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. సర్వీసెస్, టెలికం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఫార్మా, కెమికల్స్ రంగాల్లోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈక్విటీలతో కలిసి మొత్తం ఎఫ్‌డీఐలు 17.56 బిలియన్ డాలర్ల నుంచి 28% పెరిగి 22.49 బిలియన్ డాలర్లకు చేరినట్లు డీపీఐఐటీ గణాంకాలు తెలిపాయి.

- వార్షిక ప్రాతిపదికన జూన్‌లో 3.16 బిలియన్ డాలర్ల నుంచి 5.41 బిలియన్ డాలర్లకు, మే నెలలో 2.67 బిలియన్ డాలర్ల నుంచి 5.85 డాలర్లకు చేరాయి. అయితే ఏప్రిల్‌లో మాత్రం 5.1 బిలియన్ డాలర్ల నుంచి 4.91 బిలియన్ డాలర్లకు స్వల్పంగా తగ్గాయి.
- మారిషస్, సింగపూర్, అమెరికా, నెదర్లాండ్, యూఏఈ, కేమన్ ఐలాండ్, సైప్రస్ దేశాల నుంచి పెట్టుబడులు పెరిగాయి. జపాన్, యూకే, జర్మనీ నుంచి ఎఫ్‌డీఐలు తగ్గాయి.

రాష్ట్రాల వారీగా: తొలి త్రైమాసికంలో అత్యధికంగా మహారాష్ట్ర 8.48 బిలియన్ డాలర్లు ఆకర్షించింది. కర్ణాటక(2.28 బిలియన్ డాలర్లు) తెలంగాణా(1.08 బి.డాలర్లు), గుజరాత్(1.02 బి.డాలర్లు)లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

పట్టణ ప్రాంతాల్లో టెలికం సేవలకు భారత్ నిధి



న్యూఢిల్లీ: పట్టణ ప్రాంతాల్లో టెలికం సేవల మద్దతుకు రూ.80,000 కోట్ల 'డిజిటల్ భారత్ నిధి' మద్దతుగా నిలుస్తుందని.. ఈ సేవలు మరింత భద్రతతో, అందుబాటు ధరలకు లభిస్తాయని ప్రభుత్వ ఆశాభావం వ్యక్తం చేసింది. టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023 కింద ఈ పథకాన్ని కేంద్రం గత వారమే నోటిఫై చేయడం గమనార్హం. డిజిటల్ భారత్ నిధి కింద నిధుల మద్దతు పొందే పథకాలు, ప్రాజెక్టులు ఏవైనా సరే నిర్దేశిత నిబంధనలను పాటించడం తప్పనిసరి. మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడానికి అవసరమైన టెలికం పరికరాలు సహా టెలికమ్యూనికేషన్ సేవల ప్రాజెక్టులు, టెలికాం భద్రతను పెంచడం, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో టెలికాం సేవల అందుబాటు, స్థోమతను మెరుగుపరచడం వంటివి వీటి కిందకు వస్తాయి'' అని ప్రకటన పేర్కొంది. 2024 మార్చి చివరికి డిజిటల్ భారత్ నిధి కింద రూ.79,638 కోట్ల నిధి మిగిలి ఉంది. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, దేశీయ టెక్నాలజీలను వాణిజ్యీకరించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, పర్యావరణ అనుకూల సాంకేతికతలకు ఈ నిధి కింద ప్రోత్సాహం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం.

రూ.700 కోట్లతో సీడబ్ల్యూసీ గోదాముల అభివృద్ధి

ఇన్వెస్ట్ చేయనున్న హొరిజాన్ ఇండస్ట్రియల్ పార్క్స్



న్యూఢిల్లీ: సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ)కి చెందిన 13 గోదాములను రూ.700 కోట్లతో హొరిజాన్ ఇండస్ట్రియల్ పార్క్స్ అభివృద్ధి చేయనుంది. బ్లాక్‌స్టోన్ రియల్ ఎస్టేట్ ఫండ్స్‌కు చెందిన లాజిస్టిక్స్ సేవల సంస్థ ఇది. కేంద్ర ప్రభుత్వరంగ సీడబ్ల్యూసీకి దేశవ్యాప్తంగా మొత్తం 13 గోదాములు ఉన్నాయి. వీటిని 70 ఎకరాల పరిధిలో గ్రేడ్–ఏ సదుపాయాలుగా హొరిజాన్ ఇండస్ట్రియల్ పార్క్స్ తిరిగి అభివృద్ధి చేయనున్నట్టు తెలిపింది. 2.4 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణంలో ఉన్న వీటిని మారుమూల ప్రాంతాలను అనుసంధానించే అతిపెద్ద గోదాముల వసతిగా పేర్కొంది. తద్వారా ఈ–కామర్స్, రిటైల్, థర్డ్ పార్టీ లాజిస్టిక్స్, కోల్డ్ చైన్ అవసరాలను తీర్చే విధంగా ఇవి రూపుదిద్దుకోనున్నాయి. ఈ గోదాములు ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, ముంబై, పుణె, బెంగళూరు పరిధిలో ఉండడం గమనార్హం. ఈ డీల్‌కు నైట్‌ఫ్రాం క్ ఇండియా సేవలు అందించింది. హొరిజాన్ ఇండస్ట్రియల్ పార్క్స్ ప్రస్తుతం 25 పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్‌లను నిర్వహిస్తోంది. 1,700 ఎకరాల పరిధిలో ఇవి విస్తరించి ఉన్నాయి.

ఎలక్ట్రిక్ వాహనాలకు రూ.10,000 కోట్ల ప్రోత్సాహం

ఫేమ్–3 కింద కేటాయింపులు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాలకు మరో విడత కేంద్ర సర్కారు ప్రోత్సాహకాలను ప్రకటించనుంది. ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఫేమ్) – 3 పథకం కింద రూ.10,000 కోట్లను కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం సెప్టెంబర్ నుంచి అమల్లోకి రానున్నట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు వెల్లడించాయి. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతోపాటు, ప్రభుత్వం కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ బస్సులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఆరంభంలో రెండేళ్ల కాలానికి దీన్ని అమలు చేయనున్నట్టు తెలిసింది. ఫేమ్ –2 కింద 7,000 ఎలక్ట్రిక్ బస్సులకు సబ్సిడీ ఇవ్వగా.. ఫేమ్–3లో ఇంతకంటే అధిక సంఖ్యలో బస్సులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు సమాచారం. ఫేమ్–2లో ఎలక్ట్రిక్ కార్లకు సైతం ప్రోత్సాహకాలు లభించగా.. ఫేమ్–3లో వీటికి ప్రోత్సాహకాలపై ఇంకా స్పష్టత రాలేదు. కార్లను మినహాయించనున్నట్టు తెలుస్తోంది. ఫేమ్ –2 పథకం గడువు 2024 మార్చితో ముగిసింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు విక్రయ ధరపై 15 శాతం సబ్సిడీ లభించడం గమనార్హం. ఏప్రిల్ నుంచి ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఈఎంపీఎస్)ను తాత్కాలికంగా అమల్లోకి తీసుకొచ్చారు.

ఈఎంపీఎస్

ఈ పథకం కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలకు ఈ ఏడాది జూలై వరకు ప్రోత్సాహకాల కింద రూ.500 కోట్లను కేంద్రం కేటాయించింది. ప్రతి ద్విచక్ర ఈవీపై రూ.10,000 చొప్పున సబ్సిడీ కేటాయించింది. కానీ ఫేమ్–2లో ఇది రూ.22,500గా ఉంది. ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనంపై రూ.50,000 సబ్సిడీని ఈఎంపీఎస్ కింద ఇచ్చారు. ఫేమ్–2లో ఇది రూ. 1,11,505గా ఉంది. కిలోవాట్ హవర్‌కు రూ.5,000 చొప్పున ద్విచక్ర, త్రి చక్ర వాహనాలకు సబ్సిడీని కేంద్రం ప్రకటించింది.

విధాన నిర్ణయాల్లో 'మార్కెట్ల' ప్రభావం సరికాదు

సీఈఏ అనంతనాగేశ్వరన్ ఉద్ఘాటన



న్యూఢిల్లీ: భారతదేశం వికశిత భారత్ లక్ష్యం దిశగా సాగుతున్న నేపథ్యంలో దేశ ఆర్థిక విధానాల్లో 'మార్కెట్ల' ప్రభావాన్ని నివారించాల్సిన అవసరం ఉందని చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ స్పష్టం చేశారు. ''భారత్ స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో పోల్చితే దాదాపు 140 శాతంగా ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, భారత్ ఫైనాన్షియల్ రంగం రికార్డు లాభదాయకత, జీడీపీతో పోల్చితే భారీ మార్కెట్ క్యాపిటలైజేషన్ వంటివి ఎకానమీ పరంగా జాగ్రత్తగా పరిశీలించాల్సిన కీలక అంశాలని సీఐఐ ఫైనాన్సింగ్ 3.0 సమ్మిట్‌లో ఆయన పేర్కొన్నారు. ''ఆర్థిక వ్యవస్థ కంటే మార్కెట్ పెద్దదిగా మారినప్పుడు, ఆయా అంశాలు ప్రభుత్వ ప్రజా విధానాలపై ఆధిపత్యం చెలాయిస్తాయి. ఈ ధోరణిని నేను ఫైనాన్షియేలైజేషన్ అని భావిస్తాను. ఈ ధోరణి సహేతుకమైనది కాదు. పాలసీ, స్థూల ఆర్థిక అంశాలు ఫలితాలపై మార్కెట్ ఆధిపత్యం తగదు'' అని ఆయన అన్నారు. ప్రత్యేకించి భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఫైనాన్షియేలైజేషన్ మంచి ఫలితాలను ఇవ్వజాలదని స్పష్టం చేశారు.

ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలపై జీఎస్‌టీ తగ్గాలి



- జీఎస్‌టీ కౌన్సిల్‌లో పరిశీలించాలని రాష్ట్రాలకు కేంద్ర మంత్రి గడ్కరీ సూచన

న్యూఢిల్లీ: ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలపై వస్తు, సేవల పన్నులను 12 శాతానికి తగ్గించే అంశాన్ని జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పరిశీలించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 'ఫ్లెక్స్ ఫ్యూయల్ కార్లు, స్కూటర్లపై జీఎస్‌టీ తగ్గింపు విషయంలో వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సహాయం అవసరం. వారిని ఒప్పించేందుకు ప్రయత్నిద్దామని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశానికి హాజరై, ఈ మేరకు ప్రతిపాదన చేయాలని నేను మహారాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్‌ను కోరాను' అని ఇండియా బయో ఎనర్జీ అండ్ టెక్ ఎక్స్‌పోలో పాల్గొన్న సందర్భంగా గడ్కరీ చెప్పారు. ఒక ఇంధనానికే పరిమితం కాకుండా వివిధ రకాల ఇంధనాలు, ఇంధన మిశ్రమాలతో పని చేసే వాహనాలను ఫ్లెక్స్–ఫ్యూయల్ వాహనాలుగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం హైబ్రీడ్స్ సహా సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్లతో పనిచేసే వాహనాలపై జీఎస్‌టీ 28 శాతంగాను, ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతంగాను ఉంది.

ఏటా రూ. 22 లక్షల కోట్ల ఇంధనాల దిగుమతి..

భారత్ ఏటా రూ. 22 లక్షల కోట్ల విలువ చేసే శిలాజ ఇంధనాలను భారత్ దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ చెప్పారు. ఇది వాయు కాలుష్యంతో పాటు ఆర్థిక సమస్యలకు కూడా దారి తీస్తోందన్నారు. శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించుకుని జీవ ఇంధనాల వాడకాన్ని పెంచుకోవడం వల్ల ప్రధానంగా వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని మంత్రి చెప్పారు. భారత్‌లో బయోఫ్యూయల్ వ్యయాలు తక్కువని, కాలుష్యం కూడా ఉండదన్నారు.

దీనితో ఇది సామాన్యులకు కూడా ప్రయోజనకరమని మంత్రి చెప్పారు. మరోవైపు, దేశ ఎకానమీలో ఆటోమొబైల్ రంగం కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. 4.5 కోట్ల పైచిలుకు ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ పరిశ్రమ గరిష్ఠ స్థాయిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ చెల్లిస్తోందని మంత్రి చెప్పారు. హీరో, బజాజ్ వంటి దిగ్గజ టూవీలర్ల తయారీ సంస్థలు భారత్‌లో తాము తయారు చేసే బైక్‌లలో 50 శాతం వాహనాలను ఎగుమతి చేస్తున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం పెద్ద సమస్యగా మారిన ప్రస్తుత తరుణంలో బయో–ఫ్యూయల్‌కి సంబంధించి మెరుగైన టెక్నాలజీ వస్తే మన ఎగుమతులు మరో 10–20 శాతం మేర పెరగడానికి ఆస్కారం ఉందని మంత్రి చెప్పారు.

జీఎస్‌టీ కౌన్సిల్ ముందుకు ఆన్‌లైన్ గేమింగ్ పన్ను

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ పన్నుకు సంబంధించి స్థాయి నివేదికపై జీఎస్‌టీ కౌన్సిల్ తదుపరి భేటీలో చర్చించనుంది. అలాగే, నకిలీ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం పురోగతిని సమీక్షించనున్నట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు తెలిపాయి. ఆర్థిక బిల్లు 2024 కింద జీఎస్‌టీ చట్టంలో సవరణలపై నోటిఫికేషన్‌కు ఆమోదం తెలపనున్నట్టు వెల్లడించాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 54వ జీఎస్‌టీ కౌన్సిల్ భేటీ ఈ నెల 9న జరగనుంది. జీఎస్‌టీలో రేట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి మంత్రుల బృందం నివేదికపైనా భేటీలో చర్చించనున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు 28 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సిందేనని 2023 ఆగస్టులో జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం స్పష్టం చేయడం తెలిసిందే. ఆఫ్‌షోర్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు సైతం ఇదే వర్తిస్తుంది. అమల్లోకి వచ్చిన ఆరు నెలల తర్వాత ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్నును సమీక్షిస్తామని జీఎస్‌టీ కౌన్సిల్ లోగడ చెప్పింది. దీనికి అనుగుణంగానే పన్నుపై మరోసారి సమీక్ష చేయనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

4-9-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470–00
వరంగల్	472–00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,921.15	1.72
BAJAJFINSV	1,866.25	1.4
ICICIBANK	1,247.00	1.39
HDFCLIFE	754.85	1.28
HEROMOTOCO	5,647.40	1.24

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,338.50	-1.36
ONGC	321.85	-1.33
INFY	1,940.90	-1.2
ADANIPORTS	1,478.30	-1.08
HCLTECH	1,788.20	-1.02

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,314
ఎన్ఎస్ఈ	1,11,674
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,88,324
ఎఫ్ఐఐ	+ 1,029
డీఐఐ	+ 1,896

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.20	$ 73.55
బ్రెంట్	73.62	$ 77.52

పతనం దిశగా పాక్

అంతర్జాతీయ క్రికెట్‌లో నానాటికీ దిగజారుతున్న జట్టు ప్రదర్శన



అనిశ్చితికి మారుపేరైన పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రదర్శన నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇంతకన్నా కిందికి దిగజారలేదు అనుకున్న ప్రతీసారి అభిమానుల అంచనాలను తలకిందులు చేస్తూ అంతకుమించిన చెత్త ప్రదర్శనతో నిరాశ పరుస్తోంది. ఒకప్పుడు ఇమ్రాన్ ఖాన్, వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్, ఆకీబ్ జావేద్, షోయబ్ అక్తర్ వంటి దిగ్గజ పేసర్లు... జహీర్ అబ్బాస్, జావేద్ మియాందాద్, ఇంజమాముల్ హక్, రమీజ్ రాజా, సయీద్ అన్వర్, యూనిస్ ఖాన్, మొహమ్మద్ యూసుఫ్, షాహిద్ అఫ్రిది, షోయబ్ మాలిక్ వంటి మేటి ఆటగాళ్లతో కళకళలాడిన ఆ జట్టు... ఇప్పుడు రెండున్నరేళ్లుగా స్వదేశంలో టెస్టు మ్యాచ్ గెలవలేక ఇబ్బంది పడుతోంది. సొంతగడ్డపై బంగ్లాదేశ్ చేతిలో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురవడం పాకిస్తాన్ జట్టు పతనావస్థను సూచిస్తోంది.

రావల్పిండి: సమష్టి ప్రదర్శనతో కదంతొక్కిన బంగ్లాదేశ్ జట్టు... పాకిస్తాన్‌లో పాకిస్తాన్‌పై రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. గతంలో పాకిస్తాన్‌తో ఆడిన 13 మ్యాచ్‌ల్లో 12 టెస్టుల్లో ఓడిన బంగ్లాదేశ్... తాజా పర్యటనలో వరుసగా రెండు టెస్టులు నెగ్గి సొంతగడ్డపై పాకిస్తాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. బంగ్లాదేశ్‌కు విదేశాల్లో ఇది మూడో టెస్టు సిరీస్ విజయం కాగా... వర్షం అంతరాయం మధ్య మూడున్నర రోజులే జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ స్ఫూర్తివంతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. రాజకీయ అనిశ్చితి కారణంగా దేశంలో అల్లర్లు, నిరసనలు కొనసాగుతున్న సమయంలో బంగ్లాదేశ్ జట్టు ఇలాంటి విజయం సాధించడం గమనార్హం. మరోవైపు గత కొంతకాలంగా స్వదేశంలోనూ నిలకడగా విజయాలు సాధించలేకపోతున్న పాకిస్తాన్ జట్టు... ఈ ఏడాది వరుసగా ఐదో టెస్టు మ్యాచ్‌లో పరాజయం పాలైంది. ఈ ఐదింట్లోనూ జట్టుకు సారథిగా వ్యవహరించిన షాన్ మసూద్... తొలి ఐదు టెస్టుల్లోనూ ఓటములు ఎదుర్కొన్న తొలి పాకిస్తాన్ కెప్టెన్‌గా చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఈ సిరీస్‌లో నమోదైన పలు ఆసక్తికర రికార్డులను పరిశీలిస్తే..

3 బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు విదేశాల్లో ఇది మూడో టెస్టు సిరీస్ విజయం. ఇంతకుముందు 2009లో వెస్టిండీస్‌పై. 2021లో జింబాబ్వేపై బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌లు నెగ్గింది.

10 ఒక ఇన్నింగ్స్‌లో పదికి పది వికెట్లు పేస్ బౌలర్లే తీయడం బంగ్లాదేశ్‌కు ఇది తొలిసారి. రెండో ఇన్నింగ్స్‌లో హసన్ మహమూద్, నహీద్ రాణా, తస్కీన్ అహ్మద్ కలిసి పాకిస్తాన్ పది వికెట్లు పడగొట్టారు. ఇక ఓవరాల్‌గా ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి బంగ్లా పేసర్లు 14 వికెట్లు పడగొట్టారు.

21 ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ టాప్‌-6 ప్లేయర్లు 21 పరుగులకే పెవిలియన్ చేరారు. టెస్టు మ్యాచ్ నెగ్గిన సందర్భంలో తొలి ఇన్నింగ్స్‌లో మొదటి ఆరుగురు ఆటగాళ్లు చేసిన రెండో అత్యల్ప పరుగులివే. 1887లో ఆస్ట్రేలియాతో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 17 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ ఆ తర్వాత పుంజుకుని మ్యాచ్ నెగ్గింది.

10 సొంతగడ్డపై గత పది మ్యాచ్‌ల్లోనూ పాకిస్తాన్ జట్టు గెలుపు రుచి చూడలేదు. ఇంతకుముందు 1969–1975 మధ్య పాకిస్తాన్ జట్టు వరుసగా 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించలేకపోయింది.

5 షాన్ మసూద్ సారథ్యంలో ఆడిన ఐదు టెస్టుల్లోనూ పాకిస్తాన్ ఓటమి పాలైంది. గతంలో ఏడుగురు కెప్టెన్‌లకు తొలి ఐదు టెస్టుల్లో పరాజయాలు ఎదురయ్యాయి. ఆ జాబితాలో ఖాలెద్ మసూద్ (12 టెస్టులు: బంగ్లాదేశ్), ఖాలెద్ మహమూద్ (9 టెస్టులు: బంగ్లాదేశ్), మొహమ్మద్ అష్రఫుల్ (8 టెస్టులు: బంగ్లాదేశ్), నయీముర్ రహమాన్ (5 టెస్టులు: బంగ్లాదేశ్), గ్రేమ్ క్రీమర్ (6 టెస్టులు: జింబాబ్వే), కేన్ రూథర్‌ఫర్డ్ (5 టెస్టులు, న్యూజిలాండ్), బ్రాత్‌వైట్ (5 టెస్టులు: వెస్టిండీస్) ముందున్నారు.

"ఓటమికి బాధ్యత వహిస్తూ దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా. కానీ టెస్టు క్రికెట్‌ను మరింత పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది. సుదీర్ఘ ఫార్మాట్ కోసం సిద్ధంగా లేనట్లు అనిపించింది. ఆటగాళ్లు గెలవాలనే లక్ష్యంతోనే ఆడినా... ఫలితాలు అనుకూలంగా రాలేదు. టెస్టు ఫార్మాట్ ఆడుతున్న బౌలర్లకు తరచూ అవకాశాలు ఇవ్వాలి. తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోలేకపోయాం. ఇకపై మరింత క్రమశిక్షణతో ముందుకు సాగాలనుకుంటున్నాం. లోపాలను సవరించుకోవడంపై దృష్టి పెడతాం. జట్టు ఎంపిక, డ్రెస్సింగ్ రూమ్ వంటి అంశాలతో ఫలితాలకు సంబంధం లేదు. బంగ్లాదేశ్ జట్టు మా కంటే మెరుగైన ఆటతీరు కనబర్చింది. ఈ విజయానికి వారు అర్హులు. –షాన్ మసూద్, పాకిస్తాన్ కెప్టెన్

ధనుశ్‌కు రెండో స్వర్ణం



న్యూఢిల్లీ: ప్రపంచ బధిరుల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ తన ఖాతాలో రెండో స్వర్ణ పతకాన్ని జమ చేసుకున్నాడు. జర్మనీలోని హనోవర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ధనుశ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. ఫైనల్లో ధనుశ్ శ్రీకాంత్–మహిత్ సంధూ (భారత్) ద్వయం 17–5తో భారత్‌కే చెందిన నటాషా జోషి–మొహమ్మద్ ముర్తజా జంటపై గెలిచింది. ధనుశ్–మహిత్ జోడీ క్వాలిఫయింగ్‌లో 628.8 పాయింట్లు స్కోరు చేసి బధిరుల షూటింగ్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇదే టోర్నీలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభినవ్ దేశ్వాల్–ప్రాంజలి ధూమల్ జంట రజత పతకాన్ని దక్కించుకుంది. ఫైనల్లో అభినవ్–ప్రాంజలి ద్వయం 7–17తో ఒలెక్సిల్ లేజ్బింక్–ఇనా అఫోన్‌చెంకో (ఉక్రెయిన్) జంట చేతిలో ఓడిపోయింది. మూడో రోజు ముగిశాక భారత్ ఖాతాలో మూడు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలున్నాయి.

అక్టోబరు 18 నుంచి ప్రో కబడ్డీ లీగ్

తొలి అంచె పోటీలు హైదరాబాద్‌లో



ముంబై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ అక్టోబరు 18వ తేదీన మొదలవుతుంది. మూడు నగరాల్లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అక్టోబరు 18 నుంచి తొలి అంచె పోటీలు జరుగుతాయి. అనంతరం నవంబరు 10 నుంచి రెండో అంచె మ్యాచ్‌లకు నోయిడా నగరం ఆతిథ్యమిస్తుంది. చివరి అంచె పోటీలు డిసెంబరు 3 నుంచి పుణేలో జరుగుతాయని... పూర్తి షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని పీకేఎల్ లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపారు. 2014లో ప్రో కబడ్డీ లీగ్ మొదలైంది. ఇప్పటి వరకు 10 సీజన్లపాటు ఈ టోర్నీ జరిగింది. పుణేరి పల్టన్ జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. పట్నా పైరేట్స్ జట్టు అత్యధికంగా మూడుసార్లు విజేతగా నిలువగా... జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు రెండుసార్లు టైటిల్‌ను దక్కించుకుంది. బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, యు ముంబా, పుణేరి పల్టన్ జట్లు ఒక్కోసారి చాంపియన్‌గా నిలిచాయి. తెలుగు టైటాన్స్ జట్టు రెండో సీజన్‌లో మూడో స్థానంలో, నాలుగో సీజన్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. గత మూడు సీజన్లలో తెలుగు టైటాన్స్ జట్టు చివరిదైన 12వ స్థానంతో సరిపెట్టుకోవడం గమనార్హం.



పాక్ రెజ్లర్ అలీ అసద్‌పై నాలుగేళ్ల నిషేధం

కరాచీ: ప్రదర్శన మెరుగయ్యేందుకు నిషేధిత ఉత్ప్రేరకాలు ఉపయోగించిన పాకిస్తాన్ రెజ్లర్ అలీ అసద్‌పై ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) నాలుగేళ్ల నిషేధం విధించింది. 2022 బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో అలీ అసద్ పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతక బౌట్‌లో అలీ అసద్ 11–0తో సూరజ్ సింగ్ (న్యూజిలాండ్)పై గెలుపొందాడు. 2022 కామన్వెల్త్ గేమ్స్ సందర్భంగా నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అలీ అసద్ నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్లు తేలింది. దాంతో 2022 నవంబర్‌లో అలీ అసద్‌పై తాత్కాలిక నిషేధం విధించారు. అలీ అసద్ నెగ్గిన కాంస్య పతకాన్ని వెనక్కి తీసుకొని నాలుగో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్ రెజ్లర్ సూరజ్ సింగ్‌కు ఈ పతకాన్ని అందించారు. ఈ కేసును రెండేళ్లపాటు విచారించిన ఐటీఏ అలీ అసద్‌ను దోషిగా నిర్ధారిస్తూ ఈ వారంలో అతడిపై నాలుగేళ్ల నిషేధాన్ని విధించింది. విచారణ సమయంలో అలీ అసద్ గైర్హాజరు కావడంతో ఐటీఏ తుది నిర్ణయాన్ని ప్రకటించింది.



బీసీసీఐ సెలెక్టర్‌గా అజయ్ రాత్రా

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ వికెట్ కీపర్ అజయ్ రాత్రా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెలెక్టర్‌గా నియమితుడయ్యాడు. అజిత్ అగార్కర్ చైర్మన్‌గా ఉన్న ఐదుగురు సభ్యుల ప్యానెల్‌లో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన సలీల్ అంకోలా స్థానాన్ని అజయ్ రాత్రా భర్తీ చేయనున్నాడు. ఈ స్థానం కోసం అజయ్ రాత్రా, రితిందర్ సింగ్ సోధి, అజయ్ మెహ్రా, శక్తి సింగ్ పోటీ పడగా... అశోక్ మల్హోత్రా అధ్యక్షతలోని క్రికెట్ అడ్వైజరీ కమిటీ రాత్రా వైపు మొగ్గు చూపింది. గత ఏడాది ఫిబ్రవరిలో చేతన్ శర్మ వైదొలిగినప్పటి నుంచి సెలెక్షన్ కమిటీలో నార్త్ జోన్‌కు ప్రాతినిధ్యం లేదు. 'బీసీసీఐ క్రికెట్ అడ్వైజరీ కమిటీ అజయ్ రాత్రాను పురుషుల సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసింది. సలీల్ అంకోలా స్థానాన్ని రాత్రా భర్తీ చేస్తాడు' అని బీసీసీఐ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గురువారం దులీప్ ట్రోఫీ ప్రారంభం నుంచి రాత్రా బాధ్యతలు చేపట్టనున్నాడు. 'ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అదే సమయంలో బాధ్యత కూడా పెరిగినట్లే. భారత క్రికెట్‌కు నా వంతు సహకారం అందించేందుకు ప్రయత్నిస్తా' అని రాత్రా పేర్కొన్నాడు. 42 ఏళ్ల అజయ్ రాత్రా గత నెల ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత మహిళల 'ఎ' జట్టు సహాయక బృందంలో సభ్యుడిగా పనిచేశాడు. లెవల్ 3 కోచ్ అయిన రాత్రా దేశవాళీ క్రికెట్‌లో అస్సాం, పంజాబ్, ఉత్తరప్రదేశ్ జట్లకు కోచ్‌గానూ వ్యవహరించాడు. జాతీయ జట్టు తరఫున 6 టెస్టులు, 12 వన్డేలు ఆడిన రాత్రా... జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనూ పని చేశాడు.

లార్డ్స్‌లో తొలిసారి...

- వచ్చే ఏడాది డబ్ల్యూటీసీ ఫైనల్
- జూన్ 11–15 వరకు తుది పోరు



దుబాయ్: ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌కు ఈసారి ఇంగ్లండ్‌లోని విఖ్యాత లార్డ్స్ మైదానం వేదిక కానుంది. వచ్చే ఏడాది జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ తుది పోరు జరుగుతుందని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం ప్రకటించింది. ఫైనల్ మ్యాచ్‌కు 16వ తేదీని రిజర్వ్ డేగా కేటాయించింది. 'అతి తక్కువ కాలంలో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన డబ్ల్యూటీసీ 2023–25 సీజన్ ఫైనల్ వచ్చే సంవత్సరం జూన్ 11 నుంచి నిర్వహిస్తాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో జరిగిన రెండు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ (2021), ఓవల్ (2023) ఆతిథ్యమివ్వగా... ఈసారి లార్డ్స్‌లో ప్రతిష్టాత్మక మ్యాచ్ జరగనుంది. గత రెండు ఎడిషన్‌లలోనూ ఫైనల్ చేరిన భారత జట్టు రెండు పర్యాయాలూ రన్నరప్‌తోనే సరిపెట్టుకోగా... న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఒక్కోసారి విజేతగా నిలిచాయి. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమిండియా టాప్‌లో కొనసాగుతుండగా... ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ సీజన్ ముగిసే సమయానికి అనుకూల వాతావరణం, విశ్వవ్యాప్త అభిమానులకు వీక్షణ సమయం కూడా అనుకూలంగా ఉండటంతో ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహణకు ఇంగ్లండ్ సరైన వేదిగా ఐసీసీ భావిస్తోంది. వరుసగా నాలుగో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు కూడా ఇంగ్లండ్ 2027లో ఆతిథ్యమిస్తుంది.

ఇంగ్లండ్ వన్డే, టి20 కోచ్‌గా మెకల్లమ్

వచ్చే ఏడాది నుంచి బాధ్యతలు



లండన్: దూకుడుకు మారుపేరైన న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్... వచ్చే ఏడాది నుంచి ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కోచ్‌గానూ బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రస్తుతం టెస్టు ఫార్మాట్‌లో మాత్రమే ఇంగ్లండ్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న మెక్‌కల్లమ్... 2025 జనవరి నుంచి వన్డే, టి20లకూ కోచ్‌గా పనిచేయనున్నాడు. మెకల్లమ్ శిక్షణలో సుదీర్ఘ ఫార్మాట్‌లో 'బజ్‌బాల్' ఆటతీరుతో ప్రకంపనలు సృష్టించిన ఇంగ్లండ్ జట్టు... పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేకపోతోంది. 2019లో వన్డే ప్రపంచకప్, 2022లో టి20 ప్రపంచకప్ నెగ్గిన ఇంగ్లండ్... మాథ్యూ మాట్ శిక్షణలో వాటిని తిరిగి సాధించడంలో విఫలమైంది. దీంతో నైతిక బాధ్యత వహిస్తూ ఈ ఏడాది జూలై 30న మాథ్యూ మాట్ వన్డే, టి20 హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నాడు. దీంతో ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వచ్చే ఏడాది నుంచి మెకల్లమ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. అప్పటి వరకు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాజీ ఆటగాడు ట్రెస్కోథిక్ ఇంగ్లండ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'మెకల్లమ్ శిక్షణలో ఫార్మాట్లకు అతీతంగా ఇంగ్లండ్ జట్టు మంచి ప్రదర్శన చేస్తుందని ఆశిస్తున్నా. అతడిలో ఆ సత్తా ఉంది' అని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ మంగళవారం పేర్కొన్నాడు. 'అదనపు బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నా. ఇంగ్లండ్‌లో నైపుణ్యానికి కొదవలేదు. ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన చేసేవిధంగా నా వంతు కృషి చేస్తా. అన్ని ఫార్మాట్లలో రాణించే విధంగా తీర్చిదిద్దుతా' అని మెకల్లమ్ అన్నాడు.



మిఠాయిలకు దూరం... 'బంగారం'తో సంబరం

జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ వెల్లడి

పారిస్ పారాలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శనతో పసిడి పతకం సాధించిన భారత జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్... బంగారు పతకాన్ని నిలబెట్టుకునేందుకు తనకిష్టమైన మిఠాయిలకు దూరమైనట్లు వెల్లడించాడు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 విభాగంలో మూడేళ్ల క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన సుమిత్... తాజా పారిస్ పారాలింపిక్స్‌లోనూ అదే ప్రదర్శనను పునరావృతం చేశాడు. సోమవారం రాత్రి జరిగిన పోటీల్లో సుమిత్ జావెలిన్‌ను 70.59 మీటర్ల దూరం విసిరి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అనంతరం సుమిత్ మాట్లాడుతూ... 'పారాలింపిక్స్ కోసం 10 నుంచి 12 కేజీల బరువు తగ్గా. అధిక బరువు వల్ల శరీరంపై ఒత్తిడిపడి మెరుగైన ప్రదర్శన చేయలేనని ఫిజియో సూచించడంతో నాకు ఇష్టమైన స్వీట్లు తినడం మానేశా. ఒత్తిడి కారణంగా సరిగ్గా నిద్ర కూడా పోలేదు. టోక్యో సమయంలో నాపై పెద్దగా అంచనాలు లేవు కాబట్టి ఇబ్బంది లేకపోయింది. వంద శాతం ఫిట్‌నెస్‌తో లేకుండానే పారిస్ పోటీల్లో పాల్గొన్నా. గాయం భయంతో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. గత రెండు మూడేళ్లుగా తీవ్రంగా శ్రమిస్తున్నా... స్వదేశానికి చేరుకున్నాక కాస్త విశ్రాంతి తీసుకుంటా' అని అన్నాడు.

స్వర్ణం గెలవనందుకు బాధగా ఉంది

పారాలింపిక్స్ రజత పతక విజేత సుహాస్



పారిస్: వరుసగా రెండు పారాలింపిక్స్‌లో రజత పతకాలు సాధించిన భారత పారా షట్లర్ సుహాస్ యతిరాజ్... విశ్వక్రీడల్లో స్వర్ణం గెలవలేకపోవడం నిరాశగా ఉందని అన్నాడు. పారిస్ పారాలింపిక్స్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్4 ఫైనల్లో పరాజయం పాలై రజతం దక్కించుకున్న 41 ఏళ్ల ఐఏఎస్ అధికారి సుహాస్ యతిరాజ్... మూడేళ్ల క్రితం టోక్యోలోనూ రెండో స్థానంలోనే నిలిచాడు. 'పసిడి పతకం సాధించాలని ఎంతో శ్రమించా. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌తో విశ్వ క్రీడలకు రావడంతో అంచనాల భారం కూడా పెరిగింది. రజతం దక్కడం కూడా ఆనందంగానే ఉన్నా... ఏదో వెలితి అనిపిస్తోంది. బంగారు పతకం చేజారిందనే బాధ ఒకవైపు... పారాలింపిక్స్ వంటి అత్యుత్తమ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ పతకం నెగ్గాననే భావన మరో వైపు ఉంది. గత కొంతకాలంగా దేశంలో క్రీడా సంస్కృతి పెరిగింది. గతంలో క్రికెట్‌కే ఎక్కువ క్రేజ్ ఉండేది. ఇప్పుడు అన్ని క్రీడలకు ఆదరణ దక్కుతోంది. పారా అథ్లెట్లకు కూడా మంచి తోడ్పాటు లభిస్తోంది. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో మనవాళ్లు మరిన్ని పతకాలు సాధించగలరు' అని సుహాస్ అన్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లాకు చెందిన సుహాస్ 2007 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం సుహాస్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో ప్రాంతీయ రక్షక్ దళ్, యూత్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సెక్రటరీ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

నెతన్యాహు నెగ్గుకొచ్చేనా?

ఇజ్రాయెలీల ఆక్రోశం, ఆక్రందనలు క్రమంగా ఆగ్రహ జ్వాలలుగా మారాయి. ఇజ్రాయెల్ ప్రధాని పీఠానికి ఎసరు పెట్టేలా కన్పిస్తున్నాయి. హమాస్ చెరనుంచి ఇజ్రాయెలీ బందీలను విడిపించడంలో నెతన్యాహు సర్కారు వైఫల్యంపై దేశవ్యాప్తంగా నిరసనలు తీవ్ర రూపు దాలుస్తున్నాయి. తాజాగా ఆగస్టు 31న ఆరుగురు బందీలను గాజాలో ఉగ్రవాదులు పాశవికంగా హతమార్చడంతో ఇజ్రాయెలీలు భగ్గుమంటున్నారు. సోమవారం లక్షలాదిగా వీధుల్లోకి వచ్చారు. దేశాన్ని స్తంభింపజేశారు. నెతన్యాహూ వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. కోర్టు జోక్యం చేసుకుంటే గానీ వెనక్కు తగ్గలేదు. ఈ నిరసనలు చివరికి నెతన్యాహూ రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పెడతాయా? అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు... - సాక్షి, నేషనల్ డెస్క్

నిరసనల సెగతో ఉక్కిరిబిక్కిరి

- ఇజ్రాయెలీల్లో నానాటికీ పెరుగుతున్న వ్యతిరేకత
- తప్పుకోవాలంటూ మిన్నంటుతున్న నిరసనలు
- నెతన్యాహూ హయాంలో నిత్యం ఆందోళనలే



సోమవారం టెల్ అవీవ్‌లో జరిగిన ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న ఇజ్రాయెల్ వాసులు

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపు దాడికి తెగబడ్డ హమాస్ 1,200 మందికి పైగా పొట్టన పెట్టుకోవడమే గాక 250 మందిని బందీలుగా తీసుకెళ్లడం తెలిసిందే. ఖైదీల మార్పిడి కింద 100 మందిని విడిపించారు. 35 మందికి పైగా చనిపోయినట్టు భావిస్తుండగా 100 మందికి పైగా ఇంకా హమాస్ చెరలోనే మగ్గుతున్నారు. వాళ్లను విడిపించేందుకు ఇటీవల ఇజ్రాయెల్ సైన్యం చేసిన తాజా ప్రయత్నం వికటించడం, ఆరుగురు బందీలను హమాస్ చంపేయడం తెలిసిందే. దీనిపై ఇజ్రాయెలీల్లో ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నాయి. బందీలను విడిపించడంలోనే గాక గాజాలో కాల్పుల విరమణలో కూడా ప్రధానిగా బెంజమిన్ నెతన్యాహు ఘోరంగా విఫలమయ్యారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు బాధ్యత వహిస్తూ తక్షణం రాజీనామా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇజ్రాయెల్‌లో అతిపెద్ద కార్మిక సంఘం హిస్తాడుట్ ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపు సోమవారం దేశాన్ని స్తంభింపజేసింది. హమాస్‌పై ఇజ్రాయెల్ యుద్ధం మొదలయ్యాక దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ఇదే అతి పెద్దది. దాని దెబ్బకు బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. విశ్వవిద్యాలయాలు, షాపింగ్ మాల్స్, ఓడరేవులనూ మూసివేశారు. నిరసనలు సాయంత్రం దాకా కొనసాగాయి. నిరసనకారులు నెతన్యాహూ నివాసాన్ని కూడా ముట్టించారు. అమెరికా ఎంబసీ ముందు బైఠాయించారు. అయలాన్ హైవేను దిగ్బంధించారు. దాంతో వారిపైకి పోలీసులు వాటర్ క్యానన్లు ప్రయోగించాల్సి వచ్చింది. విధ్వంసానికి, అధికారులపై దాడికి పాల్పడ్డారంటూ టెల్ అవీవ్‌లో 29 మందిని అరెస్టు చేశారు. చివరికి లేబర్ కోర్టు ఆదేశాలతో సమ్మె ఆగింది. ఇజ్రాయెలీల నిరసనల వెల్లువను తట్టుకుని నిలవడం నెతన్యాహూకు కష్టమేనంటున్నారు.

పెరుగుతున్న వ్యతిరేకత

యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయాలన్న నెతన్యాహు వైఖరిపై విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్ విపక్ష నేత యైర్ లాపిడ్ కూడా ప్రధానిపై విమర్శలు గుప్పించారు. యుద్ధ విషయమై నెతన్యాహు తీసుకున్న, తీసుకుంటున్న పలు నిర్ణయాలపై సొంత కేబినెట్‌లోనే వ్యతిరేకత ప్రబలుతోంది. బందీలను విడిపించే ఒప్పందం కుదుర్చుకోవడం కంటే కారిడార్ నియంత్రణకే ప్రాధాన్యమిస్తుండటం సరికాదని రక్షణ మంత్రి యెవ్ గాలెంట్ బాహాటంగానే విమర్శించారు. దీన్ని 'నైతికంగా అవమానం'గా అభివర్ణించారు. బందీల ఒప్పందంపై గానీ, కాల్పుల విరమణపై గానీ నెతన్యాహుకు ఎలాంటి ఆసక్తి లేదని ఇజ్రాయెల్ మాజీ రాయబారి, ప్రభుత్వ సలహాదారు అలోన్ పింకస్ ఆరోపించారు. ''ఆశ్చర్యంగా అన్పించినా ఇదే నిజం. ఒప్పందానికి నెతన్యాహూ విముఖత వల్లే బందీలు బలవుతున్నారు'' అని మండిపడ్డారు.

తగ్గుతున్న మద్దతు

మరోవైపు నెతన్యాహుకు మద్దతు కూడా నానాటికీ తగ్గుతోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేయకూడదని మెజారిటీ ఇజ్రాయెలీలు భావిస్తున్నట్లు గత శుక్రవారం ఛానెల్ 12 చేసిన సర్వేలో తేలింది. ఆయన మళ్లీ పోటీ చేయొద్దని 69 శాతం పేర్కొనగా కేవలం 22 శాతం మంది మాత్రమే మళ్లీ ఎన్నికల బరిలో దిగాలని కోరుతున్నారు.

నిత్యం నిరసనలే

ఇజ్రాయెల్ చరిత్రలోనే అత్యంత అతివాద సంకీర్ణ సర్కారుకు నెతన్యాహూ నేతృత్వం వహిస్తున్నారు. 2023 జనవరిలో ఆయన గద్దెనెక్కిన నాటినుంచీ దేశంలో తరచూ నిరసనలూ, ఆందోళనలూ కొనసాగుతూ వస్తున్నాయి. సుప్రీంకోర్టు అధికారాలకు భారీగా కత్తెర వేసేందుకు ఉద్దేశించిన న్యాయ సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏడాది కింద జనం భారీగా రోడ్డెక్కారు. చివరికి ఆ ప్రతిపాదనలపై ప్రభుత్వం వెనక్కు తగ్గాల్సి వచ్చింది. ఇక హమాస్ ఆటవిక దాడి అనంతరం నెతన్యాహూ ప్రభుత్వ స్పందనను నిరసిస్తూ గత అక్టోబర్ నుంచి రాజధాని మొదలుకుని దేశంలో ఏదో ఒక మూల నిత్యం ఆందోళనలు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. హమాస్‌తో ఒప్పందానికి అంగీకరిస్తే ప్రభుత్వాన్ని పడగొడతామని కూడా కొన్ని సంకీర్ణ పక్షాలు బెదిరిస్తున్నాయి. దీనికి తోడు నెతన్యాహూపై అవినీతి, మోసం, నమ్మకద్రోహం తదితర అభియోగాలపై విచారణలు కోర్టుల్లో పలు దశల్లో ఉన్నాయి.

ఎన్నికలకు మరో రెండేళ్లు

ఇజ్రాయెల్‌లో ఎన్నికలకు మరో రెండేళ్ల గడువుంది. ఆలోపు నెతన్యాహూపై విపక్షం అవిశ్వాసం పెట్టాలన్నా కనీసం ఐదుగురు పాలక సంకీర్ణ సభ్యుల మద్దతు అవసరం.



నెతన్యాహు... తగ్గేదే లే

నెతన్యాహు మాత్రం వెనక్కు తగ్గేందుకు ఏమాత్రం సిద్ధంగా లేరు. ఎట్టి పరిస్థితుల్లోనూ హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడమే తన లక్ష్యమని ఆయన కరాఖండిగా చెబుతున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలన్న నిరసనకారుల డిమాండ్లను, మంత్రివర్గ సహచరుల విజ్ఞప్తులను నెతన్యాహూ తోసిపుచ్చారు. ''ఆరుగురు బందీలను ఉరితీశారు. అయినా కసి తీరక తల వెనుక భాగంలో కాల్చారు. వాళ్లతో రాయబారాలా?'' అని ప్రధాని ప్రశ్నిస్తున్నారు. కొన్ని మినహాయింపులతోనైనా కాల్పుల విరమణ చర్చల్లో పాల్గొనాలన్న సూచనకు ససేమిరా అంటున్నారు. దీనిపై ఇటీవల మరింత కఠిన వైఖరి తీసుకున్నారు. గాజా నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వైదొలగాలన్న హమాస్ డిమాండ్‌కు ఒప్పుకునేదే లేదంటున్నారు. బందీలను కాపాడలేకపోయినందుకు క్షమాపణ చెప్పిన నెతన్యాహూ, యుద్ధాన్ని ముగించేందుకు అంతర్జాతీయ సమాజమే హమాస్‌పై మరింత ఒత్తిడి తేవాలంటూ కుండబద్దలు కొట్టారు. బందీల విడుదలకు తాను తగినంత కృషి చేయడం లేదన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ''ఈ విషయంలో నాకంటే నిబద్ధత కలిగిన వారెవరూ లేరు. దీనిపై నాకెవరూ ఉపన్యాసం ఇవ్వనక్కరలేదు'' అన్నారు!

హాట్‌స్పాట్ షేర్ చేయలేదని చంపేశారు

పుణె: అపరిచితులకు మొబైల్ హాట్‌స్పాట్‌ను (ఇంటర్నెట్‌ను వినియోగించుకునేందుకు మొబైల్ డేటాను ఇతరులతో పంచుకోవడం) షేర్ చేయడానికి నిరాకరించినందుకు 47 ఏళ్ల వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ విభ్రాంతికర ఘటన పుణెలోని హడాప్సర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగింది. వాసుదేవ్ రామచంద్ర కులకర్ణి రుణాలు ఇప్పించే ఏజెంట్. కొందరు యువకులు కులకర్ణి వద్దకు వచ్చి హాట్‌స్పాట్‌ను షేర్ చేయాల్సిందిగా కోరారు. అపరిచితులకు హాట్‌స్పాట్ ఇవ్వడానికి ఆయన నిరాకరించారు. ఈ క్రమంలో గొడవ జరిగింది. కులకర్ణి నిందితుల్లో ఒకరిపై చేయి చేసుకున్నారు. దాంతో నిందితులు నలుగురు రోడ్డుపైనే కులకర్ణిని పదునైన ఆయుధాలతో పొడిచి చంపారు. మయూర్ భోసలే (19)తో పాటు మరో ముగ్గురు మైనర్ నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చైనాలో స్కూలు బస్సు బీభత్సం

ఐదుగురు విద్యార్థులు సహా 11 మంది మృతి

బీజింగ్: స్కూలు బస్సు అదుపుతప్పిన పాఠశాల గేటు వద్ద ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులపైకి దూసుకువచ్చింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులతోపాటు ఆరుగురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. మరో 13 మంది గాయపడ్డారు. చైనాలోని షాండోంగ్ ప్రావిన్స్‌లోని తైయాన్ నగరంలో మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది. డాంగ్‌పింగ్ కౌంటీలోని మాధ్యమిక పాఠశాల గేటు వద్ద మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో నిలబడి ఉన్నారు. అదే సమయంలో, ఓ బస్సు అదుపుతప్పి వేగంగా వారిపైగా దూసుకువెళ్లింది.

హరియాణాలో ఘోర రోడ్డు ప్రమాదం

8 మంది మృతి, మరో 10 మందికి గాయాలు

చండీగఢ్: హరియాణాలోని జింద్ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది చనిపోగా, 10 మంది క్షతగాత్రులయ్యారు. హిసార్– చండీగఢ్ జాతీయ రహదారిపై బిధరన గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఘటన జరిగింది. కురుక్షేత్ర జిల్లాకు చెందిన కొందరు రాజస్తాన్‌లోని గొగామెడిలో ఆలయానికి కారులో వెళ్తున్నారు. అర్ధరాత్రి సమయంలో బిధరన గ్రామ సమీపంలో రోడ్డు పక్కన విశ్రాంతి కోసం వారు వాహనం ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ కారును బలంగా ఢీకొట్టింది. ఘటనలో కారులోని 15 ఏళ్ల బాలుడు, ఇద్దరు మహిళలు సహా 8 మంది చనిపోయారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు.

రూ.1.44 లక్షల కోట్లతో ఆయుధ కొనుగోళ్లు

న్యూఢిల్లీ: యుద్ధ ట్యాంకుల ఆధునీకరణ, గగనతల రక్షణ ఫైర్ కంట్రోల్ రాడార్లు, ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికల్స్(ఎఫ్ఆర్‌సీవీల) కొనుగోలుకు మంగళవారం ఆమోదం తెలిపినట్లు కేంద్ర రక్షణ శాఖ తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సారథ్యంలోని డిఫెన్స్ అక్విజిషన్ కంట్రోల్(డీఏసీ) రూ.1,44, 716 కోట్ల విలువైన 10 ప్రతిపాదనలను ఆమోదించినట్లు వివరించింది. తీర రక్షక దళం(ఐసీజీ)బలోపేతం కోసం 228 డోర్నియర్ విమానాలు, అత్యాధునిక పెట్రోలింగ్ బోట్ల కొనుగోళ్లు కూడా ఇందులో ఉన్నాయని పేర్కొంది. ఇందులో 99 శాతం మేర దేశీయంగా తయారయ్యేవేనని పేర్కొంది.

రోజుకు 30 నిమిషాలే నిద్ర

జపాన్ వ్యాపారవేత్త దైసుకి హోరికి 12 ఏళ్లుగా ఇదే అలవాటు

టోక్యో: మనిషికి రోజుకు ఎన్ని గంటలు నిద్ర అవసరం? 6 నుంచి 8 గంటలపాటు అవసరమని వైద్య నిపుణులు చెబుతుంటారు. అంత కంటే తక్కువ సమయం నిద్రిస్తే మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతుంటాయి. శరీరంలో జీవక్రియలు మందగించి ఆరోగ్యం దెబ్బతింటుంది. జపాన్‌కు చెందిన వ్యాపారవేత్త దైసుకి హోరి మాత్రం రోజుకు కేవలం 30 నిమిషాలే నిద్రపోతాడట! ఒక్క రోజో, రెండు రోజులో కాదు. గత 12 ఏళ్లుగా ఇదే అలవాటు ఉందని చెబుతున్నాడు. కేవలం 30 నిమిషాలు నిద్రించినా తనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, పైగా తనలో శక్తి సామర్థ్యాలు, పనిలో ఉత్పాదకత పెరిగాయని అంటున్నాడు. 40 ఏళ్ల దైసుకి హోరి వ్యాపారంలో రాణిస్తున్నాడు. సంగీతం, చిత్రలేఖనం, మెకానికల్ డిజైనింగ్ అతడి అభిరుచులు. నిద్ర సమయాన్ని తగ్గించుకొని, మిగిలిన టైమ్‌లో పనికోసం ఖర్చు చేయాలన్న ఆలోచన 12 ఏళ్ల క్రితం వచ్చింది. అప్పటి నుంచి ప్రయోగం ఆరంభించాడు. నిద్రించే సమయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చాడు. అది చివరకు 30 నుంచి 45 నిమిషాలకు తగ్గిపోయింది. తన అనుభవాన్ని దైసుకి ఓ పత్రికతో పంచుకున్నాడు. సుదీర్ఘమైన నిద్ర కంటే నాణ్యమైన నిద్ర అవసరమని స్పష్టం చేశాడు. ఆటలు ఎక్కువగా ఆడడం లేదా పడుకోవడానికి గంట ముందు కాఫీ సేవిస్తే మగత అనేది దూరమవుతుందని పేర్కొన్నాడు. దైసుకి చెప్పేదంతా నిజమో కాదో తెలుసుకోవడానికి జపాన్‌లో యుమియూరి టీవీ చానల్ నిర్వాహకులు ఓ పరీక్ష పెట్టారు. ఈ పరీక్షలో దైసుకి కేవలం 26 నిమిషాలే నిద్రించాడు. నిద్ర నుంచి లేచిన తర్వాత చాలా ఉత్సాహంగా కనిపించాడు.



మోసం తేలకుండానే 8 ఏళ్లు జైల్లో పడేస్తారా?

- సుప్రీంకోర్టు విస్మయం
- నిందితుడికి బెయిల్

న్యూఢిల్లీ: చిట్‌ఫండ్ మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏకంగా 8 సంవత్సరాలుగా విచారణ ఖైదీగా ఒక వ్యక్తి జైల్లో మగ్గిపోతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. సంబంధిత కేసులో నిందితుడికి బెయిల్ మంజూరుచేసింది. కేసు విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉండటంతో ఇందుకు కారణమైన మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు తలంటింది. బెయిల్ మంజూరుచేయాలంటూ ఆ పిటిషనర్ పెట్టుకున్న దరఖాస్తును మంగళవారం జస్టిస్ జేబీ పార్దివాలా విచారించారు. చిట్ ఫండ్ మోసంపై 77 మంది సాక్షులు ఉంటే దాదాపు 30 మందిని విచారించినట్లు ప్రభుత్వం తరఫున హాజరైన లాయర్ చెప్పారు. ఈయన వాదనలను జడ్జి తోసిపుచ్చారు. ''ఎంత మందిని విచారించారనేది ఇక్కడ అనవసరం. ఇన్ని సంవత్సరాలపాటు అకారణంగా జైల్లో పెట్టారు'' అని జడ్జి ఆక్షేపించారు.

కార్మికులను గృహ నిర్మాణ పథకంలో చేర్చండి

రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అట్టడుగున ఉన్న కార్మికుల సంక్షేమానికి భరోసా కల్పించే దిశగా అన్ని రంగాల కార్మికులను 'గృహనిర్మాణ' పథకంలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈమేరకు వలస కార్మికులు, భవన కార్మికులు, బీడీ కార్మికులు, సినీ కార్మికులు, బొగ్గు గనియేతర కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అసంఘటిత కార్మికులు అందరినీ ఈ పథకంలో చేర్చాలని సూచిస్తూ మంగళవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు పంపింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ప్రయోజనాలను వెనకబడిన కార్మికులకు విస్తరించే దిశగా కేంద్రం ఈ ఆలోచన చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది.

హరియాణాలో ఆప్, కాంగ్రెస్ పొత్తు!

న్యూఢిల్లీ: త్వరలో హరియాణాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పొత్తుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ముందుకొచ్చాయి. ఆప్‌తో పొత్తుపై కాంగ్రెస్ సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. కాంగ్రెస్ తరఫున పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆప్ తరఫున పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా విస్తృతస్థాయిలో చర్చిస్తున్నారని, త్వరలోనే ఒక ఏకాభిప్రాయానికి రానున్నట్లు సమాచారం. ఆప్ 10 సీట్లు కావాలని కోరుతుండగా కేవలం ఏడు సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆప్ వర్గాలు వెల్లడించాయి. వేణుగోపాల్, చద్దా బుధ, గురువారాల్లో మరో దఫా చర్చలు జరిపే అవకాశముంది. పొత్తు అంశాలను ఖరారుచేసేందుకు దీపక్ బాబరియా, దీపేందర్ సింగ్ హుడా, అజయ్ మాకెన్‌లతో కాంగ్రెస్ పార్టీ మినీ కమిటీని ఏర్పాటుచేసింది. విపక్షాల 'ఇండియా'కూటమిలో భాగస్వాములైన కాంగ్రెస్, ఆప్‌లు ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో హరియాణా, గుజరాత్, గోవా, ఢిల్లీ, చండీగఢ్‌లో పొత్తు పెట్టుకుని ఉమ్మడిగా పోటీచేయడం తెల్సిందే. సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా హరియాణాలో ఉన్న 10 లోక్‌సభ స్థానాలకు గాను ఆప్ ఒక స్థానంలో, కాంగ్రెస్ 9 స్థానాల్లో పోటీచేశాయి. ఈ పరిణామాలకు ముందు ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడారు. హరియాణాలో ఆప్‌తో పొత్తుకు రాహుల్ గాంధీ ఆసక్తి కనబరచడం సంతోషంగా ఉందని సంజయ్ అన్నారు. 90 స్థానాలున్న హరియణా అసెంబ్లీ ఎన్నికల్లో 34 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఎంపికచేసిన విషయం విదితమే. ఈ రాష్ట్ర అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ ఐదున పోలింగ్ చేపట్టి 8వ తేదీన ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

కేజ్రీవాల్ పాత్రపై ఆధారాలున్నాయి

ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన అవినీతి కేసుల్లో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేల దుర్గేశ్ పాఠక్‌తోపాటు ఇతరులపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో కేజ్రీవాల్‌తోపాటు ఇతర నిందితుల పాత్రపై తగిన ఆధారాలున్నాయని ప్రత్యేక జడ్జి కావేరి బవేజా మంగళవారం స్పష్టంచేశారు. ఈ ఆధారాలతో వారిపై దర్యాప్తు కొనసాగించవచ్చని పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు ప్రొడక్షన్ వారెంట్, దుర్గేశ్ పాఠక్‌కు సమన్లు జారీ చేశారు. ఈ నెల 11న తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించారు.

మలివాల్ 'వస్త్రాపహరణం' పోస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అధికార నివాసంలో తనపై భౌతిక దాడికి దిగిన కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ బెయిల్‌పై మంగళవారం విడుదలకావడాన్ని బాధితురాలు, ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ తీవ్రంగా విమర్శించారు. తనకు ఘోర పరాభవం జరిగిన విషయాన్ని గుర్తుచేస్తూ ద్రౌపది వస్త్రాపహరణం పోస్టర్‌ను ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మహాభారతంలో కౌరవులు జూదంలో గెలవడం, ద్రౌపది వస్త్రాపహరణం వేళ కృష్ణుడు ద్రౌపదిని కాపాడటం వంటి సన్నివేశాలున్న పోస్టర్‌ను ఆమె షేర్‌చేశారు.

'ఏక్ పేడ్ మా కే నామ్'లో 52 కోట్ల మొక్కలు

జూన్ నెలలో మొక్కలు నాటే ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడేందుకు 'ఏక్ పేడ్ మా కే నామ్' నినాదంతో తల్లి పేరుతో ఒక చెట్టు అంటూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రచారం ఒక మైలు రాయిని దాటింది.'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 52 కోట్లకు పైగా మొక్కలు నాటారని కేంద్ర పర్యావరణ, అటవీ, శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జూన్ 5వ తేదీన ఢిల్లీలోని బుద్ధ జయంతి ఉద్యానవనంలో రావి మొక్కను నాటి ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్రచారాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

అట్లాస్ సైకిల్స్ మాజీ అధిపతి ఆత్మహత్య

న్యూఢిల్లీ: అట్లాస్ సైకిల్ కంపెనీ మాజీ అధిపతి సలిల్ కపూర్(70) తుపాకీతో కాల్చుకుని చనిపోయారు. ఢిల్లీ ల్యూటెన్స్ ప్రాంతం అబ్దుల్ కలాం మార్గ్‌లోని మూడంతస్తుల సొంత నివాసంలో రక్తపు మడుగులో పడి ఉండగా మంగళవారం మధ్యాహ్నం ఆయన మేనేజర్ కనుగొన్నారు. మేనేజర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చారు. పూజ గదికి సమీపంలో సలిల్ తన లైసెన్సుడ్ రివాల్వర్‌తో కాల్చుకున్నారని పోలీసులు తెలిపారు.అనంతరం ఆయన నివాసంలో ఒక సూసైడ్ నోట్ దొరికిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కొందరి వేధింపులే తన ఆత్మహత్యకు కారణానికి కారణమని అందులో సలిల్ పేర్కొన్నారని తెలిపారు. ఘటనాస్థలి నుంచి ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేపట్టామన్నారు. భార్య, సంతానం సలిల్ నుంచి దూరంగా ఉంటున్నారన్నారు. రూ.9 కోట్ల మేరకు మోసం చేశారంటూ అందిన ఫిర్యాదుల మేరకు ఢిల్లీ పోలీసులు 2015లో సలిల్‌ను అరెస్ట్ చేశారు.

తోడేళ్లు కనిపిస్తే కాల్చివేత!

యోగి సర్కారు ఆదేశాలు

- తాజాగా మరో పసికందు బలి
- ఇద్దరు మహిళలకు గాయాలు
- తొమ్మిదికి పెరిగిన మరణాలు
- వణికిపోతున్న బహ్రయిచ్ జిల్లా
- రంగంలోకి డ్రోన్లు, షూటర్లు

బహ్రయిచ్: యూపీలోని బహ్రయిచ్ జిల్లాలో తోడేళ్ల భయోత్పాతం కొనసాగుతూనే ఉంది. తాజాగా హర్ది ప్రాంతంలో అవి ఓ పసికందును పొట్టన పెట్టుకున్నాయి. ఇద్దరు వృద్ధురాళ్లపై దాడి చేసి గాయపరిచాయి. దాంతో గత రెండు నెలల్లో తోడేళ్లకు బలైన వారి సంఖ్య తొమ్మిదికి పెరిగింది. వీరిలో ఎనిమిది మంది చిన్నారులే! 34 మంది గాయపడ్డారు. ఆరు తోడేళ్లలో నాలుగింటిని పట్టుకోగా రెండు మాత్రం నిత్యం అధికారులకు చుక్కలు చూపుతున్నాయి. ఆవాసాలు మారుస్తూ, రోజుకో గ్రామాన్ని లక్ష్యం చేసుకుంటూ తప్పించుకుంటున్నాయి. తప్పనిసరైతే వాటిని కాల్చివేయాల్సిందిగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం ఆదేశాలిచ్చారు. దాంతో ట్రాంక్విలైజర్లతో షూటర్లను రంగంలోకి దించారు. తోడేళ్లను గుర్తించి పట్టుకునేందుకు, వీలవని పక్షంలో మట్టుపెట్టేందుకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. 'ఆపరేషన్ భేడియా'కీలక దశకు చేరిందని బహ్రయిచ్ డీఎఫ్‌వో అజీత్ ప్రతాప్ సింగ్ తెలిపారు. తోడేళ్ల పీడ విరగడయ్యేదాకా ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.


బహ్రయిచ్‌లో మంగళవారం తెల్లవారుజాము 3.35గంటలకు మహసీ సబ్ డివిజన్‌లోని నౌవన్ గరేతి గ్రామంలో తోడేలు ఓ ఇంట్లో దూరి అంజలి అనే రెండున్నరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లింది. షాక్‌కు గురైన తల్లి అరిచేలోపే పాపను నోట కరుచుని పారిపోయింది. రెండు గంటల తర్వాత కిలోమీటరు దూరంలో చేతుల్లేకుండా చిన్నారి మృతదేహం దొరికింది. అనంతరం ఉదయాన్నే అక్కడికి 2 కిలోమీటర్ల దూరంలోని కొటియా గ్రామంలో వరండాలో నిద్రిస్తున్న కమలాదేవి (70) అనే వృద్ధురాలిపై తోడేలు దాడి చేసింది. ఆమె అరుపులతో కుటుంబీకులు అప్రమత్తమయ్యారు. తీవ్ర గాయాలైన ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో అరగంట తరువాత మూడో దాడిలో సుమన్ దేవి (65) అనే మరో వృద్ధురాలు గాయపడింది. సోమవారం రాత్రి పండోహియా గ్రామంలో తోడేళ్ల దాడిలో గాయపడ్డ అఫ్సానా అనే ఐదేళ్ల బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం రాత్రి హర్ది దర్గియా గ్రామంలో తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిపై తోడేలు దాడి చేసింది. మెడను కరిచి లాక్కెళ్లబోయింది. తోడేలుతో తల్లి ధైర్యంగా పోరాడి తన బాబును కాపాడుకోగలిగింది. అదే రాత్రి మరో 50 ఏళ్ల వ్యక్తిపైనా తోడేలు దాడి జరిగింది.

శ్మశాన నిశ్శబ్దం...

తోడేళ్ల దెబ్బకు బహ్రయిచ్‌లో మార్కెట్లు మూతపడ్డాయి. వీధులు పగలు కూడా నిర్మానుష్యంగా ఉంటున్నాయి. మహసీ సబ్ డివిజన్‌లోనైతే జనజీవనం పూర్తిగా స్తంభించింది. ప్రభావిత సీతాపూర్, లఖింపూర్ ఖేరి, పిలిభీత్, బిజ్నోర్ డివిజన్లలోనూ తోడేళ్ల భయం నెలకొని ఉంది. ఆ ప్రాంతాలకు అదనపు ఫారెస్ట్ గార్డులు, ట్రాప్ బృందాలను పంపుతున్నారు. తోడేళ్లు నిత్యం తమ ఆవాసాలను మారుస్తుండటంతో పట్టుకోవడం కష్టమవుతోందని జిల్లా మేజిస్ట్రేట్ మోనికా రాణి తెలిపారు. ''అవి తెలివిగా ప్రతిసారీ కొత్త గ్రామాన్ని లక్ష్యం చేసుకుంటున్నాయి. ఇప్పటిదాకా నాలుగింటిని పట్టుకున్నాం. ఇంకో రెండు దొరకాల్సి ఉంది''అన్నారు. తమ బృందం నిరంతరం గస్తీ కాస్తోందని, వాటినీ పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ (సెంట్రల్ జోన్) రేణుసింగ్ చెప్పారు. పిల్లలను ఇళ్ల లోపలే ఉంచాలని, రాత్రిపూట తలుపులకు తాళం వేసుకోవాలని అధికారులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

వీడియో ఆధారాలడిగారు...

తోడేళ్లు తమ ఇళ్ల పక్కనే కనిపిస్తూ వణికిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అటవీ అధికారులకు చెబితే వీడియో ఆధారాలు అడుగుతున్నారని మండిపడుతున్నారు. ''మా ఇంటి పక్కన తోడేలు కనిపిస్తే కుక్కనుకొని తరిమికొట్టాం. పొలాల వైపు పరుగెత్తడంతో తోడేలని గుర్తించాం. దాంతో పిల్లలంతా క్షేమంగా ఉన్నారా, లేరా అని చూసుకున్నాం. అంజలి తోడేలు బారిన పడిందని తేలింది''అని నౌవన్ గరేతికి చెందిన బాల్కే రామ్ వెల్లడించారు.



మంగళవారం లక్నోలో ఆర్మీ ఆయుధ ప్రదర్శనలో పాల్గొని తుపాకీ గురి చూస్తున్న సీఎం యోగి

జగన్ ఆపన్న హస్తం.. బాబు ప్రచార అస్త్రం

వరద బాధితులను ఆదుకోవడంలో ఇద్దరు నేతల తీరిదీ..

- నిబద్ధతతో ఎలాంటి ఆర్భాటం లేకుండా వైఎస్ జగన్ తక్షణ స్పందన
- బాధితులను గాలికొదిలేసి మీడియా పిచ్చిలో చంద్రబాబు హడావుడి
- అప్పట్లో తక్షణ సాయం కింద నగదు, నిత్యావసరాలు ఆగమేఘాల మీద పంపిణీ
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగు నీరు, వైద్య సదుపాయాలూ కల్పన
- ఇప్పుడు బుడమేరు బీభత్సం సృష్టించి 72 గంటలైనా బాధితులకు అందని సాయం
- తాగేందుకు గుక్కెడు నీళ్లూ కరువు


విజయవాడ వీధుల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో తిరుగుతున్న సీఎం చంద్రబాబు


2022 జూలైలో వచ్చిన వరదలపై అధికారులతో సమీక్షిస్తున్న అప్పటి సీఎం జగన్

సాక్షి, అమరావతి: గద్దెనెక్కిన వారందరూ నాయకులు అవుతారేమోగానీ.. వారిలో కొందరే మనసున్న పాలకులుగా ప్రజల మనసుల్లో నిలిచిపోతారు. ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు మీడియా ముందు హడావుడి చేసి ప్రచారం కోసం పాకులాడే వారు కొందరైతే.. తాము తెరవెనుక ఉన్నా పర్వాలేదు బాధితులకు తక్షణం సహాయం అందడం ప్రధానం అని భావించే మనసున్న పాలకులు కొందరే. ప్రస్తుతం విజయవాడను భారీ వరదలు ముంచెత్తిన నేపథ్యంలో అందరూ ఈ అంశం ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మీడియా హడావుడి లేకుండా బాధితులకు తక్షణం సహాయం సమర్థంగా అందించడంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనబరిచిన నిబద్ధతను.. ప్రస్తుతం కేవలం మీడియా కోసం హడావుడి చేస్తూ బాధితులను గాలికొదిలేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచార పిచ్చిని పోల్చిచూస్తున్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో నాడు–నేడు ముఖ్యమంత్రుల తీరు ఎలాగుందంటే..

అధికారులకు వారం గడువు.. బాధితులకు తక్షణ సాయం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గోదావరి తదితర వరదలు సంభవించినప్పుడు ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో పరిణతితో వ్యవహరించారు. వరద బాధిత ప్రాంతాలకు తాను తక్షణం వెళ్తే అధికార యంత్రాంగం అంతా తన చుట్టే ఉంటూ బాధితులను పట్టించుకోరని ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచే కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగం మధ్య సమన్వయం సాధిస్తూ సహాయ, పునరావాస చర్యలను సమర్థంగా పర్యవేక్షించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలించడమే కాదు.. అక్కడ వారికి తగిన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. ప్రతి కుటుంబానికి తక్షణం నగదు సహాయం చేసి నిత్యావసర వస్తువులు అందేలా చూశారు. వరదలు తగ్గుముఖం పట్టిన తరువాతే బాధితులను సురక్షితంగా వారి ఇళ్లకు పంపించారు. ఆ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి ఏమన్నారంటే.. ‘కలెక్టర్‌కు వారం రోజుల గడువు ఇస్తున్నా. ఆ తరువాతే వరద బాధిత ప్రాంతాలకు వస్తా. ఒక్క బాధితుడు కూడా తనకు సహాయం అందలేదని చెప్పకూడదు’ అని కరాఖండీగా చెప్పారు. దాంతో యావత్ అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసింది. వారం రోజుల తరువాత జగన్ పర్యటించారు. ఎలాంటి ఇబ్బందుల్లేవని బాధితులంతా ముక్తకంఠంతో చెప్పారు.

అంతా నేనే.. అంతటా నేనే..

ఇక వైఎస్ జగన్‌కు భిన్నంగా ప్రస్తుత సీఎం చంద్రబాబు వరద బాధిత ప్రాంతాల్లో ఇప్పుడు క్షణాల్లో వాలిపోయారు. యావత్ అధికార యంత్రాంగం ఆయన పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైపోయింది. మారుమూల ప్రాంతాల్లో బాధితుల గోడును ఏమాత్రం పట్టించుకోవడంలేదు. విజయవాడ నడిబొడ్డున వరద బీభత్సం సృష్టించినా 72 గంటల తరువాత కూడా బాధితులకు నిత్యావసర వస్తువులు అందించలేదు. తాగునీరు, పాల ప్యాకెట్ల సరఫరా చేయాలనే ధ్యాసే అధికార యంత్రాంగానికి లేకుండాపోయింది. తగినన్ని సహాయ శిబిరాలు ఏర్పాటుచేయలేదు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించనూ లేదు. కానీ, ఆయన అంతా నేనే.. అంతటా నేనే అన్నట్లుగా వ్యవహరించారు. మీడియా అంతా తనచుట్టూ ఉండేలా చూసుకుంటున్నారు. మరోవైపు.. వరదలతో ఏకంగా 19 మంది మృత్యువాత పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. మనసులేని ముఖ్యమంత్రి చంద్రబాబు, చేవచచ్చిన ప్రభుత్వ యంత్రాంగాన్ని నమ్ముకుంటే ఇక లాభం లేదని బాధితులే తమ సామాన్లు పట్టుకుని వరద నీటిలో నడుచుకుంటూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి జిల్లాలో..

- 2019–20లో 1,604 మంది రైతులకు సంబంధించి 653 ఎకరాల్లో పంట నష్టపోతే రూ.90.20 లక్షలు పరిహారం ఇచ్చారు.
- 2020–21లో 8,441 మంది రైతులకు సంబంధించి 4,084 ఎకరాల్లో పంటలు కోల్పోయారు.రూ.6.03 కోట్లు పరిహారం చెల్లించారు.
- 2021–22లో వరదల కారణంగా 4,447 మంది రైతులకు చెందిన 1,387 ఎకరాల్లో పంటను కోల్పోయారు. కేవలం నెలరోజుల్లో రూ.2.47 కోట్లు పరిహారం చెల్లించారు.
- 2022–2023 మధ్య కాలంలో 985 మంది రైతులకు సంబంధించిన 476 ఎకరాల్లోని పంటను కోల్పోయారు. రూ.72.34 లక్షల పరిహారం చెల్లించారు.

జగన్ సమర్థతకు ఈ ఉదంతాలే నిదర్శనం..

- 2021 నవంబరులో కురిసిన భారీ వర్షాలకు తిరుపతి జిల్లా అతలాకుతలమైంది. తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నగరం, పట్టణాలు, గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తక్షణం స్పందించి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ సహాయ, పునరావాస చర్యలు చేపట్టారు. వలంటీర్లు, సచివాలయ ఏఎన్ఎం, పీహెచ్‌సీ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు మంచినీరు, భోజనం, అత్యవసర, ప్రాథమిక చికిత్సలు అందించారు. తక్షణ సాయం కింద ప్రతి కుటుంబానికి రూ.3 వేల చొప్పున పంపిణీ చేశారు. అంతా అయ్యాక జగన్ బాధితులను పరామర్శించారు. తమకు ప్రభుత్వ సహాయం అందిందని బాధితులు సంతోషంతో చెప్పారు. ఇక పంటలు నష్టపోయిన రైతులకు 25 రోజుల వ్యవధిలోనే పరిహారం చెల్లించారు.
- 2023 డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు తిరుపతి జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో గ్రామాలు, పట్టణాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దాదాపు 60 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆనాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాధితులను హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సుమారు 60 వేల కుటుంబాలకు రేషన్ బియ్యం 25 కేజీలు, కందిపప్పు, పామాయిల్ ఒక లీటరు, కేజీ ఉల్లిపాయలు, బంగాళా దుంపలు అందించారు. ప్రతి కుటుంబానికి రూ.2,500 ఆర్థిక సాయం చేశారు. ప్రతిరోజూ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది బాధితుల వద్దకు వెళ్లారు. వారికి కావల్సిన అవసరాలను అందించారు. 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు పంపిణీ చేసింది. యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2022 జూలైలో గోదావరికి రికార్డు స్థాయి వరద వచ్చింది. స్వయంగా నాటి సీఎం జగన్ ఏరియల్ సర్వే చేయడంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల కలెక్టర్లు, ఇతర ముఖ్య అధికారులతో సమీక్షించారు. జిల్లా యంత్రాంగం హుటాహుటిన కదిలింది. వలంటీర్ నుంచి కలెక్టర్ వరకు ఒక్క తాటిమీదకు వచ్చి బాధితులను ఆదుకుని సమర్థవంతంగా సేవలందించారు. మరోవైపు.. హోంగార్డు, వలంటీర్ల బృందాలతో ఏటిగట్లకు రక్షణ కల్పించారు. దీని ఫలితంగానే వివిధ ప్రాంతాల్లో గట్లకు ఊలలు పడిన విషయాన్ని సకాలంలో గుర్తించి గండ్లు పడకుండా చూశారు. అప్పట్లో 45 వేల కుటుంబాలు వరద బారిన పడగా, వీరిలో 37,128 మందిని తరలించారు. ఇక వరద బాధితులకు రెండు విడతలుగా నిత్యావసరాలు అందించారు. ఇలా 36,801 మందికి అందజేశారు. నగదు సాయం కుటుంబానికి రూ.2వేల చొప్పున సుమారు రూ.6.50 కోట్ల వరకు నేరుగా బాధితుల అకౌంట్లలో జమచేశారు. మృతులు ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున అందించారు. మరోవైపు పాడి రైతులను సైతం ప్రభుత్వం ఆదుకుంది. 33,570 పశువులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. 1,374 మెట్రిక్ టన్నుల దాణాను పంపిణీ చేశారు. 31,295 పశువులకు వ్యాక్సిన్లు అందించారు.
- 2023 డిసెంబరు మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుపానుతో ప్రకాశం జిల్లా అతలాకుతలమైంది. తీరప్రాంత మండలాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలోనే నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందే అలర్ట్ అయింది. ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంది. 46 పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించారు. 685 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించారు.
- 2022 జూలై 11న అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో పోలవరం నిర్వాసిత గ్రామాల్లో వరదలు ముంచెత్తాయి. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల పరిధిలో 217 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అప్పట్లో జగన్ స్పందించి కుటుంబానికి రూ.2 వేలు చొప్పున 37 వేల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.7 కోట్ల 40 లక్షలు అందించారు. వీటిలో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా అందించారు. ఆ నెలంతా కలెక్టర్‌తోపాటు యావత్ అధికార యంత్రాంగం ముమ్మరంగా సహాయ, పునరావాస చర్యలు చేపట్టింది. జూలై 27న జగన్ ఆయా ప్రాంతాల్లో పర్యటించగా బాధితులు పూర్తి సంతృప్తి వ్యక్తంచేశారు.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు మరో ఎన్డీఆర్ఎఫ్ బృందం



గన్నవరం: వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు మరో ఎన్డీఆర్ఎఫ్ బృందం మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. పుణే నుంచి వాయుసేనకు చెందిన కార్గో విమానంలో మోటర్ బోట్లతోపాటు సహాయక సామగ్రితో కూడిన 120 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం వచ్చింది. వీరందరినీ బస్సులో విజయవాడ పరిసర ప్రాంతాల్లో సహాయక చర్యలు నిమిత్తం అధికారులు తరలించారు. రెస్క్యూ ఆపరేషన్లు, ఆహారం సరఫరా నిమిత్తం మరో నాలుగు ఆర్మీ హెలికాప్టర్లు చేరుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్లలో ఆహారం, తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్లను లోడ్ చేసి పంపుతున్నట్లు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి తెలిపారు.

ఢిల్లీ విమానంలో బాంబు బెదిరింపు

గోపాలపట్నం: ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన ఎయిరిండియా విమానంలో బాంబ్ ఉందన్న సమాచారంతో విశాఖ విమానాశ్రయంలో అలజడి నెలకొంది. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు సీఐఎస్ఎఫ్ జవాన్లు అప్రమత్తమయ్యారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి విశాఖకు బయల్దేరిన విమానం రాత్రి 8.07 గంటలకు విశాఖ చేరుకుంది. రాత్రి 8.14 గంటలకు విమానంలో బాంబు ఉందని ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో ప్రయాణికుల్ని, వారి లగేజీలను సీఐఎస్ఎఫ్ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. అయితే ఎక్కడా ఎటువంటి బాంబు ఆచూకీ దొరకలేదు. విమానంలో కూడా బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఈ విమానంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు పురందేశ్వరి వచ్చారు. అయితే ఎక్కడా బాంబ్ ఆచూకీ దొరకక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమానంలో బాంబు ఉందని ఒక వ్యక్తి బెదిరింపు కాల్ చేయడంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. దీంతో రాత్రి 8.50కి వెళ్లవలసిన విమానం రాత్రి 12 గంటల తరువాత బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

వరద భయంతో ఆగిన గుండె

- బాపట్ల జిల్లా పెసర్లంకలో వ్యక్తి మృతి
- వరద కారణంగా మృతదేహం వద్దకు ఎవరూ చేరుకోలేని పరిస్థితి
- చివరకు కరకట్టపైకి తరలించి అంత్యక్రియలు


మృతదేహాన్ని లైఫ్‌బోట్‌లో కొల్లూరు తరలించే యత్నంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానికులు


బాపట్ల జిల్లా కొల్లూరు కరకట్టపై దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

కొల్లూరు : వరద విపత్తు తీవ్రతకు ఆందోళనకు లోనైన ఓ వ్యక్తి గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. వరద ప్రవాహం అంతకంతకూ పెరిగిపోతుండటంతో తీవ్రంగా భయపడిపోయిన బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంకకు చెందిన రాము కృష్ణారావు(65) సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉద్యోగం నిమిత్తం బెంగళూరులో ఉండగా, మృతుడి ఇద్దరు కుమార్తెలు సమీపంలో ఉన్నా వరద కారణంగా తండ్రి మృతదేహాన్ని చేరుకోలేని దుస్థితి. ఆ గృహానికి అత్యంత సమీపంలోనే వారి బంధువులున్నా వరద ప్రవాహం అధికంగా ఉండటంతో ఏ ఒక్కరూ అక్కడకు చేరుకుని మృతుడి భార్యను ఓదార్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇంటి పక్కన ఉన్న వారు సాహసం చేసి రాత్రి సమయానికి ఆ గృహానికి చేరుకుని మృతుడి భార్యను ఓదార్చేందుకు యత్నించారు. ఓ పక్క విద్యుత్తు సరఫరా లేకపోవడంతో కటిక చీకటిలోనే ఉండిపోయారు. సెల్ ఫోన్‌లలో చార్జింగ్ లేని కారణంగా బంధువులకు సమాచారం ఇచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. శ్మశానంలో వరద నీరు కారణంగా అంత్యక్రియలు చేసే పరిస్థితి లేకపోవడంతో మృతదేహాన్ని కొల్లూరు కరకట్టపైకి తరలించాలనుకున్నారు. అయితే అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పడవలు పంపలేదు. సమస్యను మీడియా దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. ఎట్టకేలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది లైఫ్‌బోట్ సాయంతో మృతదేహాన్ని కరకట్టపైకి తరలించి.. అంత్యక్రియలు నిర్వహించారు.


థియేటర్‌లో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ వీరంగం

- సోఫాలు, కుర్చీల ధ్వంసం
- పోలీసులను ఆశ్రయించిన యాజమాన్యం


వీరంగం సృష్టిస్తున్న పవన్ అభిమానులు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఓ థియేటర్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసైనికులు సోమవారం రాత్రి వీరంగం సృష్టించారు. తాము కోరినట్టుగా సినిమాలోని పాటలు రిపీట్ వేయలేదని థియేటర్‌లోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. థియేటర్ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించడంతో వారు థియేటర్ వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. వివరాల్లోకి వెళితే... డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ఆయన నటించిన గబ్బర్ సింగ్ సినిమాను తాడేపల్లిగూడెంలోని ఓ థియేటర్‌లో గల స్క్రీన్–1లో ప్రదర్శించారు. రాత్రి ఫస్ట్ షోకు వచ్చిన ఆయన అభిమానులు పాట పూర్తయిన సందర్భంలో తిరిగి ఆ పాటను రిపీట్ చేయాలని పట్టుబట్టారు. షో ఆలస్యమవుతుందని, ప్రతి పాటనూ రిపీట్ చేయడం వీలుకాదని యాజమాన్యం వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. పాటలను రిపీట్ చేయడం లేదని థియేటర్‌లోని సోఫాలు, కుర్చీలు ధ్వంసం చేశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. పోలీస్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ ఘటనపై థియేటర్ యాజమాన్యం నోరువిప్పడం లేదు. అభిమానుల వీరంగానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

తిరుమలలో రద్దీ సాధారణం



తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,936 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,697 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలుగుతున్నారు.

ముగిసిన శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: విశాఖలోని కనక మహాలక్ష్మి దేవస్థానంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న శ్రావణమాసం విశిష్ట పూజలు మంగళవారంతో ముగిశాయి. శ్రావణమాసం ముగింపు కారణంగా మహా పూర్ణాహుతి నిర్వహించారు. గత నెల 5 నుంచి ఈ నెల 3 వరకు నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పాలతో మంగళవారం నిర్వహించిన అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి

సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని సింహాచల క్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేశారు.



3 రోజుల పాటు లడ్డూల విక్రయాలు

కొమ్మాది: విశాఖపట్నంలోని రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ)లో ఇకపై వారంలో మూడు రోజులు లడ్డూలు విక్రయించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రతి నెలా రెండో శనివారం మాత్రమే శ్రీవారి లడ్డూలను విక్రయించామని.. భక్తుల కోరిక మేరకు గురు, శుక్ర, శనివారాల్లో లడ్డూలను విక్రయిస్తామని వెల్లడించారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. భాద్రపద మాసం మంగళవారం సందర్భంగా భారీగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు వీణా మనోజ్ కుమార్ చార్యులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌ల సమక్షంలో పూజలు జరిగాయి. రంగమండపంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు.

జాబ్‌మేళాలో 55మందికి ఉద్యోగాలు

పలమనేరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 55మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బాబు తెలిపారు. జాబ్‌మేళాకు 149మంది హాజరుకాగా ఇంటర్వ్యూల్లో 55మంది సెలెక్ట్ అయినట్టు పేర్కొన్నారు. ఎంపికైన వారు ఐసీఐసీఐ బ్యాంకు, ఎన్‌బిఐటీ, సుగుణఫౌల్ట్రీ,డిక్సన్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు.

హస్తకళలపై అవగాహన అవసరం

తిరుపతి సిటీ: సాంప్రదాయ హస్తకళలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని తిరుపతిలోని పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో హస్తకళలకు ఆధునికత జోడించి చిత్రించిన వస్తువులను ఆమె పరిశీలించి విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు హస్తకళలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికితీసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్-2024 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 8 వరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, 9 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 15న ఆప్షన్ల మార్పు, 17న అలాట్‌మెంట్ల ప్రకటన, 21లోపు సీట్లు లభించిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.



ఎస్వీ వైద్య కళాశాలలో సదస్సు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలోని ఔషధ విభాగంలో మంగళవారం ఐ.పీ.సీ, జాతీయ ఫార్మాకో విజిలెన్స్, ఘజియాబాద్ వారి ఆదేశాల మేరకు ఔషధాలతో కలిగే దుష్ప్రభావాల పై నిరంతర వైద్య విద్య సదస్సును విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అదనపు వైద్య విద్య సంచాలకులు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఎ.చంద్రశేఖరన్, అదనపు వైద్య విద్య సంచాలకులు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు హాజరయ్యారు.

అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

అమలాపురం టౌన్: కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఏపీ కమిషనర్ ఆఫ్ కాలేజెస్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలోనే అప్పటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అమలాపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. గతేడాది అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తూ సంబంధిత శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. అనంతరం వివిధ కారణాలతో ఏర్పాటు వాయిదా పడింది.

ఎన్ఎంఎంఎస్‌కు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించిన దరఖాస్తుకు సెప్టెంబర్ 17వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వైఎస్సార్ జిల్లా డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. డిసెంబర్ 8వ తేదీ నిర్వహించే ఈ పరీక్ష కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు ఆన్‌లైన్ అప్లికేషన్‌ను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www. bre.ap.gov.inలో అందుబాటులో ఉందని తెలిపారు.

ఖైదీల భద్రతపై మరింత దృష్టి



డీజీపీ జితేందర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలోని ఖైదీల భద్రతపై పోలీస్, జైలు అధికారులు మరింత దృష్టి పెట్టాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రాతో కలిసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల నుంచి ఖైదీలను కోర్టులు, ఆసుపత్రులకు తీసుకెళ్లే సమయంలో తగిన భద్రత కల్పించాలని డీజీపీ సూచించారు. జైళ్లలో భద్రత చర్యలపైనా ఆయన పలు సూచనలు చేశారు. సమీక్షలో ఐపీఎస్ అధికారి రక్షిత మూర్తి, జైళ్లశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నిజస్వరూపమిది: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: కులగణనతో ముప్పంటూ, దేవుళ్ల పేరు మీద రాజకీయం చేసే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నాయని మాజీ ఎంపీ వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కులగణన చేస్తే దేశం మునిగి పోతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ నిజ స్వరూపం బయట పడిందని, దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యాఖ్యలపై బీసీలు, ఎస్సీలు యుద్ధం చేయాలన్నారు. కులగణన చేస్తే 90% మందికి న్యాయం జరుగుతుందని వీహెచ్ అభిప్రాయపడ్డారు.

జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తుపాను నష్ట తీవ్రతను కేంద్ర ప్రభుత్వం గుర్తించి తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని.. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు ఆర్థిక సాయం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కురిసిన అత్యంత భారీ వర్షాల వల్ల 22 జిల్లాల్లో తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం జరిగిందని వివరించారు. ఇప్పటికి దాదాపు 21 మంది మరణించగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైనట్టు పేర్కొన్నారు. సుమారు 173 మండలాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో నష్టం తీవ్రంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తమ్మినేని కోరారు.

3,223 మంది తరలింపు

ఎన్డీఆర్‌ఎఫ్ అధికారుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వరద ముంపు ప్రాంతాల్లో ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ 2 వరకు చేపట్టిన సహాయక చర్యల్లో మొత్తం 3,223 మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్టు ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు వెల్లడించారు. ముగ్గురి ప్రాణాలు కాపాడినట్టు తెలిపారు. జూలై నెలలో ములుగు జిల్లాలో ఐదుగురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈనెల 1 ఖమ్మం జిల్లా పరిధిలో 64 మందిని, మహబూబాబాద్ జిల్లాలో 3,154 మందిని, ఈనెల 2న నిజామాబాద్‌లో ముగ్గురిని వరద నుంచి కాపాడినట్టు తెలిపారు.

కాలం చెల్లిన ఔషధాల విక్రయం

మందుల దుకాణం సీజ్.. రూ.55 వేల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు జరిపిన సోదాల్లో ఒక మందుల దుకాణంలో కాలం చెల్లిన ఔషధాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. తార్నాకలోని కందార్ మెడికల్స్‌లో కాలం చెల్లిన మందులతోపాటు ఫిజీషియన్ శాంపిళ్లను విక్రయిస్తున్నట్టు గుర్తించామని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. మొత్తం ఆరు రకాలకు చెందిన రూ.55 వేల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మందుల దుకాణం నిర్వాహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సోదాల్లో డీసీఏ సికింద్రాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బి.గోవింద్‌సింగ్, జి.అనిల్, పి.రేణుక, ఎం.సురేంద్రనాథ్ పాల్గొన్నట్టు తెలిపారు. కాగా, కాలం చెల్లిన మందులు, ఉచితంగా ఇవ్వాల్సిన ఫిజీషియన్ శాంపిల్స్‌ను విక్రయిస్తే డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ కింద రెండేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

క్విక్ డెలివరీకి క్రేజ్



- ప్రీ ప్రిపేర్డ్ ఫుడ్‌సేవలు అందిస్తున్న జెప్టో, జొమాటో, స్విగ్గీ
- ఆర్డర్ ఇచ్చిన పది నిమిషాల్లోనే కుక్కుడ్ ఫుడ్ అందించే ఏర్పాట్లు
- ఇప్పటికే ముంబై, బెంగళూరులలో సేవలు ప్రారంభం
- రానున్న రోజుల్లో హైదరాబాద్, ఇతర నగరాలకు విస్తరించే ప్లాన్

సాక్షి, హైదరాబాద్: కస్టమర్ల అభిరుచులు..అవసరాలకు తగ్గట్టుగా వేగంగా వివిధ రకాల వస్తువులు, సామగ్రి వంటి వాటిని అందించేందుకు క్విక్ (క్యూ)కామర్స్ సంస్థలు పోటీ పడుతున్నాయి. కొత్తకొత్త ఆలోచనలను తెరపైకి తీసుకురావడంతోపాటు, విభిన్నమైన సర్వీసులను త్వరితంగా అందించడం ద్వారా వినియోగదారుల మనసును గెలుచుకునే దిశగా ఈ సంస్థలు వేగం పెంచాయి. తాజాగా 'ప్రీ ప్రిపేర్డ్ ఫుడ్'క్విక్ డెలివరీ పేరిట టీ, కాఫీ, సమోసా, ఇతర స్నాక్స్ అందించేందుకు జెప్టో, జొమాటో, స్విగ్గీ వంటి క్యూ-కామర్స్ దిగ్గజాలు పోటీకి సై అంటున్నాయి. తమతమ యావరేజ్ ఆర్డర్ వాల్యూ (ఏవోయూ)లను పెంచుకునేందుకు 10 నిమిషాల్లో కుక్కుడ్ ఫుడ్ అందించేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ముంబై, బెంగళూరులలో ఈ సేవలు మొదలై ఆదరణ పొందుతున్నాయి. రానున్న రోజుల్లో హైదరాబాద్ సహా ఇతర నగరాలకు తమ ప్రణాళికలను ఈ సంస్థలు విస్తరించనున్నాయి. ప్రధాన నగరాలు, పట్టణాలే కాకుండా ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు, పట్టణాలతోపాటు నాన్ మెట్రో నగరాలకు ఈ సేవల విస్తరణకు ఏర్పాట్లు మొదలుపెట్టాయి. రోజువారీ బిజీ జీవితం, ఆఫీసు నుంచి ఇళ్లకు సుదీర్ఘ ప్రయాణాలు, ట్రాఫిక్ సమస్యలు తదితరాలతో క్విక్ ఫుడ్ డెలివరీ యాప్స్ వైపు వినియోగదారుల మొగ్గు క్రమంగా పెరుగుతున్న విషయం తెలిసిందే.

- జెప్టో ప్రయోగాత్మకంగా గతేడాది ముంబైలో 'జెప్టో కేఫ్'ను ప్రారంభించింది. ఇప్పుడు ముంబైతోపాటు బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంది.
- స్విగ్గీ కూడా బెంగళూరులో ఇన్‌స్టామార్ట్ ద్వారా ఇన్‌స్టా కేఫ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది.
- క్యూ- కామర్స్ సంస్థల మధ్య పోటీ తీవ్రంకావడంతో తమతమ సరాసరి ఆర్డర్ల విలువలను గణనీయంగా పెంచుకోవడంపై ఇవి దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. ఈ సంస్థలు ఆఫర్ చేస్తున్న స్నాక్స్ , ఇతర ఆహార పదార్థాలు దేశవ్యాప్తంగా సూపర్ మార్కెట్ చెయిన్లలో రూ.30 నుంచి 300 లోపు అందుతున్నా, హోం డెలివరీ రూపంలో కోరుకున్న సమయానికి వేగంగా ఇళ్లకు ఆర్డర్లు అందజేయడమే ఈ సేవల ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇప్పటికైతే కస్టమర్లు ఈ సంస్థలు అందిస్తున్న సేవలను ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా జొమాటో, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ యాప్‌ల మాదిరిగా కాకుండా వివిధ రకాల వస్తువులతో (రోజువారీ అవసరాలకు తగ్గట్టుగా) పాటుగా ఫుడ్ ఐటమ్స్ కూడా ఒకేసారి తెప్పించుకునేందుకు అవకాశం ఉండటమే ఈ సేవల ప్రత్యేకతగా నిలుస్తోంది. యూఎస్ఏ, యూకే, లాంటి దేశాల్లో ఈ ఐడియాను ముందుగా అమలు చేయడంతోపాటు వినియోగదారులు చేసే ఆర్డర్ల సంఖ్యను పెంచేందుకు స్నాక్స్ ఇతర ఆహార పదార్థాలను చేర్చారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ఇతర లగ్జరీ వస్తువులతో పోల్చితే స్నాక్ ఐటెమ్స్‌కు వచ్చే మార్జిన్ అంత హెచ్చుస్థాయిలో లేకపోయినా రోజువారీ నిత్యావసర వస్తువుల కంటే మాత్రం స్నాక్స్ రేట్స్‌కు అధిక మార్జిన్‌తో ఎక్కువ ఆదాయం సమకూరుతున్నట్టుగా నిపుణులు లెక్కలు వేస్తున్నారు.
- కోల్‌కతాకు చెందిన సామాసేన్ ప్రతీరోజు ఆఫీస్‌కు వెళ్లడానికి ముందు లోకల్ మార్కెట్‌కు వెళ్లి తాజా పండ్లు, కూరగాయలు తెచ్చుకోవడంతోపాటు అప్పుడప్పుడు తప్పని పరిస్థితుల్లో అత్యవసరంగా ఎండు మిర్చీ, మస్టర్డ్ ఆయిల్, తదితర వస్తువుల కోసం దగ్గరలోని మార్కెట్‌కు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడేది. అదే ఇప్పుడు క్విక్ డెలివరీ యాప్, సర్వీసులు అందుబాటులోకి రావడంతో ఆయన కోరుకున్న రోజువారి వస్తువులు కేవలం ఏడు నిమిషాల సమయంలోనే హోం డెలివరీ ద్వారా ఇళ్లకు చేరుతున్నాయి. అయితే మామూలుగా కొనుగోలు చేస్తున్న దాని కంటే ఈ సర్వీసులకు కొంత ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తున్నా సేన్, ఆయన భార్య ఉద్యోగులు కావడంతో యాప్‌లపై ఆర్డర్ చేయడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోగలుగుతున్నారు. నేడు వేగంగా మారుతున్న పరిస్థితులు..క్విక్ కామర్స్ యాప్స్ అందుబాటులోకి రావడంతో వస్తువుల ఆర్డర్ అనేది సులభమై పోయింది.

- రోజువారీ జీవితంలో అత్యంత అవసరమైన వస్తువులను 10 నుంచి 15 నిమిషాల్లో ఇళ్ల వద్దనే తెప్పించుకోవడం అనేది నవయువ తరానికి ఎంతో సౌకర్యవంతంగా మారింది. రోజువారీ జీవనశైలి అలవాట్లలో మార్పులు, వేగం పెరిగిన బిజీ లైఫ్ తదితరాలకు తగ్గట్టుగా వివిధ వర్గాల కస్టమర్ల అభిరుచులు, అలవాట్లు కూడా వేగంగా మారిపోతున్నాయి. వీటన్నింటిని తీర్చేలా క్విక్ కామర్స్ సంస్థలు పోటీపడి కొత్త కొత్త ఆలోచనలతో డెలివరీ యాప్స్‌కు పదును పెడుతున్నాయి. అయితే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలు ఈ విధమైన వ్యాపారంలో ముందంజలో ఎందుకు నిలవడం లేదన్న ప్రశ్నలు కూడా ముందుకు వస్తున్నాయి. ఇవేకాకుండా దేశీయంగా పెద్ద పెద్ద కంపెనీలు, దేశవ్యాప్తంగా సప్లయి చెయిన్లు ఉన్న బడా సంస్థలు కూడా క్యూ-కామర్స్ మార్కెట్‌ను అధిగమించలేకపోవడం కూడా ఓ సవాల్‌గానే నిలుస్తోంది.





హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ప్రముఖుల చిత్రాలు. ఒక్కో చిత్రం వద్ద పెట్టిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆయన జీవిత చరిత్ర మొత్తం సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతుంది

నేటి నుంచి దోస్త్ స్పెషల్ డ్రైవ్

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి వెల్లడి



సాక్షి,హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. రూ.400 చెల్లించి బుధవారం నుంచి ఈ నెల 9 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తోపాటు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈ నెల 9న పరిశీలించి 11న సీట్ల భర్తీని వెల్లడిస్తామని అందులో పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 13వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టు చేయాలని తెలిపారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారికి డిగ్రీలో సీట్లు పొందేందుకే ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు చెప్పారు. ఇప్పటివరకూ డిగ్రీలోని వివిధ కోర్సుల్లో 2 లక్షల మంది వరకూ సీట్లు పొందిన సంగతి తెలిసిందే.

వరద బాధితుల కోసం స్పందించండి

సినీ ప్రముఖులు, విద్యా, వ్యాపారవేత్తలకు దయాకర్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వరద బాధితులకు అండగా నిలిచేందుకు సినీ ప్రముఖులు, విద్యా, వ్యాపారవేత్తలు ముందుకు రావాలని టీపీసీసీ నేత చనగాని దయాకర్ విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు రూ.10 వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నిర్వాసితులకు తక్షణ సహాయం అందించిందని, సీఎం రేవంత్‌రెడ్డి వరద బాధితులను స్వయంగా వెళ్లి పరామర్శించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా, ప్రజలకు సహాయంగా సినీ ప్రముఖులు కదిలి రావాలని దయాకర్ కోరారు. కేరళలోని వయనాడ్‌ను వరదలు చుట్టుముట్టినప్పుడు అనేక మంది ప్రముఖులు స్పందించారని, అదే తరహాలో తెలంగాణలో కూడా వ్యాపారవేత్తలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. వరద బాధితులకు అండగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ఉండి సహాయ సహకారాలు అందిస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు కళ్లు లేని కబోదుల్లా మాట్లాడుతున్నారని దయాకర్ మండిపడ్డారు.

గిరాకీ బంగారమాయెనే

పాతబస్తీలో కనుమరుగవుతున్న బంగారం వ్యాపారం

రాను రాను తగ్గుతున్న వైనం..

కోట్ల రూపాయల పెట్టుబడి.. అయినా పరేషాన్

పాతబస్తీ వీడుతున్న బంగారం, వెండి, ముత్యాల వ్యాపారం

చార్మినార్: నగరంలో 400 ఏళ్ల కిందట బంగారం వ్యాపారం అంటేనే పాతబస్తీ. నిజాం కాలం నుంచి పాతబస్తీలో కొనసాగుతున్న బంగారు, వెండి, ముత్యాల వ్యాపారాలకు ప్రస్తుతం కష్టకాలమొచ్చింది. ఇక్కడి వ్యాపారాలకు గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అసలే బాటిల్ నెక్ రోడ్లు.. దీనికి తోడు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పాతబస్తీలో బంగారం వ్యాపారం తగ్గింది. చిన్న వ్యాపారులు రూ.50 లక్షల నుంచి.. పెద్ద పెద్ద షోరూం వ్యాపారులు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పెట్టుబడి పెట్టి తమ వ్యాపారాలను కొనసాగించాల్సి ఉంటుంది. ఇంత పెట్టుబడి పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్న ఇక్కడి వ్యాపారులకు మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయి. దీంతో పాతబస్తీలోని దుకాణదారులు తమ వ్యాపారాలను నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ప్రధాన సమస్య పార్కింగే..

పాతబస్తీలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో పాటు కార్లు, భారీ వాహనాలకు పార్కింగ్ సమస్య, నిత్యం ట్రాఫిక్ రద్దీ పాతబస్తీలో బంగారం, వెండి, ముత్యాల వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయి. వీటిని ఎక్కడ పార్క్ చేయాలో తెలియక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఇక్కడి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రానురాను తమ వ్యాపారాలు కుంటు పడుతున్నాయంటున్నారు. పార్కింగ్ అందుబాటులో లేకపోవడమే కాకుండా నిత్యం వాహనాల రద్దీతో పాటు రోడ్లపై నెమ్మదిగా కదిలే వాహనాలు పాతబస్తీలోని బంగారు, వెండి, ముత్యాల వ్యాపారాలకు అడ్డుగా మారాయి.

నిజాం కాలం నుంచి..

ఒకప్పుడు చార్మినార్ పరిసరాల్లో బంగారం, వెండి, ముత్యాల వ్యాపారం చేసుకోవడానికి నిజాం సర్కార్‌లో అప్పటి నిజాం స్వయంగా కొంత మందిని ఉత్తర భారతదేశం నుంచి రప్పించినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. నిజాం కాలం నుంచి చార్మినార్, గుల్జార్ హౌజ్, కాలికమాన్, చార్‌కమాన్, ఘన్సీబజార్, శాలిబండ, సిద్ది అంబర్ బజార్ తదితర ప్రాంతాల్లో దాదాపు 300 వరకు దుకాణాలుండేవి. ప్రస్తుతం 50 నుంచి 100 దుకాణాలకు తగ్గిపోయాయి. వీరంతా నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లి అక్కడ తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారు. బంగారు, వెండి ఆభరణాలను తయారు చేసి ఇవ్వడానికి పనిచేసే వలస కార్మికులు సరైన ఆర్డర్లు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

పాతబస్తీలో వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపట్టాలి



మదీనా నుంచి చార్‌కమాన్-చార్మినార్ వరకు వ్యాపారాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. దుకాణాల ముందు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి సరైన స్థలాలు లేకపోవడంతో అటు వ్యాపారులతో పాటు ఇటు వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో పాటు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పాతబస్తీ వ్యాపారులు తమ వ్యాపారాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

– నాగ్‌నాథ్ మాశెట్టి, గుల్జార్‌హౌస్/బషీర్‌బాగ్



గుల్జార్‌హౌస్ వద్ద సందర్శకుల సందడి



గిరాకీ లేక వెలవెలబోతున్న గుల్జార్‌హౌస్‌లోని ఓ బంగారం దుకాణం

'కాళోజీ' అవార్డు ఎంపిక కమిటీ తొలి సమావేశం

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక 'కాళోజీ నారాయణరావు అవార్డు'కు అర్హులైన సాహితీవేత్తను ఎంపిక చేసేందుకు ప్రముఖ కవి అందెశ్రీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. అందెశ్రీతో పాటు కమిటీ సభ్యులు ఏనుగు నర్సింహారెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పొట్లపల్లి శ్రీనివాస్, మెంబర్ కన్వీనర్ మామిడి హరికృష్ణ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజాకవి పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు పేరు మీద ఏటా సాహితీ అవార్డు కింద జ్ఞాపికతో పాటు రూ.1,01,116 నగదును అందజేస్తారు. ఈ అవార్డుకు దాదాపు 40 మంది సాహితీవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు.

చేనేత శాలువాలే వాడండి



సాక్షి, హైదరాబాద్: ఉత్సవాలు, స్మారక దినోత్సవాల్లో సింథటిక్ శాలువాలకు బదులు.. చేనేత శాలువాలను వినియోగించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో సూచించారు. చేనేత వస్త్రాలను ఉపయోగించడం ద్వారా నేతన్నలకు ఆర్థికంగా సహకరించినట్టవుతుందని తెలిపారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం రోజు సింథటిక్ శాలువాలకు బదులు.. చేనేత శాలువాలు వాడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. గణేశ్ ఉత్సవాల సందర్భంలో అతిథులు వచ్చినప్పుడు.. ఇతర ఏ సందర్భాల్లోనైనా కూడా చేనేత శాలువాలే వినియోగించాలని కోరారు. ఒకసారి కప్పిన తరువాత పనికిరాకుండా పోయే సింథటిక్‌ను వాడి పర్యావరణాన్ని పాడుజేయవద్దని విజ్ఞప్తి చేశారు.



ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో చెట్టుపై విద్యార్థులు వేసిన పెయింటింగ్

ప్రధాని రాజీనామా చేస్తే మంత్రి మండలి రద్దవుతుందా?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రధాన మంత్రి-మంత్రి మండలి

రాజ్యాంగ రీత్యా దేశాధిపతి రాష్ట్రపతి అయితే ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ ఉంది. దీన్నే 'వెస్ట్ మినిస్టర్' పద్ధతి అంటారు. (వెస్ట్ మినిస్టర్ అనేది ఇంగ్లండ్‌లో ఒక ప్రాంతం. అక్కడే పార్లమెంటు భవనం ఉంది. అందువల్ల దీనికి ఆ పేరు వచ్చింది.)

> భారత రాజ్యాంగం పార్లమెంటరీ లేదా మంత్రివర్గ పాలిత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. పార్లమెంటరీ వ్యవస్థ ముఖ్య లక్షణం రెండు రకాలైన అధిపతులు ఉండటం. రాజ్యాంగ పరంగా ఉండే రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఉంటే, ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి అన్ని అధికారాలను చెలాయిస్తుంది.

రాజ్యాంగ స్థానం

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో ప్రకరణలు 74, 75, 78లో ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

ప్రకరణ 74(1): రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలను అందించడానికి ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. వీరి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి.

ప్రత్యేక వివరణ: మౌలిక రాజ్యాంగంలో మంత్రి మండలి సలహాను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలి అని అర్థం వచ్చేలా ఎలాంటి పదబంధం లేదు. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణకు 'షల్' (Shall) అనే పదం చేర్చారు. దీని ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 74లో మరో అంశాన్ని చేర్చారు. మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి పునర్ పరిశీలనకు పంపవచ్చు. పునర్ పరిశీలనకు పంపిన అంశాలను మంత్రి మండలి మార్పు చేయవచ్చు, చేయకపోవచ్చు. రెండో పర్యాయం రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ అంశాలను ఆయన తప్పకుండా ఆమోదించాలి.

ప్రకరణ 74(2) ప్రకారం మంత్రిమండలి రాష్ట్రపతికి ఏ సలహా ఇచ్చారో, ఆ సలహా ఎందుకు ఇచ్చారో న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదు.

నియామకం

- ప్రకరణ 75(1) ప్రకారం ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులను కూడా నియమిస్తారు.
- ప్రకరణ 75(1ఎ) ప్రకారం కేంద్రంలో మంత్రిమండలి సంఖ్య, ప్రధాన మంత్రితో కలిపి లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతానికి మించరాదు.
- ప్రకరణ 75(1బి) ప్రకారం ఏదైనా గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హుడైతే, అతడిని మంత్రిగా నియమించరాదు. ఈ అనర్హత అతడు మంత్రిగా ఉన్న కాలంలో జరిగితే, అది అతడి సభ్యత్వ కాలం ముగిసేంత వరకు కొనసాగుతుంది. ఒకవేళ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తే, అంతటితో అనర్హత ముగుస్తుంది.

గమనిక: 75(1ఎ), (1బి) క్లాజులను 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

- ప్రకరణ 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు ప్రధాన మంత్రి, మంత్రి మండలి పదవుల్లో కొనసాగుతారు.
- ప్రకరణ 75(3) ప్రకారం మంత్రులు సంయుక్తంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు.
- ప్రకరణ 75(4) ప్రకారం, మంత్రులందరూ తమ పదవిలోకి ప్రవేశించే ముందు మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న నమూనా ప్రకారం రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేయాలి.
- ప్రకరణ 75(5) ప్రకారం ఎవరైనా వ్యక్తి మంత్రి పదవి చేపట్టాక ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రి పదవిని కోల్పోతారు.
- ప్రకరణ 75(6) ప్రకారం మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటి ప్రస్తావన రెండో షెడ్యూల్‌లో ఉంది.

ప్రధాని నియామకానికి సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకమైన ప్రక్రియ గురించి పేర్కొనలేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిని రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రధాన మంత్రిగా నియమించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరతారు. లోక్‌సభలో ఏ రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ సీట్లు లభించనప్పుడు రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచే క్రమంలో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రధానిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరతారు.

ఉదాహరణకు 1979లో నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌ను ప్రధానిగా నియమించడం కొంత వివాదానికి దారితీసింది. నాటి ప్రతిపక్ష నాయకుడైన వై.బి.చవాన్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంజీవరెడ్డి ఆహ్వానించారు. కానీ, చవాన్ తన అశక్తతను వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిలో జగ్జీవన్‌రామ్‌ను విస్మరించి చరణ్‌సింగ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించడం వివాదానికి కారణమైంది. అయితే చరణ్‌సింగ్ లోక్‌సభ సమావేశాలకు హాజరు కాకుండానే ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఈ విధంగా లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లేకుండా 1989లో వి.పి.సింగ్, 1990లో చంద్రశేఖర్, 1991లో పి.వి. నరసింహారావు, 1996లో ఎ.బి.వాజ్‌పేయి, 1996లో దేవెగౌడ, 1997లో ఐ.కె. గుజ్రాల్, 1998లో ఎ.బి. వాజ్‌పేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా నియమితులయ్యారు.



సుప్రీం కోర్టు తీర్పులు: మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రి రాజీనామా చేసి, తదనంతరం లోక్‌సభ రద్దయితే, ఆ వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి పరిపాలన చేయవచ్చు. అయితే విధాన నిర్ణయాలు చేయరాదని 1971లో యు.ఎన్.రావు Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

ప్రధాన మంత్రి అర్హతలు: రాజ్యాంగంలో ప్రధాన మంత్రి పదవికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక అర్హతలు గురించి పేర్కొనలేదు. అయితే పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండాలి. నియమితులయ్యే సమయానికి పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే నియామకం పొందిన రోజు నుంచి ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

ప్రత్యేక వివరణ: రాజ్యాంగపరంగా ప్రధాన మంత్రిగా నియమితులవడానికి పార్లమెంటు సభ్యుడైతే చాలు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్ సభలో సభ్యుడై ఉండాలి. రాజ్య సభలో సభ్యులుగా ఉండి ప్రధాన మంత్రులైనవారు ఇందిరా గాంధీ (1966), దేవెగౌడ (1996), ఇందర్ కుమార్ గుజ్రాల్ (1997), మన్మోహన్ సింగ్ (2004, 2009).

ప్రధాని ప్రమాణ స్వీకారం - జీతభత్యాలు

- ప్రధాన మంత్రితో రాష్ట్రపతి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగ పరంగా భారత ఐక్యతను, సమగ్రతను పరిరక్షిస్తామని, నమ్మకంతో, నిర్భయంగా, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని ప్రధాన మంత్రి ప్రమాణం చేయాలి.
- ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. పార్లమెంటు సభ్యులకు వచ్చే జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను కలిగి ఉంటారు.
- ప్రకరణ 78 ప్రకారం రాష్ట్రపతికి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడం ప్రధాన మంత్రి బాధ్యత.
- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- ప్రకరణ 78 (బి) ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని రాష్ట్రపతి ప్రధాన మంత్రి ద్వారా తెలుసుకోవచ్చు.
- ప్రకరణ 78 (సి) ప్రకారం.. సమర్పించిన సమాచారంలో ఏదైనా అంశం మంత్రి చేసిన నిర్ణయమా లేదా మంత్రి మండలి చేసిన నిర్ణయమా అనే సంశయం ఉన్నప్పుడు, దాన్ని మంత్రి మండలి పరిశీలనకు పంపమని రాష్ట్రపతి ప్రధాన మంత్రిని కోరవచ్చు.

ప్రత్యేక వివరణ: మంత్రి మండలి ఏర్పాటు పూర్తిగా ప్రధాన మంత్రి విశిష్టాధికారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి, ఎలా పునర్ వ్యవస్థీకరించాలి అనేది ప్రధాన మంత్రి అభీష్టం. అయితే రాజకీయ పరమైన అంశాలు, వివిధ వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాన మంత్రికి ఇష్టం లేకపోయినా కొందరు ప్రముఖులను మంత్రి మండలిలోకి తీసుకోవాల్సి వస్తుంది.

ప్రధాన మంత్రి పదవీ కాలం, తొలగింపు

సాధారణంగా ప్రధాన మంత్రి పదవీ కాలం లోక్‌సభతో పాటుగా అయిదేళ్లు ఉంటుంది. అయితే ఇది లోక్‌సభలోని మెజారిటీ సభ్యుల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పదవిలో కొనసాగడానికి ఇష్టపడనప్పుడు రాష్ట్రపతికి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు. ప్రధాన మంత్రి రాజీనామా చేస్తే మంత్రి మండలి స్వతహాగా రద్దవుతుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధాన మంత్రి కింద పేర్కొన్న పరిస్థితుల్లో పదవి కోల్పోతారు.

- లోక్ సభలో మంత్రి మండలిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
- లోక్ సభలో విశ్వాసం కోరిన తీర్మానానికి మెజారిటీ లభించనప్పుడు.
- లోక్ సభ ద్రవ్య బిల్లును తిరస్కరించినప్పుడు.
- బడ్జెట్‌పై కోత తీర్మానం నెగ్గినప్పుడు.
- రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానం వీగిపోవడం లేదా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణ తీర్మానం నెగ్గడం.

ఉద్యోగాలు

ఆర్‌వీఎన్‌ఎల్, న్యూఢిల్లీలో 24 పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-06, సీనియర్ మేనేజర్-06, అసిస్టెంట్ మేనేజర్-02, సీనియర్ ఎగ్జిక్యూటివ్-10.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీకామ్, ఎంబీఏ(ఫైనాన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** డీజీఎం పోస్టుకు 45 ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా, ఆర్కే పురం, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.

దరఖాస్తులకు చివరితేది: 05.09.2024.

వెబ్‌సైట్: https://www.rvnl.org/

టీహెచ్ఎస్‌టీఐ, ఫరీదాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

ఫరీదాబాద్(హర్యానా)లోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (టీహెచ్ఎస్‌టీఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ మేనేజర్-01, క్వాలిటీ మేనేజర్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీబీఎస్/బీడీఎస్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు ప్రోగ్రామ్ మేనేజర్ పోస్టుకు రూ.79,060, క్వాలిటీ మేనేజర్ పోస్టుకు రూ.66,080, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు రూ.33,040.
- **వయసు:** ప్రోగ్రామ్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, క్వాలిటీ మేనేజర్, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** సర్టిఫికేట్ల పరిశీలన, షార్ట్‌లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2024
- **వెబ్‌సైట్:** https://thsti.res.in

భానూదయం అనే మాటలో సంధి?

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ/ఎల్‌పీ)



డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్ఏ & ఎస్జీటీ)

సంధులు

1. **పడ్వాది సంధి:** పడ్వాదులు పరమైనప్పుడు 'ము' వర్ణమునకు లోప పూర్ణ బిందువులు విభాషనగు. (పడు + ఆదులు = పడు, పాటు, పెట్టు, పరచు మొదలైనవి పడ్వాదులు. ఇవి పరమైనప్పుడు పూర్వపదంలోని ము వర్ణానికి లోప పూర్ణ బిందువులు విభాషగా వస్తాయి)
   ఉదా: భయము + పడు = భయపడు, భయంపడు, భయముపడు. మూడు రూపాలు వచ్చాయి. అవి.. ము వర్ణలోపం; పూర్ణ బిందువు; స్వత్వ రూపం.
2. **ప్రాంతాది సంధి:**
   i. ప్రాంతాదుల తొలి అచ్చు మీది వర్ణం బులకెల్ల లోపంబు బహుళంబుగానగు (ప్రాంతాదులు, ప్రాంత, లేత, కొత్త మొదలైనవి)

మాదిరి ప్రశ్నలు

ఉదా: ప్రాంత + ఇల్లు= ప్రాయిల్లు. లోపం బహుళమైనందున లోపించిన రూపం, లోపించని రూపం రెండూ వచ్చాయి.

ii. లుప్త శేషమునకు పరుషములు పరమైనప్పుడు నుగాగమంబగు. **ఉదా:** చెను + తొవ. ద్రుత ప్రకృతికం మీది పరుషం సరళమవుతుంది.

ఉదా: చె + న్ + దొవ = చెందొవ

ద్రుత సరళాదేశ సూత్రాలు వర్తించి చెందొవ రూపం వస్తుంది.

మీదు+కడ=మీఁగడ రూపం ప్రాంతాది సూత్రాలు, ద్రుత సరళాదేశ సూత్రాల వల్ల వస్తుంది.

iii. కొత్త శబ్దాల ఆద్యక్షర శేషమున కొన్ని యెడల నుగాగంబును. కొన్ని యెడల మీద హల్లునకు ద్విత్వంబునగు.

ఉదా: క్రొత్త + పసిడి = క్రొంబసిడి రూపం. నుగాగమం వచ్చి సరళాదేశ సంధి చేత క్రొంబసిడి రూపం వస్తుంది.

క్రొత్త + క్కారు = క్రొక్కారు

(ద్విత్వ రూపం) (త్తకారం లోపం)

iv. అన్యంబులకు సహిత ఐక్యార్యంబు కొండొకచో కానంబడియెడు

ఉదా: పది + తొమ్మిది = పందొమ్మిది

పాత, కొత్త, లేత వంటి ప్రాంతాది కార్యాలకే కాకుండా ఇతరమైన వాటికి కూడా ఈ సూత్రాలు వర్తిస్తాయని చెప్పడానికి ఈ సూత్రాన్ని చెప్పారు.

పది + తొమ్మిది అనే దానికి ప్రాంతాది సూత్రాలు, సరళాదేశా సంధి సూత్రాలు వర్తించి పందొమ్మిది రూపం వచ్చింది.

3. **లు, ల, నల సంధి:** లు, ల, నలు పరమగునప్పుడు ఒకానొకచో 'ము'వర్ణానికి లోపం, తత్పూర్వ స్వరానికి దీర్ఘం విభాషనగు.
   ఉదా: వజ్రము+లు=వజ్రాలు, వజ్రములు
   ముఖము + న = ముఖాన, ముఖమున
   మీసము + ల = మీసాల, మీసముల

వ్యాకరణ పరిభాషలు

చిన్నయసూరి తెలుగు భాషకు ప్రామాణికమైన బాల వ్యాకరణాన్ని రచించారు. బాల వ్యాకరణ పరిచ్ఛేదాల్లో కొన్ని వ్యాకరణ పరిభాషలు ప్రయోగించారు. పరిభాషలనే పారిభాషిక పదాలంటారు. పారిభాషిక పదాలు తెలిస్తేనే బాల వ్యాకరణం అర్థమవుతుంది. డీఎస్సీ, టెట్ పరీక్షలకు కూడా వ్యాకరణ పరిభాషలు ముఖ్యం. గత డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్స్‌లో ఐదు ప్రశ్నలు అడిగారు. కొన్ని ముఖ్యమైన వ్యాకరణ పరిభాషలను పరిశీలిద్దాం.

1. **సంధి:** పూర్వ, పర స్వరాలకు పరస్పరం ఏకాదేశమవడాన్ని సంధి అంటారు.
   ఉదా: రాముడు + అతడు= రాముడతడు
   (డ్ + ఉ పూర్వ స్వరం + 'అ' పరస్వరం, పూర్వ, పర స్వరాలు రెండింటికి లోపం వచ్చి పరస్పరమైన 'అ' కారం ఏకాదేశంగా వచ్చింది)
2. **ఆగమం:** ఒక అక్షరం అదనంగా మిత్రుడిలా వచ్చి చేరడాన్ని ఆగమం అంటారు.
   ఉదా: పేద + ఆలు = పేదరాలు. ఇందులో 'ర్' కారం ఆగమంగా వచ్చింది.
3. **ఆదేశం:** ఉన్న ఒక అక్షరాన్ని తొలగించి దాని స్థానంలో వేరొక అక్షరం రావడాన్ని ఆదేశం అంటారు.
   ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు.
   'త' కారం స్థానంలో 'ద' కారం ఆదేశమైంది.
4. **మహద్వాచకం:** పురుషులను సంబోధించే పదాలు, వాటి విశేషాలను తెలియజేసేవి మహద్వాచకాలు.
   ఉదా: కృష్ణుడు, రాముడు, భాగ్యవంతుడు, గుణవంతుడు.
5. **మహతీవాచకం:** స్త్రీలను, వారి విశేషాలను తెలియజేసేవి మహతీవాచకాలు.
   ఉదా: రమ, ధీరురాలు
6. **అమహద్వాచకం:** పశుపక్ష్యాదులు, జడాదులు వాటి విశేషాలను తెలియజేసేవి అమహద్వాచకాలు.
   ఉదా: గోవు, పర్వతం మొదలైనవి.
7. **శబ్ద పల్లవం:** రెండు ధాతువులు కలిసి కొత్త అర్థాన్ని ఇస్తే దాన్ని శబ్ద పల్లవం అంటారు.
   ఉదా: మేలు + కొను= మేలుకొను
8. **భావార్థకం:** క్రియ అర్థాన్ని తెలియజేసేది భావార్థకం. ఇందులో క్రియకు 'ట' ప్రత్యయం చేరుతుంది.
   ఉదా: వచ్చుట, చూచుట.
9. **వ్యతిరేక భావార్థకం:** క్రియ వ్యతిరేకార్థాన్ని తెలిపేది వ్యతిరేక భావార్థకం. ఇందులో క్రియకు 'అమి' చేరుతుంది.
   ఉదా: వండు + అమి = వండమి
   వ్రాయు + అమి = వ్రాయమి
10. **అవ్యయం:** లింగ, విభక్తి, వచనరహిత మైంది అవ్యయం.
    ఉదా: అయ్యో!, కాబట్టి, కావున మొదలైనవి.
11. **ఉపధ:** ఒక పదంలో చివరి అక్షరానికి ముందున్న వర్ణాన్ని 'ఉపధ' అంటారు.
    ఉదా: అర్చి (అర్ + చ్ + ఇ) 'చ్' కారం ఉపధ.
12. **ఉత్తమం:** మూడు లేదా అంతకంటే ఎక్కువ అక్షరాలున్న పదంలో చివరి అక్షరాన్ని ఉత్తమం అంటారు.
    ఉదా: పందిరి (రి) ఉత్తమం.
13. **ఉపోత్తమం:** మూడు లేదా అంతకంటే ఎక్కువ అక్షరాలున్న పదంలో చివరి అక్షరానికి ముందున్న అక్షరం ఉపోత్తమం.
    ఉదా: పందిరి. 'ది' ఉపోత్తమం.
14. **కారకం:** క్రియతో అన్వయాన్ని కలిగించేది కారకం. కారకాన్ని అనుసరించి విభక్తులు చేరతాయి. కారకాలు ఆరు విధాలు.
15. **తద్ధితాంతం:** కొన్ని నామవాచకాలకు అర్థ విశేషాలు తెలిపేందుకు చేరే ప్రత్యయా లను తద్ధితాలంటారు.
    ఉదా: తనం (తద్ధితం).
    మంచితనం (తద్ధితాంతం)
16. **వర్ణం:** కొన్ని ధ్వనుల సముదాయం వర్ణం, అర్థభేదక శక్తి కలిగిన కనిష్ట భాషాంశం వర్ణం.
    ఉదా: క-గ-న-త
17. **పదం:** అర్థ భేదక వర్ణాల సమూహమే పదం.
    ఉదా: పలక, అలక, నలక, గిలక మొదలైనవి.
18. **పదాంశం:** భాషలో అర్థవంతమైన కనిష్ఠ రూపం పదాంశం.
    ఉదా: బొమ్మ+లు = బొమ్మలు
    బొమ్మలు అనే దాంట్లో బొమ్మ+లు రెండు పదాంశాలున్నాయి.
19. **స్వర భక్తి లేదా విప్రకర్ష:** భిన్న హల్లుల మధ్య మరో వర్ణం చేరడాన్ని స్వరభక్తి అంటారు. దీన్నే 'విప్రకర్ష' లేదా 'వికర్ష' అంటారు. **ఉదా:** మర్యాద - మరియాద,
    తర్వాత - తరువాత
20. **వర్ణ వ్యత్యయం:** ఉచ్చారణ వేగం, అశ్రద్ధ, అజ్ఞానం, తడబాటు, తొట్రుపాటు వల్ల అక్షరాలు తారుమారు కావడాన్ని వర్ణ వ్యత్యయం అంటారు.
    ఉదా: నవ్వులాట - నవ్వుటాల
    పావురం - పారువం

గత డీఎస్సీ, టెట్‌లో అడిగిన ప్రశ్నలు

1. చెందొవను విడదీస్తే? (ఎస్ఏ - 2012)
   1) చెన్ను + తొవ 2) చెందు + ఒవ
   3) చెంగు + తొవ 4) తొవ + తొవ
2. జయంతి + ఉత్సవం = ? (ఎల్‌పీ - 2012)
   1) జయంతోత్సవం
   2) జయంత్యుత్సవం
   3) జయంత్యోత్సవం
   4) జయంతుత్సోవం
3. అయోమయం అనే పదాన్ని విడదీసి రాస్తే? (టెట్ 2012 - జనవరి)
   1) అయమ్ + మయం
   2) అయ + మయం
   3) అయో + మయం
   4) అయః + మయం
4. భానూదయం అనే మాటలో సంధి? (టెట్ 2012 - జూన్)
   1) సవర్ణదీర్ఘసంధి 2) ఉత్వ సంధి
   3) గుణ సంధి 4)యణాదేశ సంధి
5. కులాంతకుడు పదంలోని సంధి? (టెట్ - 2014)
   1)గుణ సంధి 2) అకార సంధి
   3) సవర్ణదీర్ఘ సంధి 4) ఉత్వ సంధి
6. తూగుటుయ్యేల - పదాన్ని విడదీస్తే? (టెట్ - 2014)
   1) తూగుటు + ఉయ్యేల
   2) తూగు + ఉయ్యేల
   3) తూగుటుయ్య + ఏల
   4) తూగుట + ఏల
7. స్వర విభక్తికి ఉదాహరణలు? (ఎస్ఏ - 2012)
   1) నిత్తెము- సత్తెము
   2) గోధుమ, వదిన
   3) చందురుడు- అలుపము
   4) ఉవిద, కస్తూరి
8. 'మేలుకొను, విజయం చేయు' అను పద బంధాలు? (ఎస్ఏ - 2012)
   1) ధాతువులు 2) నామవాచకాలు
   3) శబ్దపల్లవాలు 4) సమాసాలు
9. 'సంప్రదానము' అనే వ్యాకరణ పరిభాషకు అర్థం? (ఎస్ఏ - 2012)
   1) గ్రహణము 2) అపాయము
   3) ఉపయోగము 4) త్యాగోద్దేశ్యము
10. ప్రత్యయాలు తెలుగులో ఎలా చేరతాయి? (ఎల్‌పీ - 2012)
    1) ధాతువుకు ముందు చేరతాయి
    2) ధాతువుకు తర్వాత చేరతాయి
    3) ధాతువునే తమలో చేర్చుకుంటాయి
    4) ధాతువుకు మధ్యలో చేరతాయి
11. ప్రత్యయానికి నిబద్ధమైన రూపం? (ఎల్‌పీ - 2012)
    1) పదం 2) ప్రాతిపదిక
    3) సపదాంశం 4) పదాంశం
12. ఉపధకు ముందున్న వర్ణం? (ఎల్‌పీ - 2012)
    1) ఉత్తమం 2) ఉపోత్తమం
    3) ప్రాతిపదిక 4) ఉపధ
13. ఒకే వర్ణానికి సంబంధించిన సన్నిహిత ధ్వనులు? (ఎల్‌పీ - 2012)
    1) భిన్న వర్ణాలు 2) సవర్ణాలు
    3) సధ్వనులు 4) వర్ణాలు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1; 5) 3; 6) 2; 7) 3; 8) 3; 9) 4; 10) 2; 11) 2; 12) 2; 13) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నవ్వు పుట్టించే వాయువు ఏది?

మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు నత్రజని అత్యంత ఆవశ్యక మూలకం. ప్రోటీన్ల నిర్మాణంలో ముఖ్యమైన మూలకం నైట్రోజన్. ఉగ్రవాదులు వాడే విస్ఫోటనకారుల్లోనూ నైట్రోజన్ ప్రముఖంగా ఉంటుంది. మెరుపులు, ధ్వని వేగం కంటే అధిక వేగంతో ప్రయాణించే సూపర్ సోనిక్ జెట్ విమానాల వల్ల నైట్రిక్ ఆక్సైడ్ వాతావరణంలోకి చేరుతుంది. ఇది 'ఓజోన్' పొరను క్షీణింపజేస్తుంది.

నత్రజని (Nitrogen)

గాలిలో సుమారు 80 శాతం నైట్రోజన్ ఉంటుంది. ఇది ఆక్సిజన్‌కు విలీనకారిగా పనిచేస్తుంది. మొక్కలు, జంతువులు వాతావరణంలోని నత్రజని వాయువును నేరుగా శోషించుకోలేవు. మొక్కలు నైట్రోజన్‌ను అమ్మోనియం లేదా నైట్రేట్ లవణాల రూపంలో భూమి పై పొరల నుంచి గ్రహిస్తాయి.

నత్రజని స్థాపన: వాతావరణంలోని నైట్రోజన్ వాయువును మొక్కలకు ఉపయోగపడే అమ్మోనియం, నైట్రేట్ లవణాలుగా మార్చడాన్ని 'నైట్రోజన్ స్థాపన' అంటారు. ఇలా నైట్రేట్‌లుగా మార్చిన నైట్రోజన్‌ను మొక్కలు వేర్ల ద్వారా గ్రహించి ప్రోటీన్లను (పప్పు దినుసులు) తయారు చేస్తాయి.

మేఘాల రాపిడి వల్ల మెరుపులు ఏర్పడినప్పుడు వాతావరణంలోని నైట్రోజన్, ఆక్సిజన్ వాయువులు కలిసి నైట్రిక్ ఆక్సైడ్‌ను ఏర్పరుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ గాలిలోని ఆక్సిజన్‌తో చర్యనొంది నైట్రోజన్ డై ఆక్సైడ్‌ను ఇస్తుంది. ఇది నీటిలో కరిగి నైట్రికామ్లాన్ని ఏర్పరుస్తుంది. ఇలా ఏర్పడిన నైట్రికామ్లం భూమిని చేరి, భూమిలోని సోడియం, పొటాషియం, కాల్షియం తదితర లోహాలతో చర్య జరిపి వాటి నైట్రేట్లను ఏర్పరుస్తుంది.

హేబర్ పద్ధతి ద్వారా పారిశ్రామికంగా, వాతావరణంలోని నైట్రోజన్ వాయువును అమ్మోనియాగా మారుస్తారు. అమ్మోనియాను నైట్రికామ్లం తయారీలో వినియోగిస్తారు. ఇది నైట్రేట్ ఎరువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.

బఠానీ, చిక్కుడు లాంటి 'లెగ్యుమినేసి' జాతి మొక్కల వేరుబుడిపెల్లో వాతావరణంలోని నైట్రోజన్‌ను.. నైట్రోజన్ సమ్మేళనాలుగా స్థిరీకరించగలిగే ప్రత్యేక రకమైన 'సహజీవన (Symbiotic)' బ్యాక్టీరియా ఉంటుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

నైట్రోజన్ వలయం: వాతావరణంలోని నైట్రోజన్ వివిధ ప్రక్రియల ద్వారా భూమిని, దాని ద్వారా మొక్కలను చేరడం.. తిరిగి వాతావరణంలోకి చేరడం ఒక చక్రీయ క్రమంలో జరుగుతుంది. దీన్నే 'నైట్రోజన్ వలయం' అంటారు.

మెరుపులు, ఆమ్ల వర్షాలు, సహజీవన బ్యాక్టీరియా ద్వారా నైట్రోజన్ భూమిలోకి, అక్కడి నుంచి మొక్కలను చేరుతుంది.

మొక్కలు, జంతువుల్లో ఉండే అత్యంత సంక్లిష్టమైన ప్రోటీన్లు (మాంసకృత్తులు) మొదట యూరియాగా.. చివరగా అమ్మోనియం లవణాలుగా మారుతాయి.



చనిపోయిన వృక్ష, జంతు కళేబరాలు, వాటి వ్యర్థ పదార్థాలు 'అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల అమ్మోనియా, అమ్మోనియం లవణాలుగా నిక్షిప్తమవుతాయి. వీటిలో కొంత భాగం 'నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల నైట్రేట్లుగా మారుతుంది.

డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియం లవణాలను తిరిగి నైట్రోజన్‌గా మార్పు చెందిస్తుంది. ఈవిధంగా ఏర్పడిన నైట్రోజన్ వాతావరణంలోకి చేరుతుంది. తద్వారా వాతావరణంలో నైట్రోజన్ శాతం స్థిరంగా ఉంటుంది.

నైట్రోజన్ - ముఖ్యమైన అంశాలు

- నైట్రస్ ఆక్సైడ్ అనేది నైట్రోజన్ తటస్థ ఆక్సైడ్. దీన్నే 'లాఫింగ్ గ్యాస్' అంటారు.
- అమ్మోనియాను ఐస్ తయారీలో శీతలీకరణిగా ఉపయోగిస్తారు.
- ఓజోన్‌తో పాటు నైట్రిక్ ఆక్సైడ్, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్లు (PAN) కాంతి రసాయన స్మాగ్‌కు కారణమవుతాయి. పొగ మంచు ఏర్పడినప్పుడు కళ్లలో మంటకు కారణం ఈ రసాయనమే.
- నైట్రేట్ల ఉనికిని 'బ్రౌన్ వలయ పరీక్ష' ద్వారా గుర్తిస్తారు.
- నైట్రోజన్ $-210.5^{o}C$ వద్ద ఘన పదార్థంగా మారుతుంది.
- నైట్రో గ్లిజరిన్, TNT, సెల్యులోజ్ నైట్రేట్, అమ్మోనియం నైట్రేట్లు పేలుడు పదార్థాలు.
- 'అమ్మోటాల్' అనేది అమ్మోనియం నైట్రేట్, TNTల మిశ్రమం. అమ్మోనియం క్లోరైడ్, అల్యూమినియం పొడిల మిశ్రమం 'అమ్మోనాల్'. ఈ రెండూ పేలుడు పదార్థాలే.
- సల్ఫర్, బొగ్గుపొడి, పొటాషియం నైట్రేట్‌ల మిశ్రమం గన్ పౌడర్.
- పొటాషియం నైట్రేట్ (KNO_3)ని వేడి చేస్తే ఆక్సిజన్ విడుదలవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. నవ్వు పుట్టించే వాయువు ఏది? (గ్రూప్-1, 2012)
   1) నైట్రిక్ ఆక్సైడ్ 2) నైట్రోజన్ పెరాక్సైడ్
   3) నైట్రస్ ఆక్సైడ్
   4) నైట్రోజన్ పెంటాక్సైడ్
2. కృత్రిమ గర్భోత్పత్తికి ఉపయోగించే రేతస్సును ఎందులో భద్రపరుస్తారు? (గ్రూప్-2, 2005)
   1) ద్రవ నత్రజని 2) మంచుగడ్డ
   3) ద్రవ ఆక్సిజన్ 4) ద్రవ కార్బన్ డై ఆక్సైడ్
3. గన్‌కాటన్ పేరుతో పిలిచే శక్తివంతమైన విస్ఫోటనకారి ఏది? (గ్రూప్-1, 2012)
   1) పొటాషియం క్లోరేట్
   2) సెల్యులోజ్ నైట్రేట్
   3) పొటాషియం నైట్రేట్
   4) సెల్యులోజ్ ఎసిటేట్

సమాధానాలు
1) 3; 2) 1; 3) 2.

మాదిరి ప్రశ్నలు

1. గాలిలో అయిదింట ఒక వంతు ఆక్సిజన్ ఉంటే మిగిలిన నాలుగు భాగాలు ఉండే వాయువు ఏది?
   1) హైడ్రోజన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
   3) నైట్రోజన్ 4) హీలియం
2. కిందివాటిలో నత్రజని స్థాపన చేయగలిగే మొక్క ఏది?
   I. వెదురు II. బఠానీ
   III. చిక్కుడు IV. వరి
   1) I, IV 2) II, III
   3) I, II 4) పైవన్నీ
3. వీర్యాన్ని ఎందులో నిల్వ చేస్తారు?
   1) ద్రవ హైడ్రోజన్ 2) పొడిమంచు
   3) ద్రవ హీలియం 4) ద్రవ నైట్రోజన్
4. నత్రజని సమ్మేళనాలను నైట్రోజన్‌గా మార్చే బ్యాక్టీరియా ఏది?
   1) డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా
   2) సహజీవన బ్యాక్టీరియా
   3) సాల్మొనెల్లా 4) నైట్రిఫైయింగ్
5. భూమిలో నైట్రోజన్‌ను స్థాపించే బ్యాక్టీరియా ఏది?
   1) సాల్మొనెల్లా 2) ఇ-కొలై
   3) సహజీవన బ్యాక్టీరియా
   4) నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా
6. పేలుడు పదార్థమైన అమ్మోనాల్ వేటి మిశ్రమం?
   I. అమ్మోనియం క్లోరైడ్
   II. అల్యూమినియం పొడి
   III. టీఎన్‌టీ IV. పిక్రికామ్లం
   1) I, II 2) I, III
   3) III, IV 4) II, III
7. డ్రై సెల్‌లో ఎలక్ట్రోలైట్ ఏది?
   1) అమ్మోనియం క్లోరైడ్ (NH_4Cl)
   2) అమ్మోనియం నైట్రేట్ (NH_4NO_3)
   3) యూరియా
   4) కాల్షియం సయనమైడ్
8. లెగ్యుమినేసి మొక్కల వేరుబుడిపెల్లో ఉండే సహజీవన బ్యాక్టీరియా ఏది?
   1) రైజోబియం 2) సాల్మొనెల్లా
   3) అమ్మోనోబియం
   4) అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా
9. మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు అవసరమయ్యే ముఖ్యమైన మూలకం?
   1) హైడ్రోజన్ 2) కార్బన్
   3) నైట్రోజన్ 4) ఆక్సిజన్
10. ద్రవ నైట్రోజన్‌తో పొందగలిగే ఉష్ణోగ్రత?
    1) $0^{o}C$ (273 K) 2) $-4^{o}C$ (269 K)
    3) $-196^{o}C$ (177 K) 4) $-273^{o}C$ (0 K)
11. కిందివాటిలో ఉత్పతనం చెందే సమ్మేళనం?
    1) యూరియా 2) అమ్మోనియం క్లోరైడ్
    3) పొటాషియం నైట్రేట్ 4) టీఎన్‌టీ
12. మొక్కలకు చాలా అవసరమైన మూలకం ఏది?
    1) నైట్రోజన్ 2) కార్బన్
    3) క్లోరిన్ 4) పొటాషియం
13. కోడి ఈకలను కాల్చినప్పుడు వెలువడే వాయువు ఏది?
    1) నైట్రోజన్ 2) అమ్మోనియా
    3) ఆక్సిజన్ 4) హైడ్రోజన్
14. ఎరువుల గుట్ట నుంచి గాఢమైన (ఘాటైన) వాసనకు కారణమయ్యే వాయువు ఏది?
    1) అమ్మోనియా 2) హైడ్రోజన్ సల్ఫైడ్
    3) నైట్రస్ ఆక్సైడ్ 4) నైట్రిక్ ఆక్సైడ్
15. స్పృహతప్పిన మనిషికి స్పృహ తెప్పించడానికి ఉపయోగించే అమ్మోనియం లవణం (స్మెల్లింగ్ సాల్ట్) రసాయన నామం?
    1) అమ్మోనియం కార్బొనేట్
    2) అమ్మోనియం నైట్రేట్
    3) అమ్మోనియం సల్ఫేట్
    4) అమ్మోనియం క్లోరైడ్
16. కిందివాటిలో ఆమ్ల వర్షానికి కారణమైనవి?
    I. నైట్రోజన్ ఆక్సైడ్‌లు
    II. సల్ఫర్ ఆక్సైడ్‌లు
    III. ఫాస్ఫరస్ ఆక్సైడ్‌లు
    1) I మాత్రమే 2) I, II మాత్రమే
    3) III మాత్రమే 4) I, II, III

సమాధానాలు
1) 3; 2) 2; 3) 4; 4) 1;
5) 3; 6) 1; 7) 1; 8) 1;
9) 3; 10) 3; 11) 2; 12) 1;
13) 2; 14) 1; 15) 4; 16) 2.

అడ్మిషన్స్

రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(సెట్) 2025-26 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మిలిటరీ స్కూళ్లలో అడ్మిషన్ పొందడానికి ఆర్మీ నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరులు పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూళ్లు. మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్),బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక).

అర్హత: ఆరో తరగతిలో ప్రవేశం పొందడానికి విద్యార్థి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఐదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులు.

తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి, విద్యార్థి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులు.

వయసు: ఆరో తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయసు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి,2025,మార్చి 31నాటికి అభ్యర్థి వయస్సు 13ఏళ్ల కంటే తక్కువ,15 ఏళ్ల కంటే ఎక్కువ ఉండకూడదు.

ఎంపిక ప్రక్రియ: కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ ఓఎమ్మార్ ఆధారిత విధానంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష విధానం: **ఆరో తరగతి:** ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్-కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మ్యాథ్స్(50 మార్కులు), ఇంగ్లిష్(50 మార్కులు), ఐదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు. **తొమ్మిదో తరగతి:** ఇంగ్లిష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మ్యాథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు), ఎనిమిదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు.

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది:** 19.09.2024.
- **వెబ్‌సైట్:** **www.rashtriyamilitaryschools.edu.in**

No healthier than do people exercising

BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Halt an escalation of current tensions (1)/ and preventing mass atrocities from happening in Sudan again will require (2)/ cutting off the goods and services that combatants need (3)/ to perpetrate further violence. (4)/ No error (5)
2. Acquiring material wealth or rejecting its attractions (1)/ has often been (2)/ the base upon which writers (3)/ had developed interesting plots. (4)/ No error (5)
3. Science plays a significant role (1)/ in the origin of superhero stories precisely because (2)/ that stories are really an extension (3)/ of science fiction as a genre. (4)/ No error (5)
4. The article on the subject of Colombian drug lords (1)/ published in The Economist this morning neither alludes nor specifically describes (2)/ the methods that the police employ (3)/ in the fight against crime. (4)/ No error (5)
5. During the alumni meet, (1)/ the old students reflected (2)/ on the time (3)/ they have spent in college. (4)/ No error (5)

Directions(Q.No. 6-8):Choose the set of words which are closest in meaning to the word provided.

6. Generic
   1) general, basic 2) cheap, vital
   3) fresh, pure 4) elderly, cheaply
   5) standard, novice
7. Educe
   1) demand, stipulate
   2) elicit, extract 3) ideal, idyllic
   4) unlawful, illicit
   5) prohibit, proscribe
8. Appall
   1) delirious, rambling
   2) covered, exposed
   3) dismay, consternation
   4) confuse, scandalize
   5) perplex, doubt

Directions (Q.No.9- 10): Choose the set of words which are opposite in meaning from the five options given in each question.

9. 1) rotund, plump
   2) brazen, defiant
   3) pique, soothe
   4) peaked, ruddy
   5) nadir, apex
10. 1) supercilious, meek
    2) approbate, sanction
    3) demur, hesitate
    4) fatuous, foolish
    5) quiescent, repose

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Foods that are rich in salt, likes potato chip, cheese and sauces contain high level of sodium levels that may lead to heart attacks and stroke.
    1) liked potato chip, cheese and sauces
    2) like potato chips, cheese and sauce
    3) like potato chips, cheese and sauces
    4) like potato chip, cheeses and sauce
    5) No correction required
12. Poor reading skills among students of inner-city schools have not resulted from failures in teaching but insufficiently supportive home environments.
    1) resulted not from failures in teaching but from
    2) resulted from failures not in teaching but
    3) resulted from failures not in teaching but have stemmed from
    4) resulted not from failures in teaching but have stemmed from
    5) No correction required
13. In a recent survey, *Physical Fitness Weekly* found that people exercising daily consider themselves no healthier than do people exercising three to five times a week.
    1) not any healthier than do people exercising
    2) not any healthier than do people who exercise
    3) no healthier than are people who are exercising
    4) not as healthy as are people who exercise
    5) No correction required
14. Many people discover a need for glasses in middle age, a consequence from sitting too close to the television screen for long periods of time.
    1) of sitting too close
    2) which resulted from sitting too close
    3) damaged from sitting too near
    4) damaged because they sat too close to
    5) No correction required
15. At one stage it appeared as if Indians will lost the match against Hongkong.
    1) will be losing the match
    2) will lost a match
    3) would lose the match
    4) would be losing the match
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Shortages of canned food in the British Army in 1917 led to the government issuing cigarettes and amphetamines to soldiers to suppress their appetites.
B) But by 1916, widespread boredom with cheap canned food amongst soldiers resulted in militaries purchasing better-quality food to improve morale and the complete meals in a can began to appear.
C) Demand for canned food skyrocketed during World War I, as military commanders sought vast quantities of cheap, high-calorie food to feed their millions of soldiers, which could be transported safely, survive trench conditions, and not spoil in transport.
D) After the war, companies that had supplied military canned food improved the quality of their goods for civilian sale.
E) Throughout the war, soldiers generally subsisted on low-quality canned foodstuffs, such as the British "Bully Beef" (cheap corned beef), pork and beans, canned sausages, and Maconochies Irish Stew.
F) In 1917, the French Army began issuing canned French cuisine, such as coq au vin, Beef Bourguignon and Vichyssoise while the Italian Army experimented with canned ravioli, spaghetti bolognese, Minestrone and Pasta e fagioli.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Residents can donate clothes, household items and other goods to the ____ store. The store then sells them and donates the amount to ____.
    1) Thrift, charities
    2) waft, aid 3) fluster, gifts
    4) heterogeneous, relievers
    5) assorted, donations
22. Everything about S. Russell Groves is just so, from his style of dress to his choice of words; nothing is ____.
    1) Lumber 2) superfluous
    3) garner 4) renovate
    5) encumber
23. The MLA was charged with criminal attempt to ____ a minor and criminal attempt to ____ the morals of a minor on Thursday.
    1) Entice, impair
    2) ambidextrous, blight
    3) ostentation, prejudice
    4) qualm, weaken
    5) worse, impeach
24. In order to consistently prevail you must be agreeable, amenable, and ____. These characteristics make it possible to gain trust, show compromise, and___deals.
    1) Contrite, reform
    2) malleable, restructure
    3) frenetic, simplify
    4) impugned, adjust
    5) remorseful, sort
25. There is a buzz about the sudden death of one of the artists, which cast a ____ on the opening ceremonies, ____, briefly.
    1) Attraction, though
    2) wither, although
    3) pall, albeit
    4) gloom, notwithstanding
    5) shadow, almost

Directions (Q.No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.


Cloud seeding is a type of weather modification that ____ (26) to change the amount or type of precipitation that falls from clouds by dispersing substances ____(27) the air that serve as cloud condensation or ice nuclei, which alter the microphysical processes within the cloud. The usual intent is to increase precipitation (rain or snow), but hail and fog suppression ____ (28) also widely practiced in airports, where harsh weather conditions are experienced. Cloud seeding over Kosciuszko National Park-a biosphere reserve-is problematic in that several rapid changes of environmental legislation ____ (29) made to enable the trial. Environmentalists are concerned ____ (30) the uptake of elemental silver in a highly sensitive environment affecting the pygmy possum ____ (31) other species as well as recent high level algal blooms in ____ (32) pristine glacial lakes. Research 50 years ____ (33) and analysis by the former Snowy Mountains Authority led to the cessation of the cloud seeding program in the 1950s with non-definitive results. Formerly, cloud seeding was rejected in Australia on environmental grounds ____ (34) of concerns about the protected species, the pygmy possum. Since silver iodide and not elemental silver is the cloud seeding material, the claims of negative environmental impact are disputed ____ (35) peer-reviewed research as summarized by the international Weather Modification Association.

26. 1) aim 2) aimed
    3) aims 4) was aimed
    5) is aimed
27. 1) into 2) in 3) on
    4) along 5) among
28. 1) has 2) was 3) are
    4) is 5) had
29. 1) was 2) were 3) being
    4) been 5) has been
30. 1) during 2) from 3) for
    4) about 5) into
31. 1) through 2) between
    3) along 4) of course
    5) among
32. 1) ones 2) once 3) prior
    4) farmer 5) early
33. 1) ahead 2) after 3) former
    4) ago 5) pristine
34. 1) because 2) as 3) when
    4) while 5) though
35. 1) with 2) from 3) froth
    4) for 5) by

KEY

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 1	7) 2	8) 3	9) 3	10) 1
11) 3	12) 2	13) 5	14) 1	15) 3
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 1	24) 2	25) 3
26) 3	27) 1	28) 3	29) 2	30) 4
31) 5	32) 2	33) 4	34) 1	35) 5

సాక్షి ప్లస్
బుధవారం। 4-9-2024



• గుణదల శివారు ప్రాంతం ఇప్పటికీ ఇలా..



• వరద ముంపులో విద్యాధరపురం

బెజవాడలో బుడమేరు విలయం



• సింగ్‌నగర్ న్యూరాజరాజేశ్వరి పేట వద్ద పరిస్థితి



బెజవాడ దుఃఖదాయని బుడమేరు నగరంలో విలయం సృష్టించింది. సంకుచిత బుద్ధితో పెద్దలు చేసిన తప్పు నగర ప్రజలకు శాపంలా మారింది. మూడు రోజులుగా నీట మునిగిన ఇళ్లల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రజలు ఈ పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో తెలియని స్థితికి చేరారు. ప్రభుత్వ పెద్దలు ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రజల కష్టాలకు ఇవ్వకపోవడంతో తిండీ, నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం నగరంలోని ముంపు ప్రాంతాల ఇదీ..



• జక్కంపూడి వైఎస్సార్ కాలనీ ప్రాంతం



• విజయవాడలో బుడమేరు కాలువ సమీప ప్రాంతాలు



• భవానీపురం ఐరన్ యార్డ్ వద్ద..



• సింగ్‌నగర్ శివారు ప్రాంతంలో వరద దృశ్యాలు



• రామవరప్పాడు ఫ్లైవర్ సమీపంలో వరద పరిస్థితి



• పాతరాజరాజేశ్వరి పేట ఏరియల్ వ్యూ